# క్రాంతి

## లోపలి పేజీల్లో...


శ్రావణ ఇంటర్వ్యూ..... 5
రై□ జన్మభూమి..... 8
ఫాసిస్టు హిందూ□్వదాడి.... 14
కేంద్రీకృ□ ప్రజాస్వామ్యం.... 22
యూరప్ స్తంభన..... 30
ఈశాన్య భార□ శాంతి..... 34
89 ఆర్థికమాంద్యం..... 38



భార□ కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) [పీపుల్స్‌వార్] రాష్ట్రకమిటీ అధికార పత్రిక

సంపుటి : 25 సంచిక : 1 జనవరి-ఫిబ్రవరి 2001 వెల : ఐదు రూపాయలు


# అశేష పీడి□ మహిళల్లారా! ప్రజా గెరిల్లా సైన్యంలో చేరండి! సకల దోపిడీల నుండి, అణచివే□ల నుండి, పి□ృస్వామ్యం నుండి విముక్తికై సాయుధం కండి!

## మార్చి 8 సందర్భం గా ప్రత్యేక వ్యాసం

మనం ప్రతి సంవత్సరం జరుపుకుంటున్న అంతర్జాతీయ మహిళా దినంకీ 2001 సం॥లో జరుపుకుంటున్న మార్చి 8కీ గుణాత్మకంగానే మార్పు వుంది. 'ప్రజాసైన్యం లేకుండా ప్రజలకుండేదేమీ లేదు', అటువంటి ప్రజాసైన్య నిర్మాణానికై తెలంగాణా, తెభాగాల నుండి, నక్సల్బరీ, శ్రీకాకుళాల నుండి నేటి కొయ్యూరు వరకు ఎన్నెన్ని త్యాగాలు, చిందిన ఎంతెంత రక్తం! ఆ అమరవీరులు కన్న కలల్ని నిజం చేస్తూ, పీడిత ప్రజల ఆకాంక్షలకు రూపాన్నిస్తూ 2000, డిసెంబర్ 2న ఆవిర్భవించింది మన ప్రజాగెరిల్లా సైన్యం.

'99 డిసెంబర్ 2న మన ప్రియతమ కేంద్రకమిటీ నాయకులు కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళీలను హత్యగావించి 'ఆకురాలు కాలం' అంటూ చారిత్రక అజ్ఞానంతో గంతులేసిన శత్రువు ముక్కుపై బలంగా గుద్దినట్లుగా, సంవత్సర కాలానికి అదేరోజున భారత ప్రజానీకానికి 'వసంతాన్ని' వాగ్దానం చేస్తూ 'మేఘగర్జన'లా అవతరించింది మన పి.జి.ఏ.

ప్రజాసైన్యం లేకుండా ప్రజలకుండేదేమీ లేదు. ఈ సత్యం మన దేశంలోని పీడిత, తాడిత, దళిత మహిళలకు నూటికి నూరు శాతం వర్తిస్తుంది అనడంలో సందేహం లేదు.

శత్రువును తెల్సుకోవాలి అంటే పితృస్వామ్యానికీ, దోపిడీ వర్గ సమాజానికీ వున్న సంబంధం కూడా అర్థం కావాలి. దోపిడీ సమాజం కొనసాగింపుకూ, దాని సైన్యానికీ వున్న సంబంధమూ అర్థం కావాలి. మనల్ని మనం తెల్సుకోవాలంటే ప్రజాసైన్యానికీ, మహిళా విముక్తికీ వున్న గతి తార్కిక సంబంధం కూడా అర్థం కావాలి. ఈ రెండు విషయాలూ అర్థం గాకుండా మహిళల బాధలకు కారణాలనూ తెల్సుకోలేం, పరిష్కారంలోనూ భాగం కాలేం.

ఎంగెల్స్ 'కుటుంబం, వ్యక్తిగత ఆస్థి, రాజ్యాల ఆవిర్భావం' అన్న పుస్తకంలో ఈ మూడింటికీ వున్న అంతర్గత సంబంధాన్ని ఆనాడే విపులీకరించాడు. వ్యక్తిగత ఆస్థిని కాపాడుకోవడానికి అన్ని వర్గ సమాజాలూ సైన్యాల్ని ఏర్పరచుకుంటూనే వచ్చాయి. ఈ ఆస్థిపరుల దోపిడీ, దౌర్జన్యాల్ని ఎదిరిస్తూ పీడితులూ తమ సైన్యాల్ని ఏర్పర్చుకుంటూనే వచ్చారు. పాత ఉత్పత్తి సంబంధాల స్థానే కొత్త ఉత్పత్తి సంబంధాల స్థాపన సాయుధంగానే జరిగింది. వ్యక్తిగత ఆస్థికి ఏర్పడిన కుటుంబం ఎంతో హింసాయుతంగానే తన ఉనికిని కాపాడుకుంటూ వస్తోంది. పితృస్వామ్యం ఉపరితలంలోనేగాక పునాదిలోనూ బలంగా నెలకొని పోయింది. ఈ దోపిడీ ఉత్పత్తి సంబంధాలను మార్చాలన్నా సాయుధం కాక తప్పదు. ఉపరితలం లోనూ పితృస్వామ్యాన్ని బలంగా నిలబెడ్తున్న దోపిడీదారుల పాలనను కూలదోయడం పితృస్వామ్య భావజాలంపై పోరాటంలో అత్యంత ఆవశ్యకమైన మొదటి అడుగు.

దశాబ్దాలుగా భారత వ్యవసాయక విప్లవంలో భాగమవుతున్న రైతాంగ మహిళలకు నేడు భూమి దక్కాలన్నా సైన్యంలోనూ సగం

కావాలన్నదే నేటి మన నినాదం. భూమి ఒకటే కాదు నేడు మన అర్ధభూస్వామ్య, అర్ధవలస సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న ఆర్థిక దోపిడి, పురుషాధిక్యత, వివక్ష, సామ్రాజ్యవాద సంస్కృతి, కుల వివక్ష, అగ్రకుల దౌర్జన్యం, అనారోగ్యం, అవిద్య, నిరుద్యోగం, వరకట్నం, బాల్య వివాహాలు, అత్యాచారాలు, వేశ్యావృత్తి, ఇంటి చాకిరీ, వివాహ స్వేచ్ఛ లేకపోవడం... ఇంకా ఎన్నో ఎన్నెన్నో సమస్యలు పరిష్కారం అవ్వాలంటే పీడిత ప్రజల్లో భాగంగా స్త్రీలకూ రాజ్యాధికారం దక్కాలి. అది దక్కాలంటే సైన్యం లేకుండా అసాధ్యం. అందుకే పి.జి.ఏ. కవాతులో ఒక అడుగు పురుషులదైతే, మరో అడుగు స్త్రీలది కావాలి.

సైన్యంలో సగం అంటే సంఖ్యలోనే కాదు అన్ని స్థాయిల్లోనూ, అన్నిరకాల విభాగాల్లోనూ సగం కావాలి. అదే మన లక్ష్యం.

అలనాడు స్పార్టకస్ లాంటి బానిస వీరులు నిర్మించిన సైన్యాల్లో, భూస్వామ్య సమాజాన్ని కూలదోస్తూ జరిగిన అనేక బూర్జువా విప్లవాల్లో, చైనా, ఇండియా వంటి దేశాల్లో జరిగిన రైతాంగ తిరుగుబాట్లలో, వలస పాలనకు వ్యతిరేకంగా జరిగిన అనేక సాయుధ జాతీయ ఉద్యమాల్లో, మొట్టమొదటి కార్మికవర్గ విప్లవమైన పారిస్ కమ్యూన్‌లో, రష్యా, చైనా, వియత్నాం వంటి అనేక దేశాల విప్లవాల్లో, ఫాసిస్టు వ్యతిరేక ప్రపంచ యుద్ధంలో, నేడు జరుగుతున్న మూడో ప్రపంచ దేశాల మావోయిస్టు విప్లవాల్లో, సామ్రాజ్యవాద వ్యతిరేక జాతుల పోరాటాల్లో-మహిళలు లేకుండా ఇప్పటివరకు ఏ సైన్యమూ ఏర్పడలేదు. ఏ విప్లవమూ విజయవంతం కాలేదు.

ప్రకృతి నుండి తనను తాను కాపాడుకోవడమే గాక తన గుంపునూ, తన సంతతినీ రక్షించుకోడానికిగానూ గుంపుకు నాయకత్వం వహించి సాయుధం అయింది ఆనాటి ఆదిమ మానవి. అయితే ఆనాడు నాయకత్వం వహించిన మహిళ గురించి ఈనాడు 'ఆమె లేకుండా విప్లవం లేదు' అని ప్రత్యేకంగా ఎందుకు చెప్పుకోవాల్సి వస్తున్నది? 'ఆమె అబల కాదు సబల' అని రుజువుపరచుకోవలసిన స్థితి ఎందుకు వచ్చింది? పరిణామ క్రమంలో మహిళకు జరిగిన అన్యాయమే ఇది. సరిగ్గా ఈ అన్యాయాన్ని రూపుమాపడానికీ, ఈ తలకిందుల భూస్వామ్య, బూర్జువా విలువల్ని కాళ్లపై నిలబెట్టడానికే స్త్రీ తన ఆదిమకాలపు మిలిటెంట్ స్వరూపాన్ని నేడు గుర్తు చేసుకోవాల్సి వుంది.

అంతేకాదు, బానిస యజమానుల కళ్లలో భయాన్ని లిఖించిన వరీనియా వంటి వీరనారుల చరిత్రను తవ్వి తలకెత్తుకోవాలి. భూస్వామ్య పాలన నెదిరిస్తూ పోరాడిన మన ముత్తవ్వల్ని మదిలో నిక్షిప్తం చేసుకోవాలి. నిన్న మొన్నటి తెలంగాణా సాయుధ పోరులో మన అమ్మల, అమ్మమ్మల తెగువను అధ్యయనం చేయాలి. నిర్మల, అంకమ్మల వంటి వీరనారుల అనుభవాల్ని సమీక్షించాలి. పెరూ, ఫిలిప్పీన్స్, నేపాల్, టర్కీలలోనూ, వివిధ జాతుల పోరాటాలలోనూ పాల్గొంటున్న అక్క చెల్లెళ్ల నుండి నేర్చుకోవాలి. అన్నిటికంటే ముఖ్యంగా విప్లవాల్ని విజయవంతం చేసిన దేశాల మహిళా సైనికుల అనుభవాల్ని మదింపు వేయాలి. సైన్యంలో శ్రామిక మహిళల నాయకత్వాన్ని ఎత్తిపట్టాలి. భారత శ్రామిక మహిళలు తమ చారిత్రక కర్తవ్యాన్ని నిర్వర్తించేలా వారిని ఉత్తేజితుల్ని చేయాలి.

ఇటీవల విజయవంతంగా ముగిసిన ఆంధ్ర రాష్ట్ర 15వ మహాసభల తక్షణ కర్తవ్యాల్లో 4వ కర్తవ్యంగా మనం 'గ్రామ గ్రామాన ప్రజా మిలీషియాను నిర్మిద్దాం! ప్రజా గెరిల్లా సైన్యాన్ని (ప్లటూన్లను, ఎస్.జి.ఎస్.లను) బలోపేతం చేద్దాం!' అనేదాన్ని రాసుకున్నాం. **ఈ తక్షణ కర్తవ్యాన్ని అమలు చేయడం అంటే అర్థం పోరాట ప్రాంతాల్లోని ప్రతీ గ్రామంలోని మహిళలనూ ప్రజా మిలీషియాలో భాగం చేయడంపైనా కేంద్రీకరించాలి అనే. ప్రజాగెరిల్లా సైన్యంలో ఈ మహిళలనూ చేర్చుకుని దాన్ని బలోపేతం చేయాలనేదే .** (పి.జి.ఏ.లో చేరాల్సిన అవసరాన్ని మనం ఎంత విస్తృతంగా మహిళల్లోకి తీసుకువెళ్లగల్గితే, ఎంత బాగా ప్రతి ఒక్క కార్మిక, కర్షక, మధ్యతరగతి, మేధావి మహిళకీ అర్థం చేయించగల్గితే అంతగా వారిని చేర్చుకోగల్గుతాం.) ఈ విషయాన్ని మనం ఏమాత్రం విస్మరించినా రాజకీయంగా పొరబాటు చేసినట్లే. భవిష్యత్‌లో ఇలా ప్రత్యేకంగా చెప్పుకోవల్సిన అవసరం రానంతగా మన కృషి అభివృద్ధి చెందడం మన లక్ష్యంగా వుండాలి.

పీడిత ప్రజల్లో సగభాగమైన మహిళలు సైన్యంలో సైనికులుగా మారకుండా వుండడం దోపిడీ వర్గాలకు ఎంతో అవసరం. అందుకనే అందుకవసరమైన భావజాలాన్నంతా సృష్టించి పెట్టేశాయి. మన దేశంలోనూ యుద్ధం పురుషులే చేయాలి, స్త్రీలు చేయరాదు అనే భూస్వామ్య భావజాలం తరతరాలుగా స్త్రీ పురుషుల నరనరాల్లో ఎక్కించుకుంటూ వస్తున్నారు. అందుకే రాజుల సైన్యాల్లో మహిళలు కనిపించరు. పైపెచ్చు 'యుద్ధంలో చాతగాని వాళ్లమా?' అనడానికి 'గాజులేసుకుని వున్నామా?' అనే భూస్వామ్య సామెతనూ సృష్టించారు. ఖడ్గ తిక్కనను యుద్ధంలోకి పంపడానికి అతని భార్య పసుపు పెట్టి స్నానం చేయమన్నదని కథలు చెప్తారు. స్త్రీలు భర్తలనూ, కొడుకులనూ యుద్ధంలోకి పంపే వీరమాతలో, వీరపత్నులో అవుతారు తప్ప తాము స్వయంగా యోధులు కావద్దని భూస్వామ్య సమాజం హోరెత్తించుకుంటూ వస్తోంది. చివరికి శత్రు సైన్యాలు వస్తే నిప్పుల్లోకి దూకి ఆత్మహత్యలు చేసుకోండి తప్ప ఆత్మరక్షణకైనా యుద్ధం చేయండని మహిళలకు ఆదేశాలు ఇవ్వలేదు. అందుకు ఝాన్సీ లక్ష్మీబాయి మనకో మినహాయింపు.

మరోవైపు బూర్జువా సైన్యాల్లోకి మహిళలను మొదటి, రెండో ప్రపంచ యుద్ధాల్లో వాళ్ళ యుద్ధ ప్రయోజనాల కోసం చేర్చుకున్నా యుద్ధం కాగానే సంప్రదాయక పాత్రల్లోకే పంపేశారు. ఇటీవల తిరిగి మహిళలను సైన్యంలో చేర్చుకుంటున్నా మహిళలపట్ల వివక్షను ఉపయోగించుకుని తక్కువ జీతాలిచ్చి సూపర్ లాభాలు సంపాదించుకోవడానికే. అలాగే స్త్రీలను కొన్ని విభాగాలకే పరిమితం చేసే బూర్జువా బూటకపు సమానత్వమూ మనకిందులో కన్పిస్తుంది. (అయితే మహిళలు యుద్ధం చేయడమే దానంతట అదే గొప్ప విషయం అవ్వదు. ఏ వర్గ ప్రయోజనాల కోసం పోరాడుతున్నారనేది నిర్ణయాత్మకమైన అంశం.)

ఇటువంటి వాతావరణం సమాజంలో వుంది కనక స్త్రీలను యుద్ధంలో వీరులుగా నాయకత్వంగా వూహించుకోడానికి పురుషాధిక్య సమాజం ఒప్పుకోదు. ఇది పీడిత వర్గాల పురుషుల బుర్రల్లోనూ బలంగా నాటుకునిపోయి వుంది. అందుకనే ఈరోజు పి.జి.ఏ.లో స్త్రీలను చేరమని పిలుపు ఇవ్వడం అంటే పి.జి.ఏ.లో మహిళలు

చేరాలనే విషయాన్ని గుర్తించి అందుకు బాధ్యతపడి వారికి పూర్తి సహకార, ప్రోత్సాహాల్ని అందించమని పురుషులకు కూడా పిలుపు ఇవ్వడమనే!

స్త్రీలు సైనికులు కాగలరనే కాదు, వారు ఏ విషయంలోనూ పురుషులకు తీసిపోరని, అన్నిట్లోనూ సమానంగా పాల్గొనగలరనీ ఇప్పటికే ప్రపంచంలోనూ, మన ఆచరణలోనూ రుజువుఅయి పోయింది. దానిని భావజాలపరంగా స్థిరీకరించి, సాధారణీకరించడమే మనం చేయాల్సిన పని.

మరోవైపు కొందరు ఫెమినిస్టులు స్త్రీ విముక్తి కావాలంటే సాయుధ పోరాటం తప్పనిసరి అనే విషయాన్ని సరిగ్గా వ్యతిరేకిస్తూ లేదా మరుగున పరుస్తూ వస్తున్నారు. ఫెమినిస్టుల వల్ల మహిళలకు జరిగే ప్రధానమైన హాని ఇదే! సంఘటితమైన శత్రు బలగాలకు వ్యతిరేకంగా స్త్రీలను నిస్సహాయంగా, చిన్న చిన్న బృందాలుగా, నిరాయుధులుగా వీరు నిలప ప్రయత్నిస్తున్నారు. అసలు ప్రకృతిపరంగానే స్త్రీ యుద్ధాన్ని వ్యతిరేకించే స్వభావం కలిగినామె అనీ, పురుషులు యుద్ధ ప్రవృత్తి కలవారనీ అందుకే పురుషుడు స్త్రీనీ, ప్రకృతినీ అణచివేస్తున్నాడు అనీ, స్త్రీ అయితేనే ప్రకృతికి దగ్గరగా వుండి యుద్ధాన్ని నివారించగల్గుతుంది అనీ వాదిస్తున్నారు. అంటే పుట్టుకతోనే వారికి ఈ లక్షణాలు సంక్రమిస్తాయనే అశాస్త్రీయ భావన అన్నమాట. ఈ విధంగా తమపై దోపిడీ, పీడనల్ని తొలగించుకోడానికి సాయుధం కావాల్సిన స్త్రీలను సాయుధ పోరాటాల నుండి విముఖుల్ని చేయడానికి ప్రయత్నిస్తున్నారు. మరికొందరు విచిత్రంగా కిరణ్‌బేడీ లాంటి పాలకవర్గాల బలగాల్లోని స్త్రీల 'తెగువ'ను మెచ్చుకుంటూనే శ్రామిక మహిళల సాయుధ పోరాటాల్ని మాత్రం గుర్తించరు!

వీరే కాక సోవియట్ రివిజనిస్టులు కూడా రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న ఎందరో మహిళల వీరోచిత అనుభవాల్ని రాస్తూ 'యుద్ధం స్త్రీ ప్రకృతికి విరుద్ధం' అనీ, ఆనాడు యుద్ధంలో మహిళలు పాల్గొన్నప్పటికీ అది ఏదో అనివార్యంగా జరిగిందే తప్ప స్త్రీలు అసలు యుద్ధానికి తగరనీ, అది పురుషుల పని అనీ ప్రచారం చేశారు. 'మాకే పనిలేదు, మీకేం చెప్తాం' అని పచ్చి పురుషాహంకార వ్యాఖ్యను చేస్తూ తెలంగాణ సాయుధ పోరాటం నుండి మహిళలను వెనక్కి పంపిన ఆనాటి రివిజనిస్టుల ద్రోహం మన జ్ఞాపకాల నుండి ఇంకా చెరిగిపోలేదు.

***స్త్రీ విముక్తికి ప్రజాసైన్యం అవసరం లేదనే, సాయుధ పోరాటం అవసరం లేదనే ఎటువంటి వాదననైనా ఒక కార్మికవర్గ పార్టీగా మనం ఎండగట్టాలి. ప్రకృతిపరంగానే స్త్రీ యుద్ధానికి తగదనో, ఆమె స్వభావానికి విరుద్ధమనే పేరుతోనో ఆమెనింకా బానిస బంధనాల్లో వుంచాలని చేసే అన్ని ప్రయత్నాల్నీ చారిత్రక భౌతికవాదం దృక్పథంతో తుత్తునియలు చేయాలి.***

ఈరోజు స్త్రీల జీవితాల్లో  ఎంత అభద్రత నెలకొన్నదంటే కనీసమైన ఆత్మరక్షణ సాధనాలు లేకుండా బైటకు అడుగుపెట్టలేక పోతున్నారు. ఒక కారం పొట్లమో, బ్లేడో, చిన్నకత్తో, ఆఖరికి జడపిన్నులు కూడా నేడు ఆత్మరక్షణా సాధనాలౌతున్నాయి. బీహార్‌లో అగ్రకుల దౌర్జన్యాలను ఎదిరించడానికి మహిళలు సాయుధ శిక్షణ కూడా పొందారు. ఇక దోపిడీ వర్గాల పోలీసుల్నీ, మూకల్నీ, సైన్యాల్నీ ఎదుర్కోవాలంటే స్త్రీలు మూకుమ్మడిగా సంప్రదాయక ఆయుధాల్ని వాడిన సంఘటనలు చరిత్రలో కోకొల్లలు. మామూలు ఉత్పత్తి సాధనాలైన రోకళ్లు, కొడవళ్లు, గొడ్డళ్లు వంటివి చీపుర్లు, కారంపొడి ఎందరు పోలీసుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించాయో, ఎత్తిన తోకల్ని ముడుచుకునేలా చేశాయో!

ఇందుకు సంబంధించి మన ఉద్యమంలో కొన్ని ఇటీవల ఉదాహరణల్ని చూద్దాం. ఇవి మచ్చుకి కొన్ని మాత్రమే.

నల్గొండ జిల్లా మంథిని గొరెల్లి గ్రామంలో '97 జూన్‌లో 200 మంది మహిళలు దాడి చేయడానికి వచ్చిన పోలీసులను పొలిమేరల దాకా తరిమికొట్టారు. అల్లాపురం గ్రామంలో సంఘ నాయకుని భార్యతో అసభ్యంగా ప్రవర్తించిన పోలీసులను గ్రామం చివరి వరకు తరిమి కొట్టడమే కాకుండా 2, 3 గ్రామాలకు చెందిన 300 మంది పోలీసు స్టేషన్లపై రాళ్లు రువ్వటం, పోలీసులను తిట్టడం లాంటి కార్యక్రమాలను 3 గంటల సేపు కొనసాగించారు.

మహబూబ్‌నగర్ జిల్లాలోని తాండ్ర గ్రామంపై పోలీసులు అనేకసార్లు దాడులు జరపడంతో ప్రజలు ఆగ్రహించి వున్నారు. స్పెషల్ పార్టీ పోలీసులు సంఘ నాయకుల కోసం రాగానే 80 మంది మహిళలు చీపుర్లూ, కొడవళ్లు, కట్టెలు పట్టుకుని ఎదురు తిరిగారు. కాల్పులు జరుపుతామని బెదిరించినప్పటికీ భయపడకుండా కల్వకుర్తి వరకు తరిమికొట్టారు. మెదక్ జిల్లాలో వీరారెడ్డి పల్లెలో దళం ఆచూకీ కోసం గర్భిణీ స్త్రీని కొట్టడంతో మహిళలు తిరగబడి ఎస్.ఐ.నీ., పోలీసులనూ తీవ్రంగా కొట్టి తరిమేశారు. తిరిగి 2 వ్యానుల్లో పోలీసులు వచ్చి దాడిచేసినా మహిళలు వారితో తలపడ్డారు.

ఈస్ట్ డివిజన్‌లో మొనగరపల్లి గ్రామంలో సంఘ నాయకుడిని అరెస్టు చేయడానికి వచ్చిన పోలీసుల్ని మహిళలు కర్రలు, కట్టెలు పట్టుకుని ఒక కిలోమీటరు వరకు బురద, మట్టి, పెండ జల్లుతూ తరిమికొట్టారు. కర్నికపాలెంలో ఇటువంటి సందర్భంలోనే పోలీసులు తమమీదకు వచ్చిన ప్రజలను భయపెట్టడానికి చెట్ల వెనక పొజిషన్లు తీసుకుని తుపాకులు ఎక్కుపెట్టినా భయపడకపోవడంతో వారికి క్షమాపణ చెప్పి సంఘనాయకుడిని విడిచిపెట్టారు. వారిలో చాలామంది మహిళలూ, పిల్లలే.

శ్రీకాకుళంలో తాటిమానుగూడలోనూ, సంఘ నాయకుడిని అరెస్టు చేయడానికి వచ్చిన పోలీసుల్ని మహిళలు 2 కిలోమీటర్లు దూరం తరిమారు. ఈస్ట్ డివిజన్‌లో కంఠవరంలో పోలీసులకు వంట పాత్రలు ఇవ్వ నిరాకరించారు. దాంతో పోలీసులు హోటల్ యజమానిపై దౌర్జన్యం చేయగా మళ్లీ ఆ మహిళలే వెళ్లి అతనిని విడిపించారు. పెదమల్లాపురం గ్రామం వద్ద జరిగిన ఎదురుకాల్పుల్లో పోలీసులు గాయపడగా ప్రజలు వారికి మంచినీళ్లు కూడా ఇవ్వలేదు.

1998 మార్చి 8న సభను అడ్డుకున్న పోలీసులను ఎదిరిస్తూ మెదక్‌జిల్లా మిడిదొడ్డి, ఇతర మండలాల స్త్రీలు వేలాదిగా కదిలి బ్యారికేడ్లను ఛేదించుకుని సభను నిర్వహించుకున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా అమరుల శవయాత్రల్లో కూడా మహిళలు నిర్బంధాన్ని ధిక్కరిస్తూ వేల సంఖ్యలో పాల్గొంటున్నారు.

అనంతపూర్‌లో కా॥ నిర్మల శవయాత్రను అడ్డుకోవడానికి ప్రయత్నించిన పోలీసుల జీపును ధ్వంసం చేసి విప్లవ మహిళా సంఘం ఆధ్వర్యంలో తిమ్మాపూర్‌లో స్మారకసభ, ఊరేగింపు జరిపారు.

ఏ దేశంలో చూసినా, ఏ ఉద్యమంలో చూసినా కామన్ మిలీషియాలో మహిళలకు కీలకమైన పాత్ర వుంటూ వస్తోంది. మన ఉద్యమాల్లోనే చూసినా తమ ప్రాణాలకు తెగించి, మన సైనికుల్ని మహిళలు కాపాడిన సంఘటనలు చరిత్రలో సామాన్యుల సాహసానికి అత్యుత్తమ ఉదాహరణలుగా నిలిచిపోయేవే. ప్రజా ప్రతిఘటనలోనూ, కామ్రేడ్స్‌ను కాపాడుకోవడంలోనూ 'పోరాడితే బానిస సంకెళ్లు తప్ప పోయేదేమీ లేని' మహిళలదే ముందడుగు. పురిటిగుడ్డల్లో కామ్రేడ్స్‌ను దాచి కాపాడినా, పేరంటాల పేరుతో మహిళలను ఒకటి చేసి రాజకీయాలు చెప్పినా, తమ స్వంత పిల్లలు అని చెప్పి కామ్రేడ్స్‌ను తప్పించి తమ పిల్లలను పట్టించినా, ఆయుధాల్ని, చిట్టీల్ని నేర్పుగా దాచి సురక్షితంగా చేరవేసినా... ఇంకా ఎన్నెన్నో పద్ధతుల్లో వారు చూపిన తెగువే కాక అనుసరించిన సృజనాత్మక పద్ధతులూ ప్రజలే నిజమైన తెలివిగలవారు అనడానికి సజీవ నిదర్శనాలే. కామన్ మిలీషియాలో మహిళలది ప్రధాన భాగమే అయినా వారిని బేసిక్, ఆర్మ్‌డ్ మిలీషియాలో ప్రధాన భాగం చేయడంపైనా మన కేంద్రీకరణ వుండాలి. ఇది జరగకుండా పి.జి.ఏ.లో వారు సగభాగం కాలేరు. ఇది గుర్తించి మనం కృషి చేపట్టాలేగానీ రేపు ప్రజాసైన్యంలో సగభాగం ఏమి, సగభాగం కంటే ఎక్కువ మహిళలే అయినా మనం ఆశ్చర్య పడాల్సినదేముంది? అది సహజమనిపించే స్థితే వుంటుంది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో 50 శాతం దాకా మహిళలు వున్నారంటే, మనం ఇంకొంత శ్రద్ధ పెడితే ఖచ్చితంగా ఆ శాతం ఎంతో పెరుగుతుంది.

చైనా, వియత్నాం వంటి దేశాల్లో మహిళా బెటాలియన్లు ఏర్పర్చడం కూడా మనకు కన్పిస్తుంది. అయితే చాలా దేశాల్లో మిలీషియాలో భాగం చేసినంతగా స్త్రీలను సైన్యంలో భాగం చేయకపోవడమూ కన్పిస్తుంది. వెనకబడిన దేశాల్లో మొదట స్త్రీలు ఎక్కువగా మిలీషియాలోనే భాగం అయ్యే అవకాశం వుంటుంది. అయితే కార్మికవర్గ పార్టీగా చైతన్యవంతంగా మనం చేసే కృషే వారు అక్కడే ఆగకుండా సైన్యంలో భాగమయ్యేలా చేస్తుంది. ఈ విషయంలో మనం ఏ మాత్రం అలసత్వం ప్రదర్శించకూడదు. అశ్రద్ధ వహించకూడదు. అన్ని స్థాయిల్లో, అన్ని విభాగాల్లో వారు రావాలన్న ఈ చైతన్యవంతమైన కృషే ప్రధాన అంశం అవుతుంది.

నక్సల్బరీ, శ్రీకాకుళాల నుండి మొదలుకొని ఇప్పటివరకు ఎందరో మహిళా గెరిల్లా యోధులు అనేక సాహసోపేతమైన చర్యల్లో పాల్గొని వీర సైనికులుగా వీరమరణం పొందారు. కా॥ నిర్మల వారసులుగా వారందరి నుండి స్ఫూర్తిని పొందుతూ వారి సాహసాల్ని ప్రజల్లో ముఖ్యంగా మహిళల్లో విస్తృతంగా ప్రచారం చేద్దాం. వారు కలలుకన్న ప్రజావిముక్తి సైన్యాల్ని నిర్మించడానికీ, భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడానికీ దృఢ సంకల్పంతో పి.జి.ఏ.లో అడుగు ముందుకు వేద్దాం! ఈ మార్చి 8 సందర్భంగా పి.జి.ఏ.లో చేరాలనే పిలుపును మహిళల్లోకి విస్తృతంగా తీసుకువెళదాం!

- **మహిళలేని విప్లవం గెలవబోదు! గెలవబోదు!**
- **ప్రజా మిలీషియాలో మహిళలను విస్తృతంగా భాగం చేద్దాం! పి.జి.ఏ.ను బలోపేతం చేద్దాం!**
- **నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి!**
- **అంతర్జాతీయ శ్రామిక మహిళా దినం వర్ధిల్లాలి!!** ❑

(7వ పేజీ తరువాయి...)

విస్తరణకు సంబంధించిన కేంద్రీకృత పథకాన్ని సిద్ధం చేశారు. ఇక త్వర త్వరగా ఫలితాలు సాధించడానికి ఈ క్రింది విధానాలను వాళ్ళు అన్వయించారు.

1. పి.యు. ఏరియాల్లో వర్గపోరాట పంథాను వదిలేసి, మాకు వ్యతిరేకంగా ఐక్య సంఘటన ఏర్పాటు చేయడానికి పి.యు.నుంచి బహిష్కరించిన, దిగజారిపోయిన వ్యక్తుల్ని, నేరగాళ్ళను కూడగట్టే విధానం.

2. ప్రజాస్వామిక పద్ధతులకు బదులు పి.యు.ను తుడిచి వేయడానికి భూస్వామ్య పద్ధతుల్ని అన్వయిస్తూ, రాజకీయ క్యాంపెయిన్‌కు బదులు వాళ్ళు దళ చర్యల్ని ఆశ్రయించటం. ప్రజల్లో భయోత్పాతం సృష్టించడానికి క్రూరాతి క్రూరమైన పద్ధతుల్ని అన్వయించే విధానం కూడా చేపట్టారు.

3. మాపై వారి దళ చర్యల క్యాంపెయిన్‌ను సమర్థించుకోవడానికి శుద్ధ అబద్ధాలు సృష్టించి నిందల్ని మోపే విధానం చేపట్టారు.

**ప్రశ్న : ఎం.సి.సి ఈ దౌ□్యపరవైన ఎ□్తైల, రాజకీయ జి□్తైల్ని ఏ కారణం చే□ ఆశ్రైంచింది?**

**శ్రావణ** : జాతీయ, అంతర్జాతీయ విప్లవ సంస్థలు ఒత్తిడి చేయటం వల్ల వాళ్ళు ఈవిధానాన్ని ఆశ్రయించారు. '98 ఆగస్టు నుండి, ఎం.సి.సి. నాయకత్వం నుండి రెచ్చగొట్టే పనులు జరిగినా ఐక్య పీపుల్స్‌వార్ తనకు తాను నిగ్రహాన్ని పాటిస్తూ, ఎం.సి.సి.తో ఘర్షణలు ఆపిన ఫలితంగా తీవ్ర నష్టాల పాలయినప్పటికీ, ఎం.సి.సి. తన విచక్షణా రహితమైన దాడుల పరంపరను కొనసాగించింది. సమస్యల పరిష్కారానికి చర్చల్ని మళ్ళీ తిరస్కరించడం కూడా వారి నిజ స్వరూపాన్ని బయటపెడుతుంది. ఫలితంగా ఎం.సి.సి. చెడ్డ పేరు సంపాదించుకుని, విప్లవ ప్రజల నుండి, విప్లవ క్యాంపు నుండి వేరైంది. పలుకుబడిని కాపాడుకోవటానికి విప్లవ క్యాంపుని, ప్రజల్ని తెలివి తక్కువ వాళ్ళని చేయడానికి బలవంతంగా ఈ విధానాన్ని ఆచరణలోకి తెచ్చారు. ఇదంతా మాకు వ్యతిరేకమైన తమ మొత్తం కుట్రలో భాగమే తప్ప, మరొకటి కాదని మేము చెప్పినట్లుగానే, మమ్మల్ని తుడిచేయడానికి [పీపుల్స్‌వార్] మీద తమ దాడులు కొనసాగించారు.

దౌత్యపరమైన ఎత్తులు, రాజకీయ జిత్తులు మానుకుని; విప్లవ కారులకు వ్యతిరేకంగా మిలటరీ (దళ) చర్యల్ని ఆపి, రాజకీయ- సైద్ధాంతిక పోరాటాలు, ద్వైపాక్షిక చర్చల ద్వారా సమస్యల్ని పరిష్కరించుకోవాలని మరొకసారి ఎం.సి.సి. నాయకత్వాన్ని కోరుతున్నాము. ఉన్నతమైన విప్లవ ప్రయోజనాల కొరకు తమ సంకుచిత ప్రయోజనాలకు ఉపయోగపడే ఒంటెత్తు విధానాలను వాళ్ళు పూర్తిగా మానుకోకుంటే, జరగబోయే దురదృష్టకర పరిణామాలకు వాళ్ళే బాధ్యత వహించవలసి వుంటుంది. ❑

# దౌత్యపరమైన ఎత్తుల, రాజకీయ జిత్తుల చాలించండి!
# ఘర్షణల మానుకుని ద్వైపాక్షిక చర్చల ద్వారా సమస్యల్ని పరిష్కరించండి!!

**[సి.పి.ఐ.(యం-యల) [పీపుల్స్‌వార్] బీహార్ రాష్ట్రకమిటీ కార్యదర్శి కా॥ శ్రావణ 'పీపుల్స్‌మార్చ్' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూ]**

**ప్రశ్న : ఏకపక్షంగా ఘర్షణల ముగింపుకై ఎం.సి.సి. నాయకత్వం ప్రకటన చేసినప్పటికీ సి.పి.ఐ. (యం-యల) [పీపుల్స్‌వార్]నుండి సరైన స్పందన లేదని వాళ్ళు చెబుతున్నారు. దీని గురించి మీరేమంటారు?**

**శ్రావణ :** ఇది శుద్ధ అబద్ధం తప్ప మరేమీ కాదు. ఇది దౌత్యపరమైన ఎత్తుగడ, రాజకీయ జిత్తు తప్ప మరొకటి కాదు. ఎం.సి.సి.తో ఘర్షణలు ఆపడానికి మా శక్తి కొద్దీ ప్రయత్నించాం. ఇందుకోసం 3-3-2000 తేదీన పత్రికా ప్రకటన విడుదల చేసి, 15-3-2000 తేదీన ఒక కరపత్రాన్ని ప్రచురించి మా పార్టీ సభ్యులందరికీ తెలియజేయడానికి ఒక సర్క్యులర్‌ను జారీ చేశాము. ఈ పత్రికా ప్రకటనలు, కరపత్రాలు, సర్క్యులర్‌లలో మేం ఎం.సి.సి. ప్రకటనను సాదరంగా, హృదయపూర్వకంగా ఆహ్వానించి క్యాడర్‌కు, ప్రజలకు విప్లవ సాయుధ పోరాటాన్ని తీవ్రతరం చేయవలసిందిగా పిలుపునిచ్చాము. ఆ పరిస్థితిలో అది అవసరం కూడా. ఎం.సి.సి. తమ ప్రకటనను ఆచరణలో పెట్టినట్లైతే, అవతలివైపు నుండి రెచ్చగొట్టినప్పటికీ, ఘర్షణలకు దిగవద్దని మా క్యాడర్‌ను ఒప్పించడానికి మా శక్తి కొద్దీ ప్రయత్నిస్తామని ఆ ప్రకటన పత్రంలో ఎం.సి.సి. నాయకత్వానికి హామీ కూడా ఇచ్చాము. దోపిడీ వర్గాలకు, వారిని కాపాడుతున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న సాయుధ పోరాటానికి ఈ ఘర్షణల ముగింపు ప్రకటన నూతన జీవితాన్నిస్తుందని కూడా మా ప్రకటన చెప్పింది. మీదు మిక్కిలి ఆరోపణలు, ప్రత్యారోపణలు అన్నింటినీ మరిచిపోదామని కూడా ఎం.సి.సి. నాయకులకు విజ్ఞప్తి చేశాము. అదొక దౌత్య ఎత్తుగడ, రాజకీయ జిత్తు కాకుంటే, ఎం.సి.సి. తన ప్రకటనను ఆచరణలో పెట్టేదని భావించాం. మా రెండు పార్టీలు కలసిన వెంటనే ఐక్య పీపుల్స్‌వార్ కేంద్రకమిటీ (ప్రొవిజనల్) '98 ఆగస్టులో ఏకపక్షంగా ఘర్షణల ముగింపుకై చేసిన ప్రకటనను, సమస్యల పరిష్కారానికి ద్వైపాక్షిక చర్చలకు రావలసిందిగా ఎం.సి.సి.ని ఆహ్వానించిన విషయాలను పరిశీలించవలసిందిగా ఈ సందర్భంగా మిమ్మల్ని కోరుతున్నాము. దానికి సమాధానంగా ఘర్షణల్ని ఆపడానికి బదులు వారు మామీద సాయుధ దాడులు తీవ్రం చేసి, వీటిని బెంగాల్‌కు కూడా విస్తరించారు. వారి దళం బీహార్ సరిహద్దులు దాటి, మిడ్నపూర్ జిల్లా బెల్పహరి గ్రామంలో మా పశ్చిమ బెంగాల్ రాష్ట్రకమిటీ సభ్యునిపై దాడి చేసింది. పైగా ద్వైపాక్షిక చర్చలకై మా ఆహ్వానానికి వారు స్పందించలేదు. గత రెండు సంవత్సరాలుగా మేము మళ్ళీ మళ్ళీ శ్రద్ధ చూపినప్పటికీ, వాళ్ళెప్పుడూ చర్చలకు రాలేదు. ద్వైపాక్షిక చర్చల్ని తప్పించుకోవడానికి వాళ్ళు ఏదో ఒక కారణాన్ని ముందు పెట్టడాన్ని కొనసాగిస్తున్నారు. వాస్తవంగా ఎం.సి.సి. నాయకత్వం తమ స్వంత ప్రకటనకు కట్టుబడి వుంటుందా, లేదా? అనేది మాకు కొంత అనుమానంగానే వుండేది. మా పార్టీ ప్రభావంలో వున్న ప్రజల పరిస్థితి కూడా ఇదే.

**ప్రశ్న : కానీ మీ అనుభవానికి ప్రాతిపదిక ఏమిటి?**

**శ్రావణ :** మొదటిది, వారి ప్రకటనకు సంబంధించిన పత్రికా ప్రకటనలో ఎలాంటి ఆత్మవిమర్శనా వైఖరి మీకు కన్పించదు, పైగా మాకు వ్యతిరేకంగా తిరిగి వాళ్ళు ఆరోపణలు చేస్తున్నారు. అంతేగాక, జాతీయ, అంతర్జాతీయ విప్లవ సంస్థలు కొన్ని చేసిన విజ్ఞప్తికి స్పందనగా వాళ్ళు ఆ పత్రికా ప్రకటన చేసినట్లు చెప్తున్నారు. దయచేసి మీరు ఆ పత్రికా ప్రకటన చూడండి, వారి పాత పద్ధతిలో మార్పులేదనేది మీకే అర్థమవుతుంది.

రెండవది, మా పార్టీని ''తుడిచిపెట్టండి'' అనే వారి పాత విధానాన్ని విరమించుకోవడంగానీ, అమలు చేయకుండా ఆపటంగానీ చేయలేదు.

మూడవది, ఏకపక్షంగా ఘర్షణల ముగింపుకు వారొక పత్రికా ప్రకటనను, కరపత్రాన్ని విడుదల చేసినప్పటికీ, ఆ ఘర్షణలకు పూర్తిగా బాధ్యులం మేమేనన్న ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

నాల్గవది, ఘర్షణలు ఆపడానికి అనేక ప్రకటనలు, ఉమ్మడి పత్రికా ప్రకటనలు చేసినప్పటికీ, ఒక్క సందర్భంలో తప్ప, సంవత్సరాల తరబడి పథకం ప్రకారం వాళ్ళు మళ్ళీ మళ్ళీ ఒడంబడికలను అతిక్రమించారు. కానీ మా మీద నింద వేయటం తప్ప, తమ తప్పును వాళ్ళెప్పుడూ అంగీకరించలేదు. ఇందులో ఎం.సి.సి. నాయకత్వం నిజంగా రికార్డు సృష్టించింది.

కానీ ఇంతటితోనే ఇది ముగియలేదు. ఇంకా కొన్ని వాస్తవాలు కూడా వారి ప్రకటనను అమలు చేయటం గురించి మేము అనుమానపడేందుకు దారితీస్తున్నాయి.

**ప్రశ్న : కానీ, తమ ప్రకటన తర్వాత కూడా వారిపై మీరు దాడి చేశారని ఎం.సి.సి. మీకు వ్యతిరేకంగా చేస్తున్న ఆరోపణలు వాస్తవం కాదా?**

**శ్రావణ :** ఇది నిజంగా ఆసక్తి కలిగించేది. దయచేసి రాసుకోండి, అది అబద్ధమైనా కూడా! ఎం.సి.సి. నాయకులు ఎప్పుడూ దృఢంగానే మాట్లాడతారు. అది అబద్ధమైనా సరే! తమ తప్పుల్ని కప్పిపుచ్చుకోవడానికి, ఎలాంటి భిన్నాభిప్రాయానికి వ్యతిరేకంగానైనా ఆరోపణలు చేయటంలో వారు అసాధారణమైన నైపుణ్యాన్ని అభివృద్ధి చేశారు. ఇది వాళ్ళకు సంబంధించిన ఒక లక్షణం. ఈసారి కూడా వాస్తవాలు ఖచ్చితంగా వాళ్ళ ఆరోపణలకు వ్యతిరేకంగా వున్నాయి. ఏడు నెలల్లో మా అనుమానం నిజమైంది. 2000 ఆగస్టు 19వ తేదీన కర్‌కట్టా రైల్వేస్టేషన్ నుంచి కా॥ రఘునాథ్ రజ్వారా, కా॥ గనోరి చౌధురి అనే మా కామ్రేడ్స్ ఇద్దరిని, కా॥ నరేష్ మెహతా అనే మా సానుభూతిపరుణ్ణి ఎం.సి.సి. కిడ్నాప్ చేసింది.

పలాము జిల్లా, బిస్రాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుల్హి గ్రామానికి చెందిన గుట్టల ప్రదేశంలో, మిగతా ఇద్దరి ముందే కా॥ గనోరి చౌధురిని ఎం.సి.సి. దళం క్రూరంగా హత్య చేసి, ఇద్దర్ని తీవ్రంగా గాయపరిచింది. ఇంతకుముందు, 20-3-2000 తేదీన పలాము జిల్లా బిస్రాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బెల్వారా గ్రామం దగ్గర ఎం.సి.సి. మా దళంపై దాడిచేసి కా॥ రామశీష్ (బిస్రాంపూర్ ఛత్తర్‌పూర్ ఏరియా కమిటీ కార్యదర్శి), కా॥ శివకుమార్, మరొక దళ సభ్యుణ్ణి చంపినప్పుడు కూడా కా॥ గనోరి గాయపడ్డాడు. ఆ సందర్భంలో ఎం.సి.సి. దళం కా॥ గనోరిని పట్టుకుని సి.పి.ఐ.(యం-యల్) [పీపుల్స్‌వార్] లో సభ్యుడిగా రాజకీయ కార్యక్రమాలు కొనసాగిస్తే చంపుతామని బెదిరించి వదిలేశారు. తమ ఆజ్ఞ పాటించలేదని ఎం.సి.సి. ఇపుడు అతన్ని చంపింది. ఈ భయంకరమైన హత్యా సంఘటన తరువాత ఈ సంఘటన తమకు తెలియకుండా జరిగిందని ఎం.సి.సి. ఒక పత్రికా ప్రకటన విడుదల చేసి, తమ విచారాన్ని వ్యక్తం చేసింది. అయినప్పటికీ, పత్రికా ప్రకటనలో గమనించాల్సిన ఆసక్తికరమైన అంశం ఏమిటంటే, సంఘటన గురించి సమాచారం వార్తా పత్రిక ద్వారానే తమకు తెలిసిందని, ఆ తరువాత, పలాము జిల్లా ఛత్తర్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాథేయ గ్రామంలో నందూపాశ్వాన్ హత్యకు ప్రతీకారంగానే ఈ సంఘటన జరిగిందనేది అర్థం చేసుకున్నామని అదే పత్రికా ప్రకటనలో వాళ్ళు చెప్పారు. నందూపాశ్వాన్ చనిపోయిన ప్రదేశానికి బిస్రామ్‌పూర్ చాలా దూరమున్నప్పటికీ, అప్పుడు కూడా వాళ్ళు వ్యాఖ్యానించేది ఏమంటే, స్థానిక ప్రజలు, కార్యకర్తలు కోపంతో మూకుమ్మడిగా దాడిచేసిన ఫలితంగా ఇది జరిగిందనే. ఇది తమ నీచమైన పనిని సమర్థించుకునే అద్భుతమైన వాదన అనడంలో అనుమానమే లేదు. ఈ జిత్తులమారి నాయకులు ప్రజల్ని మోసం చేసి తమ నేరాల్ని కప్పి పుచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. లేకుంటే, స్థానిక ప్రజలు, కార్యకర్తలు కోపంతో మూకుమ్మడిగా దాడి చేసిన సంఘటన అది అని ఎందుకు చెబుతారు? బిస్రామ్‌పూర్, ఛత్తర్‌పూర్ ఒకే ప్రదేశంలోనివని వాళ్ళు పరిగణిస్తారా? ఇంకా చూడండి, నందూ పాశ్వాన్ సంఘటన 2000 మార్చిలో జరిగితే, ఈ సంఘటన జరగకముందు నందూపాశ్వాన్ మా కార్యకర్త అని వాళ్ళు ఎందుకు చెప్పలేదు? ఒక సీనియర్ కామ్రేడ్‌గా మీరు దీన్ని ఆత్మవిమర్శగా పరిగణించగలరా? అదే నిజం కాకపోతే, ఈ రెండు సంఘటనల తర్వాత వాళ్ళెందుకు మౌనం వహించినట్లు? 2000 ఆగస్టు 15వ తేదీన పలాము జిల్లా, వెస్లీగంజ్ పి.ఎస్. పరిధిలోని ధవావివ్ గ్రామం దగ్గర కాలిమ్ మియాన్ అనే మా సానుభూతిపరుడొకర్ని ఎం.సి.సి. దళం చంపింది. కాలిమ్ మియాన్ సోదరున్ని కూడా 1997లో చంపారు. 2000 సంవత్సరం అదే నెలలో పలాము జిల్లా, ఛాన్‌పూర్ పి.ఎస్. పరిధిలోని రామ్‌ఘర్ గ్రామంలో ఎవానుల్ అన్సారీ అనే మా సానుభూతిపరుణ్ణి వాళ్ళు చంపి అతని ఇంట్లో లూటీ చేశారు.

పత్రికా ప్రకటన ఇచ్చిన క్రమంలో, వాళ్ళెంత బుద్ధిమంతులో అర్థం చేసుకోవడానికి మరొక సంఘటన కూడా చూద్దాం. కా॥ సత్యేంద్రను చంపడానికి ఔరంగాబాద్ జిల్లా, నజీనగర్ పి.ఎస్. పరిధిలోని బరియా గ్రామంమీద 2000 సెప్టెంబర్ 10వ తేదీన ఎం.సి.సి. సాయుధ దళం దాడి చేసింది. అతడు వాళ్ళకు దొరకలేదు. అందుకని ఎం.సి.సి. నాయకత్వంలోని దళం చేసిన మరో వీరోచిత చర్య ఏమిటంటే అతని తండ్రిని, భార్యని బూతులు తిట్టి, పీపుల్స్‌వార్‌తో తెగతెంపులు చేసుకోకపోతే సత్యేంద్రను చంపుతామని బెదిరించారు. గ్రామం నుండి వెళ్ళిపోయే ముందు మర్చిపోకుండా వాళ్ళ ఇంట్లో సామాను లూటీ చేసి, ఇంట్లో ఒక భాగాన్ని ధ్వంసం చేసి పోయారు. దీంతో భీతిల్లిపోయిన ఆ వూరి ప్రజలు, ధోబ్‌ధియా గ్రామంలో షెల్టర్ తీసుకున్నారు. సత్యేంద్రను వెదకడానికి దళం ఆ గ్రామంలోకి కూడా వెళ్ళింది. ఇందుకు ధోబ్‌ధియా గ్రామస్థులు వ్యతిరేకించగా, ఎం.సి.సి. వారిని చితకబాదింది.

వారి 'సౌహార్ద' క్యాంపెయిన్ ఇలా కొనసాగుతున్నది. 2000 అక్టోబర్ 18న బస్‌లో వెళుతున్న పరిఖా యాదవ్ మీద ఎం.సి.సి. దళం దాడి చేసి కాల్పులు జరిపింది. అయినప్పటికీ, అతడు తప్పించుకున్నాడు. 29-10-2000 తేదీన తిరిగి ఎం.సి.సి. మరొక 'వీరోచిత' హత్యాకాండ జరిపింది. జోరాఖుర్ద్ గ్రామానికి చెందిన అమెరికా సింగ్ అనే పేరుమోసిన రౌడీని 6-7 గ్రామాల ప్రజలు కలసి చంపిన రోజు, పలాము జిల్లా, ఛత్రపూర్ పి.ఎస్. పరిధిలోని భికి-పల్వా గ్రామంలోకి ఎం.సి.సి. ప్రవేశించి 15 మందికి పైగా మా సానుభూతిపరుల్ని కిడ్నాప్ చేసింది. వారిలో ఐదుగురిని చంపి, ఇద్దరి చేతులు నరికి, 7 ఇళ్ళను తగులబెట్టారు.

మీకిప్పుడు నందూపాశ్వాన్ సంఘటన గురించి చెప్తాను. ఈ సంఘటన పలాము జిల్లా ఛత్తర్‌పూర్ పరిధిలోని లాత్యా గ్రామంలో జరిగింది. చాలా కాలం నుండి ఈ గ్రామంలో మా రాజకీయ కార్యక్రమాలు జరుగుతూ, అనేకమంది గ్రామస్థులు మా రాజకీయ కార్యక్రమాలకు మద్దతిస్తున్నారు. ఈ మొత్తం కాలంలో ఈ ప్రాంతంలో ఎం.సి.సి.కి సంబంధించిన ఎటువంటి రాజకీయ కార్యక్రమాలూ జరగలేదు. గ్రామస్థులకు మా పార్టీ మీద విశ్వాసముండి వాళ్ళెలాంటి సమస్య ఎదుర్కొన్నప్పుడైనా, మా పార్టీ సహాయంతో ఆ సమస్యల్ని పరిష్కరించుకున్నారు. ఈసారి మా దళం గ్రామానికి వచ్చినపుడు, నందూపాశ్వాన్ మేనల్లుళ్ళు అనిల్, సునీల్ లంపెన్ జీవితం గడుపుతూ, రోడ్ కాంట్రాక్ట్ పొందిన కాంట్రాక్టర్ నుండి డబ్బులు డిమాండ్ చేశారని లాత్యా గ్రామస్థులు కొందరు చెప్పారు. డబ్బు చెల్లించడానికి కంట్రాక్టర్ తిరస్కరించగా, ఈ లంపెన్లు ఆ కాంట్రాక్టర్‌ను తీవ్రంగా భయపెట్టి, రోడ్డు నిర్మాణం ఆపమని అతన్ని బలవంతపెట్టారు. వాళ్ళ దాదాగిరిని గ్రామస్థులు వ్యతిరేకించగా, వాళ్ళు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం వేసి, హాండిల్ ఇవ్వకుండా, గ్రామస్థులకు కరెంటు అందకుండా చాలా ఇబ్బంది పెట్టారు. అందువల్ల మా దళం ప్రజా పంచాయితీ నిర్వహించ దలచింది. వాళ్ళను తీసుకురావడానికి మా దళసభ్యుడొకరు నందూ ఇంటికి వెళ్ళగా, అనిల్, సునీల్, నందూ, అతని కుటుంబ సభ్యులు, ప్రత్యేకించి సునీల్ బూతులు తిట్టడం ప్రారంభించి, దళ సభ్యులమీద ఆయుధాలతో దాడికి దిగి, వాళ్ళ ఆయుధాలు గుంజుకోవడానికి ప్రయత్నించారు. అదే సమయంలో సెంట్రీ చేస్తున్న మరొక దళసభ్యుడు జరుగుతున్న గలభా విని, దళసభ్యునికి రక్షణగా అక్కడికి పరుగెత్తి, ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపాడు. యాదృచ్ఛికంగా తూటా తగిలి నందూపాశ్వాన్ చనిపోయాడు. ఇదీ జరిగిన సంఘటన. దీనికి సంబంధించి, నందూ పాశ్వాన్‌ను మేము ఉద్దేశపూర్వకంగా చంపలేదని చెప్పాము. సంఘటన జరిగిన ప్రదేశంలో మాకున్న మంచి రాజకీయ పలుకుబడిని బట్టి కూడా నందూ

పాశ్వాన్‌కు ఎం.సి.సి.తో రాజకీయ సంబంధాలేమీ లేవని చెప్పగలం. పై సంఘటన జరిగిన తర్వాత, ఈనాడు సాధారణంగా జరుగుతున్న తంతులో భాగంగా, నందూపాశ్వాన్ కుటుంబ సభ్యులు ఎం.సి.సి.ని ఆశ్రయించారు.

**ప్రశ్న : మీ వివరణ కోసం 13-10-2000 నాటి 'ప్రాంటీం' పత్రికలో ప్రచురించిన ఎం.సి.సి. పత్రికా ప్రకటనలోని ఈ క్రింది భాగాన్ని మీ స్పందించ□న్నారా.** ''99 అక్టోబర్ మొదటి వారం లేదా సరిగ్గా అక్టోబర్ 10వ తేదీ తరువాత, వాస్తవంగా ఎం.సి.సి. అన్నిరకాల ప్రతీకార చర్యల్ని ఆపేందుకు నిర్ణయం తీసుకున్నప్పటికీ '99 అక్టోబర్ 5న ప్రభుయాదవ్ (పాట్నా జిల్లా, ముసౌరి పి.ఎస్. పరిధిలోని కెసోభల్కు గ్రామం), '99 నవంబర్ 24న కరూ యాదవ్, సంజయ్ యాదవ్, రామ్‌పరవేరో యాదవ్ (పాట్నా జిల్లా భగబన్‌గంజ్ పి.ఎస్. పరిధిలో భన్జోర్ గ్రామం), '99 డిసెంబర్ 10న నరేష్ యాదవ్ (పలాము జిల్లా చైన్‌పూర్ పి.ఎస్. పరిధిలో మిధోఖార్ గ్రామం) వంటి మా మద్దతుదారులు కొందర్ని, ఒకరిద్దరు మా క్రాంతికారి కిసాన్ కమిటీ సభ్యుల్ని '99 డిసెంబర్ మధ్యలో జెహనాబాద్ ముసౌరి ఏరియాలో ఒక మద్దతుదారుడ్ని పీపుల్స్‌వార్ చంపింది. మేము ఎలాంటి ప్రతీకార చర్యలు చేయలేదు''.

**శ్రావణ :** కానీ ఆ ప్రకటన చేసిన తేదీ లేదా ఆ వారంలోపు తమ సదభిప్రాయాల్ని వాళ్ళు ప్రకటించలేదు? దాని వెనుకనున్న రహస్యమేమిటి? జనవరి 7న తమ ప్రకటన ప్రచురించారు. ఆ ప్రకటనలో కూడా అక్టోబర్ 10 నుండి తమ ప్రతీకార చర్యల్ని ఆపుతున్నట్లు వాళ్ళు పేర్కొనలేదు. వారి ప్రకటనకు ప్రతిస్పందనగా 2000 మార్చి 15న మా ప్రకటన ప్రచురించాము. 2000 మార్చి 15 నుండి ప్రతీకారం తీసుకోవలసిన స్థాయిలో వాళ్ళు రెచ్చగొట్టినప్పటికీ మేము కనీసం ఒక్క ప్రతీకార చర్యకూడా చేయలేదని హామీ ఇవ్వగలం. కనుక మా మీద తమ దాడులు కొనసాగించ దలచిన ఎం.సి.సి. నాయకత్వం, ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కొన్నది. ఈ పరిస్థితిని అధిగమించి, మామీద దాడులు చేయడానికి వాళ్ళొక పథకాన్ని సిద్ధం చేశారు. మొదట, మేము ప్రతీకార చర్యలు ఆపలేదని రుజువుచేసి ఆ తరువాత మాకు వ్యతిరేకంగా తమ 'జిహాద్' (పవిత్ర యుద్ధం)ను కొనసాగిస్తారు. అందువల్ల జనవరి 10కి ముందుగానే ఘర్షణలు ముగించామన్న ప్రకటనకు సంబంధించిన ఈ కథను వాళ్ళు ప్రచురించారు. ఈ కథ ఎవరికీ తెలీదు.

ఇప్పుడు పైన చెప్పిన సంఘటనల గురించి చూద్దాం. పాట్నా జిల్లా భగబన్‌గంజ్ పి.ఎస్. పరిధిలోని భన్జోర్ గ్రామంలోని సంఘటన గురించి, ఆరోజు వాళ్ళ మనుషులని చెప్పుకుంటున్న ముగ్గురి హత్యా సంఘటన లాంటివేవీ అక్కడ జరగలేదని గట్టిగా చెప్పగలం. అటువంటి వ్యక్తులు అక్కడున్నారనే సమాచారం మాకు లేదు. ఎం.సి.సి. ప్రకటనకు ముందు గప్పుయాదవ్ (రామనందయాదవ్) ను మా దళం అంతమొందించిందనే సమాచారం మాకుంది. చాలా కాలం నుండి భూ సమస్యమీద అతడికి వ్యతిరేకంగా ఆ గ్రామ ప్రజలు పోరాడుతున్నారు. ప్రజల ఆగ్రహం నుంచి తనను తాను రక్షించుకోడానికి రామానంద్ మొదట ''లిబరేషన్'' పార్టీలో చేరి, గత పి.యు. నాయకత్వంలో ప్రజలు 'లిబరేషన్'ను ఓడించగా, అతడు ఎం.సి.సి.లో చేరాడు. మా కామ్రేడ్ ఒకర్ని చంపడానికి అతడు ఒకసారి ఎం.సి.సి. దళాన్ని ఆహ్వానించాడు. కానీ అది బహిర్గతమై ఎం.సి.సి.కి మా దళానికి మధ్య ఘర్షణ జరిగింది. అయినప్పటికీ వారి విచక్షణారహితమైన కాల్పులకు బదులిచ్చి, మా కామ్రేడ్‌ను కాపాడుకున్నాము. ఆ సంఘటన తరువాత, పార్టీ నిర్ణయం మేరకు మా దళం అతన్ని అంతమొందించింది. ఇంతకుముందు అదే గ్రామానికి చెందిన రాజేశ్వర్ యాదవ్, విజయ్ యాదవ్‌లను వారి ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకుగాను మేము అంతమొందించామనే విషయం కూడా మీకు తెలియజేశాము. పాట్నా జిల్లా, ముసౌరి పి.ఎస్. పరిధిలోని రెసోభల్క్ గ్రామానికి చెందిన ప్రభుయాదవ్‌కు 'లిబరేషన్'తో సంబంధాలున్నాయి. ఆ తరువాత అతడు పి.యు. నాయకత్వంలోని రైతాంగ ప్రజాసంఘంలో చేరి, స్థానిక ప్రజాసంఘంలో పలుకుబడి గల సభ్యుడిగా తయారయ్యాడు. అతని అవినీతి పనులకు, క్రమశిక్షణా రాహిత్యానికి 1998లో ప్రజాసంఘం నుండి బహిష్కరించారు. అప్పటి నుండి అతడు ముసౌరి పోలీస్‌స్టేషన్‌తో, ఎం.సి.సి.తో సంబంధాలు కొనసాగించాడు. మా దళం మీద, ప్రజలమీద దాడి చేయడానికి రహస్యంగా అతడు ఎం.సి.సి. దళంలో భాగమయ్యాడు. ఇది బయటపడినప్పుడు అతన్ని అంతమొందించాము.

**ప్రశ్న : ఎం.సి.సి. పద్ధతులు, వైఖరి గురించి మీ అంచనా ఏమిటి?**

**శ్రావణ :** ఇది వైఖరి, పని పద్ధతులకు సంబంధించిన సమస్య మాత్రమే కాదు, దృక్పథానికి సంబంధించిన సమస్య కూడా అని మేము అనుకుంటున్నాము. ఈ వైఖరి, పద్ధతి, పథక రచన వారి పిడివాద దృక్పథంలో ఒంటెత్తు పని పద్ధతిలో ప్రతిబింబిస్తున్నాయి. వాస్తవంగా వారి పిడివాద దృక్పథం కారణంగా విషయానికి సంబంధించిన అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోరు, తీసుకున్నా, సిద్ధాంతం ఏది అనేది అర్థం చేసుకోవటంలో విఫలమవుతారు. ఉదాహరణకు చెప్పుకుంటే, అభివృద్ధి నిరోధకుల్ని అణగదొక్కడానికి దలాల్‌ఛక్-బఘౌరా సామూహిక హత్యాకాండ సిద్ధాంతపరంగా సరైన పద్ధతి అని వారు మా ముందు పెట్టినప్పుడు, మేము ఈ పద్ధతిని వ్యతిరేకించాము. కానీ ఎం.సి.సి ఒప్పుకోలేదు కనక రెండుసౌహార్ద్ర సంస్థల మధ్య అభిప్రాయాల్లో తేడాలుండటం చాలా సహజం. మొక్కవోని వర్గ పోరాట అభివృద్ధి, సైద్ధాంతిక పోరాటం ద్వారా పరిష్కారమయ్యే భిన్నాభిప్రాయాలు సాధారణంగా కొనసాగుంటాయి. కానీ, ఎం.సి.సి. నాయకత్వం అన్వయించిన పద్ధతేమిటి? ఈ పద్ధతులను పక్కకునెట్టి పి.యు.ని మితవాద ఆచరణ అన్వయిస్తున్న పార్టీగా పరిగణించడం ప్రారంభించి, భవిష్యత్తులో మేము ఎన్నికల్లో పాల్గొన బోతున్నామని అవగాహన చేసుకున్నారు. ''పి.యు. నాయకుల్ని వేరుచేసి, క్యాడర్‌ను గెలుచుకోండి'' లాంటి నినాదాలకు దారితీసే విధానాన్ని తమ 91-92 మహాసభలో వాళ్ళు అన్వయించారు. ఈ నినాదం పునాది మీదనే, పి.యు.ని నిర్మూలించడానికి ఉద్దేశించిన విధానాలు, పని పద్ధతులను వాళ్ళు మాతో సంబంధాలకు అన్వయించారు. వాస్తవానికి సరిగ్గా 89 నుండి వాళ్ళు ఈ విధానాల్ని ప్రారంభించి, ఆచరణలో పెట్టారు. ఈ విధానాలు పద్ధతులేమిటి? ఇందుకోసం పి.యు. కార్యక్రమాలు నడుస్తున్న ఏరియాలను ఏ పద్ధతుల్లోనైనా కబళించే వారి ఏరియా

(తరువాయి 4వ పేజీలో...)

# రైతులను ఏమార్చలేక పోయిన రైతు జన్మభూమి!
## ఘోరంగా విఫలమైన చంద్రబాబు జిమ్మిక్కు!!

ఆంధ్ర రాష్ట్రంలో ప్రభుత్వం ఏం చేసినా చేయకపోయినా, ఒక్కటి మాత్రం నిరంతరాయంగా కొనసాగిస్తున్నది. ప్రపంచబ్యాంక్, సామ్రాజ్యవాదుల పెంపుడుకుక్క చంద్రబాబు, రాష్ట్రంలో ఏర్పడుతున్న విపత్తులతో సహా ప్రతి చిన్న అవకాశాన్ని సంస్కరణలకు, ప్రపంచబ్యాంక్ రూపొందించిన విజన్ 2020 విధానాలకు అనుగుణంగా ప్రజల మనోభావాలను మలచుకోవటానికి అతి తెలివిగా ఉపయోగించుకోవాలని చూస్తున్నాడు.

నిరుడు కరువు వస్తే కరువుకు కారణమైన ప్రభుత్వ విధానాలను సరిదిద్దుకుని, రాష్ట్రంలో సముద్రం పాలవుతున్న కృష్ణా, గోదావరీ నదీ జలాలను పంట పొలాల్లోకి మళ్ళించే పథకం గూర్చి ఒక్కమాట కూడా లేకుండా, కాంటూరు కందకాలు, ఇంకుడు గుంతలే పంట పొలాల నీటి కరువు తీరుస్తాయి అన్నట్లుగా జన్మభూమి కార్యక్రమానికి 'నీరు-మీరు' అని పేరు పెట్టి, హోరెత్తించే ప్రచారంతో (ఈనాడు ప్రచారం సరే సరి) రైతుల కళ్ళల్లో మట్టిగొట్ట చూశాడు. ప్రపంచబ్యాంక్ నుండి తెస్తున్న లేదా తాను అధికారంలోకి వచ్చిన ఈ ఆరేళ్ళలో తెచ్చిన 30 వేల కోట్ల రూపాయల అప్పుల్తో, ఫ్లై ఓవర్లు, నెక్లెస్‌రోడ్లు, బిజినెస్ స్కూల్స్, విశాలమైన రోడ్లు వేయటం (అందుకోసం పేదల ఇండ్లను కూలగొట్టడంతో సహా) మొ॥న పనులకు ఖర్చు పెడ్తూ, బహుళజాతి సంస్థలు రాష్ట్ర సంపదలను కొల్లగొట్టుకు పోవడానికి కావలసిన సౌకర్యాలన్నీ కల్పిస్తున్నాడు తప్ప, ఇప్పటికీ రాష్ట్రాలలో నూటికి 70 మందికి పైగా ప్రజలకు ఆధారభూతమైన వ్యవసాయ రంగం అభివృద్ధికి, రైతుల ప్రయోజనాల కొరకు ఖర్చు చేయటం లేదు. హంద్రీ నీవా, వెలుగొండ ప్రాజెక్టులకు వేసిన శంకుస్థాపన రాళ్ళు సమాధిరాళ్ళుగా దర్శనమిస్తున్నాయి, తెలుగుగంగ, యస్.యల్.బి.సి. మొదలైన పథకాలు ఎప్పుడో మొదలైనా నిధులు కేటాయించనందువల్ల పనులు నత్తనడకే నడుస్తున్నాయి. తన అనుంగు సహచరుడైన ఎలిమినేటి మాధవరెడ్డి మార్చి 7, 2000నాడు మన వీర గెరిల్లాల చేతుల్లో కుక్కచావు చావగానే, యస్.యల్.బి.సి. (శ్రీశైలం ఎడమగట్టు కాలువ) పథకానికి, ఎలిమినేటి మాధవరెడ్డి పథకం అని పేరుమార్చి, ప్రతిష్టగా తీసుకుని ఆ ప్రాజెక్టు మొదటి దశను వాడి సంవత్సరీకం నాటికి పూర్తి చేస్తామని, ఆర్భాటంగా ప్రకటించిన చంద్రబాబు, మార్చి 7 రాబోతున్నా దానికి కూడా నిధులు కేటాయించలేదంటే, అది ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా వుందంటే, మొత్తం పరిస్థితిని దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.




పండిన పంటకు గిట్టుబాటు ధర సంగతలా వుంచి, అయిన కాడికి తెగ నమ్ముకుందామన్నా కొనేవాళ్ళు లేక చివరకు వరి పండించిన రైతులు కూడా పంట అమ్ముడు పోక దిక్కు తోచని స్థితిలో పడగా, పత్తి రైతులనేకాక, వేరుశెనగ రైతులకు కూడా పాకిన ఆత్మహత్యలు ఇంకా కొనసాగుతూనే వుండగా, 9 గంటల పాటు ఇస్తామన్న విద్యుత్ కూడా ఇవ్వక, పంటలెండి పోతున్నాయని రైతులు గగ్గోలు పెడ్తున్న పరిస్థితులుండగా, మరోప్రక్క డబ్ల్యు.టి.ఓ. ఒప్పందం అమలు చేయటానికి గడువు ఇంకా 2 సం॥లు వుండగా, ముందుగానే, చంద్రబాబు అండతో పాలన కొనసాగిస్తున్న కేంద్ర ప్రభుత్వంఏప్రిల్ 1 నుండి, వ్యవసాయ దిగుమతులపై కూడా పరిమాణాత్మక ఆంక్షలు ఎత్తివేస్తున్న నేపథ్యంలో విదేశాల నుండి కుప్పలు తెప్పలుగా దిగుమతి అవనున్న వ్యవసాయ దిగుమతుల (ఆహార ధాన్యాలతో సహా) తో, పెనంలో నుండి పొయ్యిలోకి జారినట్లుగా కాబోతున్న పరిస్థితి వలన ఎన్నడూ లేనంతగా రైతాంగం విషమ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. తమ అసంతృప్తిని వెలిబుచ్చుతున్నారు.

ముందు ముందు స్థానిక సంస్థల ఎన్నికలు జరపవలసిన పరిస్థితి ఒకటి కాగా, రైతుల్లో పెరుగుతున్న అసంతృప్తిని తగ్గించటానికి, వాళ్ళని మభ్య పుచ్చటానికి డిసెంబర్ నుండే చంద్రబాబు తన జిమ్మిక్కులు ప్రారంభించాడు. అంతకుముందు రైతుల సమస్యలపై వాజ్‌పేయి సర్కార్ వైఫల్యంపై పార్లమెంట్‌లో వాయిదా తీర్మానం ప్రవేశపెడ్దాం, మద్దతు ఇవ్వమని ప్రతిపక్షాలు కోరితే ససేమిరా అన్నాడు. అదే చంద్రబాబు నాలుగు రోజులు తిరక్కముందే రైతుల ప్రయోజనాల కొరకు బి.జె.పి.తో తెగతెంపులు చేసుకుంటాం, కేంద్రంలో మద్దతు ఉపసంహరించటానికైనా వెనుకాడం అని హెచ్చరిస్తూ, తన పార్లమెంట్ సభ్యుల చేత పార్లమెంట్‌లో 'అల్లరి' చేయించి, సభా కార్యక్రమాలను అడ్డుకున్నాడు. అది, రాష్ట్రంలో రైతులలో పెరుగుతున్న అసంతృప్తిని గమనించిన చంద్రబాబు రైతులను వంచించటానికి చేసిన ఒక నయవంచక ప్రదర్శన తప్ప వేరు కాదు. దాని కొనసాగింపులో భాగంగానే, జనవరిలో జరిగే 14వ విడత జన్మభూమిని 'రైతు జన్మభూమి'గా ప్రకటించాడు.

రైతులు ఎదుర్కొంటున్న తక్షణ సమస్యలకు, దీర్ఘకాలిక సమస్యలకు జన్మభూమిలో సరైన పరిష్కారం సూచించాలని రైతులు ఆశించటం సహజం. కానీ, అలా చేస్తే చంద్రబాబు ఆంధ్ర రాష్ట్ర సి.ఇ.ఓ. ఎట్లా అవుతాడు!

రైతులు ఎదుర్కొంటున్న సమస్యల తీవ్రతకి, సమస్యలకు, 'జన్మభూమి'లో చంద్రబాబు తీసుకున్న కార్యక్రమానికి పొంతనే లేదు. వ్యవసాయ రంగంలో ఉత్పత్తిని, ఉత్పాదకతను పెంచేందుకు,

రైతులు ఖర్చులు తగ్గించి లాభాలు పెంచుకునేందుకు తీసుకువలసిన చర్యలపై రైతాంగాన్ని 'జాగృతం' చేస్తామని, రైతులకు 19 లక్షల కిసాన్ క్రెడిట్ కార్డులు పంపిణీ చేస్తామని ప్రకటించాడు. రైతాంగం ఎదుర్కొంటున్న ఏ సమస్యకీ చంద్రబాబు కార్యక్రమాలు పరిష్కారం కాకపోగా, అవి వినాశకాలే! ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకుని, ఉత్పాదకతను పెంచుకుని, లాభాలు తీయండి అని ఎంత జెప్పినా, రైతుకు ఆచరణలో సాధ్యం కానివే అవి. ఉత్పత్తి వ్యయాలు పెరిగి పోవటానికి బహుళజాతి సంస్థలు, వాటితో లాలూచీ పడ్డ దళారీ ప్రభుత్వాలే కారణం. ఇక ఉత్పాదకత పెంచాలంటే, ఎరువులు, పురుగుమందుల నుండి బయో టెక్నాలజీ వరకు పెద్ద ఎత్తున ఉపయోగించాలి. అంటే దానికి పెట్టుబడులు కావాలి. ఇప్పుడు కనీస పెట్టుబడులు లేకనే అల్లాడుతున్న రైతాంగానికి అది అసాధ్యం.

అంటే, దీని సారాంశం ప్రపంచబ్యాంక్ నిర్దేశించిన, చంద్రబాబు గొప్పగా చెప్తూ అమలు చేస్తున్న 2020 విజన్‌లోని 'నూతన వ్యవసాయ విధానం' (కార్పొరేట్ వ్యవసాయం) గురించి, అదే మీకు పరిష్కారమని చెప్పటం తప్ప మరొకటి కాదు. ఒక ప్రక్క కనీస పెట్టుబడులు లేని రైతాంగంకు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోమని 'అమూల్య' సలహాలు పారేస్తూ, మరోప్రక్క, పెద్ద పెట్టుబడులతో చేయవలసిన వ్యవసాయం గురించి 'ఉచిత' సలహాలు పారేస్తున్నారు. ఇది విని రైతులు 'జాగృతమై', తమకీ వ్యవసాయం గిట్టుబాటు కాదని, తమకింత పెట్టుబడులు పెట్టడం సాధ్యం కాదనీ, తమకుతామే పంట పొలాల్ని కార్పొరేట్ జలగలకు, బహుళజాతి ఆక్టోపస్‌లకు 'స్వచ్ఛందంగా' తెగనమ్ముకోవటమో, 'లీజ్' కివ్వటమో చేసి, తమ పొంట పొలాల్లోనే తాము కూలీలుగానో, కూలీలతో పనిచేయించే మేస్త్రీలుగానో మారాలి.

ఇక 19 లక్షల కిసాన్ క్రెడిట్ కార్డుల విషయం చూస్తే, గతంలోలా బ్యాంకుల చుట్టూ అప్పుల కోసం 15 రోజులు తిరగవలసిన పని లేకుండా, ఈ కిసాన్ క్రెడిట్ కార్డుల వలన ఒక రోజులోనే పని అయిపోతుందని, రైతుల ఒళ్ళోకి డబ్బు వచ్చి వాలుతుందన్నట్లుగా చెప్తున్నాడు. కానీ, రాష్ట్రంలో వాణిజ్య బ్యాంకులు, సహకార, గ్రామీణ బ్యాంకులు వాళ్ళని ఆదుకుంటున్నది నామ మాత్రమని, దాని ఫలితంగా రైతులు ప్రధానంగా వడ్డీ వ్యాపారస్తుల పైనే ఆధారపడు

## మానవహారం...కాదు, బాలల హారం...

*(జనవరి 9 ఈనాడు దినపత్రికలో వచ్చిన వార్తలో కొంత భాగాన్ని పాఠకుల కొరకు ఇస్తున్నాం!)*

''రైతు జన్మభూమి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనదైన శైలిలో మానవహారం పేరిట బాలల హారం నిర్వహించి 'రాజకీ'తో రాజధాని నగరంలో ఊరేగారు. జన్మభూమి కార్యక్రమం ముగింపు సందర్భంగా ముఖ్యమంత్రి రాజధాని నగరంలో సోమవారం నాడు జరిగిన మానవహారంలో పాల్గొన్నారు. నిజంగా అది హైదరాబాదు పౌరులతో సాగిన మానవహారం అయి వుంటే అందరూ సంతోషించేవారు. కాని నగరంలోని అనేక స్కూళ్ల నుంచి పోగుచేసుకు వచ్చిన బాలలతో జరిపించడమే బాధాకరం. పెద్ద ఎండ లేకపోయినా ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం దాదాపు పన్నెండున్నర గంటల వరకు చిన్నారులు రోడ్డుమీద గడపాల్సి వచ్చింది. చంద్రబాబు నాయుడు సికింద్రాబాదులోని గాంధీ విగ్రహం నుంచి చార్మినార్ వరకు కాన్వాయ్‌లో వెళ్లి అక్కడ ఉపన్యాసం ఇచ్చి తిరిగి సచివాలయం చేరుకునేంత వరకు బాలలంతా వేచి వుండవలసి వచ్చింది. మార్గమధ్యంలో మానవహారం కోసం మంచినీటి వసతి, జెండాలు, బ్యానర్లు, వేదికలు, మైక్ సిస్టమ్, పూలదండల అలంకరణలతో వేదిక, జీపు తదితర ఏర్పాట్లను భారీగా చేశారు. పిల్లలను సమీకరించడానికి పెద్ద ఎత్తున ఆర్టీసీ బస్‌లను వినియోగించారు. నగరంలోని మురికి వాడలలో అక్కడక్కడ ఏర్పాటు చేసిన డ్వాక్రా మహిళా సంఘాలలోని మహిళలను కూడా ఈ బస్‌ల ద్వారా సమీకరించారు. ఫలితంగా బస్‌ల కోసం సామాన్య ప్రయాణీకులు అవస్థలు పడాల్సి వచ్చింది. కేవలం చంద్రబాబు నాయుడు తన ఇమేజిని మరింతగా పెంపొందించుకోడానికి ఇలా ప్రభుత్వ వ్యయంతో మానవహారం పేరుతో బాలల హారం నిర్వహించారన్న విమర్శలు వస్తున్నాయి. ఇటీవలే తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్యక్రమం ముగిసింది. ఆ లెక్కల ప్రకారం కొన్ని లక్షల మంది నగర వాసులు ఆ పార్టీలో చేరారు. వారిలో సగంమంది వచ్చి మానవహారంలో పాల్గొన్నా విజయవంతం అయ్యేది. అది చేయలేని తెలుగుదేశం నేతలు ప్రజాధనాన్ని ఈ విధంగా ఖర్చు పెడుతున్నారన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. గతంలో కాంగ్రెస్‌కు చెందిన ముఖ్యమంత్రులు, మంత్రులు ఆయా కార్యక్రమాలలో పాల్గొన్నప్పుడు ఇలానే విద్యార్థులను తీసుకువచ్చి స్వాగత కార్యక్రమాలకు ఉపయోగించుకుంటుంటే విమర్శలు చెలరేగేవి. ఇప్పుడు అలా ముఖ్యమంత్రి కోసం బడిపిల్లలను తీసుకువచ్చినట్లు కన్పించకుండా జన్మభూమి అనో, మరో కార్యక్రమానికో తరలించినట్లు చేస్తున్నారు. అయితే చివరికి జరుగుతున్నది ఒక్కటే. ముఖ్యమంత్రి రాక కోసం గంటలకొద్దీ ఎదురుచూడడం, ఆయనవచ్చాక కొద్ది క్షణాలు చేతులు ఊపడం, ఉచితంగా ఏర్పాటుచేసిన బస్సులు ఎక్కి మళ్లీ స్కూళ్లకు వెళ్లడం''.

**(అందరికీ 'రాజకీయం చేయవద్దు' అని నీతులు చెప్పే చంద్రబాబు, పసిపిల్లలను తన 'రాజకీయానికి' 'మానవహారం' పేరిట వాడుకుంటున్న తీరు ఎంతగా ప్రజల్లో అభాసుపాలు కాకపోతే, ఎంత రోత పుట్టించకపోతే, చంద్రబాబు కార్యక్రమాలను భుజాలకెత్తుకునే రామోజీ 'ఈనాడు' దినపత్రిక ఈ వార్త రాయవలసి వచ్చిందో....)**

తున్నారని అందరికంటే రైతులకే తెలిసిన కఠోర వాస్తవం. ఒక్కమాటలో ఆ కిసాన్ క్రెడిట్ కార్డులు, ఒక 'అజాగళస్తనం' లాంటివి తప్ప మరేం కాదు.

ఇవి ప్రధానంగా చేసుకుని రైతు జన్మభూమి కార్యక్రమాన్ని మొదలుపెట్టి, రైతులను మాయ చేయపూనుకున్నాడు చంద్రబాబు. అయితే, ఇవాళ రైతులు ఎవరి మాయలో పడేంత అమాయక స్థితిలో లేరు. వాళ్ళెదుర్కొంటున్న సమస్యల తీవ్రత అలాంటిది. అందుకనే, చంద్రబాబు మొదలుపెట్టిన రైతు జన్మభూమికి రైతులు బంద్‌లు, నిరసనలతోనే స్వాగతమిచ్చారు.

జనవరి 2వ తేదీన చంద్రబాబు ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జన్మభూమిని బహిష్కరించడమే కాకుండా, తెనాలి ప్రాంత రైతులు తెనాలి బంద్‌కు పిలుపు ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ కూడా బంద్‌లో పాల్గొనాల్సి వచ్చింది అంటే, రైతుల మనోభావాలను అర్థం చేసుకోవచ్చు. ఒక తెనాలిలోనే కాదు, రాష్ట్రమంతటా జన్మభూమి వారం రోజులూ తమ నిరసనను వివిధ రూపాల్లో తెలియజేశారు. అధికార్లను, ఎం.ఎల్.ఏ.లనే కాదు, ముఖ్యమంత్రిని కూడా వదల్లేదు.

గుంటూరు జిల్లాలో కొన్ని సభల్లో పాల్గొన్న రైతులు, తమ సమస్యల పట్ల అధికారులను నిలదీశారు. దుగ్గిరాలలో రైతులు నోడల్ అధికారులను బంధించారు. పిట్టలవాని పాలెం, మంచికల పాడు, వల్లపూడి, పిడుగురాళ్ల మొ॥న గ్రామాల్లో రైతులు సమస్యలపై నిలదీశారు. తెనాలి మండలం పెదరావూరులో రైతులు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. 'రైతు జన్మభూమిలో పలకా బలపం ఏమిటి? ధాన్యం కొనుగోలుపై మాట్లాడండి' అని నిలదీశారు. తెలుగుదేశంకు తిరుగులేని గ్రామంగా పేరున్న, నాదెండ్ల గ్రామ పరిధిలోని అమీన్ సాహెబ్ పాలెం గ్రామంలో ముగ్గురు మంత్రులు (కడియం శ్రీహరి, అరుణ, అలపాటి) పాల్గొన్న సభలో ఇద్దరు రైతులు లేచి నిలబడి ప్రశ్నించడంతో మంత్రులు కంగు తిన్నారు. 'ఎన్నికలప్పుడు వచ్చి రైతుల కోసమే కృషి చేస్తున్నామని చెప్పారు ఇప్పుడు కూడా రైతుల కోసమే కృషి చేస్తున్నామని చెప్తున్నారు. ధాన్యానికి ధర రావటం లేదు. ఎవరి కోసం ఈ ఉపన్యాసాలు! ఓట్ల కోసమా?' అని సూటిగా ప్రశ్నించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరులో అనేక గ్రామాల్లో రైతులు తెలుగుదేశం విధానాలు వ్యతిరేకిస్తూ, నిరసనలు తెల్పడంతో అధికారులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. భారీగా పోలీసు బందోబస్తుతో జరపాలని ప్రయత్నించినా, రైతులు అడ్డుకోవడంతో చేసేదేమీ లేక వెనుదిరిగారు. కలకడ మండలం బాలయ్యగారి పల్లెలో తాగునీటి సమస్యను పరిష్కరించలేదని 4 గంటల పాటు అధికారులను నిర్బంధించారు. రైతుల వద్ద నుండి నేరుగా వేరుశెనగ కాయల కొనుగోలు చేయాలని అనంతపూర్‌లో పలుచోట్ల రైతులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ విప్, మడకశిర ఎం.ఎల్.ఏ. పల్లె రఘునాథరెడ్డిని రైతులు, ప్రతిపక్షాలు ఘెరావ్ చేశారు. కడప జిల్లా సిద్ధవటం మండలం లింగంపల్లి గ్రామంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖామంత్రి సరస్వతి పాల్గొన్న సభలో, తమకు గిట్టుబాటు ధరలు కల్పించటం లేదని, సమస్యలు పరిష్కరించటం లేదని గ్రామ రైతులు, ప్రతిపక్షాల కార్యకర్తలు మంత్రిని నిలదీశారు. సమాధానం చెప్పుకోలేని మంత్రి నామమాత్రంగా జన్మభూమిని ముగించుకుని వెళ్ళింది. ఈ జిల్లాలోనే పడమటి కోన, కలిబండ ప్రాంత రైతులు జన్మభూమి సభలను బహిష్కరించారు.

శ్రీకాకుళం జిల్లా నరసన్న పేట మండలం కోమర్తి, బూర్జ మండలం కొరగాం, భామిని మండలం ఘనసర్ల గ్రామాల్లోనూ, పొందూరు మండలం కింతల గ్రామంలో ప్రభుత్వ విప్ గద్దె బాబూరావు పాల్గొన్న జన్మభూమి సభను ప్రజలు బహిష్కరించారు. అదే విధంగా, భామిని మండలం బూర్జిల గ్రామంలో నోడల్ అధికారిని గ్రామంలోకి రానివ్వకుండా నాటుబళ్ళు అడ్డం పెట్టారు.

కరువు మండలాల ప్రకటనలో జాప్యం, కరెంట్ కోత, రుణాల బలవంతపు వసూళ్ళు మొదలైన సమస్యలపై ఆదిలాబాద్ జిల్లాలోని గుడిహత్నూర్ మండలంలోని లింగాపూర్‌లో తెలుగుదేశం వాళ్ళతో సహా ప్రజలందరూ జన్మభూమిని బహిష్కరించి అధికారులను వెనక్కి పంపారు. ఆరోగ్య శిబిరాన్ని కూడా నిర్వహించనీయలేదు. ఈ సమస్యలపైనే యావల్‌గూడ గ్రామస్థులు అధికారులను నిలదీశారు. పల్లి (బి) గ్రామంలో ముఖ్యమంత్రి ప్రకటనను చదవనీయకుండా అడ్డుకొని, 'అంతా మోసం' అని విమర్శించారు. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ఇటుకాల పల్లిలో ప్రభుత్వం నుండి వరద నష్టాలు, ఎక్సెల్ కంపెనీ నుండి నష్ట పరిహారం ఇప్పించాలని రైతులు నోడల్ అధికారులను నిలదీశారు. అది తట్టుకోలేని నోడల్ అధికారి రైతులను తిట్టగా, రైతులు జన్మభూమిని బహిష్కరించారు. కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ మండలంలోని పందిల్ల, బంజేరుపల్లి, పొట్లపల్లి, గోవర్ధన గిరి, కూచనపల్లి గ్రామాల్లో విద్యుత్ కోతపై రైతులు ఆందోళన వ్యక్తం చేసి, అధికారులను నిలదీశారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం ముప్కల్‌లో గ్రామస్థులు జన్మభూమిని బహిష్కరించి, అధికారులను వెనక్కి పంపారు. మంత్రి మండవ వెంకటేశ్వర రావు స్వగ్రామం ధర్మారంలో మహిళలే జన్మభూమిని తిరస్కరించారు. నిజామాబాద్ మండలం ముల్లంగి, బాడ్సి గ్రామస్థులు జన్మభూమిని బహిష్కరించటమేకాక, 'ఇది రైతు జన్మభూమి కాదు... రైతు ఖర్మభూమి' అని ఏకగ్రీవంగా తీర్మానం చేసారు. ఇలా ఈ జిల్లా, ఆ జిల్లా అని కాకుండా రాష్ట్రమంతటా, జన్మభూమి సభలు జరిగినన్ని రోజులు ఈ నిరసనలు కొనసాగాయి.

## షరా మామూలైన నిర్బంధకాండ!

2020 కల్లా స్వర్ణాంధ్రప్రదేశ్‌ను చూపిస్తాననే పేరుతో, చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు నిత్య నిర్బంధం మాత్రం చవి చూపిస్తున్నాడు. తెలుగుదేశం పార్టీకి ముఖ్యంగా చంద్రబాబుకు ఎంతో ప్రతిష్టాత్మకమైన జన్మభూమి కార్యక్రమం వాస్తవానికి ఇవాళ వెలవెలా పోతున్నది. ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనే జన్మభూమి స్ఫూర్తి కనపడటం లేదని సాక్షాత్తూ చంద్రబాబే వాపోతున్నాడు. ప్రజల భాగస్వామ్యం లేకుండా, 30 శాతం నిధుల్ని కాంట్రాక్టర్లే (వాళ్ళు తెలుగుదేశం వాళ్ళే) భరిస్తూ, అధికార్లు వాళ్ళూ లాలూచీ అయి, పనులకు అంచనాలు ఎక్కువ వేసి, జన్మభూమి నిధుల్ని కొల్లగొడుతున్నారని, అందువలన 50 శాతం నిధుల్ని గ్రామస్థులు భరిస్తేనే, ఇకనుండి గ్రామంలో జన్మభూమి పనులకు నిధులను

కేటాయిస్తామని, ఈ విధంగా దీనిలో జరుగుతున్న అవినీతిని అరికట్టామని, ఈ జన్మభూమి సందర్భంగానే ప్రకటించాడు.ఈ నిర్ణయం ద్వారా ఒకే దెబ్బకు రెండు పిట్టలు నేలరాలినట్లయింది. రాష్ట్రంలో కనీసం ఒక గ్రామంలో కూడా 50 శాతం నిధుల్ని ప్రజలు సమకూర్చటం జరగక ప్రభుత్వానికి తన వంతుగా పైసా కూడా ఖర్చు పెట్టాల్సిన అవసరం తప్పిపోయింది. 'జన్మభూమి' కోసం ఇకేమాత్రం నిధులు కేటాయించలేని ప్రభుత్వ ఆర్థిక దివాళాకోరు తనాన్ని నిధుల సేకరణలో ప్రజల వైఫల్యం పేరిట కప్పిపుచ్చుకోడానికి ప్రభుత్వానికి సాకు దొరికినట్లు అయింది.

ప్రజల భాగస్వామ్యం కొరవడటమేగాక, రాష్ట్రంలో చంద్రబాబు అనుసరిస్తున్న విధానాల కారణంగా, సమస్యలు పెరిగిపోతున్న ప్రజలు ఆందోళనలు చేపట్టాల్సిన పరిస్థితి వచ్చింది. అందుకనే ప్రతిష్టాత్మకమైన జన్మభూమిని పోలీసుల నిర్బంధకాండతోనే తప్ప మామూలుగా అమలు చేయలేక పోయింది.

జనవరి 2న ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం, వేములపాడు గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మభూమిని ప్రారంభించిన రోజున పోలీసులు అమలు చేసిన నిర్బంధం రాష్ట్రంలోని ప్రజాస్వామ్యానికి మచ్చు తునక. వేములపాడు వెళ్ళే రోడ్లను దిగ్బంధనం చేసి, తోటి పాలక పార్టీలైన కాంగ్రెస్, సి.పి.యం. పార్టీల నాయకులను మార్గమధ్యంలోనే ఆపేయటమే కాదు, అరెస్టు కూడా చేసారు. తీరా హెలికాప్టర్ రావటానికి వాతావరణం అనుకూలంగా లేదని (ఏ వాతావరణమో!) చంద్రబాబు తన కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నా, యథా ప్రకారం నిర్బంధం మాత్రం కొనసాగింది. ఇక అనంతపూర్‌లో వేరుశెనగ రైతుల సమస్యలపై మెమొరాండం ఇవ్వబూనుకున్న సి.పి.యం. కార్యకర్తలను పోలీసులు దారుణంగా కొట్టి, అరెస్టులు చేసారు. పశ్చిమ గోదావరి జిల్లా కవ్వగుంట గ్రామంలో చంద్రబాబు పాల్గొన్న రైతు జన్మభూమి సభ అచ్చంగా పోలీసు జన్మభూమే. 1200 మంది పోలీసులను ముష్టీలో మోహరించారు. అయినా గానీ, 50 మంది రైతులు మూకుమ్మడిగా లేచి విద్యుత్ కోత, మొక్కజొన్న విత్తనాల్లో దగా, సాగునీటి ఎద్దడి వంటి సమస్యలపై నిలదీస్తూ, చంద్రబాబు ప్రసంగాన్ని అడ్డుకున్నారు. 'సమస్యలు వింటున్నాను, త్వరలో పరిష్కరిస్తానని' చంద్రబాబు చెప్తున్న దానికి రైతులు సంతృప్తి పడకుండా పదే పదే ప్రశ్నించారు. ఆ రైతుల్ని పోలీసులు వెనక్కి నెట్టేశారు.

ఇక నిజామాబాద్‌లో పోలీసులు అయితే ఒకడుగు ముందుకేసి, కామారెడ్డి మండలం లింగాపూర్, దేవన్ పల్లిలో స్థానిక నాయకులను (తోటి పాలక పార్టీలే) సభలకు రావద్దని ఆదేశించారు. దీన్ని ఖాతరు చేయకుండా సభలకు హాజరై ప్రశ్నిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వుంటుందని, తీవ్రవాదులనే ముద్ర వేస్తామని హెచ్చరించారు. ఇక మామూలు రైతులను బెదిరించటం చెప్పనవసరం లేదు.

ఇలా రాష్ట్రమంతా జన్మభూమి కార్యక్రమాన్ని పోలీసుల రక్షణలో జరుపుకోవలసిన పరిస్థితి వచ్చిందంటే, నిత్యం నక్సలైట్లకు, లేదా పీపుల్స్‌వార్ పార్టీకి జనజీవన స్రవంతిలోకి రండి, రండి అని పిలుపు ఇచ్చే చంద్రబాబు ప్రభుత్వం, జన జీవన స్రవంతికి, ప్రజలకి ఎంత దూరంగా వుందో, దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

అయితే, చంద్రబాబు, అతగాడి అనుయాయులు మాత్రం, తాము చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్చుకోలేని శక్తులు కొద్దిమంది అక్కడక్కడ చేసిన అల్లరి తప్ప, రాష్ట్రంలో రైతు జన్మభూమి విజయవంతం అయిందని ప్రకటించుకున్నారు. కానీ, నిజంగా జన్మభూమి విజయవంతం అయిందా? చంద్రబాబు 'జన్మభూమి' జిమ్మిక్కు మొదలుపెట్టిన తర్వాత, దీనంతగా విఫలమైన, జనం తిరస్కరించిన జన్మభూమి ఇంకోటి లేదు. ఎందుకంటే, 'రైతు జన్మభూమి' అని ప్రకటించిన ఈ జన్మభూమిలో రైతులు ఎక్కువగా పాల్గొన్న దాఖలాలు లేవు. పాల్గొన్న చోట నిలదీయటమే చేసారు. చంద్రబాబు ఆశించిన 'స్ఫూర్తి' ఏదీ రైతులు 'పొంద'లేదు. రైతు జన్మభూమి సభలు అనేకచోట్ల రైతులు లేకుండానే జరిగినాయి. వృద్ధాప్య ఫించన్లు, గ్యాస్ కనెక్షన్ల కోసం అనివార్యంగా రావలసి వచ్చిన వాళ్ళతోనే జరిగినాయి. మొత్తం రైతు జన్మభూమిలో రైతుల పాత్రను పరిశీలిస్తే, రైతులు ఈ జన్మభూమి తమది కాదని, తమకేం ఒరగబెట్టదని తేగేసి చెప్పినట్లు తప్ప మరో రకంగా లేదు.

## రై□ాంగం ప్రజాయుద్ధ బాటనే చేపడ్తారు

కానీ, రాష్ట్ర రైతాంగం ఇవాళ ఎదుర్కొంటున్న, ముందు ముందు ఎదుర్కోబోయే సమస్యల తీవ్రత స్థాయిలో వాళ్ళ ప్రతి చర్య లేదన్నది యదార్థం. ఆ విధంగా రైతాంగం ఒక బలహీనతను ఎదుర్కొంటున్నది. రైతులకు తెలుగుదేశం పార్టీ, బి.జె.పి.లు అధికారంలో ఉండి ఎలా వ్యవహరిస్తున్నాయో అర్థమవుతున్నది. కాంగ్రెస్ పార్టీ పరిస్థితి తెలియనిది కాదు. సి.పి.ఐ., సి.పి.ఎం. మొ॥న పాలక పార్టీలు, వాటి అవకాశవాద రాజకీయాలూ అర్థం కాని పరిస్థితేం లేదు. అందువలన, ఎవరిమీద భరోసా వుంచాలన్నదే రైతాంగం సమస్య. అంతే కాదు... మార్గం ఏమిటన్నదే. ఒక ప్రక్క రాష్ట్రంలో పాలక పార్టీల దేశద్రోహ, ప్రజా ద్రోహ రాజకీయాలకు ప్రత్యామ్నాయ మార్గం చూపుతున్న పీపుల్స్‌వార్ పార్టీ ఉద్యమంమీద కోవర్టులు, కౌన్సిలింగ్‌లు మొదలు సంయుక్త కమాండ్ వరకూ అమలవుతున్న నిర్బంధాన్ని, పౌర హక్కుల నేతలను కూడా క్రూరంగా హత్యలు చేయిస్తూ, సృష్టిస్తున్న భయోత్పాత వాతావరణాన్ని ప్రజలు చూస్తూనే వున్నారు. మొన్నటి కాల్దారి కాల్పులనేగాక, నిరుడు ఆగష్టు 28 నాటి బషీర్‌బాగ్ కాల్పులను అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తూనే వున్నారు. ఈ స్థితిలో రైతుల అసంతృప్తులు ఇంకా పెల్లుబుకాల్సిన స్థాయిలో వెల్లుబుకక పోతుండవచ్చు. అలా పెల్లుబుకకుండా తను 'మాయ' బుచ్చగలనని లేదా 'అణచి' వేయగలనని చంద్రబాబు, అతగాడి బాస్‌లు కలలు కంటుండవచ్చు. కానీ, ఇవాళ భారత రైతులలో భాగంగా ఆంధ్ర రైతులు కూడా ఒక సంధి కాలంలో వున్నారు. తమ విముక్తి మార్గం ఏమిటో వెతుక్కోవలసిన, తెలుసుకోవలసిన తప్పనిసరి పరిస్థితుల్లో వున్నారు. అది వాళ్ళను దేశీయ దళారులకు, సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాటంలోకి నడిపిస్తుంది. ప్రజాయుద్ధంలోకే నడిపిస్తుంది. అందుకు 'ప్రజాయుద్ధ పార్టీ' కూడా చేయవలసినది అంతా చేయటం దాని సహజ ధర్మం! చేస్తుంది కూడా. ❑

# గుజరాత్ పై విరుచుకుపడ్డ ఘోర భూకంపం

జనవరి 26వ తేదీన భారత దళారీ కేంద్ర ప్రభుత్వం బూటకపు 'స్వాతంత్ర్య దినం' ఆట్టహాస ఆర్భాటాలతో జరుపుకుంది. సరిగ్గా అదే సమయంలో 1947 తర్వాత దేశ చరిత్రలోకెల్లా అత్యంత ఘోర భూకంపం గుజరాత్‌పై విరుచుకు పడింది. ఈ దారుణ సంఘటనకు సంబంధించిన వార్తలు ఢిల్లీకి, దేశం నలుమూలలకూ సుడిగాలిలా వ్యాపించాయి. అయినా వాజ్‌పేయి అతడి మంత్రుల ముఠా రిపబ్లిక్ దినం విన్యాసాలలో తమ సైనిక బలాధిక్యతను ప్రదర్శించుకోవడం మాత్రం ఆపుకోలేదు. గుజరాత్‌లో భూకంపం కల్గించిన ఈ మహా విషాదం సైతం జనవరి 26న యధాప్రకారం జరిగే ప్రభుత్వ సైనిక భుజబలశక్తి ప్రదర్శనను ఆపలేక పోయింది. ఒకవైపు గుజరాత్‌లో లక్షలాది మంది ప్రజలు భూకంపం తర్వాత శిధిలాల కింద పడి నలిగి పోతుండగా మరోవైపున ఎర్రకోటలో వాజ్‌పేయి, అద్వానీలు అతి గొప్ప విజయాల గురించి కలలు కంటుండగా సైనిక బలగాల అమ్ముల పొదిలో నూతనంగా వచ్చి చేరిన యుద్ధ విమానాలు విన్యాసాలు చేసుకుంటూ పోయాయి.

భూకంపం ఎంత భయంకరమైనదంటే దాని ప్రకంపనలకు భారత, పాకిస్తాన్‌లలోని అనేక ప్రాంతాలు కంపించిపోయాయి. భూకంపాల తీవ్రతను కొలిచే రెక్టర్ స్కేలుపై 7.9గా నమోదై భుజ్ పట్టణంపై నిలిచిన భూకంప కేంద్రం గుజరాత్‌లోని చాలా భాగాన్ని ధ్వంసం చేసింది. లక్షా 30 వేల జనాభా కల్గిన భుజ్ పట్టణంలో దాదాపు అన్ని భవనాలూ కుప్పగూలి పోవటంతోపట్టణం స్మశానంలా తయారైపోయింది. ఆ ప్రాంతంలోని పట్టణాలు, వందలాది గ్రామాలు ధ్వంసమై పోయాయి. భూకంపం ముగిసిన తర్వాత కూడా భూమి పదే పదే ప్రకంపించటంతో (రెక్టర్ స్కేల్‌పై ఈ ప్రకంపనల్లో కొన్ని 5 వరకూ నమోదైనాయి) చనిపోయినవారూ, కొన ప్రాణాలతో బతికి వున్నవారూ సమానమైన పరిస్థితి నెలకొంది. భూకంపం తర్వాత ఐదో రోజుకి అధికారికంగా 25,000 మంది మరణించారని ప్రభుత్వం ప్రకటించింది. దాదాపు లక్షమంది గాయపడగా, లక్షా 50 వేల మంది శిథిలాల కింద చిక్కుకు పోయారని వార్తలు. మృతుల సంఖ్య లక్షకుపైనే వుంటుందని అంచనా. రోజులు గడిచేకొద్దీ శిథిలాల కింద చిక్కుకుని ప్రాణాలతో మిగిలిన వారు కన్పించటం దుర్లభమై పోయింది. ఈ ప్రాంతంలోని స్వచ్ఛంద సేవా సంస్థల్లో కెల్లా పెద్దదైన కుచ్ వికాస్ ట్రస్ట్ భూకంప మృతుల సంఖ్య కనీసం లక్షా 25 వేల దాకా వుంటుందని అంచనా గట్టింది. భుజ్‌తో సహా ఐదు ప్రధాన పట్టణాలలో మృతుల సంఖ్య ఇలా వుంటుందని అంచనా వేశారు. భుజ్‌లో 30,000; బచ్చాలో 20,000; అంజార్ 20,000; రేపర్‌లో 20,000; గాంధీదామ్‌లో 30,000; చుట్టు ప్రక్కల గ్రామాల్లో మృతుల సంఖ్య 15 వేల నుండి 30,000 దాకా వుంటుందని భావిస్తున్నారు. భూకంప కేంద్రానికి ఎంతో దూరాన గల అహమ్మదాబాద్‌లోని ఎత్తైన భవనాలు నేలమట్టమై పోయాయి. ఇక్కడా దాదాపు 1000 మందిదాకా చనిపోయారు. దీంతోపాటు గుజరాత్‌లోని ముఖ్య పట్టణాలన్నింటిలోనూ భూకంప మరణాలు సంభవించాయని వార్తలు. చనిపోయినవారు పోగా చావు తప్పి బతికిన లక్షలాదిమంది బాధలు వంద రెట్లకు మించి చెప్పనలవి గాకుండా పోయాయి. వీరిలో వేలాదిమంది వికలాంగులైనారు. ఆప్తులను, ప్రియతములను కోల్పోయారు. సర్వస్వాన్ని కోల్పోయారు. నిలువ నీడ లేకుండా పోయారు. వీటి తర్వాత వ్యాధులు, ఆకలి, గడ్డ కట్టించే చలి, కలుషితమైన నీరు, అంటువ్యాధులు, ఇంకా మరిన్ని చావులు ప్రజలను నిత్యం వెంటాడుతూ పోయాయి. నర్మదా వంటి భారీ డ్యాములకు భూకంపంతో పగుళ్ళు ఏర్పడే ప్రమాదముండటంతో ప్రజలు మరింతగా భీతిల్లిపోయారు.

ఈ దారుణ విషాదానికి వికృత ప్రచారం కూడా తోడైంది. ''అంతర్జాతీయ సమాజం'' (సామ్రాజ్యవాద దేశాలు) తాము తుపాను బాధితుల కెంత సహాయాన్ని పంపించామనే అంశంమీదే మాట్లాడుతుండగా, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం పునరావాస కార్యక్రమాలు ఎంత సజావుగా సాగిస్తున్నామనే అంశంపైనే సొల్లు కారుస్తూ వచ్చింది. ఇక అధికారులయితే నిధుల కోసం గగ్గోలు పెడుతూనే మృతుల, గాయపడిన వారి సంఖ్యను తగ్గించి చెప్పారు. ఆ విధంగా పునరావాసం కోసం వచ్చి పడుతున్న సామగ్రిని పెద్ద మొత్తంలో దారి మళ్ళించొచ్చు మరి. పత్రికా వ్యవస్థ పదే పదే సైన్యం, ప్రభుత్వ యంత్రాంగమూ సహాయ కార్యక్రమాలను చేపట్టాయని చెబుతూ వచ్చింది కానీ, భూకంపం సంభవించిన మొదటి విపత్కర



ఘడియల్లో కలికానికిక్కూడా ఎవరూ కనిపించలేదు. రాష్ట్ర ప్రభుత్వం గణతంత్ర దినోత్సవ కార్యక్రమాలలో నిండా మునిగిపోయి వుండింది. ఇక భూకంప ప్రాంతాన్ని చేరుకోవడానికి సైన్యానికి 10 గంటల సమయం పట్టింది. ఇక కేంద్ర ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకు భూకంపాన్ని ఒక సాకుగా తీసుకుని రాబోయే బడ్జెట్‌లో ప్రజలపై భారీ ఎత్తున పన్నులకు రంగం సిద్ధం చేసింది. ప్రపంచబ్యాంకు నుంచి 7,000 కోట్ల రూ॥ల భారీ రుణాన్ని కూడా తీసుకోబోతోంది. ఇక విదేశీ ద్రవ్య వ్యాపార సొరచేపలు భూకంపం కారణంగా కుప్పకూలిపోయిన స్టాక్ మార్కెట్ షేర్లను కారుచౌకగా కొనివేయటం ద్వారా భారీ ఎత్తున లాభాలు దండుకున్నాయి.

భూకంప బాధితులైన గుజరాత్ ప్రజలకు, ప్రత్యేకించి పేద ప్రజలకు భూకంపం తర్వాత సమాజం అందించాల్సిన, అందిస్తున్న సహాయం సముద్రంలో నీటిబొట్టంత మాత్రమే. భూకంపం తీవ్రతకన్నా బిల్డింగ్ కాంట్రాక్టర్ల ధన దురాశ, వారికి దశాబ్దాలుగా ప్రభుత్వాలందిస్తూ వచ్చిన వత్తాసు, గుజరాత్ వ్యాప్తంగా ప్రభుత్వ యంత్రాంగంలో ఊడలు దిగిపోయిన అవినీతి ముప్పేటగా సాగించిన దాడికి పేకమేడల్లా కూలిపోయిన భవనాలే సాక్ష్యం. ఏదైనా ప్రకృతి వైపరీత్యాల (?) కారణంగా సమాజంలో ఎప్పుడైనా, ఎక్కడైనా ఉత్పాతం ఏర్పడినపుడు కానీ, తదనంతరం ఆ సంక్షోభ నివారణ కోసం తీసుకున్న చర్యలు కాని జీవన్మరణ పరిస్థితులలో కూరుకుపోయి వుండే ప్రజలను మరింత బాధలకు గురిచేస్తున్న పరిస్థితులే దేశంలో అధికంగా వున్నాయి. గుజరాత్ అనుభవం కూడా ఇందుకు మినహాయింపు కాదు. అందుకే సహాయ కార్యక్రమాలు అన్నింటినీ నిజమైన ప్రజాస్వామిక, విప్లవ సంస్థలే చేపట్టాలి. నిస్వార్థంగా ప్రజలకు సేవ చేసేదీ వీళ్ళే. ఇక గుజరాత్ ప్రజలకు సాయమందించడానికి ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు రావాలి. ప్రభుత్వ వ్యవస్థతో ముడిపడివున్న విరాళాల సేకరణలకు ప్రజలు విరాళమివ్వకూడదు. ఎందుకంటే అలా వచ్చిపడే లక్షలాది, కోట్లాది రూపాయల ఖర్చు వివరాలు ప్రజలముందు ప్రకటించిన చరిత్ర ఇంతవరకూ లేదు, పైగా ఈ మొత్తాల్లో అధిక భాగం కొల్లగొట్టబడుతోంది. పైగా, ప్రస్తుత విషాదం మానవ కల్పితమే. భూకంపం కన్నా కుప్పకూలిపోయిన ఇళ్ళు, భవనాల లోపభూయిష్ట నిర్మాణాల వల్లే అధికంగా ప్రజలు చనిపోయారు. ఈ వ్యవస్థ లక్షణమేదంటే ఈ విషాదం తర్వాత కూడా భూకంపాలను తట్టుకునే రకం ఇళ్ళను నిర్మిస్తారనుకోవటం కల్లోని మాటే. ఎందుకంటే భవన నిర్మాణ వ్యవస్థ కూడా అన్నింటిలాగే పెను లాభాలను తెచ్చిపెట్టేదిగా వుంది. పైగా ఈ విరాళాల సేకరణ దారులందరూ వ్యవస్థ సమర్థకులే. అతుకుల బొంతతో దీన్ని నిలబెట్టేవారే. ఇటువంటి ప్రకృతి వైపరీత్యాలు విరుచుకుపడినపుడు మానవ ప్రాణాల నష్టాన్ని కనీస స్థాయికి తగ్గించే రకం వ్యవస్థను సృష్టించడానికి ప్రజాస్వామిక, విప్లవ సంస్థలు మాత్రమే ప్రజలను సమీకరించగలవు. సహాయ కార్యక్రమాలతోపాటు కోట్లాది రూపాయల సహాయ సామగ్రిని కొల్లగొట్టేందు కోసం గుజరాత్‌లో కాచుక్కూచున్న గోతి కాడ గుంట నక్కలతో పోరాడేందుకు కూడా ప్రజలు సర్వసన్నద్ధం కావాలి. ❑

(24వ పేజీ తరువాయి...)

అమలు చేయగలమా లేదా అనే సమస్య పరిష్కారానికి ఇదే కీలకాంశం. మొదట కార్యదర్శికి, పార్టీ కమిటీకి మధ్య సంబంధాన్ని సరైన స్థానంలో వుంచాలని కమిటీ సభ్యుల చర్చలు తెలియజెబుతున్నాయి. కమిటీ కార్యదర్శి దళ నాయకుడి హోదాలో వున్నప్పటికీ, అతడిని పార్టీ కమిటీ సమిష్టి నాయకత్వం క్రింద వుంచాలి.అతడు ఎన్నడూ దానిపై పెత్తనం చెలాయించకూడనే కూడదు. కార్యదర్శికి, కమిటీకి మధ్య సంబంధాలు, అప్పుడప్పుడు సరైన తీరులో ఎందుకు నిర్వహింప బడడం లేదు? ఈ సమస్య విజయవంతంగా పరిష్కరింపబడక పోవడం అందుకు గల ఒక కారణం. పార్టీ కమిటీ, కమిటీ సభ్యులతో కూడుకుని వుంటుంది. ఒక కార్యదర్శి, తాను కమిటీ సభ్యుల కంటే వున్నతుడిననుకుంటే, సారంలో అతడు తనను పార్టీ కమిటీ కంటే వున్నత స్థానంలో పెట్టుకుంటున్నట్టే. సాధారణ కమిటీ సభ్యులు, పార్టీ కమిటీ యొక్క రోజువారీ పనిని నిర్వహించరు. అయితే వారు తమల్ని పార్టీ కమిటీ నుండి దూరం చేసుకోకూడదు. దానికి మారుగా వారు దానిలో అంతర్భాగంగా అవాలి. సమిష్టి నాయకత్వంలో క్రియాశీలంగా పాలుపంచుకోవాలి. పార్టీ యొక్క కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని చైతన్యపూర్వకంగా సంరక్షించాలి.

మనలో నెలకొనివున్న 'కార్యదర్శే తెలివైన వాడు' అనే సిద్ధాంతం కార్మికవర్గ పార్టీ చైతన్యానికి వ్యతిరేకమైనది. ఒక కార్యదర్శికి ఈ రోగం సోకితే, ఇక ఆయన మొత్తం పరిస్థితి తన చేతుల్లోనే వుందనీ, పై వారి ఆదేశాలను ఇతరులకంటే ముందుగా గ్రహించగలనని, క్రిందిస్థాయిలో నెలకొనివున్న పరిస్థితుల గురించి తనకే అధికాధిక అవగాహన వుందని, అందువల్ల అన్ని విషయాలలోనూ ఇతరులకంటే తానే అధికుడినని అనుకుంటాడు. ***ఆటువంటి సిద్ధాంతం, అంతస్సారంలో నగిషీలు చెక్కబడిన 'ప్రజారాశులు వెనుకబడిన వారు' అనే సిద్ధాంతమే తప్ప మరేదీ కాదు. అది చరిత్ర గురించిన భావవాద భావన ప్రతిబింబమే, పార్టీ చైతన్యం మలినపడి పోయిందనే దానికి ఒక వ్యక్తీకరణే తప్ప మరేమీ కాదు. ఒకడు ఈ సిద్ధాంత ప్రభావానికి లోనైతే, అతడు అనివార్యంగానే తాను ఇతరుల కంటే అధికుడిననుకుంటాడు, పార్టీ కమిటీ యొక్క, వ్యక్తి యొక్క స్థానాలను తారుమారు చేస్తాడు. అనివార్యంగానే ఇతరులు 'తాను చెప్పిందే చేయాలని' ఏదో మేరలో ఆశిస్తాడు.***

పార్టీ కమిటీ యొక్క 'దళ సభ్యుల్లో', 'దళనాయకుడు' కమిటీ సభ్యులూ, ఇరువురూ వుంటారు. వారిలో కొందరు పాతవారు కాగా కొందరు కొత్తవారు. పార్టీ కమిటీ కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రానికి అనుగుణంగా కమిటీలోని ప్రతి సభ్యుడి చొరవకు, సృజనాత్మకతకు పూర్తి వికాసం కల్పించాలి. అది, మావో ఆలోచనా విధానానికి అనుగుణ్యమైన దానికి క్రియాశీలంగా మద్దతునందివ్వాలి, అనుగుణ్యంగా లేనిదాన్ని చైతన్యపూర్వకంగా ప్రతిఘటించాలి. కార్యదర్శి అభిప్రాయాలు కమిటీ సభ్యుల అభిప్రాయాలకంటే మిన్నగా వుండి తీరాలని, కమిటీలోని పాత సభ్యుల అభిప్రాయాలు, కొత్త సభ్యుల అభిప్రాయాల కంటే మిన్నగా వుండి తీరాలని అది భావించకూడదు. రాజకీయ స్వభావంగల తప్పులేవీ వుండబోవని గ్యారంటీ ఇవ్వడమూ, నిర్ణయాలు తీసుకోవడమూ కార్యదర్శి సహజంగా చేయాల్సి వున్న పని అని నొక్కి చెప్పడం, అటువంటి తప్పుడు భావన యొక్క ప్రతిఫలనమే. ❑

# ఫాసిస్టు హిందూ వ□ోన్మాద దాడిని □ైదవట్టించండి!

ప్రజల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక జీవితంలోని ప్రతి పార్శ్వంలోనూ ఫాసిస్టు హిందూ మతోన్మాదం చాపకింద నీరులా పాకుతోంది. భయంకరమైన క్యాన్సర్ మహమ్మారిలా ఇది దేశ రాజకీయ వ్యవస్థను తినేస్తోంది. మన విలువలను చెడగొడుతూ, మన మెదళ్ళను కలుషితం చేస్తున్న స్లో పాయిజన్ ఇది. సంస్థాగతంగా ఇది కీలక స్థానాల్లోకి పాము లాగా పాకుతున్నది. రాజకీయంగా ఇది చెవులు చిల్లులు పడేటట్లు గాడిదలా ఓండ్ర పెడుతున్నది. ఆర్థికంగా, ఊసరవెల్లిలా రంగులు మారుస్తూ, బూటకపు నినాదాల క్రింద దాని దుర్మార్గమైన ఉద్దేశ్యాలను కప్పిపుచ్చుతున్నది. ఈ హిందూ మతోన్మాదం కర్కశమైనది, అమానుషమైనది, అసహ్యకరమైనది, కుళ్ళిపోయినది, పచ్చి మోసకారి మరియు సమాజంలోని అధములచేత ఇది నడపబడుతోంది. పైగా ఇది పిరికిది కూడా. భయపడే ప్రజల్ని హనుమంతుడు శరీరాన్ని చూపించినట్లుగా తన శక్తిని చూపి భయపెడుతుంది. ఎవరైనా తెగించి ఎదురు తిరిగితే ఎలుకలా తోక ముడుస్తుంది. సభ్యతను పాటించాలంటూ ఉదార ప్రజాస్వామికవాదులు ఇచ్చే పిలుపులు, విజ్ఞప్తులు దీని చెవికెక్కవు. దీనికి తెలిసిందల్లా దౌర్జన్యమే. బుజ్జగింపు రాజకీయాల ద్వారానో లేక, బాహ్య ప్రభావాల ద్వారానో లేక ఓటర్ల వైఖరిలో మార్పు ద్వారానో వెనక్కి తగ్గుతుందని ఆశించటం వృధా ప్రయాసే మరి. దీన్ని దెబ్బతీస్తేగానీ ఇది పడిపోదు.

ప్రజల్ని రెచ్చగొట్టే సింఘాల్, గిరిరాజ్, కిషోర్ వగైరా గోబెల్స్ ప్రచార ఉన్మాదులు, అద్వానీ లాంటి నరహంతకులు, దాని వ్యూహాల్ని రూపొందించే సుదర్శన్ ఇంకా ఇతర ఆర్.ఎస్.ఎస్. పెద్ద తలకాయలు, శౌరి లాంటి సలహాలిచ్చే మేధావులు, హిందూ ఫాసిస్టు ఎజెండాకు చట్టబద్ధత కల్పించే జర్నలిస్టులు, విద్యావేత్తలు, గొప్ప సహన స్వభావాన్ని తలపింపజేస్తూ వాజ్‌పెయి, గురుమూర్తి రకపు రెండు నాల్కల డంభాచారులు, చివరగా కసాయి పనులకు, అత్యాచారాలకు, మారణకాండలకు నాయకత్వం వహించే హంతకులతో బహుముఖాలు కలిగినదీ హిందూ మతోన్మాదం. చివరి కోవకు చెందిన హంతకులు మొదటి కోవకు చెందిన వారికి కేవలం పనిముట్లు మాత్రమే. అసలు హంతకుడు దారాసింగ్ అయితే, వాజ్‌పెయిలు, అద్వానీలు, సుదర్శన్‌లు, సింఘాల్‌లు, శౌరీలు మొదలైన వాళ్ళు వాడి భాగస్వాములు, వాడ్ని రెచ్చగొట్టిన వాళ్ళు, వాడి ప్రోత్సాహకులూ అవుతారు. అందరూ సమాన నేరస్థులే.

హిందూ మతోన్మాద దాడులు ప్రమాదకర స్థితికి చేరిన దానికి ఉదాహరణే క్రైస్తవులు, వారి సంస్థలపై ఇటీవల దేశ వ్యాప్త దాడులు. సామ్రాజ్యవాదులు, వాణిజ్య గుత్త సంస్థలు మొదలైన వాటి షరతులకు తలొగ్గి, బి.జె.పి. చేస్తున్న సిగ్గుమాలిన దాస్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి, 'విదేశీ మార్కు' మీద దాడి అత్యవసరంగా ముందుకొచ్చింది. 'స్వదేశీ' జాతీయవాదం వగైరా మెతుకులతో పెంచి పోషించబడిన పార్టీ శ్రేణులు తెల్లదొరల ముందు సాగిలబడి పాదాలు నాకుతున్న తమ నాయకులను చూసి ఆగ్రహోదగ్రులవుతున్నారు. కాబట్టి పాశ్చాత్య మార్కుపై దాడి చేయటం ద్వారా, ఆర్.ఎస్.ఎస్. 'స్వదేశీ' పడగనీడ ద్వారా కేడర్ల ఆగ్రహాన్ని పక్కకు మళ్ళించారు. విదేశీ దయ్యంతో కలిసి తాగుతూ, తింటూ చేసుకుంటున్న విందును మరుగుపరచడానికి, క్రైస్తవానికి వ్యతిరేకంగా హిందూ మతం, పాశ్చాత్య నాగరికతకు వ్యతిరేకంగా సంప్రదాయం, బూటకపు 'స్వదేశీ' నినాదాలు సంఘ్‌పరివార్‌కు మంచి మేతగా పనికి వచ్చాయి. అంతేగాక, విద్యా విధానాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయాలనే దాని పథకానికి, విస్తారమైన క్రైస్తవ మిషనరీ పాఠశాల వ్యవస్థ ప్రధాన అడ్డంకిగా పనిచేసింది.

కానీ, క్రైస్తవ మతం (చరిత్రలో) చేసిన గాయం కంటే, హిందూ మతోన్మాద ఎజెండాయే మరింత లోతైన గాయాన్ని చేసింది. భారతీయ నేపథ్యంలో, జర్మన్ హిట్లర్ పంథాలో ఫాసిస్టు 'హిందూ దేశాన్ని అది నిర్మించ ప్రయత్నించింది. దేశంలో అమలౌతున్న సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా తిరగబడుతున్న భారత ప్రజల్ని అదుపులో వుంచడానికి, ఒక పెద్ద సెక్షన్‌ను దీర్ఘకాలం మోసగించడానికి, ఇది మంచి మందు అని సామ్రాజ్యవాదులు కూడా గ్రహించారు. కారణం ఈరోజు వరకు కూడా ఇది పాలక వర్గాలలోని అత్యంత నిర్మాణాత్మక శక్తిగా, ప్రజల్లోని ఒక పెద్ద సెక్షన్‌ను కూడగట్టగలిగిన, ఉన్మాదపూరిత చర్యల్లో సైతం కొందరిని కదిలించినదిగా, ప్రజా సమస్యలు, డిమాండ్లపట్ల నిరంకుశ దృక్పథం కల్గినదిగా, దేశంలోనే కాక విదేశాల్లో కూడా సామ్రాజ్యవాదుల ఆజ్ఞల్ని అమలు చేయటంలో అత్యంత నమ్మకమైన దాస్య బుద్ధి గలదిగా రుజువైంది. ఒకవేళ ఈ మతోన్మాదం దేశంలో తన ఆకర్షణను కోల్పోతే పిలిప్పైన్స్, చిలీ, ఇండోనేషియా, కాంగో మొదలైన దేశాల్లో చేసినట్లు, సామ్రాజ్యవాదులు వెంటనే దీన్ని వదిలేసి తమకిష్టమైన వాళ్ళను ప్రోత్సహిస్తారు. ఈ దేశాల్లో, దశాబ్దాల తరబడి అమెరికా సామ్రాజ్యవాదులకు నమ్మకంగా సేవలందించిన నిరంకుశ, కసాయి పాలకుల్ని తమ అవసరం తీరిన తెల్లారే వదిలేశారు. మరి, భారతదేశంలో, క్రింది, మధ్య కులాలు ఎక్కువగా వున్న కుల సమాజంలో, హిందూత్వ సైన్యపు బ్రాహ్మణ హిందూవాదం ఎక్కువ మంది హిందువుల్ని, చాలా కాలం ఒకే గొడుగు కింద కూడగట్టడం సాధ్యం కాదు. దీనికితోడు, సామ్రాజ్యవాదులు ఆజ్ఞాపించిన విధానాల వల్ల ఆర్థికంగా దెబ్బతిన్న ఉన్నత కులాల్లోని ఒక సెక్షన్ కూడా ఈ హిందూత్వ మాయ నుంచి బయట పడటం ఇప్పటికే పెరుగుతున్నది.

అయితే, ప్రస్తుతానికి అది కొన్ని రాష్ట్రాలలోనూ, కేంద్రంలోనూ అధికార స్థానాలను ఉపయోగించుకుంటూ, ప్రభుత్వ యంత్రాంగం, నిరంకుశాధికార వర్గంలోకి మాత్రమేకాక, పౌర సమాజంతో సహా అన్ని రంగాల్లోకి చొరబడుతున్నది. ఇందుకోసం, ప్రభుత్వం దాని పరిపాలక విభాగాలే కాక, దళారీ బూర్జువా వర్గం, ప్రవాస భారతీయులు చివరకు సామ్రాజ్యవాదులు సైతం పెద్ద మొత్తాల్లో డబ్బు విడుదల చేస్తున్నారు. వేల కోట్లు దాని ఖజానాలోకి వచ్చి చేరుతున్నాయి. విస్తారమైన గ్రామీణ ప్రాంతాల్లోకి దాని కబంధ హస్తాలు చాచేందుకు భూస్వామ్య, గ్రామీణ ఉన్నత వర్గాలు వాహకాలుగా

పనిచేస్తున్నాయి.

ఫాసిస్టుల 'హిందూ' దేశం రెండు అంశాలు కలిగి వుంది. మొదటిది, దాని దురాక్రమిత పథకాలతో కూడిన బడా జాతి ఉన్మాదం. ఈ అగ్నికి సరిహద్దు ఘర్షణల సమయంలోనో లేక అమరనాథ్ యాత్ర సమయంలోనో హిందువులు చంపబడినపుడు తీవ్రస్థాయికి తీసుకెళ్ళబడిన పాక్ వ్యతిరేక, ఐ.ఎస్.ఐ. వ్యతిరేక ప్రసంగాల ఆజ్యం తోడవుతున్నది.

బౌద్ధం, గిరిజన మతాలు వగైరాలను మింగేస్తూ, హిందువులు కాని వారిని విదేశీయులుగా పరిగణించటం లేక వాళ్ళను హిందువులుగా మార్చే అఖండ హిందూ జాతి భావన. ఈ 'దేశీయ' హిందూవాదం బ్రాహ్మణీయం కాగా ప్రభుత్వం, ఫాసిస్టు ప్రభుత్వం అనేందుకు సందేహమేమీ లేదు.

బడా జాతి ఉన్మాదం, హిందూ దురభిమానాలు, ఎల్లప్పుడూ భారత పాలకవర్గాల్లో భాగమై వుంటూనే వచ్చాయి కానీ 1980ల మధ్య నుండి దూకుడు స్వభావం కల్గిన ఫాసిస్టు లక్షణాన్ని సంతరించుకున్నాయి. 1980ల ప్రారంభంలో డబ్ల్యు.టి.ఓ. ఒప్పందంతో పాటు ఐ.యం.యఫ్. ప్రవేశపెట్టిన వ్యవస్థీకృత సర్దుబాటు కార్యక్రమం అప్పటికే పేదరికంలో వున్న దేశాన్ని, మరింత లోతైన దారిద్ర్యంలోకి నెట్టింది. ఈ వ్యవస్థీకృత సర్దుబాటు కార్యక్రమం క్రూరాతి క్రూరమైనది, దీని తక్షణ ఫలితమైన ధరల పెరుగుదల, నిరుద్యోగం, సాంఘిక సంక్షేమంలో కోత మొదలైనవి ప్రజల్లో, అసంతృప్తికి దారితీశాయి. సామ్రాజ్యవాదులు ఆదేశించిన ఈ ఎజెండా క్రింద, 'గరీబీ హఠావో' వగైరా సంస్కరణలు సాధ్యం కావు. వెల్లువెత్తుతున్న ప్రజల అసంతృప్తిని ప్రక్కదారి పట్టించడానికి, అల్ప సంఖ్యాకులమీద దౌర్జన్యానికి దిగే అధిక సంఖ్యాకుల ఉన్మాదమే మంచి మందు. దీన్ని ఇందిరా గాంధీ గంగాజల ఏకత్మతా యాత్రతో (ఓం చిహ్నంతో) చేపట్టగా, టీ.వీ.లో రామాయణ సీరియల్ ప్రవేశపెట్టటంలో వ్యక్తిగతంగా శ్రద్ధచూపిన రాజీవ్‌గాంధీ బాబ్రీమసీదు తాళాలు తెరిపించి, వివాదాస్పద స్థలంలో శిలాన్యాసానికి అనుమతించి, అయోధ్య నుంచి 1989లో ఎన్నికల క్యాంపెయిన్‌ని అయోధ్యనుంచే మొదలెట్టాడు.

ప్రపంచ వ్యాప్తంగా, సామ్రాజ్యవాదులు దూకుడుగా ముందుకు తెచ్చిన 'ప్రపంచీకరణ'తో, ఈ మొత్తం క్రమంలో 1991/1992 సంవత్సరం పెద్ద ముందడుగుగా కన్పిస్తున్నది. ఇక, 1990 దశకంలో బి.జె.పి. పార్టీ కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో అధికారంలోకి రావటంతో, సామ్రాజ్యవాద దోపిడీకి ఆర్థిక వ్యవస్థ తలుపులు బార్లా తెరిచే అసలైన పందెం ప్రారంభమైంది. దీని ఫలితంగా, మధ్యతరగతి వర్గంలోని ఒక పెద్ద సెక్షన్ ప్రజల పరిస్థితి కూడా మరింత హీనస్థితికి దిగజారింది. అణు పరీక్షల, సరిహద్దు ఘర్షణల ఆజ్యంపోసి, తీవ్రస్థాయిలో రగిలిస్తున్న ఈ హిందూ మతోన్మాదాగ్ని, ప్రజల్ని చాలా తెలివిగా ప్రక్కదారి పట్టించే తంతు. కనుక, ఈ ఫాసిస్టు హిందూత్వ దాడి మన దేశంమీద ప్రస్తుతం జరుగుతున్న సామ్రాజ్యవాద భీకర దాడికి సంబంధించిన సామాజిక-రాజకీయ ముఖం తప్ప మరొకటి కాదు.

గత రెండు సంవత్సరాల బి.జె.పి. నాయకత్వపు పాలనలో ఈ మతోన్మాద భూతం ఏ విధంగా ఎదిగిందనేది, ఈ వ్యాసంలో క్లుప్తంగా వివరణ ఇచ్చాము. రాబోవు సంచికల్లో మరింత సోదాహరణంగా వివరిస్తూ సీరియల్ వ్యాసాలు అందించగలము. ఈ వ్యాసం రెండు భాగాలుగా విభజించబడింది. మొదట హిందూత్వ దాడి తీవ్రత ఏ స్థాయిలో వుందో చూద్దాము. తర్వాత హిందూ మతోన్మాదంపట్ల వివిధ రాజకీయ, సామాజిక శక్తుల దృక్పథాన్ని చూద్దాం.

వ్యవస్థ ఏ మేరకు కాషాయీకరించబడిందో ఇప్పుడు చూద్దాం.

# I

# హిందూత్వ దాడి

## 1. ప్రభుత్వ యంత్రాంగం

ప్రభుత్వాధికారం మీద తన నియంత్రణను ఉపయోగిస్తూ, సైనిక బలగాల్లోని అత్యున్నత స్థానాలన్నింటిలోకి, అత్యున్నత నిరంకుశాధికార వర్గంలోకి కేంద్ర పోలీసు బలగాలలోకి ఆర్.ఎస్.ఎస్. శక్తుల్ని ఒక పద్ధతి ప్రకారం బి.జె.పి. చొప్పిస్తున్నది. ఎన్.డి.ఏ. ప్రభుత్వం నియమించిన గవర్నర్లు ఆరుగురూ ఆర్.ఎస్.ఎస్. కీలు బొమ్మలు. న్యాయ వ్యవస్థలో కూడా పై స్థాయిలో చాలా లోతుగా జరిగిన కాషాయీకరణ, దాని కొన్ని తీర్పుల్లో ప్రతిఫలిస్తున్నది. రాష్ట్ర స్థాయిలో బి.జె.పి. అధికారంలో వున్నచోట, హిందూత్వం మరింత లోతుకు చొచ్చుకు పోయింది. ప్రత్యేకించి, ఇది గుజరాత్, యు.పి.లో కన్పిస్తుంది. ఉత్తర ప్రదేశ్‌లో, దేవాలయ ట్రస్టులు స్వీకరిస్తున్న విస్తారమైన నిధులపై నియంత్రణను తన చేతుల్లోకి తీసుకోవడానికి తీసుకొచ్చిన 'ధర్మద బిల్లు' ముస్లింల మసీదులు ధ్వంసం చేయడానికి, వాటి ఎదుగుదలను నిరోధించడానికి తీసుకొచ్చిన 'యు.పి. పబ్లిక్ నిర్మాణాలు, ప్రార్థనా స్థలాల నియంత్రణ బిల్లు' లను ఆమోదింప జేయడానికి అది తీవ్రంగా ప్రయత్నించింది. సర్వసాధారణంగానే అన్ని రాష్ట్రాల్లోనూ పోలీసు బలగాలు ఇప్పటికే కుల/మతతత్వానికి లోనై పోయాయి. అయితే ముస్లింల పైనే కాక, క్రైస్తవులపై కూడా హిందూ ఫాసిస్టులు చేస్తున్న దాడులకు పోలీసులు బహిరంగంగా సహకరించటం వల్ల ఇది మరింత విస్తృత స్థాయికి చేరుకుందంతే.

## ౨. కలిపేసుకునే (Assimilation) ప్రక్రియ

గిరిజనులు, దళితులు, బౌద్ధులు, సిక్కులు మొదలైన వారిని ఆర్.ఎస్.ఎస్. హిందూ సమాజంలో కలిపేసుకునే ప్రక్రియ చాలా సంవత్సరాల నుండి జరుగుతున్నా, గత రెండు సంవత్సరాల్లో ఇది తీవ్ర స్థాయికి చేరింది.

ప్రత్యేకించి, గిరిజనుల్ని బలవంతంగా కలిపేసుకునే కార్యక్రమాలు జరిగాయి. గిరిజన మతం ఏనాడూ హిందూ మతంలో భాగం కానప్పటికీ, క్రైస్తవం నుంచి 'పునఃమతాంతరీకరణ' పేరున విస్తృత మార్పిడి ఉద్యమానికి ఆర్.ఎస్.ఎస్. పూనుకుంది. గత మూడు సంవత్సరాల నుండి గుజరాత్‌లోని డాంగ్స్‌లోనూ, దాని పొరుగునున్న మహారాష్ట్ర ప్రాంతాల్లోనూ ఆర్.ఎస్.ఎస్. అనుబంధ సంఘాలు చర్చిలను తగులబెట్టడం, క్రైస్తవులపై భౌతిక దాడులు చేయడం, క్రిస్టమస్ కార్యక్రమాల్ని నిరోధించటం వంటి క్రైస్తవ మిషనరీలకు వ్యతిరేకమైన తీవ్ర చర్యలకు పాల్పడ్డాయి. 2000 మంది గిరిజనుల్ని 'పునఃమతాంతరీకరణ' చేసినట్లు ఆర్.ఎస్.ఎస్. చెప్పుకుంది.

మధ్యప్రదేశ్‌లోని బస్తర్ రీజియన్‌లో, ఒక పద్ధతి ప్రకారం, విస్తృతంగా భక్తిపూజను ప్రోత్సహించిన ఫలితంగా, ఆదివాసీ ప్రజలు హిందువులుగా మార్చబడి, సంస్కృతీకరించబడ్డారు. ఆదివాసులను బలవంతంగా హిందువులుగా మార్చారు. వారి గోండీ భాషను తొలగించి హిందీ భాష వారి నెత్తిన రుద్దారు. జార్ఖండ్ రీజియన్‌లోని ఆదివాసుల్లో పెద్ద ఎత్తున ఒక కొత్త క్యాంపెయిన్ ప్రారంభించబడింది. రాంచీ సమీపంలోని 'బెరో'లో జరిగిన రెండు రోజుల పండుగ సందర్భంగా కేంద్ర మంత్రులు, వి.హెచ్.పి. అగ్ర నాయకులు పాల్గొన్నారు. ఒరిస్సాలోని మయూర్‌భంజ్, కియోంఝుర్ జిల్లాలో గ్రాహం స్టెయిన్స్, అతని ఇద్దరు కొడుకుల హత్యలో ప్రధాన నిందితుడు ధారాసింగ్ పురాణ పురుషుడిగా మార్చబడ్డాడు. 'ధారాసేన' లాంటి అనేక నిర్మాణాలను సంఘ్ పరివార్ స్థాపించి, 'నేను, ధారాను మాట్లాడుతున్నాను' అనే పేరుగల పుస్తకంతో పాటు తీవ్రంగా రెచ్చగొట్టే సాహిత్యాన్ని పంచింది. గ్రాహం స్టెయిన్స్‌ను సజీవ దహనం చేసిన గ్రామంలోనే 2000 జూన్ ప్రారంభంలో పూరీ శంకరాచార్యుడు 72 మంది ఆదివాసుల్ని 'మతమార్పిడి' చేయించటంతో, 'పునఃమతాంతరీకరణ' గా పిలవబడుతున్న వి.హెచ్.పి. మత మార్పిడి క్యాంపెయిన్ శిఖరాగ్రానికి చేరింది. ఈ ప్రదేశాల్లోనే గాక, రాజస్థాన్, ఈశాన్య, దక్షిణ భారత దేశంలోని అనేక ప్రదేశాల్లోని ఆదివాసుల్లో ఆర్.ఎస్.ఎస్. ప్రత్యేక కార్యకర్తలు పనిచేస్తున్నారు.

గత సంవత్సర కాలంగా సిక్కు మిలిటెన్సీ ఎక్కువగా వున్న గురుదాస్‌పూర్, అమృత్‌సర్ జిల్లాలోకి ఆర్.ఎస్.ఎస్. చురుకుగా చొరబడుతూ 'రాష్ట్రీయ సిక్కు సంఘట్'లోకి యువకుల్ని చేర్చుకుంటున్నది. ఏప్రిల్ చివరిలో ఛండీఘర్‌లో సాక్షాత్తూ ఆర్.ఎస్.ఎస్. అధినేత సుదర్శన్‌చే ప్రారంభించబడిన, అత్యున్నత సంఘట్ సమావేశంలో ఇది పరాకాష్ట నందుకుంది. ముస్లింలు సిక్కు గురువులను ఏ విధంగా బాధలకు గురి చేశారనే అంశంపై, హిందూత్వాన్ని రక్షించడానికి చారిత్రకంగా ఖల్సా ఏ విధంగా సృష్టించబడిందనే దానిపై ఇక్కడ అతడు పెడబొబ్బలు పెడుతూ ప్రసంగించాడు. ఈ సంఘట్ ఎలాంటి ముసుగులూ లేకుండా సిక్కులు హిందూ విశ్వాసంలో ఓ భాగమంటూ కుండబద్దలు కొడుతూ బహిరంగంగానే ప్రచారం చేసింది.

దళితుల్లోకి చొరబడటం కూడా ఆర్.ఎస్.ఎస్. కార్యక్రమంలో భాగమే. ఇక్కడ వాళ్ళు అంబేద్కర్ నామాన్ని స్తుతిస్తూ (వాళ్ళ ప్రభాత ప్రార్థనలో కూడా దీన్ని ప్రవేశపెడుతూ), అతడు క్రైస్తవానికి గాని, ఇస్లాం మతానికి గానీ మారకుండా హిందూమతానికి దగ్గర సంబంధమున్న బౌద్ధ మతానికే మారాడనే 'వాస్తవాన్ని' ప్రధానంగా చూపుతున్నారు. మహారాష్ట్రలో 2000 సం॥రంలోనే మే నెలలో దేవగడ్ దగ్గర ఒక గ్రామంలో పెద్ద ఉత్సవం నిర్వహించి, సామాజిక సమరస్త మంచ్ (సామాజిక సామరస్య సంఘం), సమతా పరిషత్ (సమానత్వ సంఘం) అను వాళ్ళు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. దీనికి శ్రీలంక, టిబెట్, లండన్ నుంచి వచ్చిన వాళ్లతో సహా 16 మంది బౌద్ధ సన్యాసులు హాజరయ్యారు.

చివరికి, గత నాలుగు సంవత్సరాలుగా సింధు నాగరికతకు సంబంధించిన ప్రాథమిక సత్యమైన సింధునదికి (ఇండస్) నివాళులు అర్పించే మిషతో 'సింధు దర్శన్' పేరుతో కాశ్మీర్‌లోని లడఖ్ రీజియన్‌లోకి ఒక పద్ధతి ప్రకారం చొరబడుతున్నది. 2000 జూన్‌లో ప్రధానమంత్రి, అద్వానీ, ఇతర కేంద్రమంత్రులు, గవర్నర్లు, ఆర్.ఎస్.ఎస్. అగ్ర నాయకులు హాజరు కావటంతో ఈ వినోద సమ్మేళనం పతాక శీర్షికలో కెక్కింది. లడఖ్ ప్రాంత బౌద్ధుల్లోని ఒక సెక్షన్ ఇప్పటికే ముస్లిం వ్యతిరేకులుగా, క్రైస్తవ వ్యతిరేకులుగా తయారై, కాషాయ చొరబాటుతో కుమ్మక్కయ్యారు.

కేరళలో, సాంఘిక సంస్కర్త నారాయణ గురు పేరును స్తుతిస్తూ, సంఖ్యాపరంగా బలమైన ఎజవా కులాన్ని తమవైపు తిప్పుకోవడానికి పనిచేస్తున్నారు. అతని బ్రాహ్మణాధిపత్య వ్యతిరేక పోరాటాన్ని మరుగుపరుస్తూ ''ఒకే మతం, ఒకే దేవుడు'' అనే అతని విశాల భావాన్ని, ఏకీకృత హిందూవాదంగా ముందుకు తీసుకొస్తున్నారు.

***పేద వర్గాల్లో నిర్వహిస్తున్న ఈ కలిపేసుకునే కార్యక్రమాలన్నీ, వాళ్ళను క్రైస్తవానికి దూరంగా వుంచడానికే కాక, ప్రత్యేకించి, విప్లవానికి ఇంకా ఎక్కువ దూరంగా వుంచడానికే జరుగుతున్నాయి.*** ప్రభుత్వం తన పరిమిత సంక్షేమ కార్యక్రమాలు కూడా కోత పెట్టటంతో, ఈ సెక్షన్ ప్రజలు ఆర్థిక సంస్కరణల చేత ఘోరంగా దెబ్బతిని, విప్లవ భావాలవైపు ఎక్కువగా మొగ్గుతున్నారు. ''గిరిజనుల్లోకి మేము ప్రవేశించక పోతే, క్రైస్తవులతోనో నక్సలైట్లతోనో గిరిజన సమాజం నిండిపోతుంది'' అని ఆర్.ఎస్.ఎస్. వాళ్ళు చెబుతున్నారు.

## 3. మైనారిటీల మీద దాడి

ముస్లిం వ్యతిరేక ఉన్మాదం ఆగకుండ కొనసాగుతుండగానే, ఇంతకు ముందు చెప్పిన కారణాలవల్ల క్రైస్తవులు వారి తక్షణ లక్ష్యం అయ్యారు.

క్రైస్తవులమీద దాడి త్వరత్వరగా వ్యాపించే అంటువ్యాధి స్థాయికి చేరింది. దేశ వ్యాప్తంగా చర్చిల్లో బాంబు ప్రేలుళ్ల పరంపర, క్రైస్తవ సన్యాసినులపై అత్యాచారాలు, చర్చి ఫాదర్‌ల క్రూర హత్యలు, క్రైస్తవ పాఠశాలలమీద దాడులు జరిగాయి. ప్రచారకుల్ని పోలీసులు అరెస్టు చేయటంతో, యు.పి., గుజరాత్‌లలో క్రైస్తవ ప్రచారం కూడా నేరంగా మారిపోయింది. 2000 జూన్ మధ్య నాటికి, రెండు సంవత్సరాల్లో ఇటువంటి కేసులు 300 పైగా నమోదయ్యాయి. ఇవన్నీ ప్రభుత్వ పోలీసుల అండదండలతో జరిగిన పిరికి దాడులే. ఇవి మతోన్మాదుల దాడులు కాదని, చెదురుమదురుగా దొంగదాడులే నంటూ ప్రభుత్వము, పోలీసులు ఇద్దరూ కట్టుకథ అల్లారు. వాస్తవాన్ని గుర్తించ నిరాకరించడం ద్వారా ఇది మతోన్మాద గూండాలను ముందుకు పొమ్మంటూ, దాడుల్ని పెంచమని ఇచ్చిన పిలుపు తప్ప వేరే కాదనేది స్పష్టమే. మరింత ఆశ్చర్యకరమైనదేమంటే, మైనారిటీల పైన జాతీయ కమీషన్ కూడా కాషాయీకరించబడి, ప్రభుత్వానికి తందాన కొడుతూ, క్రైస్తవులమీద దాడులు మతపరమైన దాడులు కాదని, ''స్థానిక శాంతిభద్రతలకు సంబంధించిన సంఘటనలని'' చెబుతున్నది.

ఇక, పుండుమీద కారం జల్లినట్లుగా, క్రైస్తవమత వ్యవహారాల (పర్సనల్) చట్టం కోసం చాలా కాలంగా ఎదురుచూస్తున్న సవరణల్ని, చివరికి లా కమీషన్ బయటికి తెచ్చింది. దీంట్లోని నిబంధనలు

(క్లాజ్) ఏ మాత్రం ఆమోదనీయం కావు. పైగా క్రైస్తవ మతం సమర్పించిన ముసాయిదాలో ఈసవరణలు లేనే లేవు. లా కమీషన్ ప్రకటించిన ఈ సవరణలు చర్చి అధికారాన్ని అడ్డుకోవడానికి, చర్చి వివాహాలు చెల్లకుండా చేయడానికి చేసిన ప్రయత్నమే. 'జీవిత భాగస్వాముల్లో ఎవరో ఒకరు క్రైస్తవేతరులుగా వుండటం ఇప్పుడిక చెల్లదు.

మతమార్పిడి వ్యతిరేకోన్మాద కొరడా ఝుళిపించడంమీద కేంద్రీకరిస్తూనే ముస్లింల మీదికి ఎగదోయడాన్ని ఆర్.యస్.యస్. ఆపలేదు. భయాందోళనలను ప్రేరేపించే ఏ అవకాశాన్నీ, ఉద్రిక్తలను రెచ్చగొట్టే ఏ అవకాశాన్నీ అది వదులుకోలేదు. ఆ విధంగా తగిన సమయం వచ్చినపుడు, తదుపరి ముస్లిం వ్యతిరేక కార్యక్రమాన్ని ముందుకు దూకించడానికి అది కళ్ళెం వదుల్తుంది. ముస్లిం సినీతారల్ని హిందూ వ్యతిరేకులుగా చిత్రించి, పాతిపెట్టటానికి సైతం ఆర్.ఎస్.ఎస్. ప్రయత్నిస్తోంది. హృతిక్‌రోషన్ లాంటి దూసుకొస్తున్న హిందూ తారల్ని ఎదగకుండ ఖాన్‌లు, వారి వెనుకనున్న వారు అడ్డుకుంటున్నారని తమ పత్రిక కవర్‌పేజీ కథనంలో చెప్పారు. చివరకు క్రైస్తవుల మీద జరిగిన దాడులకు కూడా ఇప్పుడు అది ముస్లిం సంస్థలమీదే నిందలు మోపుతున్నది.

స్థానికంగా ముస్లింలకు వ్యతిరేకంగా మతకొట్లాటలు కొనసాగు తూనే వున్నాయి. కానీ ఇప్పుడవి పత్రికల దృష్టిలోకి కూడా రానంత సాధారణ విషయాలై పోయాయి. గత కొద్ది నెలల్లో అహమ్మదాబాద్, సూరత్, మధుర, జైపూర్, వారణాసి, జమ్ము, మహారాష్ట్ర, ఇంకా అనేక ప్రదేశాల్లో మత కొట్లాటలు జరిగాయి. ఢిల్లీలో జామియా మిల్లియా కళాశాల విద్యార్థులమీద పోలీసులు క్రూరంగా దాడిచేసి, నోటికొచ్చినట్లు ముస్లిం వ్యతిరేక బూతులు తిట్టారు. దీనికి తోడు, అయోధ్య క్యాంపెయిన్‌మీద వి.హెచ్.పి. తన పని వేగిరం చేస్తున్నది. అయోధ్యలో రామమందిర నిర్మాణం 2001 సంగరంలో జనవరిలో జరిగే కుంభమేళా తరువాత ప్రారంభమౌతుందని ప్రకటించింది. ప్రతిరోజూ, ఒకటి నుండి మూడు ట్రక్కుల వరకు మల్చబడిన శిలలు రాజస్థాన్ నుండి అయోధ్యకు తరలిపోతున్నాయి. తదుపరి ముస్లిం వ్యతిరేక సెంటిమెంట్ల నిప్పు రాజేయడానికి సోమనాథ దేవాలయ 50వ పునరుద్ధరణ (11వ శతాబ్దంలో గజనీ మహమ్మద్ ధ్వంసం చేశాడు.) వార్షికోత్సవం మీద కేంద్రీకరించి, పెద్ద ఎత్తున జరపతలపెట్టిన 'హిందూ జాగరణ' పథకాన్ని ఇప్పుడు సంఘ్‌పరివార్ ప్రకటించింది. 250 చిన్న రథయాత్రలు వచ్చి కలిసే, సోమనాథ నుంచి అయోధ్య రథయాత్రకు పథకం రూపొందించారు.

మైనారిటీ వ్యతిరేక క్యాంపెయిన్లలో కూడా వారి ప్రధాన దాడులు ముస్లింల మీదే జరుగుతాయి. ఇక ఆర్.ఎస్.ఎస్. పాశ్చాత్య వ్యతిరేక ప్రచార ఫోజు కోసం క్రైస్తవులు బలవుతారు. మరోవైపున సిక్కుల కలిపివేత కార్యక్రమం విఫలమైతే, వాళ్ళమీద కూడ మరొకసారి గురిపెడతారు. ప్రాథమికంగా, హిందూ మతోన్మాదులు హిందూ యేతరుల్ని విదేశీయులుగా, వారి హిందూ రాష్ట్ర భావనకు శత్రువులుగా చూస్తారు.

## 4. మెదళ్ళను కాషాయీకరించటం

ముద్రణా, దృశ్యమాధ్యమాలు రెండింటిలో అసభ్యకరమైన, కుటిల హిందూత్వ ప్రచారం పెద్ద ఎత్తున జరుగుతున్నది. దూరదర్శన్ ఛానెల్ ప్రతిరోజు హిందూ కావ్యాల మీద కార్యక్రమాలు, హిందూమత పక్షపాత వార్తలు, ముస్లింల వ్యతిరేక, పాకిస్తాన్ వ్యతిరేక, ఉగ్రవాద (మిలిటెంట్ల, విప్లవకారుల) వ్యతిరేక సెంటిమెంట్ల మీద అనాగరికంగా కొరడా ఝుళిపించే సీరియల్ కార్యక్రమాలు ప్రసారం చేస్తున్నది. చివరికి, అదే ఇతివృత్తానికి సంబంధించిన సినిమాలు, సీరియళ్ళు, ప్రైవేట్ ఛానెళ్ళలోనూ పెద్ద ఎత్తున ప్రసారమౌతున్నాయి. 'ఇండియాటుడే' లాంటి పత్రికల్లో మొరటుగానూ ఇతర ప్రధాన స్రవంతి పత్రికల్లో, వ్యాపార పత్రికల్లో మరింత మృదువుగానూ హిందూత్వ అనుకూల ప్రచారం సాగుతూ, ముద్రణా మాధ్యమం కూడా హిందూత్వ అనుకూల కంపులో మునిగి తేలుతోంది. దినపత్రికలైతే పూర్తిగానో, కొంత తక్కువగానో హిందూత్వ అనుకూలమైనవిగా తయారైనాయి. దాన్ని మరింత ప్రభావితం చేయడానికి, సినీతారల్ని, క్రికెట్ ఆటగాళ్ళను ఉపయోగిస్తున్నది. అత్యంత అసహ్యకరమైన ఉదాహరణ ఏమంటే మీడియాలో ధారాసింగ్‌ను అమితంగా కీర్తించే కుటిలచర్యే.

మెదళ్ళ లేక భావాల కాషాయీకరణకు సంబంధించి ఈ గోబెల్స్ ప్రచారం ఒక అంశం మాత్రమే. ఇక రెండవది, మరీ ప్రమాదకరమైనది, విద్యా విధానమంతటినీ కాషాయీకరించటం. కేంద్రంలో, బి.జె.పి. అధికారంలో వున్న రాష్ట్రాల్లో ఇది పెద్ద ఎత్తున వేగంగా జరుగుతోంది. దేశంలో యువకులలోనేగాక, పిల్లల మెదళ్లను కూడా తొలిచి విషపూరిత భావాలతో నింపుతున్నది. సమాచార ప్రసారాలు, మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖలు రెండింటిలో, తన కూటమిలోని భాగస్వామ్య పార్టీలకు చోటివ్వడానికి బి.జె.పి. సిద్ధంగా లేకపోవటంలో ఆశ్చర్యమేమీ లేదు. ఈ రెండు మంత్రిత్వ శాఖలు పై నుండి క్రింది దాకా ఆర్.ఎస్.ఎస్. శక్తులతో నిండిపోయాయి.

బి.జె.పి. ఇప్పటికే తీసుకున్న చర్యలు ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయి. ఐ.సి.హెచ్.ఆర్. (భారత చరిత్ర పరిశోధనా మండలి)లోని మొత్తం 18 మంది సభ్యుల్ని తొలగించి, ఆ స్థానాలను ఆర్.ఎస్.ఎస్. చరిత్రకారులతో నింపేసింది. ఈ క్రమంలోనే, ఐ.సి.హెచ్.ఆర్. ప్రచురించబోతున్న 'టువర్డ్స్ ఫ్రీడం' అనే రెండు భాగాల పుస్తకాన్ని సమీక్షించే మిషతో బయటికి రాకుండ ఆపేసింది. స్వాతంత్ర్య పోరాటంలో తన పాత్రను మరుగుపరిచే కథనాన్ని దాంట్లో ప్రవేశపెట్టింది. సాంస్కృతిక శాఖామంత్రి అనంత్‌కుమార్, ఇందిరాగాంధీ జాతీయ కళా కేంద్రం పరిపాలక బోర్డును రద్దుచేసి దాని స్థానంలో తనను, తన కీలుబొమ్మల్ని స్వయంగా తనే నియమించుకున్నాడు. ఈ కొత్త కార్యవర్గం కళా కేంద్ర కేంద్రీకరణను పరిశోధన నుండి ప్రచారం మీదికి మళ్ళించింది; ఐ.సి.యస్. (భారత సామాజిక శాస్త్రాల పరిశోధనా మండలి)ని కాషాయ సైన్యం పూర్తిగా తన చేతుల్లోకి తీసుకుని, ఈ మండలికి సంబంధించిన అనుబంధ సంస్థలకు కేటాయించిన పరిశోధనా బడ్జెట్‌ను ఇపుడు ఏకపక్షంగా నియంత్రిస్తోంది లేక రద్దు చేస్తోంది; సిమ్లాలోని ఐ.ఐ.ఎ.ఎస్. (భారత పురోగామి అధ్యయనాల సంస్థ) తో సహా, ఐ.సి.పి.ఆర్. (భారత తాత్విక పరిశోధనా మండలి) నియంత్రణ కూడా వాళ్ళ చేతిలోకి తీసుకున్నారు. యు.జి.సి. (విశ్వవిద్యాలయాల నిధుల మంజూరు కమీషన్) నూతన కాషాయ అధ్యక్షుడైన హరిగౌతమ్ యు.జి.సి.

నిధులు పొందుతున్న ప్రధాన విశ్వవిద్యాలయాలన్నీ ''జ్యోతిశ్శాస్త్రము, వేద అధ్యయనాలు'' శాఖలను తప్పక ప్రారంభించాలని ప్రకటించాడు. సంవత్సరాల తరబడి ముస్లింలు పోరాడుతున్న ఎ.ఎం.యు. (అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయం)కు చెందిన మైనారిటీ ప్రతిపత్తిని కాజేయాలని ఎంతకైనా తెగించే పథకాలు రూపొందిస్తున్నారు; పాఠశాలల్లో విద్యార్థుల సమావేశాల్లో జాతీయ గీతం, లౌకిక గీతాలను తొలగించి, సరస్వతీ వందనం, వందే మాతరం గీతాలను ప్రవేశపెట్టాలని బి.జె.పి. చూస్తున్నది.

దీనికితోడు, దేశమంతటా పాఠశాల విద్యా కోర్సు నిర్మాణాన్ని తయారు చేసే ప్రధాన సంస్థ ఎన్.సి.ఇ.ఆర్.టి. (జాతీయ విద్యా పరిశోధన శిక్షణ కౌన్సిల్) పై నియంత్రణను కూడా తన చేతిలోకి తీసుకుంది. ఉన్నత విద్యా బోధనకు సంబంధించిన అత్యున్నత పాలక మండలి నియంత్రణను కూడా చేజిక్కించుకోవడానికి అది కేంద్రీకరించింది. ఈ సంస్థల అత్యున్నత పాలక మండళ్ళలో కె.జి. రస్తోగి లాంటి కాషాయ మత మౌఢ్యులను నింపుతున్నది. దీనిమీద వ్యతిరేకత ఎక్కువగానే వున్నప్పటికీ, అత్యున్నత పాలక మండళ్ళు అన్నింటిమీద ప్రస్తుత ఇతడు అధికారంలో కొనసాగుతున్నాడు. దేశ విభజన కాలంలో హిందువుల చేతిలో అత్యాచారం పాలబడకుండా కాపాడేందుకోసం ఒక ముస్లిం యువతిని తాను కాల్చి చంపానంటూ తన స్వీయ చరిత్రలో ఘనంగా రాసుకుని పరువు పోగొట్టుకున్నాడు ఈ రస్తోగీ.

బి.జె.పి. ఆధీనంలోని ఎన్.సి.ఇ.ఆర్.టి. ఇప్పటికే ''పాఠశాల విద్య కొరకు నూతన జాతీయ విద్యా కోర్సు నిర్మాణ ప్రతిపాదన'' అనే డాక్యుమెంటును ముందుకు తీసుకొచ్చి, 1988 నాటి ఎన్.సి.ఇ.ఆర్.టి. యొక్క విద్యా కోర్సు నిర్మాణాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసింది. మతబోధన, సంప్రదాయం, భారతదేశపు ''గొప్ప సాంస్కృతిక వారసత్వం'', ''విద్య విలువ'', బాలికల కోసం ''గృహాన్ని చక్కదిద్దుకోవటం''లో ప్రత్యేక కోర్సులు మొదలైన వాటి ప్రాముఖ్యతను నొక్కి చెప్తుతూ, ఇప్పుడు కాషాయ మార్గదర్శక నియమావళివ్వబడ్డాయి. 'సాధారణ' విద్యార్థుల కోసం ఒకటి, 'తెలివైన' విద్యార్థులకు మరొకటి పద్ధతిన రెండు విజ్ఞాన శాస్త్రాలను బోధించి, పాఠశాల స్థాయిలో శ్రేష్టత్వ వాదాన్ని తీసుకు రావడానికి ప్రయత్నిస్తున్నది. అన్నింటికంటే ఎక్కువగా 'భారతీయత' గురించి వూదరగొడుతున్నప్పటికీ, మాతృభాషపై ఇంతకుముందు ఇచ్చిన ప్రాధాన్యతను ఇపుడు తొలగిస్తూ ఇంగ్లీషుకి అత్యంత ప్రాధాన్యత నిస్తోంది. ఈ నూతన విద్యా నిర్మాణం, సామ్రాజ్యవాదులకు మరింత చురుకుగా సేవలందించే నూతన తరాన్ని తయారు చేయడానికేననే దాంట్లో అనుమానం లేదు. యు.పి., గుజరాత్‌లోని పాఠశాలల్లో ఈ మార్పులనేకం ఇప్పటికే ప్రవేశపెట్టబడ్డాయి.

ఇది ఇంతటితో ముగియటం లేదు. ఇప్పటికే తీవ్రంగా ఉద్రేకపరచి, రెచ్చగొట్టే ముడిసరుకు నందిస్తున్న తన స్వంత ప్రైవేటు పాఠశాల వ్యవస్థను ఆర్.ఎస్.ఎస్. విస్తరిస్తున్నది. విస్తారంగా పెరుగుతున్న దాని విద్యా భారతి పాఠశాలల (వివిధ పేర్లతో నడుస్తున్నాయి) వ్యవస్థను 6000 నుండి 14000కు పెంచింది. వీటిలో 18 లక్షల మంది విద్యార్థులు, 80,000 మంది ఉపాధ్యాయులున్నారు. వీరు 60 గ్రామాల్ని, 25 ఇతర ఉన్నత విద్యా సంస్థల్ని నియంత్రిస్తున్నారు. అంతేగాక, వ్యక్తిగతంగా బి.జె.పి. సభ్యులకు అనేక స్వంత సంస్థలున్నాయి. ఉదాహరణకు పి.డి. చిట్లంగియాకు చెందిన 'గిరిజన సమాజ మిత్రులు, (ఫ్రెండ్స్ ఆఫ్ ట్రైబల్ సొసైటీ) అనే సంస్థ చేతుల్లో ఇప్పటికే 1300 పాఠశాలు వుండగా వాటిని 4,000 పెంచాలనే పథకంలో వుంది.

అయితే మెదళ్ళని (ఆలోచనల్ని) ప్రక్షాళన చేసేందుకు ఇంతటి విస్తారమైన వ్యవస్థ వున్నప్పటికీ, టీ.వీ.ల్లో ప్రచారంకన్నా, పుస్తకాల కన్నా ఎక్కువగా ప్రజల జీవితాలు, వారి దైనందిన అనుభవాలే ప్రజలకు తరచుగా వాస్తవాలను బోధిస్తూ వున్నాయి.

## 5. కుల అణచివేత

ఒకవైపున తన హిందూత్వ భావనలో అనేక క్రింది కులాలను కలిపేసుకోవడానికి సంఘ్ పరివార్ ప్రయత్నిస్తూనే, మరో చేత్తో దాని హిందూ మత బ్రాహ్మణ సారం, క్రింది కులాలు, ఒ.బి.సి.లను తోసి పారేస్తుంది. దళితుడిని బి.జె.పి. ఆధ్యక్షుడిగా చేసేటటువంటి జిమ్మిక్కులను అది ఎంతగా ప్రదర్శించినప్పటికీ తన అగ్రవర్ణ నాయకత్వంతో, హిందూ భావజాలంతో ఈ వైరుధ్యాన్ని అది ఎప్పటికీ పరిష్కరించలేదు.

గిరిజనుల్లో అది చేపట్టిన మత మార్పిడి/సంస్కృతీకరణ కార్యక్రమాల్లో ఈ వైరుధ్యం స్పష్టంగా కన్పిస్తుంది. ఇక్కడ గిరిజన పూజారులు మొదలైన వాళ్ళు, సాధారణ గిరిజనుడిని అంటరానివాడుగా పరిగణించే నూతన బ్రాహ్మణులుగా మారారు. వాస్తవానికి ఒరిస్సాలో క్రైస్తవ గిరిజనుల్ని హిందూ మతంలోకి మారమని పూరీ శంకరాచార్యుడు పిలుపునిచ్చినపుడు, సాంప్రదాయ దేవాలయాల్లోకి ప్రవేశం కల్పిస్తే ఉన్నత కులాలతో ఘర్షణకి దారి తీయవచ్చు కాబట్టి వారి కోసం వందలాది ప్రత్యేక (స్వస్తిక్) దేవాలయాలు నిర్మిస్తామని వాగ్దానం చేశాడు. మరోమాటలో చెప్పాలంటే, ప్రధాన దేవాలయాల్లోకి ప్రవేశించే హక్కులేక పోవటంతో మతాంతరీకరణ చెందినవారు నూతన అస్పృశ్యులుగా పరిగణించబడతారు.

అంతేకాక, సాధారణ దళితులు తమ ఆత్మగౌరవాన్ని ప్రదర్శించుకో జూసినపుడు వారు అగ్రకులాల గ్యాంగుల చేతగాని, ఈ ప్రభుత్వం చేతగాని నిర్దాక్షిణ్యంగా నలిపి వేయబడతారు. బి.జె.పి. పాలనలో ఇటువంటి అసహనం మరింత ఎక్కువగా కన్పిస్తుంది. గడచిన సంవత్సరంలో జరిగిన దళితుల మారణకాండలు ఈ నిజాన్ని నిరూపిస్తున్నాయి. ప్రత్యేకించి బి.జె.పి., సమతాపార్టీల కూటమి పెంచి పోషిస్తున్న రణవీర్ సేన, 2000, జూన్ 16న బీహార్‌లో ఔరంగాబాద్ జిల్లాలోని ఒక గ్రామంలో 35 మంది దళితులపై ఇతర క్రింది కులాల వారిపై జరిపిన మారణకాండ వంటివి, నక్సలైట్లచే కూడగట్టబడుతున్న కింది కులాల ఆత్మగౌరవ ప్రకటనను ఈ ఉన్నత వర్గం ఎలా సహించదో తెలియజేసే క్రూరమైన హెచ్చరికలే.

ఈ క్రూర మారణకాండ నక్సలైట్లు కూడగడుతున్న దళితుల వరకే పరిమితం కావడం లేదు. '99 జూలై 23న తమిళనాడులో తిరునల్వేలి పట్టణం నడిబొడ్డున సాక్షాత్తూ పోలీసులే 17 మంది దళితుల్ని చంపివేశారు. 2000 మార్చి 11న కర్నాటకలో కోలార్

జిల్లాలోని ఒక గ్రామంలో వక్కలిగ , అగ్రకుల గూండాలు ఏడుగురు దళితుల్ని తగులబెట్టి చంపారు. మే, 17న తమిళనాడులో పుదుక్కోటై జిల్లాలోని ఒక గ్రామంలో అగ్రకులాల పెత్తందార్లు దళితుల ఇళ్ళపై నీచంగా దాడి చేసి, ఇళ్ళను ధ్వంసం చేసి, వాళ్ళ ఆస్తులను లూటీచేశారు. ఈ దాడిలో మహిళలతో సహా 30 మంది దళితులు తీవ్రంగా గాయపడ్డారు. మరొక 30 మంది వివిధ స్థాయిల్లో గాయాలతో బాధపడ్డారు. కర్నాటకలో మాండ్యా జిల్లాలో ఒక గ్రామంలోని దళిత క్వారీ కార్మికుల వ్యథ వింటే ఎవరికైనా ఒళ్ళు గగుర్పొడుస్తుంది. తీసుకున్న అప్పు తీర్చలేక పోయినందుకుగాను, క్వారీ యజమాని తన కింద పనిచేసే కూలీలను గత రెండు సంవత్సరాల నుండి చైన్లతో కట్టేశాడు. 15 కిలోల బరువున్న ఇనుప గొలుసులచే బంధింపబడిన వీరంతా అమానుష హింసకు గురైనారు.

దీనికితోడు, రిజర్వేషన్ల పట్ల సంఘ్ పరివార్‌కున్న వ్యతిరేకత, భర్తీకాని ఉద్యోగాలను, పెద్ద ఎత్తున ఆపేయటంలోనే కాక, దేశంలోని అత్యున్నత న్యాయస్థానం ఇచ్చే తీర్పుల్లో కూడా ప్రతిఫలిస్తున్నది. గత సంవత్సర ప్రారంభంలో, ఉన్నత విద్యా బోధనా సంస్థల్లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు తీవ్రమైన కులపక్షపాత ధోరణితో కూడిన తీర్పులు రెండు ఇచ్చింది.

పార్లమెంటరీ పార్టీలన్నింటిలో అగ్రకుల పక్షపాతం కనిపిస్తూ వున్నప్పటికీ, తమ 'సాంస్కృతిక' అధికృతకు గర్వపడుతూండే సంఘ్‌పరివార్ మనస్తత్వంలో ఈ తీవ్రమైన కుల వ్యతిరేకత బలంగా పాతుకు పోయింది.

హిందూత్వ శక్తుల ప్రభావం, పెరుగుతున్న వాటి చొరబాటును చూస్తూనే, దీనిపట్ల వివిధ రాజకీయ, సామాజిక శక్తుల దృక్పథాన్ని చూద్దాం. చివరిగా, పైకి లేస్తున్న ఈ మహమ్మారి పట్ల ప్రజాస్వామిక, విప్లవ శక్తుల దృక్పథమేమిటనేది కూడా చూద్దాం.

## II

## సామాజిక-రాజకీయ శక్తుల పాత్ర

### 1. పార్లమెంటు సభ్యుల సహకారం

బి.జె.పి. కూటమిలోని మిత్రపక్షాలుగానీ, ప్రతిపక్షంగానీ ఎన్నికల ప్రయోజనాన్ని ఆశించే బి.జె.పి.పట్ల, హిందూత్వ దాడుల పట్ల తమ దృక్పథాన్ని నిర్ణయించుకుంటాయి. ***ఓటు బ్యాంకు రాజకీయాలే వారి విజయానికి కీలకమైనవిగా వున్నందున, హిందూ ఓట్లపై సెక్యులరిజం ఆధిక్యం సాధించలేదు. అధికారానికి ప్రత్యామ్నాయంగా సెక్యులరిజాన్ని త్యాగం చేయాల్సి వస్తే, ఆ పనే చేస్తారు కూడా.***

మొదటగా, బి.జె.పి. మిత్రపక్షాల (మునుపటి ఏ.ఐ.ఏ.డి.యం.కె.ను కూడా కలుపుకుని) సంగతి తీసుకుందాం. గత రెండు సంవత్సరాలలో వీరు, సంఘ్ పరివార్‌కు విస్వసనీయమైన భాగస్వాములుగా పనిచేసి, సంఘ్ పరివార్ తన చరిత్రలో ఎన్నడూ పొందని గౌరవాన్ని దానికి కట్టబెట్టారు. అంతేగాక, మొదట్లో ఉనికిలో కూడా లేని కొత్త ప్రాంతాల్లో ప్రవేశించడానికి బి.జె.పి.కి అనుకూల వాతావరణం ఏర్పడింది. హిందూత్వ విషయంలో బి.జె.పి.నే మించిపోవాలని శివసేన ప్రయత్నిస్తుంటే ఇతరులు మృదువైన హిందూత్వ వాదులుగానూ (ఉదా: మునుపటి ఏ.ఐ.ఏ.డి.యం.కె., సమతా పార్టీలు) సైలెంట్ పొత్తుదార్లుగానూ వివిధ రూపాల్లో వుంటున్నారు. క్రైస్తవుల మీద జరుగుతున్న దుర్మార్గమైన దాడులకు కనీస వ్యతిరేకత లేకపోగా, ముస్లిం వ్యతిరేక ప్రచారంలో వీరిలో ఎక్కువమంది భాగస్వాములే. పెరియార్ సంప్రదాయంలో పెరిగినవిగా పేరుపొందిన (ఇప్పుడు పూర్తిగా వదిలేశారు). తమిళనాడుకు చెందిన ద్రవిడ పార్టీలు కూడా ఇందుకు మినహాయింపు కాదు.

ఇక ప్రతిపక్షానికి సంబంధించినంత వరకు ఈ ధోరణిని మొట్టమొదటగా ప్రారంభించిన కాంగ్రెస్ (ఐ), తన మెతక హిందూత్వ పోకడలను కొనసాగిస్తున్నది. 1999 జూన్ 16 నాటి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సి.డబ్ల్యు.సి.) తీర్మానం ''సెక్యులరిజానికి అత్యంత సమర్థంగా హామీ పడేది హిందూయిజమే'' అని చెప్పడం ద్వారా సంఘ్ పరివార్ కంటే తానేం తక్కువ తినలేదని నిరూపించుకుంది. దీని తర్వాత స్వయంగా సోనియా హిందూ దేవాలయాన్ని దర్శించి, హిందూ స్వాములతో సమావేశమయింది. వి.ఎన్. గాడ్గిల్, ఎన్.డి. తివారీ, వసంత సాఠే, సుధాకర్ నాయక్ వంటి కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు బహిరంగంగానే హిందూ మతోన్మాదులు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి విలాస్‌రావ్ దేశ్‌ముఖ్ వాస్తవానికి ఒకప్పుడు శివసేనలో చేరాలని కూడా చూశాడు. ఇక, 'శ్రీకృష్ణ కమీషన్ రిపోర్టు' పై చర్య తీసుకుంటానని వాగ్దానం చేసినప్పటికీ, అందులో నిందితులుగా పేర్కొన్న పోలీసులకు వ్యతిరేకంగా ఎలాంటి చర్య తీసుకోకపోగా, అనేకమంది ప్రమోషన్లు పొందారు. దళితుల్ని చంపిన దానిమీద గుండేవార్ రిపోర్టు విషయంలో కూడా ఇదే జరిగింది. వాస్తవానికి, దాని ఒక సంవత్సరపు పాలనలో, మహారాష్ట్రలో పోలీసు కాల్పుల్లో ఐదుగురు ముస్లింలు చంపబడ్డారు. శివసేన, దాని అధ్యక్షుడు బాల్‌థాకరేతో కాంగ్రెస్ అనుమానాస్పద ప్రవర్తన, శివసేన రాజకీయ ప్రయోజనాలకు సేవలందించేదే. ఇక వీటన్నింటి తర్వాత, దాని కూటమిలోని భాగస్వామ్య ఎన్.సి.పి. పార్టీకి చెందిన హోంమంత్రి చగన్‌భుజ్‌బల్ మత కొట్లాటలు రెచ్చగొట్టిన దుశ్చరిత గలవాడే గాక, దాని అధ్యక్షుడు పి.ఏ. సంగ్మా బహిరంగంగా బి.జె.పి.తో పొత్తు కూడాడు. శరద్‌పవార్ కూడా హిందూ మతోన్మాదంలో చాలా కాలంపాటు తన సన్నిహిత సంబంధాలు కొనసాగించాడనే విషయం తెలిసిందే!

ఇతర పార్టీల విషయానికొస్తే, బి.యస్.పి. హిందూ మతోన్మాదానికి వ్యతిరేకంగా గట్టి నిర్ణయం తీసుకోవటం చాలా అరుదైన విషయమే. ఇది ఏ సమయంలోనైనా మరోసారి యు.పి.లో బి.జె.పి.తో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలదు. ఇతర దళిత పార్టీలుకూడా అదే స్థాయి అవకాశవాదంతో, తమ దళిత ఓటు బ్యాంకుల్ని ఎక్కువ సీట్లకు అమ్ముకుంటున్నాయి. భారీగా ముస్లిం ఓటు బ్యాంకును పెంచి పోషించుకుంటూ వస్తున్న సమాజ్‌వాదీ పార్టీ యొక్క హిందూత్వ వ్యతిరేక పెడబొబ్బలను పక్కన పెట్టి చూసినట్లైతే, బాబ్రీ మసీదు విధ్వంసానికి బాధ్యులైన కీలకమైన 'కరసేవకులలో' ఒకడైన సాక్షి మహరాజ్‌ను తన పార్టీలోకి చేర్చుకోవడం దానికి సమస్యగా కన్పించటం లేదు. ఇక సి.పి.ఐ.,

సి.పి.ఐ.(యం), ఆర్.జె.డి.ల విషయానికి వస్తే, తమ అవకాశవాద ఎన్నికల అవసరాలను తీర్చుకునే క్రమంలో, వీళ్ళు దేశంలోనే గొప్ప లౌకిక శక్తిగా కాంగ్రెస్ (ఐ)ని చిత్రిస్తూ, పచ్చి హిందూ మతోన్మాది ఏ.ఐ.ఏ.డి.యం.కె.తో నిరాఘాటంగా పొత్తుకు దిగుతున్నారు. వీళ్ళు కూడా క్రైస్తవుల మీద ఫాసిస్టు హిందూమతోన్మాద దాడుల్ని వ్యతిరేకిస్తూ చేసిందేమీ లేదు. ఇక ఎస్.పి., రివిజనిస్టులతో సహా ఈ ప్రతిపక్ష పార్టీలనేకం తమ పాకిస్తాన్ వ్యతిరేక ఉన్మాదంలో తరచుగా బి.జె.పి.ని మించిపోయాయి.

## ౨. మైనారిటీ నాయకత్వపు వ్యతిరేక పాత్ర

మొదటగా, మైనారిటీ ఛాందసవాదం ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న మెజారిటీ ఛాందసవాదంతో సమానం కాదు. భారతీయ నేపథ్యంలోని మైనారిటీ ఛాందసవాదం, హిందూ మతోన్మాదులకు వ్యతిరేక పరిస్థితుల్లోంచి తయారైంది. ఫాసిస్టు హిందూ మతోన్మాద దాడికి వ్యతిరేకంగా చురుగ్గా పోరాడేందుకుగాను మొట్టమొదటిగా మైనారిటీల హక్కులను, వారి మత విశ్వాసాలకు సంబంధించిన హక్కులను సైతం పరిరక్షించాల్సిన అవసరం వుంది.

అయితే, హిందూ మతోన్మాదానికి వ్యతిరేకమైన పోరాటంలో మైనారిటీ నాయకత్వం యొక్క పాత్రను బహిర్గతం చేయాల్సిన అవసరం కూడా వుంది. అనేకమంది రాజీపడి పోవటమో లేక మతాల మధ్య తీవ్రమైన చీలికలు తేవడానికి మాత్రమే వుపయోగపడే మైనారిటీ ఛాందసవాదంపట్ల ప్రతిస్పందించడమో చేస్తూ ఫాసిస్టుల చేతుల్లో ఆడించబడుతున్నారు.

క్రైస్తవుల్ని తీసుకుంటే, ప్రస్తుత భయోత్పాతానికి మూల కారకుల్లో ఒకడైన ప్రధానమంత్రికి విజ్ఞప్తులు చేయడంలోనే వారి నాయకత్వం నిండా మునిగి తేలుతుంది. పోతే, మిషనరీలు గొప్ప సమాజ సేవ చేస్తున్న అమాయకులుగానూ, నిరపరాధులుగానూ చిత్రించే ప్రయత్నం కూడా జరుగుతుంది. సాధారణంగా, మిషనరీలు వారి మత ప్రచారానికే అంకితమైనప్పటికీ, వారి అగ్రస్థాయి మత గురువులు, మతమార్పిడి ద్వారా ప్రజల్ని ఉదాసీనతలోకి, నిష్క్రియాపరత్వంలోకి నెట్టడానికి ప్రయత్నిస్తున్న వలసవాద వారసులే తప్ప మరొకటి కాదు. క్రైస్తవ పూజారి బృందంలోని అగ్రస్థానంలోని మత గురువులు పాలకవర్గాలతో సన్నిహిత సంబంధాలు గలిగి, వైభోగాలను అనుభవించే నిరంకుశ పాలక, అధికార దర్పంగల క్రూరులు. క్రైస్తవ సమాజం నిజంగా తిరగబడాలంటే ఈ ఫాదరీల ప్రభావంతో తెగతెంపులు చేసుకుని, మిలిటెంట్‌గా కొట్లాడే యువశక్తిగా ఆర్గనైజ్ కావాల్సి వుంది.

ఇక, ముస్లిం ఛాందస నాయకత్వ విషయానికి వస్తే, వీరు మత విభజనను పెంచడానికి మాత్రమే పనిచేస్తూ, తమ స్వంత వర్గాన్ని మరింత వెనుకబడిన, భూస్వామ్య ఆలోచనలోకి నెడుతున్నారు. వీరు మిలిటెంట్‌గా పోరాడుతున్నప్పటికీ, వారి లక్ష్యాలు కేంద్రీకృత కాకుండా, హిందూ నాయకత్వం కంటే ఎక్కువగా సాధారణ హిందువులే తరచుగా దెబ్బతీయ బడుతున్నారు. ఇది లక్ష్యాలకు వ్యతిరేక ఫలితాలను ఇస్తుంది. కానీ, తన మతంపై పట్టును నిలబెట్టుకునే తన ప్రయోజనాలకే ఇది పనిచేస్తుంది. అంతేగాక, వీళ్ళు తమ వర్గాన్ని ఇస్లాం ఛాందసవాద సుడిగుండంలోకి నెడుతూ, ఎలాంటి ప్రజాస్వామిక పురోభివృద్ధికి కూడా అవకాశం లేకుండా తలుపులు మూసేస్తున్నారు. ఇక్కడ సైతం సంప్రదాయవాద నాయకత్వ ప్రభావం నుండి ముస్లిం యువకులు బయటపడి, ఫాసిస్టులపై పోరాటానికి ఇతర ప్రజాస్వామిక శక్తులతో కలవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## ౩. ఉదారవాదుల బుజ్జగింపు విధానం

బుజ్జగింపు విధానం ద్వారా ఫాసిస్టులను హేతుబద్ధ మార్గంలోకి తీసుకురాగలమని కలలుగంటున్న ఉదారవాదులు దేశంలో పెద్ద సంఖ్యలోనే వున్నారు. బాబ్రీమసీదు విధ్వంసంపట్ల వారి వైఖరిలో ఇది బాగా ప్రతిఫలించింది. కూల్చిన మసీదును పునర్నిర్మించాలనే డిమాండ్‌కు బదులు, జాతీయ స్మారక చిహ్నాన్ని ప్రజలకు ఉపయోగపడే నిర్మాణాలను వగైరా వగైరాలను వీరు డిమాండ్ చేసారు. కొందరు ముస్లిం ఉదారవాదులు, ఇతర మసీదుల్ని కూలగొట్టనివ్వమనే హామీ ఇస్తే, రామ మందిర నిర్మాణానికి అనుమతిస్తామని ప్రకటించేంత వరకు పోయారు. ఈ ఉదారవాదులు గత చరిత్ర నుంచి నేర్చుకున్న దేమీ లేదనేది స్పష్టమే. ఫాసిస్టులతో సామరస్యంగా వ్యవహరించటం ద్వారా వారిని వెనక్కు మళ్ళించిన సంఘటన చరిత్రలో ఎక్కడా జరగలేదు.

కానీ, ఈ ఉదారవాదులు, స్వచ్ఛంద సంస్థలతో విస్తృత సంబంధాలు కలిగి వుండటమే నేడు మరీ హానికరంగా వుంటోంది. ఇటువంటి వేలాది స్వచ్ఛంద సంస్థలు దేశమంతటా తమ బాహువులు చాచి విదేశాల నుండో లేక ప్రభుత్వం, భారత దళారుల నుండి గానీ నిధులు దండుకుంటూ అభివృద్ధి చెందుతున్నాయి. అనేక సంస్థలు హిందూ మతోన్మాద అగ్నికి వాస్తవంగా ఆజ్యం పోసే, ఉమ్మడి సైద్ధాంతిక వైఖరితో కలుషితమైపోయి వున్నాయి. వీటి నయా గాంధేయ వాద వైఖరిలో 2 ప్రధాన దృక్కోణాలు వున్నాయి. అవి, ఒకటి: పాశ్చాత్యీకరణకు వ్యతిరేకంగా భారతీయ (హిందూ) సంప్రదాయాన్ని ఆకాశానికెత్తడం; రెండు: ఫాసిస్టుల హింసవైపు కన్నెత్తి చూడకుండా వుంటూనే మరోవైపు ప్రజా హింసను ఏ మాత్రం సహించక పోవడం.

ఈ ఉదారవాద ప్రముఖ సిద్ధాంత వ్యాఖ్యాతలలో ఒకరైన అశిష్‌నంది రాతల్లో ఈ వైఖరిని స్పష్టంగా చూడవచ్చు. ఇతడు 'అభివృద్ధి చెందుతున్న సమాజాల అధ్యయన సంస్థ'కు చెందినవాడు. దీని స్థాపకుడు రజనీ కొఠారీ. వీరి స్వంత పత్రిక 'లోకాయన్' ద్వారా వీరి భావాలు విస్తృతంగా ప్రచారమైనాయి. సంప్రదాయం దానికి పోటీగా ఆధునికత అనే అశిష్‌నందీ భావన రూప్‌కన్వర్ సతీ సహగమనాన్ని వాస్తవంగానే బలపర్చేంత 'అతి'కి పోయింది. గాంధీవాద నేతల వీరోచిత, సంప్రదాయక రాజకీయ నిరాహార దీక్షలతో దీన్ని ముడిపెడుతూ, ఇతగాడు, 'ఆత్మాహుతి'కి సంబంధించిన అంశంగా ఈ ఘటనను చూడటం ద్వారా దీనికి విశ్వసనీయత నిచ్చేంత వరకు పోయాడు. ఈ రకమైన తర్కాన్ని ఇతగాడు చివరకు లౌకిక వాదానికి వ్యతిరేకంగా తీవ్ర ప్రచారాన్ని మొదలు పెట్టేంత వరకు తీసుకుపోయాడు. లౌకిక వాదం పాశ్చాత్య భావన అనీ, భారత దేశానికి అది సరిపోదనీ, 'నిజమైన' మతం (అంటే హిందూ మతం అని అర్థం) ఒక్కటే తనకు తానుగా మంచినీ, సహనాన్నీ తీసుకు రాగలదని ఇతగాడు అంటాడు. చిట్ట చివరి ముస్లింని, సిక్కును సైతం కాపాడే లౌకికవాద లక్ష్యం కోసం పోరాడేందుకు మరీ ఆతృత

పడుతున్నందుకుగాను, వామపక్ష వాదులపై, లౌకికవాదులపై, సోషలిస్టులపై దాడి చేసేందుకు సైతం ఇతగాడు సిద్ధపడి పోయాడు.

ఇటువంటి మాటలు, ఆర్.యస్.యస్., దాని 'కుహనా లౌకికవాదం' సంప్రదాయాన్ని శ్లాఘించటం మొదలైన వాటితో ఏమంతగా విభేధించటం లేదు. దీని ఫలితంగా జరిగేది హిందూత్వ అగ్నికి ఆజ్యం పోయడం తప్ప మరొకటి కాదు. ఆశీష్‌నంది భావాలు తీవ్రమైన వైనప్పటికీ చాలా స్వచ్ఛంద సంస్థలు (ఉదాహరణకు 'మానుషి' సంస్థను తీసుకుంటే) సైతం భారతీయ నేపథ్యంలోని 'సంప్రదాయం దానికి పోటీగా ఆధునీకరణ మాయలోపడి, ఫలితంగా హిందూత్వానికి క్షమాపణలు చెప్పుకునేవిగా తయారవు తున్నాయి. పాశ్చాత్యీకరణ (ఆధునీకరణగా పిలవబడుతున్నది) అనేది ప్రజాస్వామికీకరణకు భిన్నమైనదని వాళ్ళు అర్థం చేసుకోవటం లేదు. తిరిగి సంప్రదాయంలోకి వెళ్ళడం ద్వారా, సామ్రాజ్యవాద విలువల స్థానంలో భూస్వామ్య విలువల్ని నిలబెట్టడానికే వాళ్ళు ఎక్కువగా ప్రయత్నిస్తున్నారు. ప్రజాస్వామ్య విలువల నూతన మార్గం కోసం పోరాడటమే హిందూత్వ, పాశ్చాత్యీకరణలు రెండింటికీ సరైన సమాధానం.

నయా గాంధేయ వాదంలోని రెండవ అంశం ఏమిటంటే, ఎలాంటి ప్రజాహింసనైనా అది తీవ్రంగా వ్యతిరేకించటం. హింసకు ప్రతి హింస చేయకూడదనే సోకడతో, ఒకరి తప్పును అదే తప్పును తిరిగి చేయటం ద్వారా ఎదుర్కోలేమనే వాదనతో వాళ్ళు ఫాసిస్టు హింసను చట్టబద్ధం చేస్తున్నారు. ఆ విధంగా న్యాయమైన హింసకు, అన్యాయమైన హింసకు తేడా చూడకుండా, అన్నింటినీ ఒకే గాటన కడుతున్నారు. ఈనాడు, భజరంగ్‌దళ్ బహిరంగంగా ఆయుధ శిక్షణా క్యాంపులు నిర్వహిస్తున్నది. అది, తన ఇలాకా అయిన యు.పి.లో ఇటువంటి నాలుగో క్యాంప్‌ను నిర్వహించి, లక్నో నగరం నడిబొడ్డున గల మైదానంలో, జన సమ్మర్ధం ఎక్కువగా వున్న సమయంలో, ప్రజలంతా చూస్తుండగానే ఆయుధాల శిక్షణ ఇచ్చింది. ఈసారి ఎయిర్‌గన్‌లతోగాక, నిజమైన తుపాకులతోనే శిక్షణ ఇచ్చింది. ఇటువంటి కసాయి హంతకులు ప్రభుత్వ యంత్రాంగంతో కలసి క్రైస్తవులను, ముస్లింలను, దళితులను, కాశ్మీరీలను, ఈశాన్య జాతులను, విప్లవ కారులను ఊచకోత కోస్తున్న సమయంలో, ఈ విధంగా అహింస గురించి ఊదరగొట్టడం అంటే, ప్రజానీకాన్ని నిస్సహాయంగా ఫాసిస్టులకు ఎరవేయటమే అవుతుంది.

## 4. ప్రజల్లో రగబడ□ార్ర

గత ఎన్నికలలో బి.జె.పి. ఎలాంటి ఎన్నికల ప్రయోజనాలను పొందలేక పోవడమేగాక, దాని శ్రేణుల మధ్య వున్న తీవ్రమైన చీలికలు దాని పలుకుబడిని మరింతగా హరించి వేస్తున్నాయి. ఫాసిస్టులు తీవ్రమైన అసహనానికి పెట్టింది పేరు. అది వారి సొంత సంస్థల్లో కూడా ప్రతిఫలిస్తోంది. అంతేగాక, అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ ప్రయోజనాల కంటే వ్యక్తిగత ప్రయోజనాలను ముందుకు నెట్టి కాంగ్రెస్ సంస్కృతిలో నిండా మునిగి తేలుతున్నారు. అధికార కాంక్ష, ధనాశలో కాంగ్రెస్ బి.జె.పి.కి తేడా ఏమీ లేదనేది ప్రజలు తెలుసు కోవటం ప్రారంభించారు.

అంతేగాక, హిందూత్వ దాడికి వ్యతిరేకంగా ప్రజలు తమంతట తాము పోరాడుతున్నారు. పంజాబ్‌లో 'సుదర్శన్ గో బ్యాక్' అంటూ యువజనులు నినాదాలతో పెద్ద ఎత్తున ప్రజా ప్రదర్శన ద్వారా 'రాష్ట్రీయ సిక్కు సంఘట్'కు స్వాగతం పలకటంతో ఆర్.యస్.యస్. షాక్ తిన్నది. 'సంఘట్' కు వ్యతిరేకంగా ప్రచార, ఆందోళన కార్యక్రమాలు కొనసాగించే పథకంతో 19 సంస్థలతో కార్యాచరణ కమిటీ ఏర్పాటు చేయబడింది.

ఆర్.యస్.యస్. దోపిడీ విధానాల పట్ల గిరిజనులు కూడా ఉదాసీనంగా లేరు. బస్తర్‌లో మన పార్టీ నాయకత్వంలో తమ సంస్కృతి, ఆత్మగౌరవాల మీద ఆర్.యస్.యస్.కి చెందిన భక్తి పూజల దాడిని గిరిజనులు చురుగ్గా ప్రతిఘటిస్తున్నారు. ఇటువంటి పనికిమాలిన పద్ధతులతోనే గిరిజనులను విద్యావంతుల్ని చేయటం ద్వారా, క్రైస్తవానికి మార్పిటాన్ని కూడా వారు వ్యతిరేకిస్తున్నారు. ఝార్ఖండ్‌లో బెరోలో జరిగిన వి.హెచ్.పి. ప్రత్యేక సమావేశం దగ్గర ఏ.బి.ఏ.వి.పి. (అఖిల భారత ఆదివాసీ కిసాన్ వికాస్ పరిషత్) సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు ఆ సమావేశ స్థలం దగ్గరే ప్రదర్శన జరిపి, సభా కార్యక్రమాలు జరగకుండా చేసారు. గుజరాత్‌లోని డాంగ్స్‌లో ప్రస్తుత జనాభా లెక్కల సందర్భంలో గిరిజనులుగానే తమను నమోదు చేయించుకోవాలని హిందూత్వ ప్రచారం బారిన పడొద్దని విజ్ఞప్తి చేస్తూ, 'మేము వనవాసులం కాదు, ఆదివాసులం' అనే పేరుతో తీసిన కరపత్రం విస్తృతంగా ఆదివాసీలకు పంపిణీ చేయబడింది.

భారత చరిత్రను కాషాయీకరించటాన్ని, విద్యా సంస్థలపై సాంస్కృతిక స్వేచ్ఛపై హిందూత్వ దాడులను వ్యతిరేకిస్తూ, పట్టణ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యల్లో మేధావులు ముందుకొస్తున్నారు. దీనికితోడు, ఫాసిస్టుల ఘోరమైన దాడులను మరింత చురుగ్గా ప్రతిఘటించేందుకు మైనారిటీలు, దళితులు తమంతట తాము ఆర్గనైజ్ అవుతున్నారు.

కానీ ఇదే పూర్తిగా సరిపోదు. ఫాసిస్టులను చురుగ్గా తిప్పి కొట్టేందుకు పెద్ద ఎత్తున ప్రజాస్వామిక, విప్లవ శక్తులతో కూడిన ప్రజా ఉద్యమం అవసరం. ఈ ఉద్యమం ఫాసిస్టుల ఘోరాలను బట్టబయలు చేసే కార్యక్రమాలనే కాక, వారి చొరవను అడ్డగించి, వారి ఆత్మస్థైర్యాన్ని పూర్తిగా దెబ్బతీసి, వారి నాయకత్వానికి తలవంపులు తెచ్చేలా మిలిటెంట్ చర్యలు కూడా చేపట్టాల్సి వుంది. ఫాసిస్టుల్ని వాళ్ళ పద్ధతులతోనే తిప్పి కొట్టడం అవసరం. సాధారణ శ్రేణుల నుండి వారి ముఖ్య నాయకుల్ని వేరుచేసి వారి నేరాలకు గాను తీవ్రమైన శిక్షలకు గురి చేయాలి. ఫాసిస్టులతో బహిరంగంగానో, మోసంగానో చేతులు కలిపిన ప్రభుత్వం మీద కానీ, న్యాయ వ్యవస్థ, పోలీసుల మీద కానీ ఆధారపడటం నిష్ప్రయోజనం. ప్రజా కోర్టులో మాత్రమే న్యాయం దక్కుతుంది.

చివరగా, హిందూ మతోన్మాదం పెరగడానికి కారణమైన సామాజిక, ఆర్థిక కారణాల గురించి ప్రజలకు విడమర్చి చెప్పాలి. సామ్రాజ్యవాద, దళారీ కూటమితో వారికి గల సంబంధాలను ఎండగట్టాలి. ఆ విధంగా, వారిని వేరుపర్చి మరింత సమర్థంగా దెబ్బతీయడానికి విశాల ఐక్య సంఘటన ఏర్పాటవుతుంది. చిట్టచివర విశ్లేషణలో, దాని క్యాంపులోనే చీలిక ఏర్పడి, దాన్ని బలహీనపరచి నప్పటికీ ఫాసిస్టుల అభివృద్ధి లేక పతనాన్ని దానికి వ్యతిరేకంగా బలపడే ప్రజా ఉద్యమమే నిర్ణయిస్తుంది. ❑

# ఒక రెజిమెంటల పార్టీ కమిటీలో

***(కేంద్రీకృత ప్రజాస్వామ్యం మన పార్టీ నిర్మాణ సూత్రం. వేర్వేరు స్థాయిలలోని పార్టీ కమిటీలలో, వ్యక్తికి, సమిష్టికి మధ్య సంబంధాలతో సరైన తీరులో వ్యవహరించడం అనేది కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని అమలు చేయడానికి సంబంధించిన ఒక ముఖ్య సమస్య. అది పార్టీలో సమిష్టి నాయకత్వాన్ని పదిలపర్చుకోవడానికి ఒక ముఖ్య హామీ. విప్లవ చైనాలో, ప్రజావిముక్తి సైన్యానికి చెందిన ట్సినాన్ నగర యూనిట్ల రెజిమెంటల పార్టీ కమిటీలో, ఈ విషయంపై జరిగిన చర్చల, ఈ సమస్యను సిద్ధాంత పరంగానే కాక, ఆ యూనిట అనుభవం నుండి కూడా వివరిస్తాం. అందువల్ల 1971, అక్టోబరు 22 నాటి 'పెకింగ్ రివ్యూ' పత్రిక 43వ సంచికలో ప్రచురితమైన వ్యాసాన్ని 'క్రాంతి' పాఠకుల కోసం అందిస్తున్నాం.)***

కొద్దికాలం క్రితం, ట్సినాన్ నగరంలోని ప్రజావిముక్తి సైన్యం యూనిట్లకు చెందిన ఒక రెజిమెంటల్ పార్టీ కమిటీలోని స్థాయీ సంఘం (స్టాండింగ్ కమిటీ) సమిష్టి అధ్యయనాన్ని చేపట్టి, రెజిమెంటల్ క్యాడర్ల సిద్ధాంత వెలుగులో ఒక నిర్ణయాన్ని చేసింది. అయితే, ఆ కమిటీ కార్యదర్శి అపుడు వేరే సమావేశంలో పాల్గొంటున్నందువల్ల ఈ సమావేశంలో పాల్గొనలేక పోయాడు. అందుచేత పై నిర్ణయాన్ని ఆయన ఆమోదం కోసం పంపించారు. అతడికి ఆ నిర్ణయం ఆమోదయోగ్యంగా తోచలేదు, దాన్ని ఆయన నిలుపు చేసి వుంచాడు. కమిటీ సభ్యులు కార్యదర్శి యొక్క ఈ చర్యను మొత్తంమీద ఆమోదించలేదు గానీ, అంతిమ నిర్ణయాన్ని చేయవలసింది పార్టీ కార్యదర్శి కనుక, ఈ విషయంలో తాము చేయగలిగింది ఏమీ లేదనీ, ఆయన నిర్ణయాన్ని ఆమోదించక తప్పదని వారు భావించారు.

కొంత కాలం తర్వాత, ఆ పార్టీ కమిటీ కేంద్రీకృత ప్రజాస్వామ్య సమస్యను అధ్యయనం చేస్తున్నప్పుడు ఒక సభ్యుడు పై విషయాన్ని లేవనెత్తాడు. దానిపై చర్చ జరిగింది. కార్యదర్శి కేవలం తన వ్యక్తిగత అభిప్రాయంతోనే సమిష్టి నిర్ణయాన్ని తోసిపుచ్చకూడదనీ, తద్వారా అతడు తప్పు చేశాడనీ కొందరు కామ్రేడ్లు మాట్లాడారు. కాగా, కార్యదర్శి అభిప్రాయం నిర్ణయాత్మకమైనదని, స్థాయి సంఘం నిర్ణయం అతడికి ఆమోదయోగ్యంగా తోచలేదు కాబట్టి, అతడు దాన్ని నిలుపుచేసి వుంచాడనీ, అది సరైన చర్యేనని మరికొందరు మాట్లాడారు. ఇక ఆపై కార్యదర్శి, కమిటీ సభ్యులు ఈ సమస్యను దృష్టిలో వుంచుకుంటూ దానిపై ఛైర్మన్ మావో రచనలను అధ్యయనం చేసి, అనుభవం, ఆచరణ నుండి తీసుకున్న గుణపాఠాల వెలుగులో దాన్ని విశ్లేషించారు.

## కార్యదర్శి తన స్వంత అభిప్రాయాన్ని ఏ దృష్టితో చూడాలి?

స్థాయి సంఘం నిర్ణయం సరిగానే వున్నప్పటికీ, దాన్ని అప్పుడే క్రింది స్థాయిల వరకు పంపితే, అది ఇతర పనులకు ఆటంకం కలగజేస్తుంది. అందువల్ల, దాన్ని పంపడానికి అది సరైన సమయం కాదు కనుక దాన్ని నిలుపుచేసి వుంచాలనే తన అభిప్రాయం సరైనదేనని చర్చ మొదట్లో కార్యదర్శి భావించాడు. పార్టీ కమిటీ కార్యదర్శిగా దాన్ని నిలుపుచేసి వుంచే బాధ్యత తనకుందని భావించాడు.

తప్పుడిదిగా వున్న దాన్ని ఆమోదించకుండా వుండే బాధ్యత కార్యదర్శికి వుంది. అయితే, అతడు పార్టీ కమిటీలో ఆ విషయాన్ని చర్చించకుండా వ్యక్తిగతంగా మెజారిటీ నిర్ణయాన్ని తోసిపుచ్చవచ్చా? ఈ అంశాన్ని విశ్లేషించి, చర్చించిన తర్వాత వారు ఒక ఏకాభిప్రాయానికి వచ్చారు. ఒక పార్టీ కమిటీలో, కార్యదర్శి ప్రధాన బాధ్యతలు గల సభ్యుడు. ఆయన 'సింహద్వారాన్ని' మావో ఆలోచనా విధానంతో సరరక్షించాలి. అయితే సింహద్వార పరిరక్షణను, కేంద్రీకృత ప్రజాస్వామ్య ఆచరణను ఏకీకృతం చేయాల్సి వుంటుంది. ***''కార్యదర్శికి కమిటీ సభ్యులకు మధ్య సంబంధం, మైనారిటీ, మెజారిటీకి తప్పనిసరిగా కట్టుబడి వుండాల్సిన సంబంధమే.''*** సింహద్వారాన్ని పరిరక్షించే బాధ్యత తనకున్నదన్న సాకుతో కార్యదర్శి పార్టీ కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాన్ని ఉల్లంఘించకూడదు. మెజారిటీ నిర్ణయాన్ని తోసిపుచ్చకూడదు. ఆయన కృత నిశ్చయంతో కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని అమలు చేయాలి. పార్టీ సమిష్టి నాయకత్వాన్ని పదిలపర్చాలి, సింహద్వార పరిరక్షణకు కేవలం తనపైనే ఆధారపడడం కాక, తన 'దళ సభ్యులపై' ఆధారపడాలి.

కొందరు కామ్రేడ్లు గతంలో జరిగిన ఒక ఘటనను గుర్తు చేశారు. మొదటి కంపెనీ సైనిక విన్యాసాలను చేపట్టాలని రెజిమెంట్ గత సంవత్సరం చివర్లో ఒక నిర్ణయం చేసింది. ఆ కర్తవ్యాన్ని చేపట్టిన మొదటి కంపెనీ అందుకై ఒక వివరమైన పథకాన్ని రూపొందించి ఆమోదం కోసం పార్టీ కమిటీకి పంపింది. ఆ పథకం బాగుందని, దాన్ని అమలు చేయవచ్చునని స్థాయి సంఘంలోని పలువురు సభ్యులు భావించారు. కాగా, ఆ పథకం రాజకీయ, సిద్ధాంత బోధన పట్ల తగుమాత్రంలో దృష్టి పెట్టలేదనీ, దాని మూలంగా దాని మార్గదర్శక సిద్ధాంతం అంత సవ్యంగా లేదని కార్యదర్శి అభిప్రాయపడ్డాడు. ఈసారి ఆయన ఇతర కామ్రేడ్ల అభిప్రాయాలను ఒక్క బిగిన తిరస్కరించే పద్ధతిని చేపట్టక, ఈ రెండు రకాల అభిప్రాయాలను స్థాయి సంఘం అధ్యయనం చేయాలని ప్రతిపాదించారు. విషయాన్ని పూర్తిగా చర్చించిన తర్వాత వారందరూ కార్యదర్శి అభిప్రాయంతో ఏకీభవించారు. తర్ఫీదు పథకాన్ని సరిదిద్దారు. పైగా ఆ పనిలో సాయపడడానికై ఆ కంపెనీకి ఒక క్యాడరును కూడా పంపారు. మొదటి కంపెనీ, ఛైర్మన్ మావో బోధనలను చైతన్యపూర్వకంగా అమలుచేస్తూ తన తర్ఫీదు కర్తవ్యాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుంది. స్థాయి సంఘంలోని కొందరి పొరపాటు అభిప్రాయాలను అధిగమించడానికై కార్యదర్శి తన సరైన అభిప్రాయాలను ఉపయోగించి ఈ సమస్యపై తన 'దళ సభ్యుల' అవగాహనను పెంచాడనీ, అపుడు అందరు కమిటీ సభ్యులు కార్యదర్శిని మెచ్చుకున్నారు. కార్యదర్శి ఒక పక్క సింహద్వారాన్ని చాలా బాగా పరిరక్షించాడు, వేరొక వంక కేంద్రీకృత ప్రజాస్వామ్యమూ ఆచరించబడింది.

అపుడు ఒక సభ్యుడు ఇలా అన్నాడు. సరైన అభిప్రాయాలను కేంద్రీకరించడమే కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని ఆచరించడం యొక్క

# కేంద్రీకృత ప్రజాస్వామ్యంపై చర్చ

ధ్యేయం. కార్యదర్శి అభిప్రాయం సరైనది అయినప్పుడు అతడు మెజారిటీ అభిప్రాయాలను తోసిపుచ్చవచ్చా? ఆపై వారు ఈ సమస్యను శ్రద్ధగా విశ్లేషించారు, అలా తోసి పుచ్చకూడదనే ఏకాభిప్రాయానికి వచ్చారు. అందుకు కారణం ఏమిటంటే: మొదటిది, ''మైనారిటీ, మెజారిటీకి తప్పనిసరిగా కట్టుబడి వుండాలి'' అనేది కేంద్రీకృత ప్రజాస్వామ్య మౌలిక సూత్రాలలో ఒకటి. కార్యదర్శి అభిప్రాయం సరైంది అయి వుండి, అత్యధిక సభ్యుల అభిప్రాయం తప్పుడిదిగా అయివున్నప్పుడు కూడా అతడు తనకు తానుగా వారి అభిప్రాయాలను తోసిపుచ్చకూడదు. అందుకు మారుగా అతడు వారికి అర్థం చేయించడం ద్వారానే తన అభిప్రాయాన్ని వారు ఆమోదించేటట్లు చేయాలి. రెండవది; తన స్వంత అభిప్రాయాన్ని సరైనదేనని కార్యదర్శి భావించవచ్చుగాక, అయితే అది సరైనదా కాదా అనేది పార్టీ కమిటీలోని అందరు సభ్యుల అంచనాపై ఆధారపడి వుంటుంది. కార్యదర్శి ఇతరుల అభిప్రాయాలను వినయంతో చెవికెక్కించు కోకపోవడం వల్లనో లేదా సరైన అభిప్రాయాలను కేంద్రీకరించడంలో అతడికి నైపుణ్యం కొరవడడం వల్లనో, కొన్ని సందర్భాలలో అతడి అభిప్రాయాలు అసంపూర్ణమైనవిగానో లేదా అంత సజావుగా వుండనివిగానో లేదా చివరికి, తప్పు అభిప్రాయాలుగానో కూడా తేలవచ్చునని ఆచరణ తెలియ జెబుతోంది. ఆయన అత్యధిక సభ్యుల అభిప్రాయాలను ఒక్క వూపుతో కొట్టిపారేస్తే, తప్పుడు అభిప్రాయంతో, సరైన అభిప్రాయాలను కొట్టిపారేసే ప్రమాదం కూడా వుండగలదు.

### సభ్యుల, కార్యదర్శి అభిప్రాయాలను ఎలా స్వీకరించాల్సి వుంటుంది?

చర్చ ఇంకా లోతుగా వెళ్లసాగింది. అపుడు కొందరు కామ్రేడ్స్ మరో ప్రశ్న లేవనెత్తారు. సమిష్టి నిర్ణయాన్ని నిలుపుచేసి వుంచి కార్యదర్శి మంచి పని చేయలేదని భావించాం గదా, అప్పుడు ఏ ఒక్కరు కూడా సకాలంలో అందుకు అభ్యంతరం ఎందుకు తెలియజేయలేదు. పార్టీ కమిటీ పనికి ప్రధాన బాధ్యత కార్యదర్శిదేనని, అతడి అభిప్రాయాలే నిర్ణయాత్మకమైనవని వారు భావించబట్టి అలా చేశారు. అతడు అంతిమ నిర్ణయం చేయడం సహజమే కదా. అందుచేత వారికి భిన్నాభిప్రాయం వున్నప్పటికీ కార్యదర్శి పట్ల గౌరవాన్ని చూపి, అతడికి దన్నుగా నిలవడానికి మార్గం ఇదేనని భావిస్తూ వారు తమ అభ్యంతరాన్ని వెలిబుచ్చలేదు.

కార్యదర్శి అభిప్రాయాలపట్ల సరైన వైఖరి ఎలా వుండాలి? ఈ సమస్యను వారు విశ్లేషించారు. సభ్యులు కార్యదర్శిని గౌరవించాలని, అతడికి దన్నుగా నిలవాలని వారు ఏకాభిప్రాయానికి వచ్చారు. అది లోపిస్తే, పార్టీ కమిటీ ఒక బలమైన నాయకత్వ కేంద్రంగా (న్యూక్లియస్) వుండజాలదు. మరోవైపున కమిటీ సభ్యులూ, కార్యదర్శి కూడా అన్నింటికన్నా ముందుగా పార్టీ కమిటీ సమిష్టి నాయకత్వాన్ని గౌరవించాలి. దానికి దన్నుగా నిలవాలి. ఇది లోపిస్తే, అపుడు సమిష్టి నాయకత్వం కార్యదర్శి వ్యక్తిగత నాయకత్వంగా తయారవవచ్చు. ఆ విధంగా పార్టీ కమిటీ సమిష్టి నాయకత్వ సూత్రాన్ని పదిలంగా నిలబెట్టి వుంచడానికి దూరమైపోవడం జరుగుతుంది. ఇక కార్యదర్శికి ఏ నిజమైన గౌరవంగానీ, మద్దత్తుగానీ వుండవు. దాని ఫలితం, పార్టీ యొక్క కేంద్రీకృత ప్రజాస్వామ్య అతిక్రమణ మరియు పార్టీ సమిష్టి నాయకత్వాన్ని బలహీనపర్చడం మాత్రమే కాగలదు. వారు కార్యదర్శికి దన్నుగా నిలిచి, గౌరవాన్ని ఇవ్వాలి, అదే సమయంలో పార్టీ సమిష్టి నాయకత్వాన్ని పదిల పర్చుకోవాలి.

మొత్తం పార్టీ కమిటీని బాగా ఆలోచింపజేసిన ఘటన ఒకటి వుండింది. గత శీతాకాలంలో, తర్ఫీదులో భాగంగా మాటుదాడి (ఆంబుష్)లో శిక్షణ ఇవ్వాలని కమిటీ యోచించింది. ఈ పథకాన్ని రూపొందిస్తున్న క్రమంలో, కమిటీలోని అధిక కామ్రేడ్లు, రాత్రిపూట జరిపే మాటుదాడి అభ్యాసాల్లో తమ గత అనుభవాలపై ఆధారపడుతూ సేనలు ఫీల్డుకు చేరువలో గల ఒక రహదారి వద్ద మాటు దాడి జరపాలని సూచించారు. ఎంత దగ్గర నుండి దాడి జరపగలిగితే అంతమంచిదనీ, ఏమంటే అలా చేయడం ద్వారా సన్నిహిత ముఖాముఖి పోరాటం నడపడంలో తర్ఫీదును అందించ వచ్చునని వారు భావించారు. కార్యదర్శి, ఉప కార్యదర్శులు ఇరువురు ఈ సూచన బాగుందని భావించారు, తదనుగుణంగా ఒక పథకాన్ని రూపొందించాలని నిర్ణయించారు.

అయితే, ఆ పథక రచన దాదాపు పూర్తి కాబోతున్న తరుణంలో, ఒక సభ్యుడు దాన్ని శ్రద్ధగా పరిశీలించిన పిదప ఒక అభ్యంతరాన్ని లేవనెత్తాడు. మాటుకాసి సరైన తీరులో దాడి చేయాలంటే సేనలు సరైన 'కవర్లు' తీసుకోవాల్సి వుంటుంది. గతంలో అభ్యాసాలు రాత్రివేళల్లో జరిగాయి కాబట్టి, చిమ్మ చీకటిలో 'కవరు' చూసుకోవడం తేలికే. అందువల్ల శత్రువుకు అతి దగ్గరలోనే వారు మాటుకాయగల్గేవారు. అయితే, ఈసారి సేనలు రాత్రిపూటే ఫీల్డులో ప్రవేశించినప్పటికీ, మాటుదాడి మాత్రం పగటిపూటే చేయాల్సి వుంటుంది. వారు దాడి చేసినప్పుడు పట్టపగలు కాబట్టి అంతా బాగా కానవస్తుంది. వారు రహదారికి ఎంత దగ్గరగావుంటే, వారు అంత తేలిగ్గా పసిగట్టబడతారు. అందువల్ల సేనలు ఈ మాటుదాడిద్వారా తమ లక్ష్యాన్ని సాధించలేవు. తన అభిప్రాయాన్ని, ఇంతకు ముందటి అభిప్రాయాన్ని పార్టీ కమిటీలో తిరిగి చర్చించాలని ఆ సభ్యుడు సూచించాడు. కార్యదర్శి ఉప కార్యదర్శి ఇద్దరూ ఈ సభ్యుడి అభిప్రాయాన్ని శ్రద్ధగా పరిగణనలోకి తీసుకొని, తిరిగి చర్చ జరపడానికై కమిటీ సమావేశం జరిపారు. ఆ సభ్యుడి అభిప్రాయమే సరైనదని వారందరూ అంగీకరించారు. తదనుగుణంగా పథకాన్ని సవరించారు. అభ్యాసాలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఆ కమిటీ సభ్యుడు పార్టీ కార్యదర్శికి దన్నుగా నిలబడడమూ, సమిష్టి నాయకత్వాన్ని పదిలపర్చుకోవడమూ అనే ఈ రెంటిని జోడించాలని వారికి ఈ ఘటన ద్వారా అర్థమయింది. ఈ సూత్రం నుండి వారికి వైదొలగితే అది పార్టీ ఆశయంపట్ల బాధ్యతాయుతమైన వైఖరి అవదు, కార్యదర్శిపట్ల ఏ నిజమైన గౌరవాన్ని చూపడంగానీ, అతడికి ఏ నిజమైన అండదండలను అందించడంగానీ వుండదు.

## కార్యదర్శి అభిప్రాయాలు, కమిటీలోని మెజారిటీ సభ్యుల అభిప్రాయాలుగా ఎలా మారగలవు?

కొందరు కామ్రేడ్లు ఆపైన మరో ప్రశ్న వేశారు. కార్యదర్శికి, కమిటీ సభ్యులకు మధ్య సంబంధం, మైనారిటీ, మెజారిటీకి తప్పనిసరిగా కట్టుబడి వుండాల్సిన సంబంధమని మనకు తెలుసు, అయితే ఆచరణాత్మక కృషిలో అప్పుడప్పుడు దీన్ని సాధించలేక పోతున్నాం. ఎందువల్ల?

ఈ నిర్దిష్ట సమస్యను దృష్టిలో వుంచుకుంటూ వారు ***''ఒక కార్యదర్శిగాని, ఉపకార్యదర్శిగానీ, తన స్వంత దళసభ్యుల నడుమ ప్రచార కృషిని, నిర్మాణ కృషిని నిర్వహించడంపై శ్రద్ధ పెట్టకపోతే, కమిటీ సభ్యులతో తన సంబంధాలను సజావుగా నిర్వహించు కోలేకపోతే, సమావేశాలను ఎలా విజయవంతంగా నిర్వహించాలి అనే విషయాన్ని అధ్యయనం చేయకపోతే, అతడికి తన 'దళానికి' మార్గదర్శకత్వాన్ని అందివ్వడం కష్టమవవచ్చు''*** అనే ఛైర్మన్ మావో బోధనను అధ్యయనం చేశారు. ఆ అధ్యయనం ద్వారా వారు ఈ సాధారణ భావనను స్పష్టంగా అర్థం చేసుకోగలిగారు. ఒక పార్టీ కమిటీ సమావేశంలో, కార్యదర్శి కొన్నిసార్లు మైనారిటీలో వుండవచ్చు, అయితే కమిటీ సభ్యుల నడుమ కృషిచేసి మెజారిటీని సంపాదించు కోవచ్చు. ఇది పూర్తిగా సహజమైన విషయమే. ఇది కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రానికి అనుగుణ్యమైనదే. అలాంటి కృషి చేయకపోతే, పార్టీ కమిటీలో అవగాహనా ఐక్యతను సాధించజాలం. 'దళసభ్యులు' కదం కదం కలిపి నడవలేరు. కేంద్రీకృత ప్రజాస్వామ్యం నెలకొనదు. ఇక ఈ కమిటీ సభ్యులు, గత సంవత్సరం ఆదర్శ కంపెనీని ఎన్నిక చేసే క్రమంలో నాలుగవ కంపెనీ సమస్య విషయంలో పార్టీ కమిటీ ఎలా వ్యవహరించిందో ఒకసారి గుర్తుకు తెచ్చుకుని, ఆ సందర్భంలో పార్టీ కార్యదర్శి రెండు మాట్లు జరిపిన కృషిని నిర్దిష్టంగా విశ్లేషించారు.

నాలుగవ కంపెనీ తొమ్మిదేళ్లు వరసగా ఆదర్శ కంపెనీగా నిలిచింది. అయితే, 10వ సంవత్సరంలో దానిలో అహంకారం, ఆత్మ సంతృప్తి అప్పుడప్పుడు చోటు చేసుకోసాగాయి, తన యోధుల నడుమ సిద్ధాంత రాజకీయ బోధనను నిర్వహించే కృషిని అది సడలించింది, దాని పనిలో కొన్ని సమస్యలు తలెత్తాయి. అందువల్ల ఆ కంపెనీని ఆదర్శ కంపెనీగా గుర్తించడానికి కమిటీ సభ్యుల్లో అత్యధికులు మొదట్లో అంగీకరించలేదు. అయితే నాలుగవ కంపెనీ చాలా ఏళ్లుగా ఆదర్శ కంపెనీగా గుర్తింపు పొందుతూ వస్తోందని, ఆ ఏడు దాన్ని అదే విధంగా గుర్తించడంలో విఫలమైతే, ఆ కంపెనీ, అందరికీ అప్రతిష్ఠ కొనితేలగదని దాన్ని గురించి తమ పై స్థాయి వాళ్లకు వివరించడం తమకు కష్టం కాగలదని కార్యదర్శి, ఉపకార్యదర్శి భావించారు. అందువల్ల వారు కమిటీ సభ్యుల అభిప్రాయాలను గురించి శ్రద్ధగా ఆలోచించకపోగా తమ మాటే చెల్లాలని పట్టుబట్టారు. వారు తొలుత తమ అభిప్రాయాలను ఆమోదించమని స్థాయీ సంఘం సభ్యులకు నచ్చజెప్పారు. కమిటీలోని ఇతర సభ్యులు కూడా ఆమోదించేలా చేయడానికై వారికి నచ్చజెప్పమని స్థాయి సంఘ సభ్యులను వారు కోరారు. అయితే, కమిటీ సభ్యుల్లో అత్యధికులకు మనస్సుల్లో అసంతృప్తి వున్నప్పటికీ వారు సూత్రాన్ని గాలికొదిలేసి, తాము గనుక కార్యదర్శి, ఉపకార్యదర్శుల అభిప్రాయాన్ని ఆమోదించకపోతే, అది మొత్తం పని అంతటిపైనా చెడు ప్రభావాన్ని చూపించగలదనే భయంతో వారి అభిప్రాయాన్ని అయిష్టంగానే ఆమోదించారు. అయితే, పై స్థాయి పార్టీ కమిటీ, ప్రజారాశులు వెలిబుచ్చిన అభిప్రాయాలను, నాల్గవ కంపెనీ వాస్తవ పరిస్థితులను దృష్టిలో వుంచుకొని, క్రింది కమిటీ యొక్క ఈ తీర్మానాన్ని తోసిపుచ్చింది. అది ఆ కమిటీ సభ్యులను ఎంతగానో కలవరపరచింది.

పైస్థాయి పార్టీ కమిటీ ఆదేశాన్ని ఎలా అమలు చేయాలనే సమస్యను చర్చించడానికి జరిగిన పార్టీ కమిటీ సమావేశంలో అంతకుముందు భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేసిన కామ్రేడ్లు ఫిర్యాదులు చేయగా, ఆ కంపెనీని ఆదర్శ కంపెనీగా పేర్కొనాలని భావించిన కామ్రేడ్లు తమ అభిప్రాయాలను వెంటనే మార్చుకోలేక పోయారు. ఛైర్మన్ మావో బోధనలను తిరిగి అధ్యయనం చేశారు. ఇక అప్పుడు కార్యదర్శి తన బుర్రలో నెలకొనివున్న స్వార్థభావాల గురించి, నాలుగవ కంపెనీని 'సమర్థించాలి' అనే తన తప్పుడు మార్గదర్శక అభిప్రాయం గురించి ఆత్మవిమర్శ చేసుకున్నాడు. ఆపైన ఆయన భిన్నాభిప్రాయాలను వెలిబుచ్చిన కామ్రేడ్లతో హృదయం విప్పి మాట్లాడాడు. ఆయన మొదట, వారు తనపై చేసిన విమర్శలను విన్నాడు, వారి అభిప్రాయాలే సరైనవని నొక్కిచెబుతూ ఆయన, తన మనసులోని బాధల్ని అధిగమించమని వారికి ప్రోత్సాహమిచ్చాడు. ఇక ఆపైన, నాలుగవ కంపెనీని మెచ్చుకోవాలని భావించిన వారు, తమ అభిప్రాయాలను మార్చుకోవడంలో వారికి సాయపడ్డాడు. ఆ విధంగా ఆయన తన 'దళసభ్యుల' ఆలోచనలను త్వరితంగా ఏకీకృతం చేశాడు.

కమిటీ సభ్యులు, కార్యదర్శి ఇలా రెండు దఫాలుగా నిర్వహించిన కృషిని పోల్చి చూసిన తర్వాత ఆ ఫలితాలు పూర్తిగా భిన్నంగా వున్నాయనీ భావించారు. ఆయన మొదట, ఇతరులు తన అభిప్రాయాలతో ఏకీభవించాలని కోరుకున్నాడు. దాని ఫలితంగా ఆయన, అభిప్రాయాలను తప్పుడు తీరులో ఏకీకృతం చేసాడు. అటువంటి పని పద్ధతి అంతస్సారంలో ఒక వ్యక్తి ఏది చెబితే అదే చెల్లే పద్ధతికి మారు రూపమే. ఆయన రెండవసారి అనుసరించిన పద్ధతి 'భిన్నాభిప్రాయాలను శ్రద్ధగా వినడం, సంక్లిష్ట పరిస్థితులను, భిన్నాభిప్రాయాలను శ్రద్ధగా విశ్లేషించడం' అనే పని పద్ధతే. ఈ విధంగా ఆయన, ఆయన దళ సభ్యులు ఇరువురు ఎడ్యుకేట్ అయ్యారు. తద్వారా ఆయన తన అభిప్రాయాల సరైన కేంద్రీకరణ, ఏకీకరణను సాధించగల్గాడు.

## కార్యదర్శి సమీక్ష

కార్యదర్శి, కమిటీ సభ్యులు కూడా ఈ చర్చల ద్వారా పార్టీ యొక్క కేంద్రీకృత ప్రజాస్వామ్య భావనపై లోతైన అవగాహన పొందగల్గారు. ఇక అంతిమంగా కార్యదర్శి ఈ విషయం మొత్తాన్ని సమీక్షించాడు. ఆయన ఇలా అన్నాడు: ప్రస్తుత చర్చ నిర్దిష్ట సమస్యలపై సాగినప్పటికీ, అది ఒక కేంద్ర విషయం, అంటే కమిటీ సభ్యుల నడుమ సంబంధాన్ని, వ్యక్తికి, సమిష్టికి మధ్య సంబంధాన్ని సరైన స్థానంలో ఎలా వుంచాలి అనే విషయాన్ని కేంద్రంగా చేసుకుని నడిచింది. కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని సంతృప్తికరమైన తీరులో

(తరువాయి 13వ పేజీలో...)

# శత్రు నిర్బంధాన్ని గేలిచేస్తూ, ప్రజల మనోధైర్యాన్ని పెంచుతూ విజయవంతంగా జరిగిన అమరుల సంస్మరణ సభలు

జూలై 28 నుండి ఆగస్టు మొదటి వారం వరకు రాష్ట్ర వ్యాప్తంగా అమరుల సంస్మరణ సభలు తీవ్ర నిర్బంధం మధ్యనే విజయవంతంగా జరిగి ప్రజల్ని ఎంతగానో ఉత్తేజ పరిచాయి. ప్రత్యేకించి, మన ప్రియతమ నాయకులు, కేంద్రకమిటీ సభ్యులు కా॥ శ్యామ్, మహేష్, మురళీలను కోవర్ట్ ఆపరేషన్‌లో చంపడమేగాక, చంద్రబాబు, బి.జె.పి. ప్రభుత్వాలు 'లో ఇంటెన్సిటీ వార్‌ఫేర్' పద్ధతిలో మన ఉద్యమంపై ముప్పేట దాడిచేస్తూ, దేశ వ్యాప్తంగా పార్టీని నిషేధించటానికి కుట్రలు పన్నుతూ, సంయుక్త కమాండ్‌ను ఏర్పాటు చేసి తీవ్ర నిర్బంధం అమలు చేస్తున్నాయి. ప్రపంచబ్యాంక్‌కు పెంపుడుకుక్కగా మారిన చంద్రబాబు, 'జాతీయతా' నినాదం ముసుగులో దేశాన్ని సామ్రాజ్యవాదులకు ధారాదత్తం చేస్తున్న వాజ్‌పేయి ఎన్.డి.ఏ. ప్రభుత్వాలు దేశ వ్యాప్తంగా నిర్బంధాన్ని తీవ్రతరం చేస్తున్నాయి. ఇక రాష్ట్రంలో అయితే చెప్పనే లేదు. నియంతలను మరిపించే పాలన చేస్తున్న చంద్రబాబు సర్కార్ ఇన్‌ఫార్మర్ల నెట్‌వర్క్‌ను పెంచుకొని, కోవర్టు కుట్రలు చేస్తూ, దళం ఆచూకీ ఏ మాత్రం అర్థమైనా పెద్ద ఎత్తున, హుటాహుటిన దాడిచేసేలా కమ్యూనికేషన్స్ మొదలు రహదార్లు, వాహనాలు, ఆధునిక ఆయుధాలు హంతక గ్రేహౌండ్స్, యస్.టి.యఫ్. పోలీసులకు సమకూర్చి ఒక ప్రక్క దాడులు కొనసాగిస్తూ, మరో ప్రక్క కౌన్సిలింగ్ పేరుతో పార్టీ పూర్తికాలం కార్యకర్తల, సంఘ నాయకుల కుటుంబాలను బెదిరించి లొంగిపొమ్మని స్టేట్‌మెంట్లు ఇప్పిస్తూ, తీవ్ర నిర్బంధాన్ని అమలు చేస్తున్నది. ఈ నేపథ్యంలో, జూలై 28 నుండి అమరుల సంస్మరణ వారం మన పార్టీ ప్రతి ఏడూ జరుపుతున్న విషయం శత్రువుకూ తెలుసు కాబట్టి, అమరుల సంస్మరణ సభలు జరగనీయకుండా చేయడానికి, ఆ సందర్భాన్ని అవకాశంగా తీసుకుని, దళాల ఆచూకీ తెలుసుకొని దెబ్బతీయటానికి ప్రయత్నంలో వుండగా, మరోప్రక్క వాడి ప్రయత్నాన్ని తిప్పికొడ్తూ, ఏరియాల్లో వున్న మేరకు దళాలు సంస్మరణ వారం నిర్వహించినాయి. అలా దక్షిణ తెలంగాణాలో జరిగిన సంస్మరణ సభల రిపోర్టు ఇక్కడ ఇస్తున్నాం.


జూలై 31న గిరాయిపల్లి దళం ఆధ్వర్యంలో జరిగిన సంస్మరణ సభ

## మెదకజిల్లా

జూలై 28 నుండి ఆగస్టు 3 వరకు అమరవీరుల సంస్మరణ వారాన్ని విజయవంతం చేయటానికి గిరాయిపల్లి స్క్వాడ్ ఏరియా కమిటీ బ్యానర్లు, కరపత్రాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేసింది. ఎర్రవల్లి, పల్లిపహాడ్, మంగోల్, సింగాటం, పిడిచెడ్, అహ్మదీపూర్, కాల్గూరు, ఏటిగడ్డ కిష్టాపూర్, వేములఘాట్, గిరాయిపల్లి, కొండపాక, సిల్పినగండ్ల, మర్పడ, ఖమ్మంపల్లి, దుద్దెడ, ఐనాపూర్, తపస్‌పల్లి, గురువన్నపేట, జంగారెడ్డిపల్లి, తీగుల్ నర్సాపూర్, చాట్లపల్లి, మాందాపూర్, మునిగడ్ప, నాగాపూర్, కొండాపూర్, బజ్జెగూడెం, తిమ్మాపూర్, కొనకండ్ల, బూర్గుపల్లి, బుస్సాపూర్, తొర్నాల, గుడికందుల, ఇర్కోడు, ఘనాపూర్ గ్రామాలలో, మరియు గజ్వేల్, సిద్ధిపేట, జగదల్‌పూర్, దుబ్బాక టౌన్‌లలో బ్యానర్లు కట్టారు. ఏరియాలో మొత్తం 110 గ్రామాలలో కరపత్రాలు పంచారు.

గిరాయిపల్లి ఏరియాలోని ఒక అటవీ ప్రదేశంలో, అమరవీరుల కుటుంబాలను, యాక్టివిస్టులను, మిలిటెంట్లను సమావేశపరచి, జూలై 31న సంస్మరణ సభ జరిపారు. ఆ ప్రదేశం మొత్తాన్ని ఎర్రటి తోరణాలు, బ్యానర్లతో అలంకరించి, అమరుల స్థూపం ఏర్పాటు చేయటంతో, ఒక విప్లవ వాతావరణం నెలకొంది.

సీతారాంపల్లి అమరుడు కా॥ లచ్చన్న తండ్రి (కాల్గూరు గ్రామం) ఎర్రజెండాను ఆవిష్కరించగా, చిన్న చింతకుంట అమరురాలు కా॥ ఇందిర (చెల్లాపూర్ గ్రామం) తల్లి స్థూపావిష్కరణ చేసింది. కా॥ లచ్చన్న తండ్రి మాట్లాడుతూ 'నా కొడుకు ప్రజల కోసం మరణించాడు. మాకున్నా లేకున్నా ప్రజల్లో నిలిచిపోయాడని' అన్నాడు. కా॥ ఇందిర తల్లి మాట్లాడుతూ, 'తాము అభ్యంతర పెట్టినా ఆగకుండా, పార్టీలోకి వచ్చిందని, పేద ప్రజల కోసం పోరాడుతూ చనిపోయిందని, చిన్న చింతకుంటలో అమరులైన వారి ఆశయాలను కొనసాగించాలని, ఎన్‌కౌంటర్‌కు కారకులైన హంతకులను శిక్షించాలని' పార్టీని కోరింది.

పెద్దగుండవెల్లి అమరుడు కా॥ లక్ష్మీనారాయణ తల్లి మాట్లాడుతూ, 'నాకొడుకును పోలీసులు చంపిన తర్వాత, అప్పుడు రవాణా మంత్రిగా వున్న చంద్రశేఖర్ దగ్గరకు నాలుగైదు సార్లు వెళ్ళినా కనీసం పట్టించుకోలేదని చెప్పింది. నా కొడుకు గ్రామంలో ఎలాంటి అన్యాయం చేయలేదని, అన్యాయం చేస్తున్న వాళ్ళని నిలేస్తున్నందుకే ఇన్‌ఫార్మర్ల ద్వారా

పోలీసులు పట్టుకెళ్ళి కాల్చి చంపారని' అన్నది. చివరగా 'నా కొడుకు పార్టీ కోసం ప్రాణమిచ్చాడని మరి మీరు నాకేమిస్తారని' ప్రశ్నిస్తూ, 'మీరు నిరంతరం జాగ్రత్తగా వుండాలని' సూచించింది.

దళ సభ్యురాలు కా॥ సావిత్రి మాట్లాడుతూ తల్లులు 9 నెలలు మోసి, కని పెంచి ప్రజల కోసం తమ బిడ్డలను అప్పగించారని అన్నది. దళ సభ్యురాలు కా॥ రమ అమరవీరుల ఆశయాలను కొనసాగించాలని చెప్పింది.

కా॥ వెంకన్న, అమరవీరుల కుటుంబాలను ఉద్దేశించి మాట్లాడుతూ 'మీ కొడుకులు, బిడ్డలు లేకున్నా మీకు పార్టీ వుంది. మిమ్మల్ని పట్టించుకుంటుంది. రేపటి రాజ్యం కోసం పోరాడుతున్న వాళ్ళను మీ బిడ్డలుగా చూసుకోవాలని కోరాడు.

దళ కమాండర్ కా॥ రవి మాట్లాడుతూ, నా కొడుకు పార్టీ కోసం పనిచేసి ప్రాణమిచ్చాడు, మరి మీరేమిస్తారు అనే ప్రశ్నకు సమాధానంగా, మాకు వున్నతమైన ఆస్తి ప్రాణమని, దాన్ని ప్రజల కోసం ధారపోస్తామని చెప్పాడు. వీరులను బలిగొన్న రాజ్యంమీద రాజీలేని పోరాటం చేయాలనీ పిలుపిచ్చాడు.

కా॥ ప్రసన్న (ఆర్.యస్.యు.) అధ్యక్షత వహించిన ఈ సభలో ఇంకా, కా॥ మధు (మిలిటెంట్), కా॥ కుమార్, కా॥ అమీరుద్దీన్ (వి.కా.స.), కా॥ మధు (ఆర్.యస్.యు.), కా॥ కుమారి (శాక్) కూడా మాట్లాడారు. ఈ సంస్మరణ సభ సందర్భంగా అమరుల కుటుంబాలకు బట్టలు ఇవ్వటం జరిగింది. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగింది.

## ప్రజా సంఘాల ఆధ్వర్యంలో...

వరంగల్ జిల్లా చేర్యాల మండలం తపసుపల్లి గ్రామంలో జూలై 28న రాత్రి 7 గంటల నుండి 9 గంటల వరకు విప్లవ రైతుకూలీ సంఘం, విప్లవ మహిళా సంఘం, బాల సంఘాల నాయకత్వంలో ఊరేగింపు, సంస్మరణ సభ జరిగింది. గ్రామంలో ఊరేగింపు జరిపిన అనంతరం, గ్రామం మధ్యన వున్న గుడి దగ్గర బ్యానర్లు కట్టి, ఎర్రజెండా ఎగురవేసి, 2 నిముషాల సేపు మౌనం పాటించారు. గ్రామంలోని ప్రజలందరూ ఈ సభలో పాల్గొన్నారు. ఒకవైపు కూంబింగ్‌లు జరుపుతున్నా, ప్రజలు నిర్భయంగా సభ జరిపి అమరులకు జోహార్లు అర్పించారు.

## ఇందూప్రియాల్ దళం ఏరియాలో...

అమరవీరుల సంస్మరణ వారంను విజయవంతం చేయటంలో భాగంగా ఇందూప్రియాల్ (ఐ.పి.) దళం ఏరియాలో 'శాక్' పేరుమీద 3వేల కరపత్రాలు, 1000 పోస్టర్లు, జిల్లాకమిటీ పేరుమీద 5వేల కరపత్రాలు, 1000 పోస్టర్లు తీసి ప్రచారం చేయడం జరిగింది. ఐ.పి. ఏరియాలోని గజ్వేల్, చేగుంట, దౌల్తాబాద్, మిడిదొడ్డి మండలాల్లో, నర్సాపూర్ (ఎన్.పి.) దళం ఏరియాలోని చిన్న శంకరం పేట, నర్సాపూర్, వెల్దుర్తి మండలాల్లో విస్తృత ప్రచారం చేయటం జరిగింది. బ్యానర్లను కూడా కట్టారు. ఈ మండలాల్లోని పలు గ్రామాల్లో వాల్ రైటింగ్ కూడా చేశారు. దౌల్తాబాద్ శంబుని గుట్టమీద తాత్కాలికంగా అమరుల స్థూపం ఏర్పాటు చేసారు. గిరిపల్లి గుట్టలమీద జెండాను ఎగురవేశారు. ఏరియా అంతా కలసి 150 బ్యానర్లు కట్టారు. ఏరియాలో 3 బహిరంగ సభలు నిర్వహించారు.

## ఇబ్రహీంపూర్ గ్రామంలో...

జూలై 31న రాత్రి 9 గంటలకు దాదాపు 60 మందితో, దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలిస్తూ, గ్రామంలో ఊరేగింపు జరిపారు. అనంతరం గ్రామపంచాయితీ కార్యాలయం వద్ద బహిరంగ సభ జరిపారు. సభకు దళ సభ్యుడు కా॥ నారన్న అధ్యక్షత వహించగా, దళ డిప్యూటీ కమాండర్ కా॥ అరుణ జెండా ఆవిష్కరించింది. ముందు అధ్యక్షత వహించిన కా॥ నారన్న, తర్వాత శాక్ సభ్యుడు కా॥ భూమన్న అమరుల త్యాగాల గురించి, వాళ్ళ ఆశయాలు కొనసాగించవలసిన అవసరాన్ని గురించి చెప్పారు. చివరగా కా॥ అరుణ, 'అమరవీరుల ఆశయాలను తలచుకోకుండా, వాళ్ళ ఆశయాలు కొనసాగించకుండా మన లక్ష్యం నెరవేరదని' చెప్పింది. 'అమరులు మిగిల్చిపోయిన కర్తవ్యాన్ని మనం ముందుకు తీసుకుపోవడం అంటే, పేదల రాజ్యం తీసుకురావడం కొరకు ప్రజలందరూ ఐక్యమై ఎవరి శక్తి మేరకు వాళ్ళు పని చేసినపుడు మాత్రమే అది సాధ్యమని, అలా చేయటమే అమరులకు మనం అర్పించే నివాళి' అని ముగించింది.

శత్రువు అమలు చేస్తున్న తీవ్ర నిర్బంధం దృష్ట్యా, మధ్య మధ్యలో కొంత అభ్యంతరం తెలియజేసినా, సభకు హాజరైన 300మంది ప్రజలు, సభ జరిగిన 3 గంటల పాటు వుండి, వక్తలు చెప్పినవి ఆసక్తిగా విని, పార్టీకి అన్ని విధాలా సహకరిస్తామని మాట్లాడారు. అప్పటి కప్పుడు కొంత ఆర్థిక సహాయం, 2 చీరె కట్టలు సహాయం చేశారు.

## సూరారం గ్రామంలో...

నర్సాపూర్ ఏరియాలో, సూరారం (చిన్న శంకరం పేట మండలం) గ్రామంలో జూలై 30న అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. రాత్రి 9 గంటలకు బ్యానర్లు, కాగడాలు చేతబట్టుకుని, చిన్న చింతకుంట అమరవీరులకు జోహార్లు, మెదక్ జిల్లా అమరులకు జోహార్లు, పెంచిన విద్యుత్, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి, గ్రామ సంఘాలకే సర్వాధికారాలు, నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి మొ॥న నినాదాలతో గ్రామ ప్రధాన వీధుల గుండా దాదాపు 45 నిముషాలు ఊరేగింపు నిర్వహించారు. అక్కడి దళం ఎన్‌కౌంటర్ అయిన తర్వాత, మరలా దళం ఏర్పడి తమ చెంతకు వచ్చిందన్న సంతృప్తి ప్రజల ముఖాల్లో ప్రతిఫలించింది. ఊరేగింపు అయిన తర్వాత వర్షం రావడంతో, అది తగ్గిన తర్వాత సభ నిర్వహించాలనుకుని ఒకచోట ఆగారు. తర్వాత, సెంట్రీలో వున్న కామ్రేడ్ (యాక్టివిస్టు) ప్రయాణీకుల జీపును చూసి, పోలీసులు వస్తున్నారు అని కాషన్ ఇవ్వడంతో, దళం అంతా ఎలర్ట్ అయి, బహిరంగ సభ విరమించుకుని గ్రామంనుండి బయటకు వచ్చింది.

## అడవితల్లి ఒడిలో సంస్మరణ సభ

ఝాన్సీ లింగాపూర్-ఖాజాపూర్ అడవిలో అమరవీరుల కుటుంబ సభ్యులను, యాక్టివిస్టులను, సమీకరించి ఆగస్టు 3న సంస్మరణ సభ జరిపారు. వాళ్ళందరినీ ఆగస్టు 2కే పిలిపించారు. వివిధ రకాల ఆటవస్తువులు (వాలీబాల్, రింగ్‌బాల్, బాస్కెట్‌బాల్

మొ॥నవి) తెప్పించి, ఆటస్థలం ఏర్పాటు చేసి, ఆ రోజంతా అందరిచేతా ఆటలు ఆడించారు. వాటిల్లో అందరూ అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారు. ఆగస్టు 3వ తేదీన ఉదయం 9 గం॥కు ప్రారంభమైన సభకు కా॥ మహేష్ అధ్యక్షత వహించాడు. అమరుల జెండాను కా॥ నరేందర్ గౌడ్ (అమరుడు) సోదరుడు ఆవిష్కరించగా, అమరుల స్థూపావిష్కరణను నర్సాపూర్ ఎల్.జి.యస్. శాక్ సభ్యురాలు కా॥ అరుణ ఆవిష్కరించింది. సభలో ఝాన్సీలింగాపూర్ యాక్టివిస్టు, తనకు తెలిసిన అమరుల గురించి, అమరుల సంస్మరణ ఎందు కోసమో చెప్పి ముగించాడు. అధ్యక్షత వహించిన కా॥ మహేష్ జూలై 28 ప్రాముఖ్యతను వివరించాడు. కా॥ మధు (ఆర్.యస్.యు.) మాట్లాడుతూ, అమరుల ఆశయాలను కొనసాగించడంలో ఆర్.యస్.యు. ప్రాముఖ్యతను వివరించి, విద్యార్థులను సమీకరించవలసిన అవసరాన్ని గురించి వివరించాడు. చిన్న చింతకుంట అమరుల జీవిత చరిత్రలను చెప్పి, వాళ్ళ పోరాట పటిమ మనకు ఆదర్శం అని చెప్తూ, వాళ్ళు నాటిన విత్తనాలు మొక్కై, కాయలు కాసి, పండు అయిననాడే వాళ్ళ త్యాగాలకు సార్థకత వుంటుందని, అందుకొరకు అమరులు వదలి వెళ్ళిన ఆశయాన్ని చివరి వరకు కొనసాగించడమే మనం అమరులకు అర్పించే నివాళి అని కా॥ అరుణ తన ప్రసంగంలో చెప్పింది.

ఎల్.జి.యస్. కమాండర్ కా॥ మల్లన్న మాట్లాడుతూ, నర్సాపూర్ ప్రాంతంలో గెరిల్లాజోన్ ప్రాథమిక దశ వైపుగా ప్రజలని సమీకరించడమే అమరులకు అర్పించే నివాళి అని చెప్పాడు. చివరగా ఇందుప్రియాల్ ఏరియా కమిటీ కార్యదర్శి కా॥ సుదర్శన్ మాట్లాడుతూ, మెదక్ జిల్లాలో మనం చాలా విలువైన, అనుభవం కల్గిన కామ్రేడ్స్‌ను కోల్పోయాం. ఆ మేరకు మనకు తాత్కాలికంగా నష్టం జరిగినా అది త్వరలోనే కోలుకొని ప్రజల భాగస్వామ్యంతో మళ్ళీ శత్రు గర్భంలోనే జిల్లా ఉద్యమం కొత్త పుంతలు తొక్కి ముందుకు పోతుందని ఆశాభావాన్ని ప్రకటించాడు. మధ్య మధ్యలో పాటలు పాడుతూ, నినాదాలిస్తూ జరిగిన సంస్మరణ సభ, ఎన్‌కౌంటర్లో దళాన్ని కోల్పోయిన పేద ప్రజల్లో కొత్త ఆశలు చిగురింపజేసి, పోరాటంలో తమవంతు పాత్ర నిర్వహించాలనే స్ఫూర్తిని కలిగించింది.

### ఆల్వాల గ్రామంలో...

దుబ్బాక దళం ఏరియాలో, ప్రస్తుతం ఇందుప్రియాల్ దళం చూస్తున్న మిర్‌దొడ్డి మండలం ఆల్వాల్ గ్రామంలో జూలై 31 రాత్రి 9 గం॥లకు పెద్ద ప్రదర్శన జరిగింది. దళం నుండి వెళ్ళిన ఒక శాక్ మెంబర్ నాయకత్వంలో 300 మంది ప్రజలు ప్రదర్శనలో పాల్గొన్నారు. దాదాపు గంటన్నర పాటు నినాదాలిస్తూ పాటలు పాడుతూ జరిగిన ప్రదర్శన, దళం లేకపోయినా ఏరియాలో కార్యక్రమాలు యధావిధిగా జరుగుతున్నాయి అన్న విషయాన్ని ప్రజలకు అర్థం చేయించి, వాళ్ళల్లో ఆత్మ విశ్వాసాన్ని నింపింది.

## నల్గొండ జిల్లా :

### పోలీసు క్యాంపుకు 3 నిమిషాల దూరంలో...

రాచకొండ ఏరియాలో ఆగస్టు 6న చిత్రాపూర్ గ్రామంలో దళం ఆధ్వర్యంలో అమరుల సంస్మరణ సభ జరిగింది. ఎండా కాలంలో ఎల్లెంల ఎన్‌కౌంటర్‌లో దళం తీవ్ర నష్టానికి గురి కావటంతో, ప్రజల్లో బాధ, నిరుత్సాహ వాతావరణం ఏర్పడింది. సంఘ వ్యతిరేకులు, భూస్వాములకు పట్టపగ్గాలు లేకుండా పోయింది. భూపోరాటాలను మర్లగొట్టారు. ఈ పరిస్థితుల్లో, పోలీసు క్యాంపుకు 3 నిముషాల దూరంలో సభ నిర్వహించటంతో ప్రజలకు ఎంతో మనోధైర్యాన్ని ఇచ్చింది. భూస్వాములకు, సంఘ వ్యతిరేకులకు హెచ్చరిక అయింది.

సభకు ముందు దళం, మిలిటెంట్స్ మొత్తం 20 మందితో పాటు 150 మంది ప్రజలు గ్రామంలో పాటలు పాడుతూ, నినాదాలిస్తూ, కాగడాలు, ఎర్రజెండాలు చేతబూని ఒక గంటసేపు ఊరేగింపు నిర్వహించారు. గ్రామం మధ్యలో వున్న స్కూల్ వద్ద జరిగిన సభకు కా॥ సురేష్ అధ్యక్షత వహించాడు. అమరుల స్మారక స్థూపాన్ని శాక్‌మెంబర్ కా॥ లత ఆవిష్కరించగా, అంతా అమరులకు జోహార్లర్పిస్తూ 2 నిముషాలు మౌనం పాటించారు. అమరుల మీద కొన్ని పాటలు పాడిన తర్వాత మహిళా అమరుల గురించి మాట్లాడుతూ, స్త్రీ విముక్తి సమాజ విముక్తితో ముడిపడి వున్నదని, దానికి సాయుధ పోరాటమే మార్గమనే సందేశంతో కా॥ లత ప్రసంగం సాగింది.

తర్వాత కా॥ శేషు మాట్లాడుతూ, ప్రపంచబ్యాంక్, సామ్రాజ్యవాదులకు అమ్ముడుపోయిన చంద్రబాబు, ఆంధ్ర రాష్ట్రాన్ని 'స్మశానాంధ్ర' చేయటానికి సామ్రాజ్యవాద అనుకూల విధానాలను అనుసరిస్తున్నాడని వివరించాడు. వాటి దుష్ఫలితాల కారణంగా రాబోయే ప్రజా పోరాటాల వెల్లువను అడ్డుకోవటానికి పీపుల్స్‌వార్ పార్టీపైన, ప్రజాస్వామిక శక్తులపైన పాశవిక హత్యాకాండను అమలు జరుపుతున్నాడని చెప్పాడు. ప్రజలందరి భాగస్వామ్యంతో జరిగే ప్రజా పోరాటాల ద్వారానే దీన్ని అడ్డుకోగలమని చెప్తూ, చంద్రబాబు పథకాల బూటకత్వాన్ని ఎండగట్టాడు.

కా॥ విజయ మాట్లాడుతూ, దేశంలో వర్గ వ్యవస్థతో ముడిపడిన కుల సమస్యను హిందూ మతోన్మాదులు, అగ్రకుల అహంకారులు పెంచి పోషిస్తున్నారని, అనాదిగా అంటరానివారుగా వున్న దళితులు భూమిలేని వ్యవసాయ కూలీలేనని చెప్పింది. 95 శాతంగా వున్న వ్యవసాయ కూలీలు భూస్వామ్యాన్ని, దానితో ముడిపడివున్న హిందూమతోన్మాదాన్ని, అగ్ర వర్గ అహంకారాన్ని కూల్చకుండా దళితులు విముక్తి చెందరని చెప్తూ, ఆగస్టు 1 నుండి 15 దాకా కుల నిర్మూలనా నిరసన కార్యక్రమాలు జరపమని పార్టీ ఇచ్చిన పిలుపును జయప్రదం చేయాలని కోరింది. అమరువీరుల కుటుంబాలకు ఆర్థికంగా, హార్థికంగా సహకరించాలని చెప్పగా, ప్రజలు అప్పటికప్పుడు 398 రూ॥లు చందా ఇచ్చారు. ఈ సందర్భంగా, గ్రామంలో పంచాయితీ పరిష్కారం కాకుండా అడ్డుపడుతున్న పెత్తందారు జంగారెడ్డిని హెచ్చరించారు. 800 మంది హాజరైన బహిరంగసభ నాలుగన్నర గంటలపాటు సాగి ప్రజలకు ఆత్మవిశ్వాసం నింపటమేగాక, శత్రు నిర్బంధాన్ని గేలి చేసింది.

### మహబూబనగర్ జిల్లాలో...

జూలై 28 నుండి ఆగస్టు 3 వరకు స్మారక వారాన్ని పాటించమని పిలుపిస్తూ, జిల్లాకమిటీ, శాక్‌ల పేరుతో పేపర్ ప్రకటన ఇచ్చారు. దాంతోపాటు జిల్లాకమిటీ తీసిన కరపత్రాలు, పోస్టర్లు అన్ని

ఏరియాల్లో విస్తృతంగా ప్రచారం చేయడం జరిగింది. పానగల్, కల్వకుర్తి ఏరియాల్లో విప్లవ రైతుకూలీ సంఘంవాళ్ళు ఎర్రజెండాలు ఎగురవేసారు. పానగల్ ఏరియాలో 15 మంది మిలిటెంట్స్ రహస్య సమావేశం జరిపి, అమరులకు జోహార్లు అర్పించారు.

జిల్లాలోని అన్ని దళాలు క్లాసుల సందర్భంగా కలవడంతో అడవిలో జూలై 28 జరుపుకున్నారు.

## గిరాయిపల్లి గ్రామంలో...

జూన్ 30వ తేదీన, కొండపాక మండలం గిరాయిపల్లి గ్రామంలో దళం ఆధ్వర్యంలో సంస్మరణ సభ జరిగింది. సభకు ముందుగా గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు జరిపారు. సభ జరిగిన హనుమాండ్ల గుడి ప్రదేశమంతా అమరులపై రాసిన బ్యానర్లు కట్టారు. జెండాను, అదే గ్రామానికి చెందిన, చినచింతకుంటలో అమరురాలైన కా॥ శ్యామల తల్లి ఆవిష్కరించింది. దళ సభ్యుడు కా॥ ప్రసాద్ అధ్యక్షత వహించిన ఆ సభలో, దళ సభ్యురాలు కా॥ రమ మాట్లాడుతూ, ఎమర్జెన్సీ కాలంలో గిరాయిపల్లి వద్ద పోలీసులచే హత్య చేయబడిన 'నలుగురు రాడికల్ విద్యార్థుల' నుండి నేటిదాకా విప్లవోద్యమంలో ఆ గ్రామ పాత్రను వివరించింది. ప్రస్తుతం అమలవుతున్న నిర్బంధాన్ని అధిగమించి, దాన్ని కొనసాగించ వలసిందిగా ప్రజలకు పిలుపునిచ్చింది. డిప్యూటీ కమాండర్ కా॥ వెంకన్న మాట్లాడుతూ రాజకీయ నాయకులు, పోలీసులు దొంగలు, హంతకులని, వీరిని శిక్షించకుండా ప్రజలకు విముక్తి లభించదని చెప్పారు. అనంతరం దళ కమాండర్ కా॥ రవి మాట్లాడుతూ కొయ్యూరు అమరవీరులు కా॥ శ్యాం, మహేష్, మురళీల క్రమశిక్షణాయుతమైన విప్లవ జీవితాన్ని, వాళ్ళు ఆచరణలో కొనసాగించిన ఆదర్శాలను ప్రజలకు వివరించడం జరిగింది. కొయ్యూరు బూటకపు ఎన్‌కౌంటర్ ద్వారా, పాలకవర్గాల దోపిడీ విధానాలు సామ్రాజ్యవాదుల కనుసన్నల్లో నడుస్తున్నాయనీ, అందుకే ఈ విధమైన దాడులు, హత్యలు జరుపుతున్నాయనీ వివరించాడు. కొయ్యూరు అమరుల ఆశయాలను కొనసాగించడమంటే, దోపిడీ పాలక వర్గాలను ఓడించడమే అని ప్రజలకు పిలుపిచ్చాడు. ప్రభుత్వం కొనసాగిస్తున్న నిర్బంధం గురించి వివరించి, దాన్ని ఎదిరించాల్సిందిగా ప్రజలకు పిలుపిచ్చాడు. రాత్రి 8.30 గం॥ల నుండి 11 గం॥ల వరకు అత్యంత ఉత్సాహభరితంగా జరిగిన ఈ సభలో ఉపన్యాసాల మధ్యలో పాటలు కూడా పాడారు. అంతటి నిర్బంధంలోనూ 150 మంది ప్రజలు సభకు హాజరై విజయవంతం చేసారు.

## 800 మంది ప్రజలతో సంస్మరణ సభ...

వరంగల్ జిల్లా చేర్యాల మండలం గురువన్న పేట గ్రామంలో, జూలై 16న అమరుల సంస్మరణ సభ జరిగింది. రాత్రి ఏడున్నర గంటలకు గ్రామంలోకి ప్రవేశించిన దళం ఆధ్వర్యంలో కాగడాలు, ఎర్రజెండాలు, బ్యానర్లు పట్టుకుని, పాటలు పాడుకుంటూ, నినాదాలు చేసుకుంటూ గ్రామంలో ప్రదర్శన జరిగింది. అనంతరం రాత్రి 8 గంటలకు కోనేరు ముందు బహిరంగ సభ నిర్వహించారు. దళసభ్యుడు కా॥ మారన్న అధ్యక్షతన జరిగిన ఈ సభలో దళ సభ్యురాలు కా॥ సావిత్రి మాట్లాడుతూ, అమర వీరుల ఆశయాలను కొనసాగించటానికిగాను, మహిళలందరూ మహిళా సంఘాలలో సంఘటితం కావాలని, బూటకపు ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు నాయకులను కాల్చి వేసారని, ఆ వీరుల ఆశయాలను ఎన్ని కష్టాలు ఎదురైనా ముందుకు తీసుకుపోవాలని ప్రజలకు పిలుపునిచ్చింది. గిరాయిపల్లి శాక్ కార్యదర్శి కా॥ రవి, తన ఉపన్యాసంలో కొయ్యూరు అమరుల గురించి వివరించడం జరిగింది. ఇంకా, ఆచరణలో ఎదురవుతున్న సమస్యలను ఉద్యమ పరిస్థితులకు అనుగుణంగా ఎట్లా పరిష్కరించుకోవాలో వివరించడం జరిగింది. ఇన్‌ఫార్మర్లను, ప్రజా శత్రువులను ఏరివేయకుండా ఉద్యమం ముందుకు పోదని, పోరాటంలో మాజీలు ప్రజలకు సహకరించాలని కోరడం జరిగింది. 8 నుండి 10 గంటల వరకు జరిగిన ఈ సభకు 800 మంది ప్రజలు హాజరవటమే గాకుండా, అప్పటికప్పుడే 80 రూ॥ల చందాలు పోగు చేసి ఇచ్చారు.

# అమరుల జీవిత చరిత్రలు

## ట్రేడ్ యూనియన్ కార్యకర్త కా॥ సుధాకర్ అమర్ హై!

మెదక్ జిల్లా విప్లవోద్యమం మరో ట్రేడ్ యూనియన్ కార్యకర్తను కోల్పోయింది. ఆ కామ్రేడ్ కా॥ సుధాకర్ (శ్రీనివాస్‌రెడ్డి). వరంగల్ జిల్లా చేర్యాల మండలం ఐనాపూర్ గ్రామంలో మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన కా॥ శ్రీనివాసరెడ్డి డిగ్రీ మొదటి సంవత్సరంలో వుండగా, 1998లో విప్లవోద్యమం పట్ల ఆకర్షితుడై, అప్పటినుండి చురుకుగా పనిచేయటం మొదలు పెట్టాడు. స్థానికంగా ఆయా విద్యా సంస్థలలో వున్న సమస్యలు, మరియు సామాజిక సమస్యలపై చొరవగా విద్యార్థులను కదిలిస్తూ, ఆ పోరాటాలకు నాయకత్వం వహిస్తూ, క్రియాశీలక పాత్ర వహించేవాడు. కొండపాక మండలం దుద్దెడ గ్రామంలోని పాఠశాలలో ఒక 'పోకిరీ' విద్యార్థినులను వేధిస్తుంటే ఆర్.యస్.యు. నాయకత్వంలో విద్యార్థులను కూడగట్టి అతన్ని నిలదీసాడు. విద్యార్థులు, ఉపాధ్యాయుల ముందు పోకిరీకి బుద్ధి చెప్పి, ఆర్.యస్.యు. లక్ష్యాల గురించి వివరించి, అందరి ఆదరాభిమానాలు చూరగొన్నాడు. ఆగస్టు 15, జనవరి 26 నిరసన దినాలను పాటించడంలో చాకచక్యంగా కృషి చేసేవాడు. శత్రువు కూంబింగ్ మధ్యనే మెరుపు క్యాంపెయిన్‌లు చేస్తూ, పోస్టర్లు వేస్తూ, నల్లజెండాలు ఎగరవేస్తూ శత్రువుకు సవాల్‌గా నిలిచాడు. ఒక ప్రక్క ఈ కార్యక్రమాలలో పాల్గొంటూనే, మరోప్రక్క కుటుంబంలో తండ్రి చనిపోవటంతో, ఇంటికి పెద్ద దిక్కుగా వ్యవహరిస్తూ, కుటుంబ సమస్యలను పరిష్కరించేవాడు. 1998లో ఆర్.యస్.యు. ఏరియా కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించి విద్యార్థి ఉద్యమాన్ని బలోపేతం చేయటానికి తీవ్రంగా కృషి చేసాడు. గ్రామంలో అందరితో కలుపుగోలుగా వుంటూ విప్లవంలో అందరం భాగస్తులం కావాలని, అప్పుడే విప్లవం విజయవంతం అవుతుందని ప్రజల్ని విప్లవ కార్యాచరణకు పురికొల్పేవాడు. అమరుడు కా॥ సంతోష్‌రెడ్డి సంస్మరణ దినం రోజు తాలూకా స్థాయి ఆటల పోటీలు నిర్వహించి, ఆ సందర్భంలో అమరుల ఆశయాలను కొనసాగించాల్సిన అవసరాన్ని గురించి అందరికీ వివరించాడు.

1999 జనవరిలో చేసిన బొమ్మల రామారం రెయిడ్‌లో వీరోచితంగా ప్రతిఘటిస్తున్న క్రమంలో, మెయిన్‌గ్రూప్ నుండి విడిపోయి, అది కొత్త ప్రాంతం అయినప్పటికీ ఎంతో నిబ్బరంతో వ్యవహరించాడు. తుపాకులను డంప్‌చేసి, తనతో వున్న కామ్రేడ్‌ను వెంటబెట్టుకుని ఆర్.వి.లో కలిశాడు. తండ్రిలేని కుటుంబం, తను కొంత బాధ్యతలు మోయాలని సహజంగానే ఆశిస్తున్నా, అంతకంటే

ఈ సమాజం తనని పెంచి పెద్ద చేసినందుకు, తీర్చి దిద్దినందుకు మొత్తం ప్రజలకు బాధ్యతపడటమే తన ధర్మం అని భావించాడు. ఆ త్యాగ దీక్షతో 1999 జూన్‌లో పార్టీలోకి పూర్తికాలం కార్యకర్తగా వచ్చి, 'వృత్తి విప్లవకారుడ'య్యాడు. అప్పటిదాకా విద్యార్థి రంగంలో పనిచేస్తున్నా, జిల్లా ఉద్యమ అవసరాల రీత్యా ట్రేడ్ యూనియన్ రంగంలో బాధ్యతలు అప్పగిస్తే, వెంటనే స్వీకరించాడు. అప్పటినుండి అమరుడయ్యే దాకా ఆ రంగంలోనే కృషి చేసాడు. కష్టపడే స్వభావం, విప్లవ తపన నిరంతరం ప్రతిఫలించే కా॥ సుధాకర్‌ను కొండపాక మండలం దుద్దెడ గ్రామ శివారులోని నల్లవాగు వద్ద పోలీసులు ఎదురుకాల్పుల పేరిట కాల్చి చంపారు.

## వైరణంలోనూ విజయపతాకను ఎగరవేసిన కా॥ సత్యం

మెదక్ జిల్లా కొండపాక మండలం ఏటిగడ్డ కిష్టాపూర్ గ్రామంలో కర్ణం కులంలో మధ్యతరగతి కుటుంబంలో జన్మించాడు కా॥ సత్యం (విఠల్‌రావు). గజ్వేల్‌లో ఇంటర్మీడియట్ చదివిన ఈ కామ్రేడ్, అమరుడు కా॥ సత్తిరెడ్డి (యాక్టివిస్టు)తో కలసి 1997లో పార్టీ సంబంధాల్లోకి వచ్చాడు. గ్రామంలో రహస్యంగా పనిచేయటం ప్రారంభించాడు. 1997 నవంబర్‌లో కా॥ సత్తిరెడ్డిని పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపడంతో, ఆ కామ్రేడ్ త్యాగాన్ని మరింత స్ఫూర్తిగా తీసుకుని, ఆర్.వై.యల్. కార్యకలాపాలలో మరింత చురుకుగా, పట్టుదలగా పనిచేసాడు.

ఎన్నికల బహిష్కరణ క్యాంపెయిన్ టీమ్‌కు బాధ్యుడిగా వుండి, ఒక ప్రక్క శత్రువు కూంబింగ్ జరుపుతున్నా, ఏ మాత్రం జంకకుండా, జిగ్ జాగ్ పద్ధతిలో క్యాంపెయిన్ దళాన్ని తిప్పుతూ, చంద్రబాబు విధానాలను గ్రామ గ్రామాన ఎండగడ్తూ, క్యాంపెయిన్ విజయవంతం చేయటంలో కీలకపాత్ర పోషించాడు. 1998 జూన్‌లో గిరాయిపల్లి దళం ఎన్‌కౌంటర్ కావటంతో, పార్టీ సంబంధాలు తెగిపోయినా, ఏ మాత్రం స్థైర్యాన్ని కోల్పోకుండా, ప్రజల్ని అంటిపెట్టుకుని తిరిగాడు. గిరాయిపల్లి ఏరియాలోని యువజనుల్లో, రైతాంగంలో, మొత్తం ప్రజల్లో నీటిలో చేపలాగా కలసిపోయి వాళ్ళ ఆదరాభిమానాలు చూరగొన్నాడు. 1999 జూన్‌లో పార్టీలోకి పూర్తికాలం కార్యకర్తగా వచ్చాడు. అప్పటినుండి, జిల్లా కొరియర్‌గా పనిచేస్తూ, శత్రువు కన్నుగప్పి ఉత్తర ప్రత్యుత్తరాలను చాకచక్యంగా చేరవేస్తూ, ఉద్యమ సమన్వయానికి తన వంతు బాధ్యతను నెరవేర్చాడు. పార్టీ పనిమీద ఒంటరిగా ప్రయాణంలో వున్న ఈ కామ్రేడ్‌ను 2000 సంవత్సరం సెప్టెంబర్ 7వ తేదీన మంగోల్ బస్ స్టేషన్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. పార్టీ రహస్యాలు చెప్పమని ఉదయం నుండి సాయంత్రం వరకు తీవ్ర చిత్రహింసలు పెట్టారు. వేళ్ళ గోర్లు తీసి వేసారు. కాళ్ళూ చేతులూ విరగ్గొట్టారు. అయినా ఆ కామ్రేడ్ నుండి చిన్న విషయాన్ని కూడా రాబట్టలేక పోయారు. వాస్తవానికి ఆ కామ్రేడ్ నేరుగా క్యాంపులో నుండి ఏపిటికి పోతున్నాడు, ఏ మాత్రం నోరు విప్పినా, 'క్యాంప్' మొత్తం ప్రమాదంలో పడేది. ఏ పనిని అప్పగించినా బాధ్యతగా నిర్వహించే ఈ కామ్రేడ్, శత్రు చేతుల్లో చిక్కి, ఎన్ని ప్రలోభాలు పెట్టినా, ఎంతటి చిత్రహింసలు పెట్టినా, ప్రాణాలు తీస్తామని బెదిరిస్తున్నా ఏ మాత్రం ఖాతరు చేయకుండా, అత్యంత బాధ్యతతో వ్యవహరించి మనందరికీ ఆదర్శంగా నిలిచాడు. చిన్న రహస్యం కూడా చెప్పకుండా విజయ దరహాసం చేస్తున్న కా॥ సత్యంను చూసి, తన ఓటమికి తట్టుకోలేని శత్రువు పిచ్చికుక్కకు మల్లే రెచ్చిపోయి, కొండపాక మండలం మేథినీపూర్ గ్రామ శివారులలోకి తీసుకువచ్చి, ప్రజలందరూ చూస్తుండగానే ఇద్దరు పోలీసులు రెక్కలు పట్టుకోగా, ఒకడు రివాల్వర్‌తో కాల్చి చంపాడు.

కా॥ సత్యం సొంత వూరు ఏటిగడ్డ కిష్టాపూర్‌లో నిర్బంధం చవిచూడనివాళ్ళు ఒకళ్ళూ లేరంటే అతిశయోక్తి కాదు. అయినా, గ్రామ ప్రజలు ఏ మాత్రం వెరవకుండా, తమ ప్రియతమ పుత్రుడు, వీరుడు కా॥ సత్యం శవాన్ని తీసుకువెళ్ళి ఎర్రజెండాలు కప్పి, కాగడాలు చేతబూని ఊరు ఊరంతా కదిలి నినాదాలు, పాటలతో 3 గంటల పాటు శవయాత్రను జరిపారు. ❑

---

(37వ పేజీ తరువాయి...)

ఈ పిండారీ దోపిడీ చాలదన్నట్లు, భారత ప్రభుత్వ ఆర్థిక సంస్థ అయిన ఐ.డి.బి.ఐ. (ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) ఎన్రాన్ ప్రాజెక్టుకు పెద్ద మొత్తంలో అప్పులివ్వటమేగాక, ఇప్పుడు వడ్డీరేటు కొడా 3 శాతం తగ్గించింది, అంటే 17 శాతం నుండి 14 శాతానికి తగ్గించింది. ఇంకో మాటలో చెప్పాలంటే ఎన్రాన్ కంపెనీకి 50 నుండి 100 కోట్ల వరకు అదనంగా 'నజరానా' ఇస్తుంది.

ఒకప్రక్క ప్రజలను అధిక విద్యుత్ ఛార్జీలతో కొల్లగొడ్తూ, అదే సమయంలో ప్రభుత్వం ఖజానాను ఎన్రాన్‌కు అప్పుల పేరిట, తక్కువ వడ్డీల పేరిట దోచిపెడ్తూ మహారాష్ట్ర విద్యుత్‌బోర్డును దివాలా తీయిస్తూ, ఎన్రాన్‌కు మాత్రం 'లాభాలను బంగారు పళ్ళెం'లో పెట్టి అందజేస్తున్నారు. కొల్లగొడ్తున్న ఈ సంపదనంతా ఎన్రాన్ విదేశాలకే (అమెరికాకు) తరలించుకు పోతుంది. ఇది భారతదేశ ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకమైన నీతిమాలిన కుట్ర తప్ప మరొకటి కాదు.

అయితే, ఇటువంటి ప్రాజెక్టుల్లో ఎన్రాన్ కేవలం ఒకటి మాత్రమే. రాష్ట్ర ప్రభుత్వాలు అటువంటి విద్యుత్ కొనుగోళ్ళ ఒప్పందాలను ఇతర ప్రైవేట్ విద్యుత్ కంపెనీలతోనూ కుదుర్చుకున్నాయి. వీటిల్లో అనేకం ఈ సంవత్సరమే విద్యుత్ ఉత్పత్తిని మొదలుపెడ్తాయి. ప్రపంచబ్యాంక్ తొత్తు, ఈ అమెరికన్ సామ్రాజ్యవాదుల పెంపుడుకుక్క చంద్రబాబు, ఆ ఒప్పందాల ఫలితంగా విద్యుత్ ఛార్జీలను ఏ విధంగా పెంచిందీ, ఉద్యమాన్ని రక్తపుటేరుల్లో ముంచెత్తిందీ. ఆంధ్ర రాష్ట్ర ప్రజానీకానికి తెలిసిందే!

ఇటువంటి దేశద్రోహ ఒప్పందాలను ఆసాంతం వ్యతిరేకించాలి. భారతదేశపు జాతీయ ప్రయోజనాలకు ఎన్రాన్ లాంటి సంస్థలు ఎంతో హానికరమైనవి. కానీ, వీటి వునికి మొత్తంగా ప్రపంచబ్యాంక్ ఆదేశానికి అనుగుణంగా జరుగుతున్న విద్యుత్‌రంగ ప్రైవేటీకరణ విధానంతో ముడిపడి వుంటున్నాయి. ఈ విధానం ఈ రంగంలో పనిచేస్తున్న లక్షలాది కార్మికులను వీధులపాలు చేయటమేగాక, ప్రజానీకం పెద్ద మొత్తంలో విద్యుత్ ఛార్జీలు చెల్లించాల్సి వస్తుంది. దీన్ని అతి తీవ్రంగా వ్యతిరేకించాల్సిన అవసరం వున్నది. ఈ పరిస్థితిని గమనించి, విద్యుత్ రంగంలో పనిచేసే కార్మికులు దేశవ్యాప్తంగా ఒకరోజు సమ్మె చేసారు. ఇది కేవలం ప్రారంభమేకానీ, ప్రభుత్వం తన పాలసీని వెనక్కి తీసుకునేలా చేయటానికి ఇది మాత్రమే సరిపోదు. ప్రజలు, ఉద్యోగులు ఐక్యమై, భుజం భుజం కలిపి పోరాడి, పెనుతుఫానులా విరుచుకు పడ్డప్పుడే, విద్యుత్ రంగంలో సామ్రాజ్యవాదులు, దళారీ పాలకులు చేస్తున్న కుట్రను తిప్పికొట్టగలం. ❑

# యూరోపును స్తంభింపజేసిన ప్రజల ప్రఘటన

గడచిన సెప్టెంబర్‌లో యూరప్‌లోని వివిధ దేశాల ప్రభుత్వాలు ఆయిల్ ధరలను పెంచినందుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజలు చేపట్టిన చర్యలు యూరప్‌ని స్తంభింపజేశాయి.

పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన దానికి నిరసనగా యూరప్‌లోని ఆయిల్ డిపోలను ట్రక్కుల యజమానులు, రైతులు, చేపలుపట్టేవాళ్ళు, చిన్న వ్యాపారస్తులు, సాధారణ ప్రజానీకం అనేకచోట్ల చుట్టుముట్టారు. పోలెండ్‌లోని బాల్టిక్ పోర్టు ఆఫ్ గడన్స్క్ నుండి స్పెయిన్ తీర ప్రాంతం దాకా-స్పెయిన్, జర్మనీ, ఐర్లాండ్, పోలండ్ మరియు చెక్ రిపబ్లిక్‌లోని అనేక జాతీయ రహదారులకు సమ్మె తాకిడి తగిలింది. యూరోపియన్ యూనియన్ (ఇ.యు.) మంత్రులు పెంచిన ధరలను వెనక్కి తీసుకునేందుకు అంగీకరించక పోయినప్పటికీ అనేక ప్రభుత్వాలు కొన్ని రాయితీలు ఇవ్వక తప్పలేదు. బ్రిటిష్, జర్మనీ ప్రభుత్వాలు అయితే సమ్మె చేస్తున్న ప్రజలపట్ల అత్యంత దురుసు విధానాన్ని అవలంభించాయి.

మొదట ఫ్రాన్స్‌లో మొదలైన సమ్మెలు వెనువెంటనే యూరప్ అంతటా వ్యాపించాయి. బ్రిటన్‌లో అయితే మిలిటెంట్ యాక్షన్స్ రూపం తీసుకున్నాయి. ఇటలీ ప్రభుత్వమైతే, ప్రజల తీవ్ర నిరసన జ్వాలలను ఎదుర్కోవలసి వస్తుందనే భయంతో, ఆయిల్ రేట్లు పెంచాలన్న తన ప్రతిపాదనను విరమించుకుంది.

## ఫ్రాన్సు

ఆగస్టు 31 నుండి, చేపలు పట్టేవాళ్ళు 3రోజుల పాటు ఫ్రెంచి ఓడరేవులన్నింటినీ దిగ్బంధనం చేశారు. దాంతో, చానెల్ టన్నెల్ నుండి వాహనాల రాకపోకలను మూసేసుకోవాల్సి వచ్చింది. సెప్టెంబర్ 4 నుండి ట్రక్కు యజమానులు కలాయిస్ పట్టణంలో వున్న యూరోపియన్ సొరంగ ప్రవేశ ద్వారాలను, అనేక జాతీయ రహదారులను దిగ్బంధనం చేశారు. ఫ్రెంచి రివేరా మీదున్న నైస్ ఓడరేవును ట్రక్కు డ్రైవర్లు దిగ్బంధించారు. అలాగే, వాళ్ళు దేశంలో 60 ప్రముఖ ఆయిల్ రిఫైనరీలను, డిపోలను కూడా దిగ్బంధించారు. వాయువ్య ఫ్రాన్స్‌లోని బోర్డియాక్స్ నుండి నడిచే హైస్పీడ్ రైళ్ళ రాకపోకలను అడ్డుకోవటమేగాక, రైల్వే ట్రాక్‌కు అమర్చిన చెక్క పలకలను కూడా తగలబెట్టారు. దాంతో, రైళ్ళ రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటమేగాక జాప్యం కూడా జరిగింది. ప్రజల అసంతృప్తిని తగ్గించటానికి, సెప్టెంబర్ 12న ఫ్రెంచి ప్రభుత్వం ట్రక్కు యజమానులు, రైతులకు 15 శాతం పన్ను మినహాయించింది. దాంతో కొంతమంది విరమించుకున్నా, ఇతరులు తమ రోడ్ల దిగ్బంధనను కొనసాగించారు. ట్రక్కు యజమానులు తమ దిగ్బంధనను విరమించినా, డ్రైవింగ్ స్కూల్స్ యజమానులు, అంబులెన్స్‌ల డ్రైవర్లు, దుకాణాల్లో పనిచేసే ఉద్యోగస్తులు చెదురుమదురుగా అయినా రోడ్ల దిగ్బంధనం గావించారు.

## బ్రిటన్

గత 25 ఏళ్ళలో కనీ వినీ ఎరుగని ఆయిల్ సంక్షోభాన్ని బ్రిటన్ చవిచూసింది. ట్రక్కుల యజమానులు, రైతులు బ్రిటన్‌లోని ఆయిల్‌శుద్ధి కేంద్రాలను, డిపోలను దిగ్బంధనం చేసారు. సెప్టెంబర్ 12 నాటికి, బ్రిటన్‌లోని 13,000 పెట్రోల్ పంపులలో సగం బంక్‌లు, ఆయిల్ లేక మూతబడినాయి. దాంతో దేశ వ్యాప్తంగా ఒక భీతావహ పరిస్థితి ఏర్పడింది. ఎక్కడి చెత్త అక్కడే నిలచిపోయింది. ఆసుపత్రులు అత్యవసర సర్వీసులను రద్దు చేసాయి. సూపర్ మార్కెట్‌లకు ఆహారోత్పత్తులు చేరటం ఆగిపోయింది. పోస్టాఫీసులు ఉత్తరాలను బట్వాడా చేయటం ఆపుకున్నాయి. సెప్టెంబర్ 15 నాటికి, 150 స్కూల్స్ మూతబడటమేగాక, సూపర్ మార్కెట్లలో ఆహార నిల్వలు నిండుకోవటం మొదలైంది. దుకాణ యజమానులు దుకాణాలు మూసి వేస్తున్నట్లు తమ సిబ్బందికి నోటీసులు ఇచ్చారు. ఆయిల్ కొరత వలన రైళ్ళు కూడా రద్దయినాయి. పెరిగిన ధరలకు వ్యతిరేకంగా ట్రక్కర్లు, చిన్న వ్యాపారస్తులు, రైతు సంఘాలు, మోటారిస్టుల మధ్య బలమైన ఐక్యత ఏర్పడింది.

సెప్టెంబర్ 12న, ప్రధానమంత్రి టోనీ బ్లెయిర్ ఎమర్జెన్సీ విధించే అవకాశాన్ని చర్చించటం కోసం లండన్‌కి పరుగెత్తుకొచ్చాడు. ఆందోళనకారులను బెదిరిస్తూ వెంటవెంటనే మూడు రోజుల్లోనే 3 పత్రికా ప్రకటనలు ఇచ్చాడు.

ఆయిల్ ధరల అమ్మకాలవల్ల ప్రభుత్వానికి అప్పనంగా లాభాలు వస్తున్నా, టోనీ బ్లెయిర్ ఆయిల్ ధరల పెంపును వెనక్కి తీసుకోవటానికి ఏ మాత్రం సిద్ధపడలేదు. సెప్టెంబర్ 13న పార్లమెంట్ భవనం ముందు తమ ట్రక్కులన్నింటినీ మోహరించటానికి డ్రైవర్లు ప్రయత్నించగా, పోలీసులు ట్రక్కులను అడ్డుకున్నారు. ప్రభుత్వం తన 'అత్యవసర' అధికారాల్ని వినియోగించుకుంటూ సైన్యాన్ని రంగంలోకి దించింది. భారీ పోలీసు రక్షణ మధ్య 80 మిలటరీ టాంకులు కొంత పెట్రోల్, డీసిల్‌ను పెట్రోల్ బంక్‌లకు చేర్చ గలిగాయి. చివరకు, ప్రభుత్వ బెదిరింపులకు లొంగి, దిగ్బంధనం విరమించబడింది.

ఈ విధంగా, బడా పారిశ్రామిక వర్గం పట్ల తన కుక్క విశ్వాసాన్ని కుహనా 'లేబర్ ప్రభుత్వం' రుజువు చేసుకుంది. ప్రజా వ్యతిరేక, బడా పారిశ్రామిక వర్గ అనుకూల విధానాలతో, అభివృద్ధి నిరోధకత్వంలో కన్సర్వేటివ్ పార్టీ కంటే సారాంశంలో ఏ మాత్రం తీసిపోననీ రుజువు చేసుకుంది. యూరోపియన్ యూనియన్ దేశాల్లో ఒక్క బ్రిటన్ మాత్రమే పెద్ద మొత్తంలో ఆయిల్‌ను సొంతంగా ఉత్పత్తి చేస్తుంది. అందువల్ల దేశంలో తక్కువ ధరకే క్రూడ్ ఆయిల్ లభ్యమవుతున్నా, 76 శాతం పన్ను విధింపుల వల్ల యూరప్‌లోకెల్లా బ్రిటన్‌లోనే పెట్రోల్ రేటు అధికంగా వుంది. వాస్తవానికి, అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరిగినందువల్ల బ్రిటన్‌కు సంవత్సరానికి 5.7 బిలియన్ల డాలర్ల అదనపు ఆదాయం వస్తుంది. అయినా, బ్రిటన్ ప్రభుత్వం పన్నులు తగ్గించటానికి ఏ మాత్రం సిద్ధపడలేదు.

## బెల్జియం

సెప్టెంబర్ 8వ తేదీన, బెల్జియంలోని ప్రధాన రవాణా సమాఖ్య,

బ్రస్సెల్స్‌లో నిరసన ప్రదర్శన జరిపింది. బ్రస్సెల్స్‌లోనే, సెప్టెంబర్ 14న భారీ నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఆరోజు ట్రక్కుల యజమానులు, టూరిస్ట్ బస్ ఆపరేటర్లు, టాక్సీ డ్రైవర్లు తమ వాహనాలు తీసుకొచ్చి రోడ్లమీద నిలబెట్టి, అతి నెమ్మదిగా డ్రైవ్ చేస్తూ, నగరం మొత్తాన్ని స్థంభింప జేశారు. దాని ఫలితంగా, వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలు మూత వేసుకోవాల్సి వచ్చింది. వాళ్ళు సిటీలోని విశాల మార్గాల్లో, మోటార్ వాహనాల మార్గంలోను, జర్మనీ, ఫ్రాన్స్, నెదర్లాండ్స్‌లకు వెళ్ళే సరిహద్దు మార్గాలలోనూ తమ వాహనాలను ఆపి ట్రాఫిక్‌ని అస్తవ్యస్తం చేసారు. నూనెశుద్ధి కర్మాగారాలు, ఆయిల్ డిపోలు దిగ్బంధనం చేయటంతో, వందలాది పెట్రోల్ బంక్‌లు ఆయిల్ లేక మూతబడినాయి. దక్షిణ బెల్జియంలో చార్లెరోయి పట్టణం దగ్గర వున్న అతి పెద్ద ఆయిల్ శుద్ధి కర్మాగారాల్ని ట్రక్కర్లు దిగ్బంధనం చేసారు. వాళ్ళు అంట్‌వర్ప్ ఓడరేవును కూడా దిగ్బంధనం చేయటంతో దాని కార్యకలాపాలన్నీ నిలచిపోయినాయి.

## స్పెయిన్

దాదాపు లక్షమంది రైతులు, తమ ట్రాక్టర్లతో సహా మాడ్రిడ్, ఇతర డజను స్పానిష్ పట్టణాలకు తరలి వచ్చి  పెరిగిన ఆయిల్ ధరలకు పరిహారం చెల్లిస్తూ తమతో ఒప్పందం చేసుకోకపోతే, తీవ్ర చర్యలు చేపడ్తామని హెచ్చరించారు. అందులో అతిపెద్ద ప్రదర్శన సర్‌విల్లేలో జరిగింది. అక్కడ 4 వేల ట్రాక్టర్లతో రైతులు ప్రధాన రహదారులన్నిటినీ దిగ్బంధనం చేసారు. దేశంలోని 34 రాష్ట్రాలకు ఆందోళన, ప్రదర్శనలు విస్తరించాయి. బార్సెలోనాలో జాలర్లు ఓడరేవును దిగ్బంధించి, మరిన్ని దిగ్బంధనాలు చేస్తామని హెచ్చరించారు. రైతులు, ట్రక్కర్లు, జాలర్లు, లారీ డ్రైవర్లతో ఏర్పడిన ఆయిల్ వినియోగదారుల గ్రూప్, దేశంలోని అతిపెద్దదైన 'రెప్సోల్' పెట్రోల్ కంపెనీని బహిష్కరించాలని పిలుపునిచ్చింది.

## జర్మనీ

దేశ వ్యాప్తంగా దిగ్బంధనాలు కొనసాగాయి. సెప్టెంబర్ 15న ట్రక్కర్లు చెవులు చిల్లులు పడేలా హారన్లు మోగిస్తూ, నత్తనడకను స్ఫురణకు తెచ్చేలా అతి నెమ్మదిగా వాహనాలు నడుపుతూ హానోవర్, ఇతర పట్టణాలలో ట్రాఫిక్‌ను స్తంభింప జేసారు. హాంబర్గ్ ఇన్నర్ రింగ్‌రోడ్‌ను చుట్టుముట్టిన దాదాపు 3వేల ట్రక్కులు, టాక్సీలు, బస్‌లు నిలిపి, హారన్ల మోతలతో హోరెత్తించారు. దానివలన ప్రజలకు అసౌకర్యం ఏర్పడినా, దానిపై జరిపిన అభిప్రాయ సేకరణలో 70 శాతం మంది ప్రజలు వాళ్ళ చర్యలకు మద్దతు తెలిపారు. కానీ, అధికార 'సోషలిస్టు' పార్టీకి చెందిన దేశీయాంగ మంత్రి మాత్రం, 'చట్టవిరుద్ధ' దిగ్బంధనాలు తొలగించటానికి తాను ఫెడరల్ సరిహద్దు గస్తీ అధికారులను వినియోగిస్తానని బెదిరించాడు. పైగా, పెరిగిన ఆయిల్ ధరలమీద పన్నులు తగ్గించటానికి సిద్ధపడినందుకుగాను ఇతర యూరోపియన్ దేశాలపై జర్మనీ ప్రభుత్వం దుర్మార్గంగా విరుచుకు పడింది.

## స్కాండినేవియన్ దేశాలు

ఆయిల్ ధరలు పెరగటంపై ఆగ్రహించిన ట్రక్కర్లు, రైతులు స్వీడన్‌లో ఓడలకు, రైళ్ళకు, ఆయిల్ డిపోలకు తీసుకుపోయే 'సరుకులను' దిగ్బంధనం చేసారు. గోటెన్‌బర్గ్ ఓడరేవులో పనులు నిలిచిపోయాయి. రాజధాని నగరమైన స్టాక్‌హోమ్‌లోనూ, స్వీడన్‌లోని 3వ పెద్ద నగరమైన మాకమోలోనూ రైలు రవాణా స్టేషన్లు దిగ్బంధనం చేయబడ్డాయి.

ఫిన్‌లాండ్‌లో అక్కడక్కడ ట్రక్కర్లు జాతీయ రహదార్లను దిగ్బంధనానికి గురిచేయటం మొదలుకాగానే, ప్రభుత్వం ట్రక్కర్లకు రోడ్ పన్నును తగ్గించింది. నార్వేలోని ట్రక్కర్లు సమ్మె చేస్తామని హెచ్చరించారు. ప్రపంచంలోనే ఆయిల్ ఎగుమతి చేసే దేశాల్లో నార్వే రెండవ అతిపెద్ద దేశమైనప్పటికీ, దాని ధరలు యూరప్‌లోకెల్లా ఎక్కువ.

డెన్మార్క్‌లో ప్రభుత్వంతో జరుపుతున్న చర్చలుగాని విఫలమైతే పోరాటానికి దిగుతామని 1100 మంది ట్రక్కర్లు హెచ్చరించారు.

## యూరప్ అంతటా ప్రదర్శనలు

నెదర్లాండ్స్‌లో దాదాపు వారం రోజులపాటు ట్రక్కర్లు జాతీయ రహదార్లను స్తంభింపజేశారు. మొదట్లో పెరిగిన ధరలపై ఎటువంటి రాయితీలు ఇవ్వననీ బెట్టుచేసిన డచ్ ప్రభుత్వం, తర్వాత టాక్సీ, బస్, ట్రక్కుల కంపెనీలకు 300 మిలియన్ డాలర్ల దాకా పరిహారం ఇవ్వటానికి ఒప్పుకుంది.

ఐర్లాండ్‌లో, దాదాపు జాలర్లు అందరూ తమ బోట్లను కట్టివేసి 24 గంటల పని బంద్‌ను పాటించారు. హంగరీలో ట్రక్కర్లు ఆందోళన చేపడతామని హెచ్చరించగా, ప్రభుత్వం 6 శాతం ఎక్సైజ్ పన్ను పెంచటాన్ని వాయిదా వేసింది. ఇజ్రాయిల్‌లో కూడా ట్రక్కర్లు ఒక పథకం ప్రకారం అతి నెమ్మదిగా వాహనాలు నడిపి ఇజ్రాయిల్ వాణిజ్య కేంద్రమైన టెల్ అవీవ్ నగరంలో రహదార్లు అన్నిటిని స్థంభింపజేశారు. 13 శాతం పెంచిన డీజిల్, పెట్రోల్ ధరలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

## ప్రజలకు వ్యతిరేకంగా కుమ్మక్కైన యూరోపియన్ యూనియన్ పాలకులు

అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలను పెంచటంవల్లే చమురు ధరలు పెరిగి పోయాయంటూ యూరప్‌లోని వివిధ దేశాల పాలకులు విమర్శించారు. అదెంత బూటకమో ఆ వెంటనే బయల్పడింది. ఆయిల్ ఉత్పత్తి ఖర్చులవల్ల చమురు ధరలు పెరగలేదని పన్నుల వల్లనే పెరిగాయని ప్రజలు తేల్చివేశారు. వాస్తవానికి, యూరోపియన్ దేశాల్లో, మొత్తం ఆయిల్ ధరలో పన్నుల శాతం 65 శాతం నుండి 70 శాతం వరకు వుంది. దేశాల వారీగా చూస్తే ఆయిల్ ధరలో పన్నుల శాతం నార్వేలో 70%, బ్రిటన్‌లో 76%, ఫ్రాన్స్‌లో 70%, జర్మనీలో 69%, బెల్జియంలో 66%, నెదర్లాండ్స్‌లో 65%, ఇటలీలో 64%, స్వీడన్‌లో 66%, ఫిన్లాండ్‌లో 66%, స్పెయిన్‌లో 58% వుంది. స్పెయిన్‌లో గాలన్ ఆయిల్ ధర 2.8 డాలర్లు రేటు వుండగా, అది నార్వేలో 4.3 డాలర్లగా వుంది. ఈ విధంగా, ప్రజలకు నిత్యావసరంగా మారిన ఆయిల్ మీద ఎక్కువ పన్నులు వేస్తూ, ప్రజల్ని పీల్చి పిప్పి చేస్తూ పెద్ద మొత్తంలో డబ్బులు పిండుకుంటున్నారు యూరోపియన్

పాలకులు.

తాటిచెట్టు ఎందుకు ఎక్కావంటే, దూడ గడ్డి కోసం అన్న చందంగా అధిక మొత్తంలో పన్నులు విధించటం వలన, ఆయిల్ వినియోగం తగ్గి, ఆ విధంగా పర్యావరణంకు మేలు జరుగుతుందని ప్రభుత్వాలు సమర్థించుకుంటున్నాయి. అధిక మొత్తంలో పన్నుల భారాన్ని మోపుతూ, ప్రజల్ని కొల్లగొడుతున్న తమ విధానాలను సమర్థించుకోవటానికి గ్రీన్స్ పార్టీ, సోషల్ డెమోక్రాట్‌లు ప్రదర్శిస్తున్న మరో వంచనా శిల్పమే ఇది. పెట్టుబడిదారీ విధానంచే రూపొందించబడిన ప్రస్తుత జీవిత విధానంలో, అధిక పన్నుల విధింపువలన ఆయిల్ వినియోగం తగ్గుతుందనే ఆలోచనే ఎంతో అసంబద్ధమైంది. ఉదాహరణకు సౌకర్యాల కల్పనలో నాసిరకంగా వుండి, అధిక మొత్తంలో ఛార్జీలు వసూలు చేస్తున్న ప్రభుత్వ రవాణా వ్యవస్థ, కుటుంబాలను ప్రైవేట్ కార్లు ఉపయోగించేలా ప్రోత్సహిస్తున్నది. దీన్ని దృష్టిలో వుంచుకున్నపుడు ప్రపంచ వ్యాప్తంగా రోజు రోజుకు ఆయిల్ వినియోగం పెరుగుతూందన్నా, 1995లో రోజుకు 60 మిలియన్ బారల్స్ నుండి 69 మిలియన్ బారెల్స్‌కి, 2000 నాటికి రోజుకు 75 మిలియన్ బారల్స్‌కి చమురు వినియోగంకు చేరిందన్నా ఏ మాత్రం ఆశ్చర్యం గొల్పదు.

సెప్టెంబర్ 9న యూరోపియన్ యూనియన్ ఆర్థిక మంత్రులు ఫ్రాన్స్‌లో ఒక అత్యవసర సమావేశం జరిపారు. పన్నులలో కోత విధించాలని ప్రజలు చేస్తున్న డిమాండ్లను ఉమ్మడిగా వ్యతిరేకించాలనే నిర్ణయానికొచ్చారు. ఈ విధంగా, యూరోపియన్ యూనియన్ యూరోపియన్ ప్రజలకు వ్యతిరేకమైనదని, బడా పెట్టుబడిదార్ల సంస్థేనని తేటతెల్లం చేసుకుంది. అయితే, ప్రజలు చేపట్టిన మిలిటెంట్ చర్యలు, అవి మరింతగా పెరగవచ్చునే భయంతోటి అనేక ప్రభుత్వాలకు కొన్ని రాయితీలనైనా ప్రకటించక తప్పలేదు. ప్రకటించిన రాయితీలు కూడా, ఎక్కువగా, సమ్మెలో వున్న నిర్దిష్ట సెక్షన్స్‌కే గాని, విస్తృత ప్రజానీకానికి ఉద్దేశించినట్టివి కాదు. అలాగే, ఈ ఉద్యమాలన్నీ దాదాపుగా యాదృచ్ఛికంగా వచ్చినవే కాక, అవి ఆర్థిక వాదంతో నిండిపోయాయి. దాంతో, పెంచిన ధరల భాగం విస్తృత ప్రజానీకం భరించాల్సే వుంది అన్న వాస్తవాన్ని దృష్టిలో వుంచుకోకుండా కొన్ని సెక్షన్లకు కొద్దిగా రాయితీలు లభించగానే వాళ్ళు ఉద్యమాలను విరమించేశారు.

ప్రజల్లో రగులుతున్న ఈ అసంతృప్తి జ్వాల భవిష్యత్‌లో అనివార్యంగా బద్దలవుతుంది. అయితే రాజీలకు, షరతులకు లొంగిపోయే పద్ధతులకు భిన్నంగా ఒక నిజమైన కార్మికవర్గ పార్టీ మార్గదర్శకత్వం వహించగల్గితేనే, ఈ అసంతృప్తులన్నింటినీ విప్లవ మార్గంలో నడిపించగలదు. ఒకవేళ, రాజీలు ఏమైనా చేసుకున్నా, అవి విస్తృత ప్రజానీకంకు ప్రయోజనం చేకూర్చేవి అవుతాయేగాని, అందులో కొద్ది సెక్షన్ ప్రజల ప్రయోజనాల కొరకు కాదు. ఇప్పటిదాకా నడచిన పోరాటాల గుణపాఠాలు విప్లవ బీజాలను మొలకెత్తిస్తాయనటంలో ఏ మాత్రం సందేహం వుండాల్సిన పనిలేదు. యూరప్ ఖండ ప్రజల ఐక్య మిలిటెంట్ చర్యలు శక్తిమంతులైన యూరప్ పాలకుల ముకుదాళ్ళు పట్టి ఎంత సులభంగా కిందికి లాగగలవన్న విషయాన్ని ప్రస్తుత చమురు ధరల పెంపుదల వ్యతిరేక పోరాటాలు నిరూపించాయి. ❑

(33వ పేజీ తరువాయి...)

జరుగుతున్న పరిస్థితిలో ప్రజలమీద జరుగుతున్న తీవ్రదాడులపట్ల అసంతృప్తిగా ఉన్నారు. వాళ్ళలో నిరాశావాదులు, పర్యావరణకారులు, అరాచకవాదులు మొదలుకుని సోషలిస్టుల వరకు వున్నారు. వాళ్ళలో ఎక్కువమందికి అస్పష్టమైన భావవాద వ్యూహాలు తప్ప, ప్రస్తుత వ్యవస్థకి ప్రత్యామ్నాయం గురించిన ఆలోచన లేదు. నిర్దిష్టమైన ప్రత్యామ్నాయం, దానికనుగుణమైన పని పద్ధతుల్లో, ప్రజల దైనందిన సమస్యలమీద పోరాటాలు నడవకపోతే, అటువంటి పోరాటాలన్నీ వాటంతటవే సమసిపోతాయి. అలాంటి ప్రత్యామ్నాయం 'సోషలిస్టు వ్యవస్థ' తప్ప మరొకటి కాదు. అది, విప్లవం ద్వారా ప్రస్తుతమున్న దోపిడీ వ్యవస్థను కూలదోయటం ద్వారానే సాధ్యపడుతుంది.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సోషలిస్టు శక్తులు వెనుకపట్టు పట్టి వున్న స్థితిలో, రివిజనిజం వలన ప్రజల్లో 'కమ్యూనిజంమీద అపనమ్మకం' ఏర్పడిన ఫలితంగా, స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రజల అసంతృప్తిని దారి మళ్ళించ బూనుకోవటమే కాక, ఆందోళనలను ప్రభుత్వాలకు ఆమోదయోగ్యమైన మేరకు, పరిమిత పద్ధతుల్లోకి మళ్ళిస్తున్నారు. స్వచ్ఛంద సేవాసంస్థలు వ్యవస్థకు రక్షణ కవచాల్లాగ పనిచేస్తున్నాయి. సామ్రాజ్యవాదులపైన ప్రజల ఆగ్రహం, మిలిటెంట్ రూపం తీసుకుని వాళ్ళని ముంచెత్తకుండా, సామ్రాజ్యవాదుల ప్రయోజనాలు నెరవేర్చటానికే ఈ విధంగా చేస్తున్నాయి. అందులో ఎక్కువ సంస్థలు సామ్రాజ్యవాదుల దారుణ దోపిడీ పీడనలను వ్యతిరేకించటం కంటే, సోషలిజంమీద, కమ్యూనిజం మీదనే తీవ్రంగా దాడి చేస్తున్నాయి. అయితే, ఆ ప్రదర్శనలను, ఉద్యమాలను వాళ్ళెంత 'పరిమితుల్లో' నడపాలని చూసినా, అవి ఎల్లకాలం 'శాంతియుత పరిమితుల్లో' వుండవు.

ప్రపంచ వ్యాప్తంగా మావోయిస్టు విప్లవకారుల, విప్లవోద్యమ ప్రభావం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితిలో, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నిజాయితీతో పోరాడుతున్న వాళ్ళందరూ విప్లవ ప్రత్యామ్నాయాన్నే ఎంచుకుంటారు. ఇవ్వాళ, ఈ బందిపోట్లను అత్యంత భయపెడుతున్న అంశం ఇదే! ❑

> ''స్త్రీలను మనం సామాజిక కార్యకలాపాల్లోకి, మిలీషియాలోకి, రాజకీయ జీవితంలోకీ తీసుకురాకపోతే, మనం స్త్రీలను ఇల్లు, వంటగది అనే జడజీవాల లేని వాతావరణం నుండి స్త్రీలను అమాంతం బైటకు లాగకపోతే, నిజమైన స్వాతంత్ర్యాన్ని సాధించడం అసాధ్యం. సోషలిజాన్ని సరే, అసలు ప్రజాస్వామ్యాన్ని కూడా మనం నిర్మించలేక పోతాం.'' – లెనిన్

# సియాటిల్ నుండి నైస్ దాకా-ప్రజల ఆగ్రహాన్ని చవిచూస్తున్న సామ్రాజ్యవాదులు

సియాటిల్ సమావేశం దగ్గర నుండీ, అంతర్జాతీయ మాఫియా ముఠాల సమావేశం ఏదీ, ప్రజానీకం వీధుల్లోకొచ్చి కొట్లాడుతున్న సంఘటనలు లేకుండా సాఫీగా జరగలేదు. డబ్ల్యు.టి.ఓ. గానీ, ఐ.యం.యఫ్.గానీ, ప్రపంచబ్యాంక్‌గానీ లేక ఇతర సామ్రాజ్యవాద సమావేశాలుగానీ, ఏదైనాగానీ అవి ప్రజల తీవ్ర ఆగ్రహావేశాల్ని చవిచూడాల్సి వచ్చింది. సాయుధ పోలీసుల గట్టి భద్రతా వలయం లేకుండా వాళ్ళు తమ సమావేశాలను సజావుగా జరుపుకోలేక పోయారు. సియాటిల్ తర్వాత వాషింగ్టన్, దావోస్, కాన్‌బెర్రా, థాయ్‌లాండ్, ప్రేగ్‌లలోనూ ఇలాగే జరిగింది. ఇప్పుడు నైస్‌లోనూ అదే పునరావృతమైంది.

ఫ్రాన్స్ దేశంలోని నైస్‌లో 2000 సం॥ డిసెంబర్ 7 నుండి 11 వరకు యూరోపియన్ యూనియన్ చరిత్రలోకెల్లా అతి సుదీర్ఘమైన శిఖరాగ్ర సమావేశం జరిగింది. యూరోపియన్ యూనియన్‌ను ఏ విధంగా విస్తరించాలి అన్న విషయంమీద చర్చించటానికి ఏర్పాటైన ఆ సమావేశంలో, హాజరైన ప్రతినిధులు ఆ విషయమై ఒకరినొకరు తీవ్ర పదజాలంతో దూషించుకొంటూ కీచులాడుకోగా, బయట వీధుల్లో హోరాహోరీ పోరాటాలు జరిగాయి. 4 ప్రధాన సమస్యలమీద చర్చలు జరిగినా, ఒక్క దానిమీద కూడా వాళ్ళు చర్చను తెమల్చలేక పోయారు. వాళ్ళ కీచులాటంతా ఒక్కొక్క సభ్యునికుండే ఓటు, ఇతర అధికారాల గురించి, అలాగే విస్తరించే యూరోపియన్ యూనియన్‌లో తమ ప్రాబల్యం ఏ మేరకు వుంటుంది, ఎంతవరకు ఉపయోగించుకోగలం అన్న వాటిమీదే! టర్కీ, సైప్రస్, మాల్టాలతో పాటుగా తూర్పు యూరప్ నుండి, బాల్కన్ నుండి అదనంగా 13 దేశాలను సభ్యులుగా చేర్చుకోవటం ద్వారా అది ప్రపంచంలోనే అతిపెద్ద వాణిజ్య కూటమి అవుతుంది. దాంట్లో, అతి శక్తివంతమైన సభ్య దేశాలైన ఫ్రాన్స్, జర్మనీలు యూరోపియన్ యూనియన్‌మీద తమ నియంత్రణను పెంచుకోవటానికి కొట్లాడు కుంటుండగా, అదే సమయంలో, బ్రిటన్ అమెరికాతో తనకున్న 'ప్రత్యేక సంబంధాలను' అట్టిపెట్టుకోవాలని చూస్తుంది. చివరకు కుదిరిన ఒప్పందంలో, ఇ.యు. జర్మనీలో అతిపెద్ద దేశమైన యూరోపియన్ యూనియన్‌పై పెత్తనం చెలాయించటానికి కావలసిన కొన్ని పెద్ద రాయితీలను పొందగలిగింది. ఆ సమావేశం, యూరోపియన్ యూనియన్ మీద 'బిగ్‌ఫోర్' దేశాలైన జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్, ఇటలీల పట్టును మరింత బిగించింది, అదే సమయంలో 'చిన్న దేశాలు' పక్కకు నెట్టివేయ బడినాయి.

ఇది బెల్జియం, పోర్చుగల్, లక్సెంబర్గ్, ఆస్ట్రియా మొదలైనటువంటి దేశాలలను నిస్సహాయ స్థితిలోకి నెట్టేసింది. ప్రతి దేశానికి కేటాయించిన ఓట్లను 'బిగ్‌ఫోర్' దేశాలకు అనుకూలంగా తిరిగి ప్రామాణీకరించారు.

సమావేశం జరిగిన 4రోజులు నైస్ పట్టణం అక్షరాలా సాయుధ బలాల స్వాధీనంలో వుంది. వీధులలో 6వేల మంది పోలీసులు గస్తీ తిరిగారు. హెలికాప్టర్లు ఆకాశంలో ఎగురుతూ పహరా కాసాయి. 'షార్ప్ షూటర్స్', తుపాకులు ఎక్కుపెట్టి, బిల్డింగ్‌లపైన పొజిషన్లు తీసుకున్నారు.

యూరప్ అంతటినుండీ, ఫ్రెంచి, స్పెయిన్, జర్మనీ, డచ్, ఇటలీ, పోర్చుగీస్ మొ॥న దేశాల నుండి లక్షమందికి పైగా నిరసనకారులు నైస్ పట్టణానికి చేరుకున్నారు. సాయుధ బలోపేతులైన పోలీసులకు, నిరసనకారులకు మధ్య భీకర కొట్లాటలు జరిగాయి. ప్రదర్శనకారులు పోలీసుల మీదకు 'మాల్టోవ్ కాక్‌టెయిల్స్ (మధ్య మిశ్రమం) విసరడంతోపాటు, షాపుల అద్దాలను పగులగొట్టడం, కార్లను తలకిందులు చేయటంతోపాటు ఒక బ్యాంకుకు నిప్పుకూడా పెట్టారు. నిరసనకారులని చెదరగొట్టడానికి పోలీసులు టియర్‌గాస్ వదిలారు. ఆ ఘర్షణలో 20 మంది పోలీసులు గాయపడగా, ఒక పోలీస్ తీవ్రంగా గాయపడ్డాడు. దాదాపు 100 మంది నిరసనకారులని పోలీసులు అరెస్టు చేసారు.

యూరోపియన్ యూనియన్ అధినేతలకు ఈ సమావేశం ఇచ్చిన దుబారా విందు పార్టీల గురించి సామ్రాజ్యవాద మీడియా దమ్మిడీకి కొరగాని జగడాలకు దిగుతుండగా మరోవైపున ప్రజా పోరాటం ఉగ్రరూపం దాల్చింది.

ఈ ప్రదర్శనకారుల్లో వివిధ దృక్పథాలు కల్గిన అసమ్మతివాదులున్నారు. ప్రపంచీకరణ

(తరువాయి 32వ పేజీలో...)




నైస్ పట్టణంలో ఇ.యు.కి వ్యతిరేకంగా ప్రజల భారీ ప్రదర్శన

# మయన్మార్ మిలటరీ కుట్రదారుల మతాతో భారత్ పాలకుల కుమ్మక్కు! ఈశాన్య భారత్ శాంతి ప్రక్రియ!!

వంచనకు కూడా హద్దుంటుంది. మిలటరీ నియంతృత్వానికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాలని ప్రతి అంతర్జాతీయ సభల్లో భారత పాలకులు గగ్గోలు పెడుతున్నారు. అయినప్పటికీ, మయన్మార్ సైనిక ముఠాకు చెందిన అత్యున్నత అధికారుల్ని భారత పాలకులు రాచమర్యాదలతో ఆహ్వానించారు.

ఆరు నెలల క్రితమే, అలీనోద్యమ వేదికపై భారత ప్రతినిధులు ప్రజాస్వామిక ప్రభుత్వాలను కూలదోసి అధికారం చేజిక్కించుకున్న మిలటరీ ప్రభుత్వాలను బహిష్కరించాలని తీవ్రంగా వాదించారు. మిలటరీ కుట్ర తరువాత పాకిస్తాన్‌ను బహిష్కరించాలని కామన్‌వెల్త్ మహాసభలో భారత ప్రతినిధులు గట్టిగా అరచి డిమాండ్ చేశారు. ఫిజీలో మహేంద్ర చౌధురి ప్రభుత్వాన్ని తొలగించటం ద్వారా అధికారాన్ని చేజిక్కించుకున్న మిలటరీ కుట్రదారుల పాలనను వ్యతిరేకిస్తూ అది పెద్ద నాటకాన్ని ప్రదర్శించింది. అమెరికాతో కలిసి పోలెండ్‌లో ప్రజాస్వామ్య దేశాల మహాసభను ఏర్పాటు చేసిన సహాధ్యాయుల్లో ఒకటిగా, ప్రపంచ సమాఖ్యల నుండి మిలటరీ కుట్రదారుల్ని వేరు చేయవలసిన అవసరం గురించి, ప్రజాస్వామ్య దేశాల గురించి ఆ మహాసభలో భారత్ తన వాక్చాతుర్యాన్ని ప్రదర్శించింది.




కానీ, ఎన్నికల్లో 80% ఓట్లతో గెలిచిన ఆంగ్‌సాన్ సూకీని అరెస్ట్ చేసిన తర్వాత, ఈ మయన్మార్ మిలటరీ ప్రభుత్వం, 1990లో కుట్రద్వారా అధికారంలోకి వచ్చింది. అయినప్పటికీ, ''ప్రజాస్వామిక ప్రభుత్వాలను తొలగించడం ద్వారా అధికారాన్ని చేజిక్కించుకున్న మిలటరీ ప్రభుత్వాల బహిష్కరణ'' గురించి అలీనోద్యమ వేదికపై మొరిగినప్పటికీ, భారత ప్రభుత్వం మయన్మార్ నెంబర్ టూ నాయకుడు జనరల్ మౌంగ్ అయె కి ఎర్ర తివాచీ పరిచింది. మయన్మార్ ప్రభుత్వ 'శాంతి అభివృద్ధి సంస్థ' ఉపాధ్యక్షుణ్ణి, మామూలుగా ప్రభుత్వాధ్యక్షుల సందర్శనార్థం జరిగే స్వాగత కార్యక్రమంలో రాష్ట్రపతి భవన్‌కు ఆహ్వానించారు.

16 మంది ప్రతినిధులతో కలిసివచ్చిన ఈ జనరల్ అత్యంత ప్రముఖ మంత్రులతో కలవడమేగాక, భారత సైన్యంతో చర్చలు కూడ జరిపాడు. ఈశాన్య భారత దేశంలో తిరుగుబాటు అణచివేత చర్యలు కేంద్రంగా అతడు అద్వానీతో వివరంగా చర్చించాడు. ఎన్.ఎస్.సి.యన్. (కప్లాంగ్) గ్రూపుకు చెందిన 5 క్యాంపుల్ని ధ్వంసం చేయటంలో మయన్మార్ సహకరిస్తుందని అద్వానీ గర్వంగా ప్రకటించాడు. మయన్మార్ మిలటరీ జనరల్స్‌తో ఈశాన్య భారత స్వాతంత్ర్య పోరాట వాదులకు వ్యతిరేకంగా తిరుగుబాటు అణచివేతలో 'సహకారంపైనే భారత్ ప్రధానంగా చర్చించినప్పటికీ, ప్రత్యేకించి చమురు, సహజ వాయు రంగంలో ఆర్థిక సహకారంపైన కూడా చర్చ జరిగింది. జలవిద్యుత్ రంగం, రోడ్ల నిర్మాణం, మయన్మార్, బంగ్లాదేశ్ భూభాగం గుండా పైప్‌లైన్ వ్యవస్థ నిర్మాణం గురించి కూడా, ఉమ్మడి ప్రాజెక్ట్‌ల మీద చర్చ జరిగింది. మయన్మార్, భారత దేశాల మధ్య 1980-81లో 13 మిలియన్ డాలర్లు వున్న వాణిజ్యం 1999-2000 సం॥లో 194 మిలియన్ డాలర్లకు పెరిగింది.

సిద్ధాంతాలను గాలికొదిలేసి మయన్మార్ మిలటరీ జనరల్స్‌తో సన్నిహిత సహకారాన్ని పెంపొందించుకోవటంలో భారత పాలకులకు రెండు విధాల ప్రయోజనం పొందే లక్ష్యం వుంది. మొదటిది, ప్రత్యేకించి, మయన్మార్ భూభాగంలోని తిరుగుబాటుదారుల క్యాంపులకు వ్యతిరేకంగా, ఈశాన్య భారత దేశంలో తిరుగుబాటు అణచివేత చర్యల్లో మయన్మార్ సహాయాన్ని ఉపయోగించుకోవడానికి ప్రయత్నించటం. రెండవది, (తిరుగుబాట్లు శాంతించిన తరువాత) ఈశాన్య రాష్ట్రాలపై తూర్పు ఆసియా మార్కెట్ల ఆర్థిక దోపిడీకి సంబంధాలు కలపడానికి ప్రయత్నిస్తూ, తూర్పు ఆసియాకు మయన్మార్‌ను ద్వారంగా చేయ ప్రయత్నించటం. మొదటి దాంట్లో కీలకాంశం, మయన్మార్ సహాయాన్ని ఉపయోగించుకుంటూ, సాయుధ అణచివేత, శాంతి చర్చల సమ్మేళనంతో నాగా జాతి పోరాటాన్ని అణిచివేయటం. రెండవ దాంట్లో చమురు అన్వేషణ పునఃప్రారంభం, విదేశీ పర్యటన ఇతర అభివృద్ధి రంగాలను రోడ్డు మార్గంతో మయన్మార్ గుండా ఇతర తూర్పు ఆసియా దేశాలకు కలపటం.

ఈ రెండు అంశాల గురించి చూద్దాం.

### 1. ఈశాన్య భారత్ స్వాతంత్ర్య పోరాటాల అణిచివేత

భారత మయన్మార్ సరిహద్దు 1600కి.మీ.ల పొడవైనది. ఈ ప్రాంతంలో సరిహద్దు మీదుగా రహదారుల వ్యవస్థను నిర్మించటం తిరుగుబాటు అణచివేత చర్యల్లో ముఖ్యమైన అంశం. భారతదేశంలోని టాము నుండి మయన్మార్‌లోని కాలిమ్యో వరకు 165 కి.మీ. రోడ్డును భారతదేశం ఇప్పటికే పూర్తి చేసింది. మణిపూర్‌లోని మోరె దగ్గర అంతమౌతూ, భారత జాతీయ రహదారితో కలపనున్న ఈ 'భారత్-మయన్మార్ మైత్రీ రహదారి'ని 2001 ఫిబ్రవరిలో విదేశాంగ మంత్రి జస్వంత్ సింగ్ ప్రారంభించాడు. సరిహద్దుల మీదుగా రోడ్ల వ్యవస్థ రెండు దేశాలకు తిరుగుబాటు

అణచివేత చర్యలకు వెసులుబాటు కల్పిస్తుంది. అంతేగాక, ఈ పర్యటన కాలంలో చిన్, కచిన్ రాష్ట్రాలలో రైల్వే వ్యవస్థ, రహదారుల వ్యవస్థల స్థాయిని పెంచే రూపంలో మయన్మార్ అభివృద్ధికి భారత్ సహాయాన్ని అందించ దలచింది. మయన్మార్ మిలటరీ పాలకులు దశాబ్దాలుగా ఈ రెండు ప్రాంతాల్లో సాయుధ తిరుగుబాట్లు ఎదుర్కొంటున్నారు.

కొద్ది నెలల క్రితం, ముందుగా భారత సైన్యాధ్యక్షుడు జనరల్ వి.పి. మాలిక్ మిలిటెంట్లకు వ్యతిరేకంగా చర్యలకు పథకం రూపొందించటానికి చేసిన యాంగూన్ పర్యటనతో తిరుగుబాటు అణచివేత చర్యల్లో మయన్మార్‌కు ప్రాముఖ్యత ఇవ్వటం కన్పిస్తుంది. ఈ పర్యటన కాలంలో, జనరల్ మాలిక్‌తో కలిసి అద్వానీ కూడ సమాచారం ఎలా ఇచ్చి పుచ్చుకోవాలనే దానిపై పద్ధతులు రూపొందించాడు.

ఈ ప్రాంతంలో శక్తివంతమైనది, చాలా కాలం నుండి కొనసాగుతున్నది అయిన నాగా జాతి పోరాటం మీదనే వీళ్ళు ప్రధానంగా కేంద్రీకరించారు. నేషనల్ సోషలిస్టు కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్ (ఇషాక్-ముయివా) గ్రూప్‌తో చర్చలు నిర్వహిస్తు న్నప్పటికీ, అదే సమయంలో దాన్ని ఎలా నలిపి వేయాలనే దానిపై సైనిక జనరల్స్‌తో భారత పాలకులు పథకాలేస్తున్నారు. వాస్తవంగా, మయన్మార్ సైనిక పాలకుల భారత పర్యటనకు కొద్ది రోజుల ముందు, ఎన్.ఎస్.సి.ఎన్. (ఐ.ఎం.) గ్రూపుతో చర్చలను సాధ్యమైనంత వరకు ఆపుతూ, కేంద్రం తన రక్షణ బలగాలను నాగాలాండ్‌లో పూర్తిగా అప్రమత్తం చేసింది.

ఇది పచ్చి మోసం, భారత పాలకుల విశ్వాస ఘాతుక, రహస్య పద్ధతుల ఫలితంగా నాగాల సహనం నశిస్తున్నది. మూడు సంవత్సరాలకు పైగా సాగదీస్తున్న శాంతి చర్చల మధ్యలో, లొంగిపోయిన మిలిటెంట్ల కోసం నవంబర్ 1న కేంద్రం ఒక పునరావాస పథకాన్ని ప్రకటించింది. కనీసం ఒక్క ఆయుధంతో లొంగిపోయిన నాగా గెరిల్లాల కెవరికైనా వృత్తిశిక్షణ, 12 నెలల వేతనం, డబ్బు ప్రోత్సాహకం ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. చర్చల ద్వారా రాజకీయ పరిష్కారాన్ని సాధించటం మీద శ్రద్ధే వుంటే, ఎన్.ఎస్.సి.ఎన్. (ఐ-యం) యాక్టివిస్టుల లొంగుబాటుకు ప్రభుత్వం ఎందుకు ప్రయత్నిస్తుంది? రాజకీయ పరిష్కారాన్ని సాధించటం కంటే ఎక్కువగా, ఉద్యమాన్ని నీరుగార్చటానికి, లొంగుబాట్లకు వత్తిడి చేయడానికి పనికి వచ్చేదిగా శాంతిని ఉపయోగించుకోవడానికి భారత పాలకులు ప్రయత్నించటాన్ని ఇది చూపిస్తున్నది.

అంతేగాక, బ్యాంకాక్‌లో ముయివా అరెస్టు (2000 జనవరిలో కరాచీ నుండి నకిలీ పాస్‌పోర్ట్ మీద దేశంలోకి ప్రవేశించినందుకు) కాగా, భారత పాలకులు అతన్ని ఉగ్రవాదిగా చిత్రించటం ప్రారంభించి, సాధ్యమైనంత ఎక్కువ కాలం ముయివాను జైల్లో నిర్బంధించేటట్లు ప్రయత్నించమని బ్యాంకాక్‌లోని భారత దౌత్య కార్యాలయానికి ఆజ్ఞలు పంపారు. ఇటీవల బెయిల్‌మీద విడుదలైన ముయివా ''భారత దేశంలో గూఢచార విభాగాలు, నిరంకుశాధికారులు దీనిని రాజకీయ పరిష్కారానికి గల అవకాశంగా చూడ్డానికి బదులు, నాగాలను చీల్చడానికి దొరికిన అవకాశంగా చూస్తున్నారు'' అని ప్రకటించాడు.

బి.జె.పి. మోసం ఏ స్థాయికి చేరిందంటే, దాని విధానాన్ని వ్యతిరేకిస్తూ, శాంతి చర్చల ప్రధాన ప్రతినిధి స్వరాజ్ కౌశల్ (సుష్మా స్వరాజ్ భర్త) 2000 మార్చిలో రాజీనామా చేశాడు. అతడు రాజీనామా చేస్తూ, చర్చల్లో ఇచ్చిన హామీలపై మాట నిలబెట్టుకోనందుకు, మాట మార్చినందుకు వాజ్‌పేయిని దుయ్యబట్టాడు. ఇటువంటి ద్రోహం చేయడం భారత పాలకులకు వెన్నతో పెట్టినదే. ఇప్పటికిది మొత్తం సముద్రంలో నీటి బొట్టంతే మరి. బీజింగ్‌లో చైనీస్ ఆయుధ తయారీ సంస్థతో ఎన్.ఎస్.సి.ఎన్. (ఐ-యం) పెద్ద ఆయుధ బేరానికి చర్చ జరుపుతున్నదని తెలుసుకున్న భారత ప్రభుత్వానికి భీతి పెరగటంలో ఆశ్చర్యం లేదు మరి.

ఇక తరువాత సైనిక అప్రమత్తతకు ఆజ్ఞ జారీ చేసి, అదే సమయంలో మిజోరామ్ ముఖ్యమంత్రి జోనమ్ తంగాను ప్రధాన మంత్రి ప్రతినిధిగా శాంతి చర్చలకు పంపారు. నవంబర్ చివరి వరకు అతడు ముయివా, ఇసాక్ స్వూలతో బ్యాంకాక్‌లో నాలుగ దఫాల చర్చలు జరిపాడు. నాగా శాంతి చర్చలకున్న అడ్డంకులు తొలిగాయని చెప్పాడు.

అక్కడ ప్రజల న్యాయమైన కోరికలను నెరవేర్చటం కాక, సామ్రాజ్యవాదుల, దళారీ బూర్జువాల లూటీకి అనువైన దోపిడీ ప్రాంతంగా తయారు చేయడానికి తోడ్పడుతూ, ఈశాన్య భారత దేశంలో 'శాంతి' కొరకు భారత ప్రభుత్వం ఎంతకైనా తెగిస్తున్నది. తూర్పు ఆసియా మార్కెట్లకు ఈ ప్రాంతాన్ని ముడివేస్తూ, స్వాతంత్ర్య పోరాటాలను అణచివేస్తూ, శాంతిని సాధించేందుకే ఈ ప్రయత్నం.

## 2. ఈశాన్య భార[illegible] లూటీ

నాగాలాండ్‌లో చమురు అన్వేషణ తిరిగి ప్రారంభించడానికి ఓ.యన్.జి.సి. (చమురు సహజవాయు సంస్థ) ఇప్పటికే అనుమతి అడిగింది. నాగాలాండ్‌లో చమురు నిక్షేపాలు సమృద్ధిగా వుండి సంవత్సరానికి 4.5 మిలియన్ బ్యారళ్ళ ముడి చమురును భారతదేశానికి సమకూరుస్తుంది. ఇది స్వదేశీ చమురు ఉత్పత్తిలో 15%. తదుపరి 25 బావులు తవ్వి, రోజుకు 250 టన్నుల ముడిచమురు ఉత్పత్తి చేయనుండగా, 1994లో రాష్ట్ర ప్రభుత్వం నాగాలాండ్‌లో పని ఆపమని ఆజ్ఞ జారీ చేసింది. రాయల్టీ చెల్లింపులపై వివాదాలు, చమురు తీసే రిగ్గులపై ఎన్.ఎస్.సి.యన్. (ఐ-ఎం) దాడులు ఇందుకు కారణం. నాగాలాండ్‌లో భూభాగం జాతిపరమైనదిగా పరిగణించి, చమురు తోడుకున్నందుకు రాయల్టీ చెల్లింపులు రాష్ట్ర ప్రభుత్వానికి గాక, గిరిజనులకు చెల్లించాలని నాగాలు డిమాండ్ చేశారు. దీన్ని సాధించడానికి ఎన్.ఎస్.సి.ఎన్. (ఐ-యం) రెండు రిగ్గుల్ని ధ్వంసం చేసింది.

ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి బదులుగా మయన్మార్, బంగ్లాదేశ్‌ల నుండి భారతదేశానికి చమురు, సహజ వాయువును తీసుకొచ్చే పైప్‌లైన్ వ్యవస్థతో ఈశాన్య ప్రాంతాన్ని ముడి పెట్టడానికి ప్రభుత్వం పథకాలేస్తున్నది.

ఇందులో భాగంగా రెండు ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. 1997 జూన్‌లో బి.ఐ.ఎం.ఎస్.టి.-ఇ.సి. (బంగ్లాదేశ్-భారత్-మయన్మార్-శ్రీలంక-థాయ్‌లాండ్ ఆర్థిక సహకార సంస్థ) అనే ప్రాంతీయ కూటమి ఏర్పాటైంది. ఇకిప్పుడు మెకాంగ్-గంగా సహకారాన్ని (ఎం.జి.సి.) ప్రారంభించేందుకు భారత్, మయన్మార్,

థాయ్‌లాండ్, లావోస్, కాంబోడియా, వియత్నాంలకు సంబంధించిన ఆరు దేశాల మంత్రి వర్గ ప్రతినిధులు, 2000 నవంబర్ 10న లావోషియన్ రాజధాని వియన్‌టైన్లో సమావేశ మయ్యారు. గత సంవత్సర కాలంగా పథకం రూపొందిస్తున్న ఎం.జి.సి. అనే ఈ తక్కువ పటుత్వం కలిగిన కూటమి, భారతదేశం మరియు ఐదు మెకాంగ్ నదీ పరీవాహక దేశాల మధ్య పర్యాటక, సాంస్కృతిక, విద్యా, సమాచార సంబంధాల రంగంలో సహకారంపై శ్రద్ధ వహించటం మీద కేంద్రీకరించే లక్ష్యం గలది.

ఉమ్మడి మార్కెటింగ్‌కు, పర్యాటక మార్కెటింగ్‌కు సంబంధించిన సంస్థల సమావేశాల కోసం 'వ్యూహాత్మక అధ్యయనాలు' నిర్వహించనున్నట్లు, ఈ ప్రాంతంలో ప్రజల ప్రయోజనాలకు అనుకూలతను కల్పించే మెకాంగ్-గంగా మార్గదర్శక సంస్థను ప్రారంభించనున్నట్లు, బహురూప (వివిధ) సమాచార సంబంధాలు, రవాణా సంబంధాల విస్తరణ, ఇంకా ఈ ప్రాంతంలోని సాంస్కృతిక, మతపరమైన, ప్రకృతి ప్రసిద్ధ పర్యాటక ప్రదేశాలకు ప్రతిపాదిత పర్యటనలను ప్రోత్సహించటం జరుగుతుందని ఆ ప్రకటన చెప్పింది. రవాణా సమాచార రంగాల్లో రవాణా వ్యవస్థలను, ప్రత్యేకించి తూర్పు-పశ్చిమ కారిడార్ ప్రాజెక్ట్‌ని, ట్రాన్స్ ఆసియన్ హైవేని అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలు చేపట్టాలని నిర్ణయించటం జరిగింది. మరో విధంగా చెప్పాలంటే ఈ ప్రాంతం మొత్తాన్ని విదేశీ యాత్రికుల వేట స్థలంగా మార్చాలనే దీనర్థం.

ఈ ప్రాజెక్టులలో భారత భాగస్వామ్యం ఈశాన్య భారతం లోంచే మొదలవుతుంది ఎందుకంటే తూర్పు ఆసియా దేశాలతో ఈశాన్య భారతం భౌగోళిక పరంగా అవిచ్ఛిన్న సంబంధంతో వుంది. (పటాన్ని చూడండి) భారత పాలకులు ఇటువంటి రెండు అత్యున్నతమైన బహుపార్శ్విక ఒప్పందాలతో ముందుకెళుతున్నారంటే ఈశాన్య భారతంలో ఏ విధంగానైనా సరే 'శాంతి' కోసం వారు త్వరత్వరగా పథకాలేస్తున్నారనే అర్థం. ఇక్కడి స్వాతంత్రోద్యమాలను లొంగదీసుకునైనా, లేక పాశవికంగా వాటిని అణచివేయటం ద్వారానైనా ఇక్కడ 'శాంతి'ని సాధించాలని పాలకులు చూస్తున్నారు. భారత పాలకుల యుక్తులు, జిత్తులతో ఈశాన్య జాతుల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాల్సి వుంది. భారత విస్తరణవాద పాలక వర్గాల నుండి వేరు పడటంతో సహా, ఈశాన్య జాతుల న్యాయమైన స్వయంనిర్ణయాధికార పోరాటం ప్రజాస్వామిక చైతన్యం కల భారత ప్రజల ఎనలేని మద్దతును పొంది తీరుతుంది. ❑

## విద్యుత్ ప్రైవేటీకరణ - సర్వత్రా వైఫల్యం

ప్రైవేట్ విద్యుత్ ఉత్పత్తిదారులతో మూడో ప్రపంచ దేశాల అనుభవాలు దారుణంగా వుంటున్నాయి. ప్రైవేట్ విద్యుత్ ఉత్పత్తిదారులతో విద్యుత్ సరఫరా విషయమై కుదుర్చుకున్న ఒప్పందాలను అనేక దేశాలు రద్దు చేసుకున్నాయి. ఎన్రాన్‌తో కుదుర్చుకున్న ఈ తరహా ఒప్పందాన్ని క్రొవేషియా రద్దు చేసుకుంది. ఎన్రాన్‌తో ఒప్పందం కుదుర్చుకుంటే తనకు వైట్‌హౌస్‌లో అమెరికా అధ్యక్షుడిని కలుసుకునే అవకాశం లభిస్తుంది కాబట్టి తాను ఒప్పందానికి అంగీకరించినట్లుగా క్రొవేషియా అధ్యక్షుడు చేసిన ప్రైవేట్ సంభాషణలు వీడియో టేపుల ద్వారా బయటపడటంతో ఈ ఒప్పందం వెంటనే రద్దయిపోయింది. ఇండోనేషియాలో సుహార్తో కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, ప్రైవేట్ విద్యుత్ సంస్థలు భారీ ఎత్తున ముడుపులిచ్చి కుదుర్చుకున్న ఒప్పందాల ఫలితంగా అక్కడి ప్రభుత్వ విద్యుత్ సంస్థ ప్రైవేట్ విద్యుత్ కంపెనీలకు హామీపడిన గ్యారంటీలను నెరవేర్చేందుకుగాను స్వల్ప వ్యయంతోనే తాను చేస్తున్న విద్యుత్ ఉత్పత్తిని ఆపుకోవలసి వచ్చింది. ఇండోనేషియా ప్రభుత్వ విద్యుత్ సంస్థ ఒక సం॥రానికి కేవలం రెండు ప్రైవేట్ విద్యుత్ కంపెనీలకు దాదాపు ఒక బిలియన్ డాలర్ల మేరకు రుణపడి పోయింది. దీంతో అది మొత్తం ఒప్పందాలనే తిరిగి చర్చించాల్సి వచ్చింది. ఇక ఫిలిప్పైన్స్ సైతం మహారాష్ట్ర విద్యుత్ సంస్థకు పట్టిన గతినే ఎదుర్కొంటోంది. 32 విద్యుత్ సరఫరా సంస్థల నుండి కొంటున్న విద్యుత్‌కు గాను బిల్లుల చెల్లింపుకు ఫిలిప్పైన్స్ విద్యుత్ సంస్థ విదేశీ రుణాలు తీసుకుంటోంది. ప్రైవేట్ సంస్థలతో ఒప్పందాలను తానిక పునరుద్ధరించనంటూ ఫిలిప్పైన్స్ ప్రభుత్వం తెగేసి చెప్పింది. హంగేరియన్ పార్లమెంట్ సైతం హంగరీ ప్రభుత్వం ప్రైవేట్ విద్యుత్ సంస్థ ఆర్.డబ్ల్యు.ఇ.తో కుదుర్చుకున్న ఒప్పందం చెల్లదని, అది రాజ్యాంగ విరుద్ధమైనదని ప్రకటించింది.

ఇలా మూడో ప్రపంచ దేశాల్లోనే కాదు, విద్యుత్ ప్రైవేటీకరణ లేక నిక్రమబద్ధీకరణ (డి-రెగ్యులేషన్) సమస్య అమెరికాను సైతం చుట్టుముట్టింది. అమెరికాలోకెల్లా అత్యంత సంపద్వంతమైన రాష్ట్రం కాలిఫోర్నియా. ఇది భూమ్మీద అత్యంత పురోగామి పారిశ్రామిక రాష్ట్రంగా పేరొందింది. ప్రపంచ సాఫ్ట్‌వేర్ రంగానికే తలమానికంగా వున్న సిలికాన్ వ్యాలీ ఈ రాష్ట్రంలోనే వుంది. నాలుగేళ్ళ క్రితం అంటే 1996లో విద్యుత్ పరిశ్రమను క్రమబద్ధీకరణ నుంచి తప్పించి ఈ రంగంలో మార్కెట్ శక్తులకు ప్రవేశం కల్పించాలని కాలిఫోర్నియా రాష్ట్రం నిర్ణయించినపుడు అందరూ దాన్నొక 'మూలమలుపు' లాంటి చర్యగా పేర్కొన్నారు. ప్రపంచంలో ప్రతిచోటా చెబుతూ వచ్చినట్లే ఇక్కడ సైతం విద్యుత్ డీ రెగ్యులేషన్ ద్వారా ప్రైవేట్ కంపెనీల సమర్థవంతమైన విద్యుత్ ఆదా చర్యలతో ప్రజలు చెల్లించే విద్యుత్ బిల్లులు 20 శాతంమేరకు తగ్గుతాయని ఆర్భాటంగా ప్రచారం జరిగింది. కానీ డీ రెగ్యులేషన్ తర్వాత విద్యుత్ ధర మెగావాట్‌కి 30 డాలర్ల నుండి 1000 డాలర్లకు అమాంతంగా పెరిగిపోయింది. 1996 నుండి కాలిఫోర్నియాలో విద్యుత్ బిల్లుల రేటు 379 శాతం మేరకు చుక్కలమీదికి ఎక్కి కూర్చున్నాయి. బిల్లుల ధరల విషయం అలా వుంచితే, ఏ 'సమర్థత' గురించి డబ్బా కొట్టుకుని ప్రైవేట్ విద్యుత్ సంస్థలు రంగంలోకి దిగాయో ఆ 'సమర్థత' అనేది కాలిఫోర్నియాలో గత నాలుగేళ్ళుగా అరాచకాన్నే సృష్టించింది. పెట్టుబడిదారీ ప్రపంచం శ్లాఘించిన ఈ 'భూతల స్వర్గధామం'లో ఎక్కడ చూసినా విద్యుత్ వున్నట్లుండి ఎగిరిపోవటం, విద్యుత్ వినియోగ వ్యవస్థలు కుప్పగూలి పోవటంతో ప్రైవేట్ విద్యుత్ ఉత్పత్తి దారులూ, సరఫరాదార్లూ అయిన ఎన్రాన్ తదితర కంపెనీల తీరుతెన్నులపై కాలిఫోర్నియా రాష్ట్ర అటార్నీ జనరల్ విచారణ మొదలెట్టాడు. ఇక అసంఖ్యాకులైన వినియోగదారులు ఎన్రాన్ తదితర ప్రైవేట్ విద్యుత్ సంస్థలపై లాభాలతో కూడిన విద్యుత్ వ్యవస్థను తలక్రిందులు చేసిన మోసకారులుగా ఆరోపిస్తూ పలు కేసులు పెట్టారు. అంతిమ ఫలితం ఏదంటే 'భూతల స్వర్గధామం' కాలిఫోర్నియా నాలుగేళ్ళ స్వల్ప వ్యవధిలోనే 'భూతల నరకమై' కూర్చుంది. సిలికాన్‌లో ఈ విద్యుత్ కోతల తీవ్రత ఏ స్థాయిలో వుందంటే అక్కడి ప్రపంచ ప్రఖ్యాత హైటెక్ (సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్) వాణిజ్య సంస్థలు కాలిఫోర్నియా రాష్ట్రాన్నే విడిచిపెట్టి అవతలికి పోయే ప్రయత్నాలు చేపట్టాయి. కాలిఫోర్నియా ఉత్పాతానికి, ఉపద్రవానికి ఇంతకుమించిన సాక్ష్యం అవసరం లేదు.

చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లుగా ''కాలిఫోర్నియాని ఇంకెన్నడూ స్థానికేతర లాభార్జనాతత్వం కల్గిన ప్రైవేట్ సంస్థల గుప్పిట్లో పెట్టేది లేదంటూ'' ఆ రాష్ట్ర గవర్నర్ భీషణ ప్రతిజ్ఞ చేశాడు. నాలుగేళ్ళలో విద్యుత్ ధరలను గణనీయంగా తగ్గిస్తానంటూ ప్రగల్భాలు పలుకుతున్న చంద్రబాబు నాలుగేళ్ళలోనే కాలిఫోర్నియాకు పట్టిన గతిని ఒకసారి చూస్తే బాగుంటుంది. అయినా దున్నపోతుమీద..... ❑

# జలగలా మహారాష్ట్ర ప్రజల రక్తాన్ని పీల్చుకుంటున్న ఎన్రాన్

ద్రోహులైన ప్రస్తుత, గత మహారాష్ట్ర పాలకులు రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను అమెరికన్ బహుళజాతి సంస్థ ఎన్రాన్‌కు తెగనమ్మేశారు. యూనిట్‌కు 6 రూ॥ల 80 పైసల చొప్పున మహారాష్ట్ర విద్యుత్ బోర్డు ఎన్రాన్‌కి చెల్లిస్తూంది (దోచి పెడ్తోంది). మహారాష్ట్ర విద్యుత్ బోర్డు తాను స్వయంగా ఉత్పత్తి చేస్తున్న విద్యుత్‌కు యూనిట్ వారీ ఖర్చు 1 రూ॥ 30 పైసలు కాగా, అలాగే ఇతర మార్గాలలో (అంటే కేంద్రం, ఇతర రాష్ట్రాల నుండి) కొంటున్న విద్యుత్‌కు సగటున 2 రూ॥ 30 పైసలకు కొంటుంది. కానీ, మహారాష్ట్ర విద్యుచ్ఛక్తి బోర్డు ఎన్రాన్‌కు మాత్రం యూనిట్‌కు 300 శాతం అధికంగా ధర చెల్లిస్తుంది. ఒకప్పుడు అత్యధిక లాభాల్లో ఉన్న మహారాష్ట్ర విద్యుచ్ఛక్తి బోర్డును దివాలా స్థితిలోకి ఈ ఒప్పందం నెట్టేసింది. మే 2000 చివరి నాటికి 2వేల కోట్ల రూపాయల లోటు తేలింది.



ఎన్రాన్‌కు వ్యతిరేకంగా కార్మికుల ప్రదర్శన

అలాంటి కొనుగోళ్ళు మహారాష్ట్ర ప్రజలకు అధిక ఛార్జీలు చెల్లించాల్సిన తప్పనిసరి పరిస్థితిని ఎలా కల్పిస్తాయో ఊహించు కోవచ్చు. ప్రస్తుతం గృహ వినియోగదారులు యూనిట్‌కు 2 రూ॥లు చెల్లిస్తుండగా, రైతులు వ్యవసాయానికి వాడే విద్యుత్‌కు యూనిట్‌కు 50 పైసలు చెల్లిస్తున్నారు. మహారాష్ట్ర విద్యుత్‌బోర్డు వినియోగ దారుల్లో 3వ వంతు మంది రైతులే! ఎన్రాన్ రేట్లకు అనుగుణంగా వినియోగదారులు చెల్లించాల్సి వస్తే, గృహ వినియోగ దారులు 3రెట్లు అధికంగానూ, వ్యవసాయ వినియోగదారులు 14 రెట్లు అధికంగానూ చెల్లించాల్సి వస్తుంది. ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేట్‌పరం చేయటానికి కంకణం కట్టుకున్న ప్రస్తుత పరిస్థితులలో, ఆ విధంగా విద్యుత్ ఛార్జీలు పెరగనుండటమేగాక, రైతాంగాన్ని నాశనం చేస్తాయి. పేద, మధ్యతరగతి ప్రజలను ఇది దారుణంగా దెబ్బతీస్తుంది.

ప్రస్తుతం ఉనికిలో ఉన్న ఎన్రాన్ ఒప్పందం, తమకు మించిన దేశభక్తులు, జాతీయవాదులు లేరని నిత్యం డంబాలు పలికే కుహనా జాతీయవాదులైన శివసేన, బి.జె.పి. ప్రభుత్వ 'పుణ్యమే'. అత్యంత అనుమానకరమైన ఈ ఒప్పందంకుగాను, ఎన్రాన్ ప్రస్తుత యన్.సి.పి. గతంలో కాంగ్రెస్ నాయకుడైన శరద్‌పవార్‌కు, ఆ తర్వాత బాల్‌థాకరేకు పెద్ద ఎత్తున ముడుపులు ముట్టచెప్పింది.

ఒప్పందం ప్రకారం, ఎన్రాన్ నుండి విద్యుత్ కొన్నా, కొనకపోయినా, అది ఎంతైతే విద్యుత్ ఉత్పాదన చేస్తుందో అంత విద్యుత్‌కు రాష్ట్ర విద్యుత్‌బోర్డు డబ్బు చెల్లించాల్సిందే! ఇంధన ఛార్జీలు సైతం డాలర్‌తో రూపాయికున్న విలువనుబట్టి, అంతర్జాతీయంగా ముడిచమురు ధరను బట్టి ముడిపడి వుంటాయి. ఒకవేళ మహారాష్ట్ర విద్యుత్‌బోర్డు ఎన్రాన్ నుండి విద్యుత్‌ను కొనకపోయినా, 'కెపాసిటీ ఛార్జీ' కింద నెలకు 95 కోట్ల రూపాయిలు చెల్లించాల్సిందే! ఒకవేళ కంపెనీ విద్యుత్‌ను కొన్నట్లయితే యూనిట్‌కు 6 రూ॥ 80 పైసలు చెల్లించాల్సిందే! ఇక్కడ అత్యంత దారుణమైన విషయం ఏమిటంటే, మహారాష్ట్ర విద్యుచ్ఛక్తి బోర్డులోని దళారీలు కృత్రిమ కొరతను చూయించి, అధిక రేట్లతో ఎన్రాన్ నుండి విద్యుత్ కొంటాన్ని సమర్థించుకోజూస్తున్నారు. అందుకోసం విద్యుత్ కొరత చూపించటం కోసం, విద్యుత్ బోర్డు అధికారులు 'నిర్వహణ' పేరుతో విద్యుత్ ఉత్పాదన యూనిట్లను మూసివేశారు. అలాగే, గ్యాస్ లభించటం లేదు అనే సాకుతో, యురాన్‌లోని 900 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం గల స్వంత యూనిట్లను మూసివేశారు. వాస్తవానికి, మహారాష్ట్రలోని విద్యుత్ ఉత్పత్తిని, లభ్యతను పూర్తిగా విశ్లేషిస్తే దాభోల్ పవర్ ప్లాంట్ (ఎన్రాన్) నుండి అసలు విద్యుత్ కొనాల్సిన అవసరమే లేదు.

స్వేచ్ఛా వ్యాపార పవిత్రత గురించి చెవులు దిబ్బడపడేలా వూదరగొట్టే ఈ అమెరికన్ బందిపోటు దొంగలు, ఎన్రాన్ నుండి మహారాష్ట్ర విద్యుత్‌బోర్డు మార్కెట్ ధరకంటే ఎంతో అధిక ధరతో విద్యుత్ కొనుగోలు చేసేలా ఒప్పందాలు కుదుర్చుకున్నారు. విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్న ఇతర సంస్థలతో స్వేచ్ఛా మార్కెట్‌లో ఎన్రాన్ ఎందుకు పోటీ పడదు మరి!! ఎన్రాన్ నుండి మహారాష్ట్ర విద్యుత్‌బోర్డు తప్పనిసరిగా విద్యుత్ కొనుగోలు చేయక తప్పని పరిస్థితుల్లోకి నెట్టబడింది. ఒకవేళ అది విద్యుత్‌ను కొనకపోతే, నెలకు 95 కోట్ల రూ॥ల మేరకు భారీగా నష్ట పరిహారం కూడా చెల్లించాల్సిందే! పైగా, ఒకవేళ మహారాష్ట్ర విద్యుత్ బోర్డు కాని ఆ డబ్బులు చెల్లించకపోతే, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించేలా ఎన్రాన్ రాష్ట్ర ప్రభుత్వ గ్యారంటీని (హామీ) పొందింది. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం ఇలా చెల్లించకపోతే కేంద్ర ప్రభుత్వమే దాన్ని చెల్లించేలా 'కౌంటర్ గ్యారంటీ' ఒప్పందాన్ని సైతం కూడా ఎన్రాన్ కేంద్ర ప్రభుత్వంతో కుదుర్చుకుంది.

ఇంతటితో అయిపోలేదు. ఎన్రాన్ తన పవర్ ప్రాజెక్టులో రెండవ దశని (1444 మెగావాట్ల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కల్గినది) నెలకొల్పేందుకు సిద్ధమౌతూ ఈ దశలో ఉత్పత్తయ్యే విద్యుత్‌ను కూడా మహారాష్ట్ర ప్రభుత్వమే కొనేలా ఒప్పందం చేసుకోవడానికి ఒత్తిడి పెట్టింది. ఒకవేళ అలా ఒప్పందం చేసుకోవటానికి సిద్ధపడకపోతే, తన ఒప్పందాన్ని వెనక్కి తీసుకున్నందుకుగాను, మహారాష్ట్ర ప్రభుత్వం ఎన్రాన్‌కు పెద్ద మొత్తంలో 20వేల కోట్ల రూపాయిలు నష్టపరిహారంగా కట్టాల్సి వుంటుంది.

(తరువాయి 29వ పేజీలో...)

# ఆర్థిక సంస్కరణల ఫలి□ం-పైరోసారి ఆర్థికమాంద్యం

మరో సంక్షోభం వైపుగా ఆర్థిక వ్యవస్థ ప్రయాణాన్ని సూచిస్తూ, తిరిగి ఏర్పడిన ఆర్థిక మాంద్యాన్ని కప్పిపెట్టడానికి మీడియా ఎంతగానో ప్రయత్నిస్తున్నది. మూడు సంవత్సరాల తరువాత గత సంవత్సరం (1999-2000) కొద్దిపాటుగా కోలుకున్న ఆర్థిక వ్యవస్థ తిరిగి మందగిస్తోంది. అతిగా ప్రోత్సహించబడిన ఎగుమతుల పెరుగుదల 24% ఉన్నప్పటికీ, ఆర్థిక సూచికలన్నీ పడిపోయాయి.

నిజానికి 'ఆర్థిక సంస్కరణల' ఫలితంలోని పూర్తి వైఫల్యం ఇది. 1994 నుండి '96 వరకు రెండు సంవత్సరాలలోనూ, గత సంవత్సరంలోని కొద్ది పెరుగుదలనూ మినహాయిస్తే, ఈ దశాబ్దపు పెరుగుదల రేటు, 1980ల దశకం కంటే తక్కువ స్థాయికి పడిపోయింది. ప్రజలకు చెందవలసిన లాభాలను పన్ను రాయితీలు, సబ్సిడీలు, గ్రాంట్లు, కమీషన్ల రూపంలో బడా వ్యాపార సంస్థలకు దానం చేసిన ఫలితం ఇది. నిజానికి దేశం మొత్తంమీద భారీ లాభాలార్జించే అతిపెద్ద రిలయెన్స్ సంస్థ, 1997-1999 సంవత్సరాలకు దాని రూ॥ 4800 కోట్ల లాభాల్లో 2.8% మాత్రమే పన్నుల రూపంలో చెల్లించింది. వంద అగ్ర సంస్థల సగటు పన్ను చెల్లింపు కేవలం 18 శాతమే.

మితిమీరిన 'ఆర్థిక సంస్కరణల' అమలు దీనికి కారణం కాగా, ప్రభుత్వాలు, సామ్రాజ్యవాదుల దళారీలు చెప్పే కారణం, ఆర్థిక సంస్కరణలు మరింత వేగవంతం చేయక పోవడమేనని. బి.జె.పి. ప్రభుత్వపు రెండవ దశ సంస్కరణలుగా పిలువబడేవి, సంస్కరణల క్రమాన్ని వేగవంతం చేయటమే తప్ప మరొకటి కాదు. ఇకా తరువాత ఫలితం మాంద్యమే.

ప్రస్తుత ఆర్థిక దుస్థితి, ప్రజా జీవితాలపై దాని ప్రభావాన్ని పరిశీలిద్దాం.

## ప్రస్తు□ మాంద్యం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరపు ప్రథమార్థానికి (ఏప్రిల్ నుండి 2000 సెప్టెంబర్ వరకు) ఆర్థిక సూచికలన్నీ పడిపోయిన పరిస్థితి, గత సంవత్సరపు దిగజారిన పెరుగుదలను పోలి వుండటమే కాదు, భారత ఆర్థిక వ్యవస్థ పర్యవేక్షణ కేంద్రం (సెంటర్ ఫర్ మోనిటరింగ్ ఇండియన్ ఎకానమీ), ఇంకా ఇతరులు చేసిన సూచనలను కూడా పోలి వుంది.

మన స్థూల దేశీయ ఉత్పత్తి (జి.డి.పి)లో ఇప్పుడు సగంగా వుండి, అతిగా ప్రోత్సహించబడుతున్న సర్వీసుల రంగంతో సహా ఆర్థిక రంగాలన్నింటి అభివృద్ధి రేటు పడిపోయింది. జి.డి.పి. పెరుగుదల రేటు గత సంవత్సరపు 6.4% కంటే కూడా ఈ సంవత్సరం 5.8% కి పడిపోయింది. ఈ సంవత్సరం జి.డి.పి. పెరుగుదల రేటు 7% లక్ష్యం కాగా, భారతదేశం 7 నుండి 8% పెరుగుదల రేటును సాధిస్తుందని వాజ్‌పేయి, ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హాలు ఇప్పటికీ ప్రగల్భాలు పలుకుతూనే వున్నారు. ఆర్థిక వ్యవస్థలోని అతిపెద్ద రంగమైన వ్యవసాయ రంగం రెండవ సంవత్సరంకూడా స్తంభించటమే ఆర్థిక మాంద్యానికి సాక్ష్యం. గత 11 సంవత్సరాలలోకెల్లా ఈ సంవత్సరం వికటించిన రుతుపవనాలు, రెండు రాష్ట్రాల వరదల ప్రభావంతో వ్యవసాయ రంగంలో పెరుగుదల మహా ఉంటే 1% మాత్రమే వుంటుందని అంచనా. ఇక పరిశ్రమల రంగం పరిస్థితి మరీ క్షీణించింది. పరిశ్రమల పెరుగుదల గత సంవత్సరపు 8.1% నుండి ఈ సంవత్సరం 5.4 శాతానికి పడిపోయింది. కార్ల అమ్మకాల పెరుగుదల కేవలం 2% చూపిస్తున్నది. పెట్టుబడి సరుకుల ఉత్పత్తి 1%, సిమెంట్ 8.6% వ్యతిరేక పెరుగుదల (అమ్మకాలు తగ్గటం)ను చూపిస్తున్నాయి. ముడిచమురు దిగుమతులు ఆకాశాన్నంటగా స్వదేశీ ముడిచమురు ఉత్పత్తి 1 శాతానికి పడిపోయింది. అతిగా ప్రోత్సహించబడిన సర్వీసు రంగంలో సైతం పెరుగుదల రేటు గత సంవత్సరపు 8.5% నుంచి ఈ సంవత్సరం 8.1%కి స్వల్పంగా పడిపోవటం దీనికి సాక్ష్యం. పరిశ్రమలు, తయారీ రంగంలోని ఈ స్తబ్దతకు ప్రాథమిక కారణం, ఎక్కువ మంది భారత ప్రజల కొనుగోలు శక్తి పడిపోయి, నిత్యావసర సరుకులకు గిరాకీ పెరగటమే.

ఇక పెట్టుబడి మదుపు రంగంవైపు చూస్తే, పరిస్థితి ఆశించినంతగా లేదు. 1997 నుండి చిన్న తరహా పెట్టుబడుల రంగంమీద చేస్తున్న ఖర్చును ప్రభుత్వం 27% తగ్గించింది. కేంద్ర ప్రభుత్వం కూడ 1985-90ల కాలంలోని జి.డి.పి.లోని 6.8% నుండి గత సంవత్సరం 2.6 శాతానికి పెట్టుబడి ఖర్చును తగ్గించి వేసింది. స్టాక్ మార్కెట్ జారీ చేసిన నూతన పబ్లిక్ ఇష్యూ-వాటా-ల ద్వారా సమకూర్చుకున్న డబ్బు మార్చి నాటి రూ॥ 2071 కోట్ల నుండి, ఆగస్టు నాటికి రూ॥ 200 కోట్ల కంటే తక్కువకు ఘోరంగా పడిపోయింది. వేగంగా పడిపోతున్న రూపాయి విలువను పైకి లేవనెత్తేందుకు, డాలర్లను బాగా ఆకర్షించేందుకుగాను ఇచ్చే బ్యాంకు రుణాలపై వడ్డీరేట్లు చాలా అధికంగానే వున్నాయి (ఇవి 11.8 నుండి 12.5 శాతానికి పెరిగాయి). వడ్డీరేట్లు పెరగటంతో, పెట్టుబడి మదుపు మరీ ఖరీదైపోయి, దేశీయ మదుపుదార్లు నిరుత్సాహ పరచబడ్డున్నారు. దేశంలోని పొదుపు (బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా పెట్టుబడిగా తిరిగి రాగలిగినవి) మొత్తాలు 30 శాతానికి పెరుగుతాయని వాజ్‌పేయి ప్రగల్భాలు పలుకుతుండగా, అవి జి.డి.పి.లోని 24.7% నుండి 22.3%కి పడిపోయాయి. మన దళారీ ప్రభుత్వం, దళారీ సంస్థలు ఆధారపడే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు సైతం ఈ 6 నెలల కాలంలో ఒక బిలియన్ డాలర్లకు కొంచెం ఎక్కువగా మాత్రమే వచ్చి స్తబ్దతకు గురై ఆగిపోయాయి. ఫలితంగా ఆర్థిక వ్యవస్థ (స్థూల దేశీయ పెట్టుబడి కల్పన)లోని మదుపు మొత్తం 1997-98 సంవత్సరపు జి.డి.పి.లోని 26.2% నుండి 23.4%కి పడిపోయింది. అన్ని రంగాల్లోని ఈ తీవ్రమైన మదుపు తగ్గుదల రేటు, ఆర్థిక వ్యవస్థ అంతటా స్తబ్దతకు గురైన దానికి సూచన. అయినా, భారతీయ ఆర్థిక మూలాలు బలమైనవనే మంత్రాన్ని ఆర్థికమంత్రి జపిస్తూనే వుంటాడు.

విదేశీ బకాయిల చెల్లింపుల కేసి చూస్తే పరిస్థితి చాలా నిరాశాపూరితంగా మారింది. ఎగుమతులు పెరిగినప్పటికీ కూడా వాణిజ్య లోటు గత సంవత్సరపు 9.9 బిలియన్ డాలర్ల నుండి 12

బిలియన్ డాలర్లకు 21%గా పెరిగింది. దీనికి తోడు, విదేశీ రుణాలకు సంబంధించి గడచిన ఆర్థిక సంవత్సరం మొదటి ఐదునెల్లకే (2000 ఏప్రిల్ నుండి ఆగస్టు వరకు) మరీ ఎక్కువగా 3.5 బిలియన్ డాలర్ల సొమ్ము బయటికి పోతూ, ప్రత్యేకించి, ప్రమాదకరంగా వుంది. గత సంవత్సరపు ఇదే కాలానికి ఇది రెట్టింపు. దీనర్థం ఈ ఆర్థిక సంవత్సరంలో రూ॥ 40,000 కోట్ల పెద్ద మొత్తం విదేశీ మారక ద్రవ్యం దేశం నుండి బయటికి పోతున్నది. వీటన్నింటి ఫలితంగా నవంబర్ 2000 నాటికి మొదటి ఏడు నెలలకే 3.3 బిలియన్ డాలర్ల మేరకు (రూ॥ 15,000 కోట్లు) విదేశీ మారక నిల్వలు తరిగి పోతున్నాయి. ఎక్కువ ధరకు ఇండియా మిలీనియమ్ డిపాజిట్ (ఐ.ఎం.డి.)ను ప్రవాస భారతీయులకు ధారపోయటం వల్ల మాత్రమే ప్రభుత్వం విదేశీ వాణిజ్య బకాయిల చెల్లింపుల సంక్షోభం విదేశీ చెల్లింపుల వైఫల్య స్థితి నుంచి తనకు తాను సురక్షితంగా వుంది, ఈ విధంగా 5.5 బిలియన్ డాలర్లను ఆకర్షించినప్పటికీ, ప్రభుత్వం దానిమీద 14% (రూపాయి విలువ సంవత్సరానికి 6% తగ్గించడాన్ని లెక్కలోకి తీసుకున్న తరువాత) అధిక వడ్డీరేటు చెల్లిస్తున్నది. దేశీయ మార్కెట్‌లోని వడ్డీ రేటు కంటే ఇది మరీ ఖరీదైనది. 3% నుండి 5% వడ్డీ రేటు కలిగిన అంతర్జాతీయ ప్రమాణాలతో పోల్చినప్పటికీ ఇది దురాశాపూరితమైన వడ్డీ వ్యాపారమనేది స్పష్టం. కొంత కాలానికి ఈ రకమైన లోన్లు ప్రభుత్వ ఖజానాకు మరింత గండి పెట్టి విదేశీ మారక ద్రవ్యాన్ని బయటికి పోయేటట్లు చేస్తాయి. ఈ అధిక వడ్డీకి తెచ్చే లోన్లు తక్షణంగా బకాయిల చెల్లింపుల సంక్షోభం నుండి ఆర్థిక వ్యవస్థను కాపాడతాయేమోకానీ, సంక్షోభాన్ని తరువాత తేదీకి మాత్రం పొడిగిస్తాయి అంతే.

చివరికి, రూపాయి విలువ పడిపోయి, ధరల పెరుగుదల కొనసాగుతోంది. ఏప్రిల్ నుండి రూపాయి 7% విలువను కోల్పోయింది. ద్రవ్యోల్బణం గత సంవత్సరపు 3%తో పోల్చితే ఈ సంవత్సరం 7.2% (అధికారికంగా) వుంది. దీనికితోడు, 8 నెలల్లో స్టాక్ మార్కెట్ 2,600 పాయింట్ల (40%)కు పడిపోయింది.

ఆర్థిక వ్యవస్థ ఇటువంటి దుస్థితిలో వున్నప్పటికీ, ప్రపంచబ్యాంకు అధ్యక్షుడు ఉల్ఫెన్‌సన్ భారత ఆర్థిక వ్యవస్థపై ప్రశంసలు కురిపించాడు. 8 రోజుల భారత పర్యటనలో వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు ప్రధానమంత్రికి కూడా ఆదేశాలు జారీ చేస్తూ పోయిన ఈ ఉల్ఫ్ (తోడేలు) తర్వాత ఇండియాకు మూడింతల 'సహాయం' పెంచేందుకు వాగ్దానం చేశాడు. ప్రైవేటీకరణ, సబ్సిడీల కోత, ఆర్థిక లోటు ప్రభుత్వ రంగంలో సామూహిక ఉద్యోగుల సంఖ్య తగ్గింపు వగైరా తన షరతులన్నింటికీ హామీ పొందిన తర్వాత, వచ్చే సంవత్సరంలో 1.2 బిలియన్ల నుండి 3 బిలియన్ డాలర్లకు సహాయాన్ని పెంచేందుకు వాగ్దానం చేశాడు. భారత ఆర్థిక స్థితి, దాని శ్రేయస్సు కంటే అంతర్జాతీయ పెట్టుబడి సొరచేపలకు భారత ఆర్థిక వ్యవస్థ ద్వారాలు తెరువబడి వుండటంలోని అస్థిర స్థితే ఈ సామ్రాజ్యవాద ప్రముఖుడికి ఆందోళన కల్గిస్తూ వచ్చింది. ఈ అంశానికి సంబంధించినంత వరకూ ఈ సామ్రాజ్యవాద దొరగారికి మన ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు వరసకట్టి తమ విధేయతను ప్రకటించటం పరమానందాన్ని కల్గించింది.

కానీ, వాస్తవంగా చూస్తే ఆర్థిక సంస్కరణలు సాధించింది స్వదేశీ పరిశ్రమల వినాశనం, పెద్ద ఎత్తున పెరిగిపోయిన నిరుద్యోగాన్ని మాత్రమే. ఇది గ్రామీణ వ్యవసాయోత్పత్తుల స్తబ్దత (వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేయటం, తక్కువ ధరలకే వ్యవసాయోత్పత్తులు దిగుమతి చేసుకోవటం)తో జతగూడి నిరంతరంగా ప్రజల కొనుగోలు శక్తిని దిగజార్చుతున్నది. ఇది వరుసగా పారిశ్రామిక సరుకుల డిమాండ్‌ను తగ్గిస్తూ, ఎగుమతుల పెరుగుదలను పెద్ద ఎత్తున తగ్గించి వేస్తూ, ఆర్థిక మాంద్యానికి దారి తీస్తున్నది. ప్రపంచీకరణ ఫలితంగా ప్రతి సంవత్సరం భారత దేశం తన ఒక శాతం స్థూల దేశీయోత్పత్తిని లేక రూ॥ 20,000 కోట్ల ఆదాయాన్ని నష్టపోతున్నదని అంచనా కట్టబడింది.

## స్వదేశీ పరిశ్రమల వినాశనం

ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యు.టి.ఓ.) ఆదేశాలను అమలు చేసిన కారణంగా, మితిమీరిన చౌక దిగుమతులు భారత స్వదేశీ ఉత్పత్తికి సంబంధించిన విస్తారమైన విభాగాలను నాశనం చేశాయి. ఏప్రిల్ 2001 నాటికి దిగుమతులపై మిగిలివున్న పరిమాణాత్మక అడ్డంకులన్నింటిని తొలగించడానికే మరింత ప్రాధాన్యత ఇవ్వబడింది. దీనికి తోడు ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాల్లోకి గుత్త సంస్థలు (టి.యన్.సి.లు) చొచ్చుకు రావటంతో స్వదేశీ ఉత్పత్తిదారులు తుడిచివేయ బడ్డారు. వారికున్న ధనబలంతో, సంవత్సరాల తరబడి నష్టాన్ని భరిస్తూ కూడ, ధరలు తగ్గించి పోటీదారుల్ని తుడిచేశారు. వ్యాపార ప్రకటనలమీద పెద్ద ఎత్తున పెట్టిన ఖర్చు చిన్న ఉత్పత్తి దారుల వునికికే తావే లేకుండా చేసింది. గుత్తాధిపత్యం సాధించిన తరువాత ఇక పదిరెట్లు ధరలు పెంచి నష్టాన్ని పూడ్చుకుంటారు. గుత్త సంస్థలకు (టి.యన్.సి.) చౌకగా సరుకులు, విడి భాగాలు అందించే వారి సహాయకులు, దళారీ పెట్టుబడి సంస్థలు మాత్రమే, ఈ మెరుపు దాడి నుండి బతికి బట్ట కట్టగలవు.

వేలాది చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఈ సరికే నాశనమయ్యాయి. వీటి సంఖ్య కనీసం నాలుగు లక్షలని ఒక అంచనా. బొంబాయి, ధానా-బేలాపూర్, భివాండి, ఔరంగాబాద్, ఆలీఘర్, కాన్పూర్, ఇండోర్ ఇంకా అనేక పట్టణాలలో అసంఖ్యాక పరిశ్రమలు మూతబడ్డాయి. భివాండిలో 60% మరమగ్గాలు నిశ్శబ్దమై పోయాయి. ఆలీఘర్‌లో తరతరాలుగా తాళాలు, ఇనుప సామాన్ల తయారు చేస్తూ వచ్చిన చిన్న సంస్థలు షట్టర్లు దించుకున్నాయి. ముంబాయిలో ధానా-బేలాపూర్ రోడ్డు వెంట ప్రయాణిస్తే ప్రతి రెండో ఫ్యాక్టరీ మూసే కన్పిస్తుంది. ఆరు దశాబ్దాలుగా సైన్యానికి అవసరమైన దుస్తులు, బనియన్లు, డ్రాయర్లు సరఫరా చేసే చిన్న తరహా పరిశ్రమల్లో పనిచేసే 1.5 లక్షల కార్మికులు ఉద్యోగాలు కోల్పోవడానికి దగ్గర్లో వున్నారు. ఇప్పుడు సైన్యం దాని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలకు టెండర్లు ఇస్తూ, గతంలో లూధియానా నుండి వచ్చిన సప్లై కంటే రెండు లేక మూడు రెట్లు అధిక ధరలకు సైతం సప్లైలు తెచ్చుకుంటున్నది. అంబాలాలో 25,000 మందికి ఉపాధి కల్పిస్తున్న 500 చిన్న తరహా, కుటీర పరిశ్రమలు మూసివేత పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వం ఇప్పుడు గ్లోబల్ టెండర్లను పిలుస్తూండటంతో, సైన్స్ పరికరాలు తయారు చేసే కంపెనీలు బయటికి నెట్టేయబడ్డాయి. అంబాలా నుంచి సప్లై అయ్యే పరికరాల

కంటే గ్లోబల్ టెండర్లలో కొనుగోలు చేసే వాటికి రేట్లు కూడా మరీ ఎక్కువే. అధిక దిగుమతుల దెబ్బకు తూర్పు జోన్‌లో వనస్పతి నూనె తయారు చేసే కంపెనీలు 50% వరకు మూతబడ్డాయి.

ఈ పోటీలో తుడిచేయబడకుండా వున్న యూనిట్లు కూడా ప్రభుత్వ జోక్యంతో తుడిచిపెట్టుకు పోతుండటం కన్పిస్తుంది. పరిసరాల పరిరక్షణ పేరున ఢిల్లీలో ఇప్పుడు 1 లక్ష పైగా చిన్న తరహా యూనిట్లు మూసివేత పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి.

ఈ విధంగా పెద్ద ఎత్తున జరుగుతున్న పరిశ్రమల వినాశనం దేశంలో ఉపాధి కల్పన మీద ఎటువంటి ప్రభావం కలిగించగలదో బాగానే ఊహించవచ్చు. కానీ, కథ ఇంతటితో ముగియలేదు. ఈరోజున పెరుగుదల సైతం 'ఉపాధి లేని పెరుగుదల'గానే ప్రతిబింబిస్తున్నది.

## భారీస్థాయి నిరుద్యోగం

అధికారిక లెక్కల ప్రకారమే (వాస్తవ లెక్కలు కాకపోవచ్చు) అన్ని రంగాల్లో ఉపాధి శాతం 1983-90 సం॥ల మధ్యకాలంలోని 1.6 శాతంతో పోల్చితే, 1990-98ల మధ్య కాలంలో వ్యవసాయేతర పనులకు వలస ఎక్కువగా వుంది. కానీ, 1990ల్లో ఇది తారుమారైంది. వ్యవసాయేతర రంగాల్లో ఉపాధి తగ్గిపోవటం, వగైరా కారణాల వల్ల శ్రమ అనేది వ్యవసాయం వైపు వెనక్కు మళ్ళింది. దేశంలో పరిశ్రమల వినాశనం జరిగిందనీ, ఇది ఇంకా పెరిగితే, వ్యవసాయ భూమిమీద శ్రామికుల ఒత్తిడి పెరుగుతుందనే ఇది స్పష్టంగా సూచిస్తున్నది. నూతన తరమంతా ఉద్యోగాలు లేని దృశ్యాల్ని ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితి భీతిగొల్పుతున్నది. చిన్న తరహా పరిశ్రమల మూసివేత ప్రభావం ఉపాధి మీద ఎలా వుంటుందనేది మనం ఇప్పటికే చూశాం. ప్రభుత్వరంగ సంస్థల్లో సామూహికంగా ఉద్యోగుల సంఖ్య తగ్గింపుతో పాటు పారిశ్రామిక రంగాల స్తబ్దత నిరుద్యోగాన్ని తీవ్ర స్థాయికి తీసుకు పోయింది.

ఈరోజు వస్తూత్పత్తి రంగంలో శాశ్వతంగా స్తబ్దత కొనసాగే స్థితి నెలకొని వుంది. ఈ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ, ఆర్థిక వ్యవస్థను మరింతగా సేవా రంగానికి తరలిస్తున్నారనే చర్చ నిరంతరం జరుగుతున్నది. ప్రైవేటు రంగంలోని వస్తూత్పత్తికి సంబంధించిన పెట్టుబడి 48 శాతానికి తగ్గిపోవటం గత మూడు సంవత్సరాలుగా మనం చూశాం. బట్టల పరిశ్రమలోని మదుపు 50 శాతానికి, సిమెంటు పరిశ్రమలో 35 శాతానికి, రసాయన పరిశ్రమలో 40 శాతానికి పడిపోయింది. అన్ని పెట్టుబడులు ఎక్కువ లాభదాయకమైన సమాచార సాంకేతిక (ఇన్ఫర్మేషన్ టెక్నాలజి) రంగంవైపు పోతున్నాయి. కానీ, ఈ ప్రైవేట్ ఐ.టి. రంగంలో సైతం 5 లక్షల మంది ఉద్యోగులు మాత్రమే పనిచేస్తున్నారు.

మరోవైపు స్తబ్దత వస్తూత్పత్తి రంగంలోని ఆధునీకరణలు, అనేక కంపెనీలు సామూహికంగా ఉద్యోగుల్ని తగ్గించటంలో కన్పిస్తాయి. కొన్ని ఉదాహరణలు చూడండి: బజాజ్ ఆటోస్ ఈ సంవత్సరం 2000 మంది ఉద్యోగుల్ని తగ్గించింది. మరో 3000 మందిని వచ్చే సంవత్సరం తగ్గించనున్నది. 8 సంవత్సరాల క్రితం 21,000 మంది ఉద్యోగులతో ఒక మిలియన్ (10 లక్షలు) వాహనాలు ఉత్పత్తి చేసిన ఈ కంపెనీ ఈరోజున 17,000 మందితోనే 15 లక్షల వాహనాలు ఉత్పత్తి చేస్తోంది. పైగా 3 సంవత్సరాల్లో 13,000 మంది ఉద్యోగులతో 30 లక్షల వాహనాలు ఉత్పత్తి చేయాలనే పథకం వేశారు. 2001 మార్చి నాటికి టిస్కో 4,000 మంది ఉద్యోగుల్ని తగ్గించనున్నది. 1972లో దాని 72,000 మంది ఉద్యోగుల సంఖ్యతో పోల్చితే, ఈరోజు టిస్కో ఉద్యోగుల సంఖ్య 52,000. ఇండియన్ రేయాన్ 800 మందిని, గ్రాసిమ్ బట్టల కంపెనీ 300 మంది ఉద్యోగులను తగ్గించటానికి ప్లాన్ చేస్తున్నాయి. స్వచ్ఛంద పదవీ విరమణ పథకం ఇంకా ఇతర పద్ధతుల్లో ఉద్యోగులను తగ్గించటం దాదాపు ప్రతి పరిశ్రమలో కన్పిస్తున్నది. ప్రత్యేకించి, విలీనాలు, భాగస్వామ్యాలు జరిగిన సంస్థల్లో కార్మికుల సంఖ్యను పెద్ద ఎత్తున తగ్గించుకునే విధానాలు తప్పక అమలు చేయబడుతున్నాయి. దీనికితోడు అసంఘటిత రంగంలోని కార్మికుల్ని చౌకగా ఉపయోగించుకుంటూ, పరిశ్రమలు గుత్తకు పని చేయించుకోవటం మరింతగా పెరిగిపోతున్నది. దీని ఫలితంగా పర్మనెంటు కార్మికుల సంఖ్య ఇంకా తగ్గించబడుతున్నది.

ప్రభుత్వ రంగ సంస్థలవైపు, ప్రత్యేకించి బ్యాంకులు, విద్యుత్ సంస్థలు మొదలైన వాటిలో ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య తగ్గింపు వైపు చూస్తే పరిస్థితి మరింత భయం గొల్పుతున్నది.

సంవత్సరం వరకు కొత్తగా ఉద్యోగాల్లోకి తీసుకునేది లేదని, ఇప్పుడున్న సిబ్బందిలో 10 శాతం తగ్గించి వేస్తున్నట్లు, గత సంవత్సరం వరకు భర్తీ చేయని ఉద్యోగాలు రద్దు చేస్తున్నట్లు, ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సామూహికంగా ఉద్యోగుల్ని తగ్గించటం, వేతనాల్లో కోత పెట్టడం, బోనస్ ఇవ్వ నిరాకరించడం చేస్తున్నాయి. ఉదాహరణకు మహారాష్ట్ర ప్రభుత్వం బోనస్ చెల్లించ నిరాకరిస్తూ, తన 20 లక్షల ఉద్యోగులకు 10 శాతం వేతనాల కోత విధించింది. మొత్తం ఖర్చులో ఉద్యోగుల వేతనాల బిల్లును ఇప్పుడున్న 73 శాతం నుండి 60 శాతం వరకు తగ్గిస్తానని ఆర్థికమంత్రి జయంత్ పాటిల్ వాగ్దానం చేశాడు. ముంబాయి నౌకా రవాణా సంస్థ తన సిబ్బందిలో సగం అదనపు భారం అనీ నిర్ణయించింది. మొత్తం 30,000 సిబ్బందిలో 14,000 మందిని స్వచ్ఛంద సేవా విరమణ పథకానికి (వి.ఆర్.ఎస్.) ప్రోత్సహించింది.

అంతేగాక బ్యాంకులు వాటి సిబ్బందిని పెద్ద ఎత్తున తగ్గించడానికి పథకం వేశాయి. 2.5 లక్షల సిబ్బంది గల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2003-04 సంవత్సరాల నాటికి ఒక లక్షమంది ఉద్యోగులను తొలగించాలనే పథకాన్ని ఇప్పటికే ప్రకటించింది. ఇతర బ్యాంకులు కూడా ఎస్.బి.ఐ.ని అనుసరించడానికి, స్వచ్ఛంద సేవా విరమణ పథకాన్ని అమలు చేయడానికి తమ నిధుల్ని పెంచుతున్నాయి.

దీనికితోడు విజయవంతంగా నడుస్తున్న ప్రభుత్వరంగ సంస్థలను ఖాయిలా పరిశ్రమల (హెచ్.ఎఫ్.సి.ఎల్., ఎన్.టి.సి. మిల్లుల వంటివి) తో కలిపి ప్రైవేటీకరణకు అప్పగించి, ఉపాధి నుండి వెళ్ళగొట్టే సంస్థల సరసన చేర్చనున్నారు.

అంతేగాక, ఇంగ్లీషు మాట్లాడగల వున్నత మధ్య తరగతికి స్వల్ప మాత్రపు సంఖ్యలో ఉద్యోగాలు కల్పించగల సమాచార, ప్రసార,

వినోద రంగంతో పాటు ఆర్థిక వ్యవస్థలోని ఇతర రంగాల్లో ఉపాధి అవకాశాలు పూర్తిగా తిరోగమించటం గమనించగలం. ఆర్థిక సంస్కరణల సారం ఇదే. దీని ఫలితంగా కోట్లాది ప్రజల బ్రతుకులు నాశనమై, దేశంలోపల కొద్దిమంది ఉన్నత వర్గ ప్రజలు, దేశం బయట విదేశీ గుత్తసంస్థలూ (టి.యన్.సి.లు) బలిసిపోతారు.

కానీ, ఇంత పెద్ద ఎత్తున నిరుద్యోగం వుంటే, ప్రజలకు కొనుగోలు శక్తి, నిత్యావసర సరుకులకు గిరాకీ ఎలా పెరుగుతాయి? తాము చూసిన దీపావళి పండుగ లన్నింటికంటే ఈ దీపావళి మరీ ఘోరంగా వుందని చిల్లర వ్యాపారులు చెప్పే దాంట్లో ఆశ్చర్యపడ వలసిందేమీ లేదు. గత కొన్ని సంవత్సరాలుగా దీపావళికి వ్యాపారం మందకొడిగా వుంటున్నదని, ఈ దీపావళి మరీ చప్పిడిగా వుందని ముంబాయిలో వర్తక సంఘ అధ్యక్షుడు చెప్పాడు. గత దీపావళి కంటే 30 శాతం అమ్మకాలు తగ్గాయని, అప్నా బజార్‌లో చెప్పారు. ఈరోజున ప్రజల మౌలికావసరాలకు డబ్బు లేక, ఆర్థిక సంస్కరణల 'వరప్రసాదం' చేత పండుగల ఆనందానికి దూరమయ్యారు.

### సంక్షోభం నుంచి సంక్షోభానికి:

ఉనికిలో వున్న అభివృద్ధి చట్రంలో, ఆర్థిక వ్యవస్థ ఒక సంక్షోభం నుండి మరొక సంక్షోభానికే పోతున్నది. ఇక ప్రతీ మునకలో ఇది సామ్రాజ్యవాద ఆక్టోపస్ కబంధ హస్తాల్లోకి ఇంకా నెట్టబడుతుంది. ఆర్థిక వ్యవస్థ ఎంత బలహీనపడితే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి సొరచేపల దాడికి అంత అనువుగా వుంటుంది. ఆహారం మీద దూకడానికి రాబందుల్లా వారు కాచుకు కూర్చున్నారు. మన దరిద్ర స్థితి ప్రాతిపదికన ఈ రాబందులు బలిస్తే, నాశనమైన జనాభా ఎముకల గుట్టలే భారతదేశంలో మిగులుతాయి.

పెరిగే నిరుద్యోగంతో నిత్యావసర సరుకుల స్వదేశీ గిరాకీ ఇంకా ఇంకా కుంచించుకు పోతుంది. ప్రపంచ మార్కెట్‌లో ఎగుమతులకు పోటీ ఎదురై, ఎగుమతుల గందరగోళం పెరుగుతుంది. రూపాయి విలువ పడిపోవటం కొనసాగుతుంది. ఆ విధంగా దిగుమతుల ధరలు (డాలర్ల లెక్కన) పెరిగిపోతుంటే, మన ఎగుమతులు మరీ మరీ చౌకగా తయారౌతాయి. ఆర్థిక సంస్కరణలు పెట్టిన ఉచ్చు మొత్తం దేశం గొంతునే పిసుకుతుంది. ఒక దాని వెంట ఒకటి పరిశ్రమలు కూల్చబడి, అంతర్జాతీయబ్యాంకర్లు, గుత్తసంస్థలు (టి.యన్.సి.లు) వాటిని కారుచౌక ధరలకు స్వాధీనం చేసుకుంటారు.

మన దేశాన్ని సర్వ నాశనం చేసే ఈ మొత్తం ప్రక్రియలో రెండవ, మూడవ, నాల్గవ దశ ఆర్థిక సంస్కరణలు చొరవగా అమలు చేయడానికి ఈ నయవంచక పాలకులు పెద్ద పెద్ద కమీషన్లు దండుకుంటారు. అది బి.జె.పి., కాంగ్రెస్ పార్టీగానీ, లేక ప్రాంతీయ పార్టీగానీ, భారత ఆర్థిక వ్యవస్థ వినాశనానికి, దేశాన్ని సామ్రాజ్యవాద భూతానికి అమ్మివేస్తున్నందుకు వీళ్ళందరూ బాధ్యులే. అడపాదడపా కోలుకోవటం జరిగినా ఆర్థిక వ్యవస్థలో స్తబ్దత శాశ్వత లక్షణంగా వుంటుంది. ❑

## మణిపూర్ రైఫిల్స్ తిరుగుబాటు

డిసెంబర్ 9న, కేంద్ర పారామిలటరీ బలగాలకు చెందిన మణిపూర్ రైఫిల్స్‌లోని ఒక బెటాలియన్ ఆయుధాలను పక్కనబెట్టి సమ్మె మొదలుపెట్టింది. కొద్దిరోజుల్లోనే ఈ తిరుగుబాటు మణిపూర్ రైఫిల్స్‌లోని మొత్తం 12 బెటాలియన్లకు, ఇండియన్ రిజర్వ్ బెటాలియన్ (ఐ.ఆర్.బి.) సైనికులకు మణిపూర్ పోలీస్ ట్రైనింగ్ స్కూల్ సిబ్బంది (ఎం.పి.టి.ఎస్.) ఇంకా ప్రభుత్వ విభాగాలైన అగ్నిమాపక సర్వీస్‌లు, నేర పరిశోధక విభాగాల్లోకి వ్యాపించింది. కీలక స్థానాల్లోని మంత్రులు వాళ్ళ తిరుగుబాటును చల్లార్చాలని ప్రయత్నించగా, జవాన్లు హింసాత్మక ఘటనలకు పాల్పడ్డారు. మణిపూర్ ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర హోంశాఖా మంత్రి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవాన్ల చేతుల్లో చావుదెబ్బలు తినే స్థితి నుండి అతి కొద్దిలో తప్పించుకున్నారు.

సైనికులు అలా సమ్మెకు దిగటానికి వాళ్ళను అంతగా ప్రేరేపించిన అంశం ఏమిటంటే, సైన్యంలోని వున్నతాధికారులు, పోలీసు అధికార్లు సైనికులకు రావలసిన భత్యాల విషయంలో పెద్ద ఎత్తున అవకతవకలకు పాల్పడటమే. 1996–98 మధ్య కాలానికి మణిపూర్ రైఫిల్స్‌లో పనిచేస్తున్న వాళ్ళకి రావలసిన కోట్ల రూ॥ల భత్యాలు, పాత బకాయిలను, ఉన్నతాధికార వర్గం దారి మళ్ళించేసింది. సమ్మెతో భయపడిన ప్రభుత్వం వెంటనే ఆ డబ్బు మొత్తాన్ని సైనిక సిబ్బందికి చెందిన జనరల్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలో జమ చేసింది. అయినా, అందుకు పాల్పడిన దోషులమీద చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సైనికులు సమ్మె కొనసాగించారు. దాంతో, ప్రభుత్వం ఇద్దరిమీద చర్య తీసుకుంది. కానీ, వాళ్ళిద్దరినీ 'బలి పశువులను' చేయటం ద్వారా, కుంభకోణాన్ని కప్పిపుచ్చ చేస్తున్నదని సైనికులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ, సమ్మెను కొనసాగించారు. మిగతా సెక్షన్ల వాళ్ళు కూడా, తమ డిమాండ్లతో ఆ సమ్మెలో కలిసారు.

రాష్ట్రంలో పీపుల్స్ లిబరేషన్‌ఆర్మీ నాయకత్వంలో తీవ్రంగా జరుగుతున్న మణిపూర్ జాతి విముక్తి పోరాటానికి వ్యతిరేకంగా సాగుతున్న ప్రభుత్వ కౌంటర్ ఇన్‌సర్జెన్సీ చర్యలన్నీ, మణిపూర్ రైఫిల్స్ చేసిన ఈ సమ్మెతో ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. దీంతోపాటు, రక్షణ యంత్రాంగం అంతా కుప్పకూలిపోగా, ప్రభుత్వ కార్యకలాపాలన్నీ నిలిచిపోయాయి. సమ్మె తాకిడికి దిమ్మెరపోయిన వి.ఐ.పీ.లు (ప్రముఖాతిప్రముఖులు), సెక్యూరిటీ సిబ్బంది లేకుండా రోడ్డుమీదకు వస్తే చచ్చి వూరుకుంటామన్న భయంతో, ఇళ్ళకీ, ఆఫీసులకే పరిమితమయ్యారు.

జవాన్‌లను అవమానపరుస్తున్న విషయాలలో వాళ్ళ భత్యాలను దుర్వినియోగం చేయటం అన్నది చిట్టచివరి అంశమనడంలో సందేహం లేదు.

నిత్యం ప్రభుత్వ అధికార్ల చేతుల్లో, తమ అధికార్ల చేతుల్లో అవమానాలకు గురవుతూ, భరిస్తూ వస్తున్న వాళ్ళలో ఓపిక నశించి చివరికి అది బద్దలైంది. అయితే, దీంట్లో పాలకుల 'అదృష్టం' ఏమిటంటే, జవాన్‌లు ఆయుధాలు పక్కనబెట్టి సమ్మె చేయటం. వాళ్ళు ఆయుధాలు దించకుండా, (తమ దగ్గరే ఆయుధాలు వుంచుకుని) సమ్మెకు దిగినట్లైతే, అది ఎంతో ప్రాముఖ్యం సంతరించుకునేది. మణిపూర్ సంఘటన ప్రత్యేకమైనదేం కాదు. దేశ వ్యాప్తంగా సైనికాధికారులకు, జవాన్‌లకు మధ్యన, అన్ని రంగాలలోని సాయుధ బలగాలు, పారామిలటరీ బలగాలు, పోలీసుల మధ్య ఇటువంటి వైరుధ్యాలే పెరిగి పోతున్నాయి. 2 సంవత్సరాల క్రితం వాయుసేన సిబ్బంది పెద్ద ఎత్తున చేసిన తిరుగుబాటు అందుకొక సూచన. ప్రస్తుతం దేశంలో జరుగుతున్న ఆర్థిక సంస్కరణలు అధికార్లను సంపద్వంతులను చేస్తూ వారికి ఒప్పందాల ద్వారా దొడ్డిదోవన డబ్బు గడించే అవకాశం ఇవ్వటంతోపాటు ఇప్పుడున్న వైరుధ్యాలను మరింతగా పెంచుతాయి. పర్యవసానంగా దేశ వ్యాప్తంగా మణిపూర్ రైఫిల్స్ తరహా తిరుగుబాట్లు అనేకం జరగక తప్పదు. ❑

(44 వ పేజీ తరువాయి...)

మవుతుంది. విజయం వైపుగా ఏ విప్లవాన్నైనా ముందుకు నడిపించాలంటే బలమైన పార్టీ, బలమైన సైన్యం, బలమైన ఐక్య సంఘటన అనేవి ముందు షరతుగా వుంటాయి. ఇవి విప్లవానికి మూడు ప్రధాన సాధనాలు. వీటిలో ఇతర రెండు సాధనాలపై ఆధిపత్యం కల్గి వుండి విప్లవాన్ని విజయవంతంగా ముగించడానికి వాటిని నైపుణ్యంగా వుపయోగించుకోగలిగే వీరయోధ పార్టీయే. మరోవైపున ఈ వీరయోధను సైన్యం, ఐక్యసంఘటన రెండూ అజేయురాలిగా చేస్తాయి. కాల పరీక్షకు నిలబడి నెగ్గిన ఈ సత్యాన్ని 1925లో మొదటిసారిగా ఏర్పడింది మొదలుకుని భారత కమ్యూనిస్టు పార్టీ సంపూర్ణంగా వదిలి పెట్టేసింది.

గడచిన 80 సంIIరాల భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రలోనే ప్రజాసైన్యం అనేది ఏర్పడలేదు. ఇక 1947 వరకు బ్రిటీష్ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట కాలంలో ఏర్పర్చబడిన ఐక్య సంఘటన సారాంశంలో వర్గ కుమ్మక్కు స్వభావం కల్గినది. ఇది తరచుగా దళారీ బడా బూర్జువా వర్గ నేతృత్వంలోని గాంధీ, నెహ్రూల కాంగ్రెస్ పార్టీ తోక పట్టుకుని నడిచింది. డాంగే, పి.సి. జోషి, అజయ్‌ఘోష్ తదితరులతో కూడిన సి.పి.ఐ. నాయకత్వం చేపట్టిన అవకాశవాద పంథా ప్రజాసైన్యం అవసరం గురించి ఇష్టా రాజ్యంగా వ్యవహరించింది. రష్యాలోని మెన్షివిక్కుల్లాగా ఈ పంథా బడా బూర్జువా వర్గం వెన్నంటి నడిచింది. భారత దేశంలో బూర్జువా ప్రజాతంత్ర విప్లవాన్ని బడా బూర్జువా వర్గం సాధించ గలదని ఈ పంథా నమ్మింది. పుట్టింది మొదలుకుని బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి కట్టుబడి వున్న భారత బడా బూర్జువా వర్గం ఎల్లప్పుడూ దళారీ స్వభావంతోనే వుంటూ వచ్చిందని సైతం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం అర్థం చేసుకోలేదు. విప్లవకర ప్రజాసైన్యాన్ని, విప్లవకర ఐక్య సంఘటనను ఏర్పరచడానికిగానూ, అర్ధవలస చైనా కంటే ఎక్కువగా భారతదేశంలో చాలామంచి అవకాశాలు వున్నప్పటికీ పార్టీ నాయకత్వం ఈ అంశంకేసి కన్నెత్తి చూడలేదు.

1940ల చివర్లో ఉజ్వలమైన తెలంగాణా ప్రజల తిరుగుబాటు నడచిన స్వల్ప కాలంలో మాత్రమే సాయుధ దళాలు వునికిలోకి వచ్చాయి. 2000 మంది రెగ్యులర్ బలగాలు, 10,000 మంది మిలీషియా (ఇర్రెగ్యులర్) బడా భూస్వాముల, నిజాం, కేంద్ర ప్రభుత్వ హంతక సైనిక బలగాలతో పోరాటం చేశారు. అయితే ఈ గెరిల్లా బలగాలను కేంద్రీకృత నాయకత్వం కిందికి తీసుకుని రానందున చెదురుమదురు విడివిడి గెరిల్లా యూనిట్ల లాగే అవి పని చేశాయి. ఏమైనప్పటికీ ఈ గెరిల్లా బలగాలు వీరోచిత పోరాటం సాగించి 3,000 గ్రామాల్లోని భూస్వాములను పారద్రోలారు. ప్రజల రాజకీయ అధికారపు తొలి బీజాలను విత్తటం జరిగింది. తెలంగాణాలో మొట్టమొదటి స్థావర ప్రాంతాన్ని నెలకొల్పేందుకు మార్గం సుగమం చేసే ఎర్రసైన్యం స్థాపనకు పరిస్థితులు అనుకూలమైన సమయంలో మితవాద అవకాశవాద పార్టీ నాయకత్వం వెనుకడుగేసింది. అది విప్లవానికి ద్రోహం చేసి 1951లో సాయుధ పోరాటాన్ని ఉపసంహరించింది. నెహ్రూ నాయకత్వంలోని దళారీ బూర్జువా వర్గపు ఎడమ భుజం లాగా అది తయారైంది.

పార్టీ నాయకత్వం ఈ దుర్మార్గ పూరిత విద్రోహానికి పాల్పడిన తర్వాత భారత కమ్యూనిస్టు ఉద్యమంలో సుదీర్ఘకాలం స్తబ్దత ఏర్పడింది. 1967 నక్సల్బరీ వసంత మేఘ గర్జనతో మాత్రమే ఆ స్తబ్దత బద్దలయింది. ఇది తిరిగి సాయుధ పోరాటాన్ని మరోసారి రంగంమీదికి తెచ్చింది. శ్రీకాకుళం, దేబ్రా-గోపీ వల్లభాపూర్, ముషాహరి, బీర్భూమ్ మొదలైన దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్వల్పకాలమే అయినప్పటికీ గెరిల్లా జోన్లు వునికిలోకి వచ్చాయి. ఈ మేటి పోరాటాలు మొత్తం దేశాన్నే ప్రకంపింపజేసి, ప్రజారాసులను మేల్కొల్పి, వారిని చరిత్ర రంగంమీద కీలక స్థానంలోకి కొని తెచ్చాయి. పాలక వర్గాలను కంపింపజేశాయి. భారీ సంఖ్యలో సాయుధ బలగాలను సమీకరించి ఈ పోరాటాలను పాలకవర్గాలు తాత్కాలికంగా అణచివేసినాయి. దేశంలోని పలు ప్రాంతాల్లో ప్రజాధికారాన్ని స్థాపించిన వందలాది సాయుధ గెరిల్లా దళాలను ఒక కేంద్రీకృత నాయకత్వం కిందికి తెచ్చి తద్వారా వాటిని రెగ్యులర్ ప్రజాసైన్యంలోకి మార్చడంలో మన వైఫల్యమే 1972 నాటికి ఉద్యమాన్ని పాలకవర్గాలు అణచి వేయగలగడానికి ముఖ్య కారణాల్లో ఒకటయింది.

కాII చారుమజుందార్ అమరత్వం మరియు కేంద్రకమిటీ మొత్తంగా విచ్ఛిన్నమై పోవటంతో ఏర్పడ్డ పెను స్తబ్దత తర్వాత 1970ల చివర్లో ఆంధ్రప్రదేశ్‌లోనూ తర్వాత బీహార్‌లోనూ తిరిగి పోరాటాలు గుర్తించదగ్గ స్థాయిలో పుంజుకున్నాయి. 1980లలో ఆంధ్ర, దండకారణ్య, బీహార్‌లలో ఏర్పడిన సాయుధ గెరిల్లా దళాలు ఈ పోరాటాలకు నాయకత్వం వహించాయి. ప్రారంభంలో ప్రగతి నిరోధక భూస్వామ్య శక్తులతో వారి ప్రైవేట్ సైన్యాలతో తలపడిన గెరిల్లా దళాలు, 1980ల మధ్య నుండి ప్రభుత్వ సాయుధ బలగాలతో పోరాటాన్ని మొదలెట్టాయి. దశాబ్ద కాలంగా సాయుధ గెరిల్లా దళాలు సంఖ్య రీత్యా పెరుగుతూ, తమ ఆయుధ బలాన్ని, పోరాట నైపుణ్యాలను, సామర్థ్యతలను విస్తృత పర్చుకున్నాయి. వేళ్ళమీద లెక్కించదగిన కొద్దిమంది వీరయోధులుగా మొదలై సాపేక్షంగా దృఢమైన శక్తిగా గెరిల్లా దళాలు ఎదిగి, వేలాది గ్రామాల నుండి భూస్వాములను పారద్రోలి అధికారం కోసం, ప్రభుత్వ సాయుధ బలగాలతో పోటీ పడ్డాయి. సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రజాయుద్ధంలో 1980 నుండి దాదాపు 3,000 మంది ప్రజలు అమరులైనారు. ప్రగతి నిరోధక భూస్వామ్య వర్గంపై, దాని తొత్తులపై, ప్రభుత్వ బలగాలపై యుద్ధాన్ని సాగించే క్రమంలో మాత్రమే పార్టీ, సాయుధ గెరిల్లా దళాలు మరింతగా శక్తిని సంతరించుకున్నాయి.

ప్రజాయుద్ధ పురోగమనం ఒక కేంద్రీకృత నాయకత్వ చట్రం కింద పి.జి.ఏ.ని ఏర్పర్చగల పరిస్థితులను పరిపక్వం చేసింది. గెరిల్లా జోన్లలోని, ఇతర వర్గ పోరాట ప్రాంతాల్లోని ప్రజలూ, వారిని నడిపిస్తున్న పార్టీ రెండు కూడా ప్రభుత్వంతో అసంఖ్యాక సమరాలు చేస్తూ రాటు దేలాయి. సి.పి.ఐ. (యం-యల్) (పీపుల్స్‌వార్) సాగించిన రెండు దశాబ్దాల పోరాట క్రమంలో లక్షలాది ఎకరాల భూమి పంపిణీ చేయబడింది. భూస్వాముల ఆక్రమణకు గురైన తమ భూములని తిరిగి సాధించుకోవడం కోసం, విశాల గ్రామీణ ప్రాంతంలో తమ రాజకీయాధికారాన్ని సాగించేందుకుగాను తమకు తాము సాయుధులై మరింత తీవ్రంగా, కృత నిశ్చయంతో యుద్ధం

సాగించటం కంటే ప్రజలకు ప్రత్యామ్నాయ మార్గం లేదు. గెరిల్లా జోన్లలోనూ, వర్గ పోరాటం తీవ్రంగా జరుగుతున్న ఇతర ప్రాంతాలలో పార్టీకి సాయుధ గెరిల్లా దళాలకు ప్రజల నుండి పెద్ద ఎత్తున లభిస్తున్న మద్దతుకు ఇదే కారణం. అందుకనే యుద్ధ ప్రాంతాలలోని వేలాది ప్రజలు తమ కలల్ని ఫలింపజేయగల నూతన సాధనాన్ని ఏర్పరుచుకునేందుకు లేచి నిలబడ్డారు. భూస్వామ్య విధానం, సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశాధికార పెట్టుబడిదారీ విధానం అనే మూడు పర్వత భారాల కింద నలిగిపోతున్న పీడిత ప్రజల నుండి వేలాది మందిని తనలో చేర్చుకోవటం ద్వారా ప్రజా గెరిల్లా సైన్యం స్వల్పకాలంలోనే ప్రజా విముక్తి సైన్యంగా తన్ను తాను మలచుకుని, గ్రామీణ భారతదేశంలోని పలు ప్రాంతాలలో స్థావర ప్రాంతాలను నెలకొల్పేందుకు కట్టుబడి వుంది.

ఈరోజు భారత ప్రజానీకంలోని అత్యధిక మెజారిటీ సహించరాని పీడనకు గురవుతున్నారు. పాలకవర్గాల దాడి అన్ని రంగాల మీద, జనాభాలోని అన్ని విభాగాల మీద విరుచుకు పడింది.

పీడిత జాతులు తమ స్వయం నిర్ణయాధికార హక్కును డిమాండు చేస్తున్నారు. వారి జాతీయ ఆకాంక్షలు క్రూరంగా అణచివేయ బడినాయి. వారి భూభాగాలను బలాత్కారంగా ఆక్రమించుకుని భారత సామ్రాజ్యం అత్యంత పాశవిక పద్ధతిలో వాటిని నిలబెట్టుకుంటోంది. ఈ జాతులలో కొన్ని తమ సొంత సైన్యాలను ఏర్పరుచుకుని భారత విస్తరణవాద రాజ్యంతో జీవన్మరణ పోరాటాలలో మునిగిపోయాయి.

మతపరమైన మైనారిటీలు (ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు) వేధింపుల పాలవుతూ, ఫాసిస్టు హిందూత్వ దాడికి గురవుతున్నారు. వీరి ఆలయాలు అపవిత్రం చేయబడినాయి. లేక ధ్వంసం చేయబడినాయి. వీరు రెండో తరగతి పౌరులుగా చూడబడటమేగాక హిందూ మతోన్మాద శక్తుల ముందు లొంగిపోయేలా ఒత్తిడికి గురవుతున్నారు.

ఆదివాసులు తమ సాంప్రదాయక నివాస ప్రాంతాలైన అడవుల నుండి కొండ ప్రాంతాలకు వెళ్ళగొట్టబడ్డారు. లేక అత్యంత అమానుష పరిస్థితుల్లో పెట్టుబడికి వేతన బానిసలుగా మార్చబడినారు. దళారీ బడా బూర్జువా వర్గం, సామ్రాజ్యవాద గుత్త సంస్థలు, ఇతర దురాశాపూరిత లూటీదార్లు అడవులపై ఆదివాసుల సాంప్రదాయక హక్కులను లాగేసుకున్నారు.

సామ్రాజ్యవాదుల ఆదేశానుసారం భారత పాలకవర్గాలు మొదలెట్టిన ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ అనే నయా ఉదారవాద విధానాల బారిన పడి కార్మికవర్గం, రైతాంగం నలిగిపోతోంది. నిత్యావసర వస్తువుల ధరల్లో భారీ పెరుగుదల, సబ్సిడీలపై పెద్ద ఎత్తున కోత, సంక్షేమ, ఉపాధికల్పనా పథకాల రద్దు. ప్రాథమిక సరకుల ధరల పెంపుదల వంటివి ప్రజల జీవన ప్రమాణంపై అపార ప్రభావమేస్తున్నాయి. భారీ స్థాయిలో ఉద్యోగుల తొలగింపు, వేతనాలలో కోత, కార్మిక సంఘాల హక్కులపై ఆంక్షలు, కాంట్రాక్టుల పాలబడిన శ్రమ, అధికార పూర్వకంగానే ఉద్యోగుల తొలగింపు వంటివి కార్మికుల జీవన పరిస్థితులను మరింతగా దెబ్బతీస్తున్నాయి. రైతాంగం వీరికన్నా ఘోరంగా దెబ్బతిని పోయింది. ఇపుడు రైతాంగం క్రమం తప్పని కరువుల్ని, వరదల్నే కాక మార్కెట్ వైపరీత్యాలను సైతం ఎదుర్కొంటున్నారు. పెద్ద ఎత్తున రుణాల బారిన పడటంతో పాటు పై కారణాలన్నీ కలిసి వేలాది మందిని ఆత్మహత్యల వైపుకు నెడుతూ లక్షలాది మందిని నిత్య దరిద్రులను చేస్తున్నాయి.

దళితులపై, మహిళలపై సాంఘిక అణచివేత నిరాఘాటంగా సాగుతోంది. వెల్లువలా పెరుగుతున్న హిందూ ఫాసిజం ద్వారా ఇది మరింత తీవ్రతరమవుతోంది. హిందూ ఫాసిస్టులు భూస్వామ్య విలువలను దూకుడుగా ముందుకు తెస్తున్నారు. ఇది కులతత్వాన్ని పితృస్వామికత్వాన్ని మరింతగా పెంచుతోంది. ఫలితంగా అస్పృశ్యత, విద్య, ఉద్యోగాలలో అగ్రవర్ణ ప్రాధాన్యత, భార్యలను కొట్టడం/తగుల బెట్టడం, కట్నం చావులు మొదలైనవన్నీ పెరిగిపోతున్నాయి. సామ్రాజ్యవాద సంస్కృతి మరింతగా మహిళలను సరకులుగా మారుస్తూ వారిపై లైంగికపరమైన పీడనను పెంచివేస్తోంది.

ఉన్నత మధ్యతరగతిని మినహాయిస్తే విస్తృత సంఖ్యలోని భారత పెటీ బూర్జువా వర్గం ఉద్యోగాలు లేని భవిష్యత్తును, దిగువస్థాయి జీవన ప్రమాణాలను, జీవితంలో పెరుగుతున్న పరాయీకరణను, నిరాశాపూరితమైన భవిష్యత్తును ఎదుర్కోబోతోంది. దేశంపై సామ్రాజ్యవాదపు పెనుదాడి భారత జాతీయ బూర్జువా వర్గంపై చెప్పుకోదగ్గ ప్రభావాన్ని వేస్తున్నది. గుత్త సంస్థలు తమ మార్కెట్లను స్వాధీనం చేసుకోవటంతో, ప్రభుత్వం అన్ని రకాల రాయితీలను తొలగించేయటంతో ఇప్పటికే లక్షలాది చిన్న తరహా పరిశ్రమలు మూతపడ్డాయి. ఇంకా లక్షలాది పరిశ్రమలు దివాళా అంచున వున్నాయి. అవి తుడిచి పెట్టుకు పోవడానికి మరెంతో కాలం పట్టదు కూడా.

అందుచేత సామ్రాజ్యవాదుల ప్రపంచీకరణ దాడిని ఎదుర్కొని, హిందూ ఫాసిస్ట్ శక్తులను తన్ని తరిమేసేందుకుగాను విస్తృత ప్రజారాసులు భీషణ పోరాటం చేయవలసి వుంది.

సామ్రాజ్యవాదుల ఆధ్వర్యంలో ఢిల్లీ హంతక పాలకుల బారిన పడుతోంది కేవలం భారత ప్రజలే కాదు. దక్షిణాసియా ప్రజానీకం మొత్తంగానే భారత విస్తరణవాదం బారిన పడుతున్నారు. కాబట్టి భారత విస్తరణ వాదులను ఓడించేందుకు భారత ప్రజలూ, దక్షిణాసియా ప్రజలూ మొత్తంగానే ఐక్యం కావలసిన అవసరం ఇపుడుంది.

ప్రపంచీకరణ విధానాలకు, హిందూ ఫాసిస్ట్ బలగాలకు, భారత విస్తరణవాదానికి, జాతుల అణచివేతకు అన్నిరంగాలపై సామ్రాజ్యవాదుల, భారత పాలకవర్గాల పెనుదాడికి ప్రజా గెరిల్లా సైన్యం స్థాపనే ధీటైన జవాబు నివ్వగలుగుతుంది. భారతదేశంలోని, దక్షిణాసియాలోని ఈ ప్రజా విభాగాలన్నింటితో ఒక విశాల ఐక్య సంఘటనను స్థాపించే క్రమాన్ని ప్రజా గెరిల్లా సైన్యం వేగవంతం చేస్తుంది. ఈ శక్తులతో కలిసి దక్షిణాసియాలోని భారత విస్తరణవాదాన్ని, సామ్రాజ్యవాదాన్ని పి.జి.ఏ. భూస్థాపితం చేస్తుంది. ❑

# భార□ ప్రజాయుద్ధంలో నూ□న ఉషోదయాన్ని ప్రభవించిన ప్రజాగెరిల్లా సైన్యం స్థాపన

భారత విప్లవోద్యమ చరిత్రలో 2000 సం॥రం డిసెంబర్ 2 అరుణాక్షరాలతో లిఖించదగిన దినం. నూతన సహస్రాబ్ది, నూతన శతాబ్ది తొలి సంవత్సరంలోని ఆరోజు భారత ప్రజానీకపు నూతన సైన్యమైన ప్రజా గెరిల్లా సైన్యం ఆవిర్భవించింది. కమ్యూనిజం కోసం, సోషలిజంలో అడుగు పెట్టేందుకు మొదటి దశ అయిన ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్తి చేయటం అనే అత్యున్నత లక్ష్యం కోసం తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించిన వేలాది మంది అమరుల చిరకాల స్వప్నాలను ఫలింపజేస్తూ పి.జి.ఏ. ఆవిర్భవించింది.

ఆ రోజున ప్రజాగెరిల్లా సైన్యపు మూడు సాయుధ విభాగాలైన ప్రధాన, ద్వితీయ, పునాది బలగాలు ఆంధ్ర, ఉత్తర తెలంగాణా, దండకారణ్య, బీహార్ అడవుల్లో, మైదానాల్లో కవాతు నిర్వహించాయి. నూతన ప్రాంతాలకు యుద్ధాన్ని విస్తరింపజేస్తూ విశాల భారత గ్రామీణ ప్రాంతంలో స్థావర ప్రాంతాలను నెలకొల్పే ఉన్నత దశకు భారత ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేయటం అనే విప్లవకర దృఢ సంకల్పాన్ని మరోసారి ఈ కవాతు ధృవీకరించింది. దండకారణ్యం ఉత్తర తెలంగాణా, తూర్పు రీజియన్, దక్షిణ తెలంగాణా, నల్లమల, కోయిల్-కైమూర్ అడవులు నూతన గెరిల్లా సైన్యం కవాతుతో ప్రతిధ్వనించాయి. ప్రజా గెరిల్లా సైన్యానికి నూతన సాయుధ విభాగాలను జతచేయడానికి విశాల మైదాన ప్రాంతాలు సన్నద్ధమౌతున్నాయి. పి.జి.ఏ. ఆవిర్భవించిందన్న వార్తలు ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి వ్యాపించగా, పీడిత ప్రజలు మరెంతోమంది పి.జి.ఏ. శ్రేణులలో చేరడానికి ఆసక్తి ప్రదర్శించారు. సంఖ్యలో, ఆయుధ సామగ్రిలో, పోరాట సామర్థ్యంలో విస్తరించడానికి కట్టుబడిన పి.జి.ఏ. భారత ప్రజల నిజమైన పోరాట శక్తిగా మారింది. అందుకనే భారత విప్లవోద్యమంలో పి.జి.ఏ. ఒక నూతన ఉషోదయం.

సామ్రాజ్యవాదం, భూస్వామ్య విధానం, దళారీ నిరంకుశాధికార పెట్టుబడిదారీ విధానం అనే మూడు పర్వత భారాలను మోస్తున్న వందకోట్ల భారత ప్రజల ఆశలు, ఆకాంక్షల ప్రతిరూపమే పి.జి.ఏ. క్రామేడ్స్ శ్యామ్, మహేష్, మురళీల అమరత్వం తర్వాత సం॥రంలోపే ఆవిర్భవించిన పి.జి.ఏ. భారత విప్లవ ప్రజానీకానికి, ప్రత్యేకించి సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] పార్టీ శ్రేణులకు ప్రత్యేక ప్రాధాన్యత కల్గినటువంటింది. ఈ నేతలు అమరులైన తొలి వార్షిక దినమే జరిగిన పి.జి.ఏ. ఆవిర్భావం విప్లవకారులకు మరణం లేదని, వారు మృత్యుంజయులని, వేలాదిమంది విప్లవకారులుగా వారు తిరిగి ప్రభవిస్తారని కాల పరీక్షకు నిల్చిన సత్యాన్ని నిర్ధారించింది. పి.జి.ఏ. ఆవిర్భావం ఈ భారత విప్లవ ప్రియతమ పుత్రులకు నిజమైన నివాళి. అత్యంత పిరికి పద్ధతిలో ఈ నేతలను హత్య చేయటం ద్వారా విప్లవ జ్వాలలను అడ్డుకున్నామంటూ కలలుగన్న భారత దోపిడీ పాలకవర్గాలకు పి.జి.ఏ. తిరుగులేని సమాధానం. పి.జి.ఏ. ఆవిర్భావం వారి కలల్ని కల్లలు చేసి దేశంలో సాగుతున్న ప్రజాయుద్ధం, పార్టీ అజేయమైనవని నిర్ధారించింది.

భారత ప్రజల పోరాట పటిమలో పి.జి.ఏ. ఓ గుణాత్మకమైన గెంతును కొనితెచ్చింది. ప్రజల సంఘటిత పోరాటశక్తి- ప్రజాసైన్యం- లేకుండా పీడిత ప్రజలు వర్గ రహిత సమాజం గురించిన తమ స్వప్నాలను నెరవేర్చుకోలేరు. అందుకే కా॥ మావో ''ప్రజాసైన్యం లేనిదే ప్రజలకొరిగేదేమీ లేదు'' అంటూ పదే పదే నొక్కి చెప్పాడు. ప్రభుత్వం యొక్క భారీ స్థాయి అణచివేత యంత్రాంగాన్ని, అపార హంతక సైన్యాన్ని తన అమ్ముల పొదిలో కలిగివున్న దోపిడీ పాలకవర్గాలను ఆయుధాలు చేపట్టకుండా ప్రజలు ఎన్నటికీ కూలదోయలేరని ఇంతవరకూ నడచిన వర్గ సమాజాలన్నీ నిర్ద్వంద్వంగా నిరూపించాయి. అస్థిరమైన, అసమర్థులైన పాలకులను అధికారంలో కొనసాగించడంలో ఈ సైన్యమే కీలక పాత్ర వహించింది. పీడిత ప్రజల వర్గ పోరాటాలు ఆస్థి పర వర్గాల ఉనికికే ప్రమాదం తెచ్చి పెట్టిన చరిత్రలోని ప్రతి కీలక దశలోనూ, ప్రజలను తొక్కి పెట్టడం ద్వారా తుపాకీయే పాలకుల అధికారాన్ని పరిరక్షిస్తూ వచ్చింది. అలాగే పోటీపడుతున్న వర్గం కూడా తుపాకీ ద్వారానే రాజ్యాధికారాన్ని సాధించగల్గింది.

**''సాయుధ శక్తి ద్వారా అధికారాన్ని కైవసం చేసుకోవడం''** మావో చెప్పిన ఈ మాట వర్గ సమాజాలన్నింటికీ వర్తిస్తుంది.

భూస్వామ్య విధానం వైదొలిగి బూర్జువా ప్రజాస్వామ్యం ఉనికిలోకి వచ్చి, ఆర్థిక వ్యవస్థ మొత్తంగానే నగరీకరణ చెందినట్టి పాశ్చాత్య పెట్టుబడిదారీ దేశాల్లో సైతం, దేశ వ్యాప్త తిరుగుబాటుకు ప్రజలను కూడగట్టేందు కోసం సాపేక్షంగా ఒక సుదీర్ఘకాల సన్నాహక చర్యలు అవసరమౌతాయి. రాజకీయాధికారాన్ని చేజిక్కించు కోవటానికి అంతిమ తిరుగుబాటు కోసం కార్మికవర్గం అనేక సాయుధ రిహార్సల్స్‌ని చేపట్టాల్సి వుంటుంది. అయితే ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగాగానీ సామ్రాజ్యవాదం చేత పరిపాలించ బడుతున్న భూస్వామ్య, అర్ధభూస్వామ్య సమాజాల్లో గ్రామీణ ప్రాంతాలను విముక్తి చేసేందు కోసం కమ్యూనిస్టు పార్టీని స్థాపించిన వెంటనే సాయుధ పోరాటం ప్రారంభం కావాలి. ప్రజా సైన్యం, విప్లవకర ఐక్య సంఘటన అనేవి విప్లవాన్ని కొనసాగించటంలో కార్మికవర్గ పార్టీ చేతుల్లోని రెండు ప్రధాన సాధనాలు. సైన్యాన్ని, ఐక్య సంఘటనను దృఢతరం చేసే క్రమంలోనే పార్టీ బలోపేత

(తరువాయి 42వ పేజీలో...)